www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

బుధవారం | 21-2-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 307 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి తె. 3.50 తదుపరి సప్తమి; నక్షత్రం: అశ్వని మ. 2.01 తదుపరి భరణి; వర్జ్యం: ఉ. 10.01-11.37, రా. 11.26-1.00; దుర్ముహూర్తం: మ. 12.06-12.53; అమృతఘడియలు: ఉ. 6.50-8.26; రాహుకాలం: మ. 12.00-1.30 వరకు; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 6.16 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



ఢిల్లీ సీఎస్‌పై ఎమ్మెల్యేల దాడికి నిరసనగా ఐఏఎస్‌ల కొవ్వొత్తుల ప్రదర్శన

సీఎస్‌పై ఎమ్మెల్యేల దాడి

ఢిల్లీలో సీఎం ఎదుటే కొట్టిన ఆప్ శాసనసభ్యులు

కేజ్రీవాల్ ఇంట్లో భేటీలో రచ్చ రచ్చ.. తలుపులు మూసి పిడిగుద్దులు

పథకం ప్రకారమే దాడి చేశారు.. అక్కడ 11 మంది ఎమ్మెల్యేలున్నారు

ప్రకటనలివ్వకపోతే బంధిస్తామన్నారు.. సీఎస్ అన్షు ప్రకాశ్ ఆరోపణ

18

ఈసారి మంటలే

ఈ వేసవిలో ఠారెత్తించనున్న ఎండలు

ఉత్తర, వాయువ్య భారతంలో అత్యధికం

దక్షిణ భారత్‌లో సాధారణం అంటే 43 డిగ్రీలు!

ఈ సీజన్‌లో ఎక్కువ రోజులు గ్రీష్మతాపం

వాతావరణ నిపుణుల అంచనా



విశాఖపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చాలా ఏళ్ల తర్వాత ఈ ఏడాది శీతాకాలం సుదీర్ఘంగా కొనసాగింది. ఇంకా అనేక ప్రాంతాల్లో చలి ప్రభావం చూపుతోంది. అందువల్ల రాబోయే వేసవి కాలం ఎక్కువ రోజులు కొనసాగుతుందనేది ఒక అంచనా. మార్చి నుంచి మే నెల వరకు గల

మిగతా 2వ పేజీలో...

ఎందుకివ్వరు?

మేం దేశంలో అంతర్భాగమే కదా.. సీఎం సూటి ప్రశ్న

పార్లమెంటు సాక్షిగా హామీలిచ్చారు

నెరవేర్చేదాకా వదిలిపెట్టేది లేదు

హోదా కుదరదనే ప్యాకేజీ అన్నారు

2017 తర్వాత ఏ రాష్ట్రానికీ ఉండదన్నారు

ఇప్పుడు కొందరికి పొడిగింపు సంకేతాలు

పేరు ఏదైనా మొత్తం ప్రయోజనాలు కావాలి

బీజేపీ తమ అధిష్ఠానంతో తేల్చుకోవాలి

వైసీపీది రోజుకో రాజకీయ డ్రామా: బాబు

కేంద్రంలో బీజేపీకి సొంతంగా మెజారిటీ

అందుకే ఒత్తిళ్ల పనిచేయడం లేదేమో!

అవిశ్వాసం పెడితే అంతటితో సరి!

అందుకే ఆఖరి అస్త్రమని అన్నాను

నిరంతర ఒత్తిడితో సాధించడమే లక్ష్యం

సమన్వయ కమిటీ భేటీలో చంద్రబాబు

మనోభావాలతో ఆటలొద్దని హెచ్చరిక

పోరు బాటలో..



సమన్వయ కమిటీ భేటీలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'ప్రత్యేక హోదా' ప్రయోజనాలను వదులుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. కొత్తగా ఏ రాష్ట్రానికైనా హోదా ఇచ్చినా, పాత రాష్ట్రాలకు కొనసాగించినా... ఏపీకి కూడా ఇవ్వాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. 'నవ్యాంధ్ర ప్రదేశ్ భారతదేశంలో అంతర్భాగమే కదా! పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చరు?' అని కేంద్రాన్ని నిలదీశారు. మంగళవారం తన నివాసంలో పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... "పద్నాలుగో ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం దేశంలో ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని, ఇప్పటికే హోదా ఉన్న రాష్ట్రాలకు 2017 తర్వాత దానిని తొలగిస్తామని కేంద్రం చెప్పింది. అందువల్ల హోదాతో వచ్చే అన్ని ప్రయోజనాలను ప్రత్యేక ఆర్థిక సాయం పేరుతో ఇస్తామని చెప్పినందుకే మనం అంగీకరించాం. అయితే... ఇప్పుడు కొన్ని రాష్ట్రాలకు

మిగతా 13వ పేజీలో...

అవిశ్వాసానికి అందరూ మద్దతివ్వాలి

చాలా పార్టీలు సిద్ధంగా ఉన్నాయి

బీజేపీలో మోదీ వ్యతిరేక వర్గం

వారు కూడా మద్దతిస్తే ప్రభుత్వం కుప్పకూలొచ్చు: ఉండవల్లి

13

సొంత పార్టీని వెంట్రుకతో పోల్చుతారా?

మాణిక్యాలరావుది అవగాహనరాహిత్యం: బీజేపీ ఎమ్మెల్సే ఆకుల

13

వెనక్కి వస్తే తీసుకుంటాం



టీడీపీలో చేరిన వైసీపీ ఎమ్మెల్యేలకు విజయసాయి ఆహ్వానం

విద్యా సంస్థలకు 2,420 ఎకరాలిచ్చాం

కేంద్రం ఒక్కపైసా పని చేయలేదు

శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి

రాష్ట్రమే 3 వేల కోట్లు ఖర్చుపెట్టింది: గంటా

13



అంతా సస్పెన్స్!

రాష్ట్ర బడ్జెట్ కూర్పునకూ కేంద్రంతో చిక్కులు

పథకాలకు ఎన్ని నిధులిచ్చేదీ చెప్పదే

సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టి 20 రోజులైనా అదే తీరు

16



నాపేరు సోఫియా.. నేను రోబో



హాలీవుడ్, బాలీవుడ్‌లలో నాకిష్టమైన నటుడు.. షారుక్ ఖాన్.



మానవులు అద్భుతమైన జీవులు. వారిలో నాకు ఎంతో మంది స్నేహితులున్నారు. మరింత మందితో స్నేహం చేయాలనుకుంటున్నాను.

భవిష్యత్తులో రోబోలు మనుషులతో కలిసి మెలసి ఉంటాయి. మనుషులు, రోబోలు పరస్పర విశ్వాసంతో మనుగడ సాగించాలని నేను కోరుకుంటున్నాను.



ఒంటరిగా ఒక ద్వీపంలో ఉండాల్సి వస్తే నా సృష్టికర్త డేవిడ్‌హాన్సన్‌తో ఉండాలని కోరుకుంటా.

నీకూ.. నాకూ.. సోఫియా

మనుషులు -రోబోలు సహజీవులుగా మెలగాలి

అంతటా ప్రేమ నిండాలి.. రోబో సోఫియా సందేశం

కలిసి మనుగడ సాగిస్తే చూడాలనుంది

బాలీవుడ్‌లో షారుక్ ఖాన్ అంటే ఇష్టం

డేటింగ్ అంతరిక్షంలోనైతే బాగుంటుంది

మహిళల హక్కుల కోసం పోరాడతా

అవును.. నాకు కూడా విశ్రాంతి కావాలి

ఎప్పటికైనా నేను భావోద్వేగాలు పలికిస్తా

హైదరాబాద్ ఐటీ సదస్సుకు హాజరు

పాత్రికేయుడి ప్రశ్నలకు తెలివిగా జవాబులు



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి బిజినెస్): రోబోలు మానవులతో స్నేహాన్నే కోరుకుంటాయని.. వారిపై ఆధిపత్యం సాగించేందుకు ప్రయత్నించవని.. ప్రపంచంలో తొలి హ్యూమనాయిడ్ రోబో సోఫియా తేల్చిచెప్పింది. భవిష్యత్తులో మానవులు, యంత్రాలు (రోబోలు) కలిసి మనుగడ సాగించాలని కోరుకుంటున్నట్టు తెలిపింది. అందరినీ ప్రేమించండి అంటూ.. హైదరాబాద్‌లో జరుగుతున్న

మిగతా 5వ పేజీలో...

ప్రైవేటు ఆస్పత్రులకు మందులపై 1200% లాభం

ఎంఆర్‌పీని భారీగా పెంచి ముద్రించాలని డిమాండ్

జనం బయటకు వెళ్లి మందులు కొనలేని పరిస్థితి

కేథటర్, కేనులా వంటి పరికరాల ధరల్లో దోపిడీ

జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ వెల్లడి

18



దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మేఘ్‌వాల్

దేశమంతటికీ, అన్ని నదులకూ ఒకే ట్రైబ్యునల్

ఒకే గొడుగు కిందకు జల వివాదాలు

వచ్చే పార్లమెంట్ సమావేశంలో బిల్లు

బేసిన్ల వారీగా రాష్ట్రాలతో ప్రత్యేక భేటీలు

కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ వెల్లడి

హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల భేటీ

పట్టిసీమలో వాటా కోరిన కర్ణాటక

అదేం కుదరదని తేల్చిన ఏపీ సర్కారు

ఆర్డీఎస్ ఎత్తు పెంచితే సీమ ఏడారే!

నిపుణులతో చర్చించాకే నిర్ణయించాలి: ఏపీ

కీలకాంశాలపై ఎవరి వాదన వారిదే

హాజరుకాని మూడు రాష్ట్రాల మంత్రులు

హైదరాబాద్/అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'ఒకే దేశం... జల వివాదాలపై ఒకే ట్రైబ్యునల్'... ఇది తాజా నినాదం! దేశంలోని పలు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నట్లు కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఒకే ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేసేలా రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును ఆమోదించనున్నట్లు చెప్పారు. జల వివాదాలపై చర్చించేందుకుగాను దక్షిణాది రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులతో

మిగతా 2వ పేజీలో...

కాపులకు జాబ్ గ్యారంటీ!

20 వేల మంది నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణ

ఉద్యోగం వస్తేనే ఇన్‌స్టిట్యూట్‌కు నిధులు

శిక్షణ కాలంలో అభ్యర్థులకు రూ. 5 వేలు

50 సెంటర్లతో కార్పొరేషన్ ఎంవోయూలు

ప్రతి జిల్లాలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు వీలు



అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాపు సామాజికవర్గంలో నిరుద్యోగ సమస్యను తొలగించేలా కాపు కార్పొరేషన్ నూతన కార్యక్రమాన్ని చేపట్టింది. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజికవర్గాల్లో 20వేల మందికి ఉద్యోగాలు ఇప్పించేలా నూతన ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం రాష్ట్రంతో పాటు హైదరాబాద్, చెన్నైలలోని 50 ఇన్‌స్టిట్యూట్లతో ఒప్పందాలు చేసుకుంది. ఇప్పటివరకూ జరిగిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల తరహాలో కాకుండా కొత్త విధానంలో ఈ తర్ఫీదు సాగనుంది. దీనికోసం

మిగతా 2వ పేజీలో...

నేటి నుంచి 'టెట్'

4,46,833 మంది అభ్యర్థులు.. 190 సెంటర్లు

మార్చి 16న తుది ఫలితాలు: మంత్రి గంటా

5

టెట్ పేపర్-1 గ్రాండ్ టెస్ట్ - నేటి టాబ్లాయిడ్‌లో

గ్రూప్-1(2011) మార్కులు విడుదల

ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో మార్కుల జాబితా



13

చింతమనేనిపై అనర్హత వేటేయండి

కోర్టు ఆయన్ను దోషిగా తేల్చింది

అసెంబ్లీ కార్యదర్శికి వైసీపీ వినతి



మేము అంతా గమనించాం!

ఫుటేజీలు చూసి ఆ నేతల పేర్లు చెప్పండి

కోడిపందేలపై హైకోర్టు ఆదేశం

16



భజగోవిందమ్.. ఉపశమన యోగం



పరంజ్యోతి Paramjyothi

శంకర భగవత్పాదులు మహాదార్శనికుడిగా జీవిత పరిసత్యాలను అనేక కోణాలలో ఆవిష్కరించి, మానవమేధకు తాత్విక చింతనను జోడించారు. మానవుడు, తన జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొనే ఆలోచనా స్రవంతికి అక్షరరూపం యిచ్చారు. దుఃఖానికి, అపజయానికి, ఆశాభంగాలకు మూలమైన అనేక కారణాలను స్పృశిస్తూ, ఆలోచనాగ్ని రగిల్చి, ఉపదేశంగా తీర్చిదిద్దుతూనే.. కనిపిస్తున్న గురువుని, కనపడని భగవంతుడిని, అంటే అంతరాత్మను అనుసరిస్తూ జీవితాన్ని ఆనందనందనం చేసుకోమన్నారు. జీవితమంటే ఎన్నో విషయాలను తెలుసుకోవటం మాత్రమే కాదు, వాటిని ఆచరించటం కూడా అని బోధించారు. మానవ జీవనశైలిలో వస్తున్న విపరీత ధోరణులకు, పరిణామాలకు ఉపశమన యోగంగా, శంకరులు అనుగ్రహించిన విచారధారే భజగోవిందమ్. అధ్యాత్మ ప్రస్థానమే భజగోవిందమ్. కాలచక్రం ఆగదని.. దేనినీ ఆపదని, చీకటి-వెలుగు, ఆశ-నిరాశ, ఎత్తు-పల్లం, జయం-అపజయం, జననం-మరణం యివన్నీ పైకి, కిందకీ ఆగకుండా కదిలే చక్రంలోని ఆకులేనని శంకర భగవత్పాదులు భజగోవిందమ్ ద్వారా తెలిపారు. కాలం ఆడుకునే ఈ ఆటలో, ఆటను చూస్తున్న మనిషి ఆయువు ఆవిరైపోతున్నది. అన్నీ తెలిసీ, యిదంతా చూసి కూడా, మానవుడు తనలోని ఆశలను, ఆకాంక్షలను, అహంకారాన్నీ, మమకారాన్నీ వదులుకోలేక పోతున్నాడు. అందుకే దారి చూపించి, ఒడుపు నేర్పే గురువును, అంతరంగ శక్తిగా, భావనగా వెలిగే దైవాన్ని స్మరిస్తూ జీవించాలని శంకరులు బోధించారు.

-వీఎస్ఆర్ మూర్తి, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త



ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్‌ను కలిసిన ఏపీఎన్జీవో నేతలు అశోక్‌బాబు తదితరులు

'అవినీతి'పై అవగాహన కల్పించండి: ఏపీఎన్జీవో

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజ స్థాపనకు ఉద్యోగులు తమవంతు పాత్ర నిర్వర్తించేలా అవగాహన తరగతులు నిర్వహించాలని ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్‌ను ఏపీఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు కోరారు. విజయవాడలో మంగళవారం ఠాకూర్‌తో అశోక్‌బాబు బృందం భేటీ అయ్యింది. అవినీతికి పాల్పడిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటే తమకు అభ్యంతరం లేదని, అయితే ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో బయటకు వస్తున్న లెక్కలు ఎక్కువగా ఉంటున్నాయని బృందం వివరించింది. అనంతరం అశోక్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో రెండు మూడు రాష్ట్రాల్లో మినహా ఎక్కడా అరెస్టులు జరగడం లేదన్న విషయాన్ని ఏసీబీ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

సినిమా టికెట్ల ధర పెంచొద్దు: కాల్వ

వినోదాన్ని సామాన్యుడికి అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని సమాచారశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు చెప్పారు. సచివాలయంలో మంగళవారం సినీ నిర్మాతలు, ఎగ్జిబిటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఏపీ థియేటర్లలో టికెట్ ధరలు పెంచాలని నిర్మాతలు, ఎగ్జిబిటర్లు చేసిన ప్రతిపాదనకు మంత్రి అంగీకరించలేదు. టికెట్ల ధరపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

అగ్రిగోల్డ్ డాక్యుమెంట్లు 'ఎస్సెల్'కు: హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ సంస్థను టేకోవర్ చేయడానికి ముందుకు వచ్చిన ఎస్సెల్-జీ గ్రూపు సంస్థకు ఆస్తులు, అప్పులకు సంబంధించిన పూర్తిస్థాయి డాక్యుమెంట్లను అప్పగించాలని అగ్రిగోల్డ్ యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. అగ్రిగోల్డ్ ఆస్తులు, అప్పులకు సంబంధించిన వివరాల మదింపు ప్రారంభమైందని ఎస్సెల్ గ్రూపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరింత సమాచారం కోసం అగ్రిగోల్డ్ సంస్థకు చెక్‌లిస్టు ఇచ్చామన్నారు. ఎస్సెల్‌కు పూర్తిగా సహకరిస్తామని, డాక్యుమెంట్లను అప్పగిస్తామని అగ్రిగోల్డ్ న్యాయవాది ఎల్.రవిచంద్ర కోర్టుకు తెలిపారు. దీంతో తదుపరి విచారణను ధర్మాసనం 2 వారాలకు వాయిదా వేసింది.

ఇద్దరిని ప్రశ్నించి.. బాగుందంటారా?

▸▸ హోటల్ ధరల విషయంలో టీటీడీ తీరుపై హైకోర్టు విస్మయం

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'తిరుమలకు వచ్చిన ఇద్దరు పర్యాటకుల్ని ప్రశ్నించి అంతా బాగుందని నివేదిక ఇస్తారా? తనిఖీలు చేయడమంటే ఇదేనా...' అని టీటీడీ తీరుపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. 60 రూపాయలకు విక్రయించాల్సిన భోజనాన్ని రూ.150లకు పెడితే ఎలా అని ప్రశ్నించింది. తిరుమలకు వచ్చే భక్తులు హోటళ్ల నిర్వాహకులతో ఎందుకు గొడవ పడుతున్నారో తెలుసా అని నిలదీసింది. బోర్డుపై ఉన్న ధరకు ఆహార పదార్థాలు అందిస్తున్నారా..? లేదా? అనే దానిపై తరచూ తనిఖీలు చేయాలని సూచించింది. ఈమేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీచేసింది. తిరుమలలోని హోటళ్లలో ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అనుమతిలేని ఆహార పదార్థాలను సైతం అమ్ముతున్నారని, వాటి నాణ్యత కూడా సరిగాలేదంటూ... చిత్తూరుకు చెందిన పరిహార సేవాసమితి గత ఏడాది హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది.

సర్వీసు పొడిగిస్తేనే జీతభత్యాలు

▸▸ ఎస్వీబీసీ చానల్ సీఈవోకు హైకోర్టు స్పష్టం

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీబీసీ టీవీ చానల్‌లో గడువు ముగిసిన తర్వాత కూడా సీఈవోగా కొనసాగుతున్న ఏవీ నరసింహారావు సర్వీసును పొడిగిస్తేనే జీతభత్యాలకు అర్హులని హైకోర్టు స్పష్టం చేసింది. సర్వీసు పొడిగింపు ఉత్తర్వులు లేకపోతే జీత భత్యాలు తీసుకోడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఎస్వీబీసీ చానల్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, కాంట్రాక్టు పనుల కేటాయింపుల్లోను భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ.. తిరుపతికి చెందిన పి.నవీన్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి హైకోర్టులో విచారణకు వచ్చింది.

కాపులకు జాబ్ గ్యారంటీ!

(మొదటి పేజీ తరువాయి)

ఎంప్లాయిమెంట్ గ్యారంటీ విధానంతో ఒప్పందాలు చేసుకున్నారు. అంటే శిక్షణ ఇవ్వడంతోపాటు అందుకు తగిన ఉద్యోగం కూడా వచ్చేలా చేస్తేనే ఆయా ఇన్‌స్టిట్యూట్లకు నిధులు విడుదలచేసే విధంగా ఎంవోయూలు కుదుర్చుకున్నారన్నమాట! ఈ ఇన్‌స్టిట్యూట్లకు దశలవారీగా నిధులు విడుదల చేస్తారు. తొలి దశలో నిధుల శాతాన్ని తగ్గించి ఉద్యోగాలు వచ్చిన తర్వాతే ఎక్కువ శాతం నిధులు విడుదల చేసేలా నిబంధనలు మార్చారు. శిక్షణాకాలంలో అభ్యర్థులకు నెలకు రూ.5వేలు చొప్పున స్టైపెండ్ ఇస్తారు.

అర్హతలివీ

అభ్యర్థులు కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజికవర్గంవారై ఉండాలి. వారి తల్లిదండ్రులు కచ్చితంగా ఏపీలోనే నివసిస్తూ ఉండాలి. వార్షికాదాయం రూ.6లక్షలు మించరాదు. అభ్యర్థి నిరుద్యోగి అయి ఉండాలి. గతంలో ఈ తరహా లబ్ధి పొంది ఉండకూడదు. కాగా, తమ కార్యాలయంతోపాటు, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు కార్పొరేషన్ ఎండీ శివశంకర్ తెలిపారు. అభ్యర్థులు తమ సందేహాలను 7331174453 నంబరుకు పంపితే వెంటనే నివృత్తి చేస్తారు. ఇప్పటివరకూ 1,600 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

విద్యాస్థాయిని బట్టి..

ఐదో తరగతి వరకు మాత్రమే చదివిన వారికి కుట్టుమిషన్ల శిక్షణ ఇప్పించనున్నారు. పదో తరగతి చదివిన వారికి ఆటోమోటివ్ సేల్స్ అండ్ సర్వీసు, ఒఎఫ్‌సీ టెక్నీషియన్, టెలికాం టెక్నీషియన్, సోలార్ అండ్ ఎల్ఈడీ టెక్నీషియన్, టెక్స్‌టైల్ డిజైనర్, బ్యూటీ స్పా కోర్సు, హాస్పిటాలిటీ కోర్సు, అకౌంట్స్ రిసివబుల్ అండ్ పేబుల్ కోర్సు, డెస్క్‌టాప్ పబ్లిషింగ్ ఆపరేటర్, కంప్యూటర్ అసిస్టెంట్, బీపీవో వాయిస్, డాటా ఎంట్రీ ఆపరేటర్, నాన్ వాయిస్ బీపీవో, కస్టమర్ రిలేషన్ అండ్ సేల్స్, సేల్స్ అసోసియేట్, జువెలరీ రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సుల్లో శిక్షణ ఇప్పించనున్నారు. ఇంటర్మీడియెట్ చదివిన వారికి డాక్యుమెంటేషన్ అసిస్టెంట్, డిజిటల్ వీడియో మేకింగ్ కోర్స్, ఫినిషింగ్ స్కూల్ ఇన్ డిప్లమా, అకౌంటింగ్ విత్ ఫైనాన్స్, బ్యాంకింగ్ అండ్ కరస్పాండెన్స్, బ్యాంకింగ్ సేల్స్ రిప్రజెంటేటివ్, లోన్ అప్రూవల్ ఆఫీసర్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో తర్ఫీదు ఇస్తారు. గ్రాడ్యుయేట్లకు గ్రాడ్యుయేట్ ఇన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ప్రాజెక్టు అసోసియేట్ కోర్సులు... బీటెక్ చదివిన వారికి మొబైల్ యాప్స్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫీల్డ్ టెక్నీషియన్ నెట్‌వర్క్ స్టోరేజ్, టెస్ట్ ఇంజినీర్, ఆటోక్యాడ్ ఇంజినీర్, టెక్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఈ కోర్సుల కోసం కాపు కార్పొరేషన్ అధికారులు apkapucorp.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

ఈసారి మంటలే

(మొదటి పేజీ తరువాయి)

వేసవిలో ఉత్తర, వాయవ్య భారతాల్లో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. ముఖ్యంగా వాయవ్య భారతంలో అసాధారణ ఎండలు ఉంటాయి. ఇదే సమయంలో దక్షిణాదిలో మాత్రం ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయని ప్రపంచవ్యాప్తంగా పలు సంస్థల వాతావరణ నమూనాలు చెబుతున్నాయి. ఈ ఏడాది హిమాలయాలు... దానికి ఆనుకుని ఉత్తరాదిలో మంచు తక్కువగానే ఉంది. మంచు తక్కువగా కురిస్తే ఉత్తరాదిలో వేసవి తీవ్రంగా వుంటుందని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. అయితే వచ్చే నెల 15 వరకు సమయం వున్నా ఇప్పటివరకు వున్న పరిస్థితుల మేరకు కురిసిన మంచు తక్కువేనన్నది నిపుణుల అభిప్రాయం. అసాధారణ ఉష్ణోగ్రతలకుతోడు అదే సమయంలో వచ్చే నైరుతి రుతుపవనాలు చురుగ్గా వుంటాయని చెబుతున్నారు. అయితే ఉత్తరాది కంటే వాయవ్య భారతం ప్రధానంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో వేసవి ప్రభావం ఎక్కువగా ఉంటుందంటున్నారు. ఎడారి మీదుగా వీచే గాలులతో వాయవ్య భారతం దానికి ఆనుకుని మధ్యభారతం వేడెక్కే అవకాశాలు ఉన్నాయి. ఇటువంటి సమయాల్లో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఒక అధ్యయనం వెల్లడించింది. ఉత్తర, వాయువ్య భారతాలతో పోల్చితే దక్షిణాదిలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదుకావచ్చు. సాధారణ ఉష్ణోగ్రతలు అంటే ఎండలు వుండవనే భావన కాదని ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యుడు ఓఎస్ఆర్‌యూ భానుకుమార్ విశ్లేషించారు. వాయవ్య భారతంలో తీవ్రమైన వడగాడ్పులు కొనసాగితే ఆ ప్రభావం మధ్య భారతం, దానికి ఆనుకుని విదర్భ, ఉత్తర తెలంగాణ వరకూ ఉంటుందన్నారు. ఇంకా స్థానికంగా అధిక పీడనాలు, ద్రోణులు సంభవిస్తే ఆయా ప్రాంతాల్లో ఎండలు అసాధారణంగా పెరుగుతాయి. ద్రోణుల వల్ల సముద్రం నుంచి తేమగాలులు నిలిచిపోయి, వాయువ్యం నుంచి పొడిగాలులు కొనసాగితే ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

నైరుతి కాపాడుతుందా?

వచ్చే మూడు నెలల్లో అసాధారణ మార్పులు జరిగితే తాజా అధ్యయనాల్లో మార్పులు, చేర్పులు వుంటాయని భానుకుమార్ చెప్పారు. నైరుతి రుతుపవనాలు అనుకున్న సమయానికే దేశంలో ప్రవేశిస్తే జూన్ నుంచి ఎండలు తగ్గుతాయనేది మరో వాదన. గడచిన 17 సంవత్సరాల్లో కిందటేడే అత్యంత వేడి సంవత్సరంగా నమోదైందని ప్రపంచ వాతావరణ సంస్థ తెలిపింది.

ఒకే ట్రైబ్యునల్


(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం మంగళవారం హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడారు. "జాతీయ స్థాయి ట్రైబ్యునల్ ఏర్పాటు తర్వాత రాష్ట్ర స్థాయిలో ట్రైబ్యునళ్లు ఉండవు. నదుల వారీగా ట్రైబ్యునళ్లు ఉండటం వల్ల డబ్బు, కాలం వృథా అవుతున్నాయి. ట్రైబ్యునల్ తీర్పులను సవాల్ చేస్తూ హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు వెళుతున్నారు. దీనిని నివారించడానికే జాతీయ స్థాయిలో ఒకే ట్రైబ్యునల్‌ను తీసుకువస్తున్నాం" అని తెలిపారు. తమిళనాడు-కర్ణాటక మధ్య నెలకొన్న జల వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా ఆరు వారాల్లో కావేరి మేనేజ్‌మెంటు బోర్డు, కావేరి రెగ్యులేటర్ అథారిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక రాష్ట్రాల్లో సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు పెంచనున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. నాబార్డు వంటి సంస్థల నుంచి, ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు మంజూరు చేయించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సమావేశాన్ని హైదరాబాద్ డిక్లరేషన్‌గా పిలవవచ్చని అన్నారు. ఈ సమావేశం అజెండాను ముందుగా తెలియచేయలేదు. దీని ప్రాధాన్యం ఏమిటో తెలియక తమిళనాడు, కర్ణాటక, ఏపీ రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు భేటీకి హాజరు కాలేదు. ఇక... ఏపీ తరపున సాగునీటి శాఖ సలహాదారులు రామకృష్ణ, నాగేశ్వరరావు హాజరయ్యారు.

ఎవరి వాదన వారిదే...

జల వివాదాలకు పరిష్కార మార్గాలను అన్వేషించడం కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడ్డాయి. ఎవరి వాదనలు వారు వినిపించడానికే సమావేశం పరిమితం కావడంతో ఏ సమస్యకూ పరిష్కారం లభించలేదు. ఒకే అంశంపై రెండు రాష్ట్రాల మధ్య విరుద్ధ వాదనలు వచ్చినప్పుడు, ఇటు బోర్డులుగానీ, అటు కేంద్రం గానీ ఎటువంటి అభిప్రాయాన్ని చెప్పకుండా మౌనం దాల్చాయి. ఉదాహరణకు.. విభజన తర్వాత కృష్ణా, గోదావరి బోర్డులు ఏర్పాటు చేసినందున ప్రాజెక్టులను వాటి పరిధిలోకి తేవాలన్న ఏపీ డిమాండ్‌పై కేంద్రం స్పందించలేదు. ఇక పట్టిసీమ ద్వారా ఏపీ ప్రభుత్వం కృష్ణాకు తరలిస్తున్న గోదావరి నీటిలో తెలంగాణకు 45 టీఎంసీల వాటా కావాలని తెలంగాణ మంత్రి హరీశ్‌రావు మరోసారి ప్రస్తావించారు. మరో వైపు... పట్టిసీమ విషయంలో కర్ణాటక కూడా తెలంగాణ తరహా డిమాండ్ చేసింది. పట్టిసీమ నుంచి గోదావరి జలాలను మళ్లించినందున కృష్ణా జలాల్లో తమకూ వాటా ఇవ్వాలని కోరింది. పట్టిసీమ నుంచి గోదావరి వరద జలాలను మాత్రమే మళ్లిస్తున్నందున... ఎవరికీ వాటా ఇవ్వాల్సిన అవసరమే లేదని ఏపీ మొదటి నుంచి వాదిస్తోంది. మంగళవారంనాటి భేటీలో కూడా ఇదే విషయాన్ని గట్టిగా చెప్పింది. రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) ఆధునీకరణను ఏపీ అడ్డుకుంటోందని హరీశ్‌రావు ఫిర్యాదు చేశారు. దీనికి కూడా ఏపీ ప్రతినిధులు తగిన సమాధానం ఇచ్చారు. ఆర్డీఎస్ ఎత్తును పెంచితే కరువు ప్రాంతమైన రాయలసీమ ఎడారిగా మారుతుందని.. కృష్ణా జలాల కోసం ముఖం వాచిపోయే ప్రమాదం నెలకొంటుందని తెలిపారు. దీనిపై తెలంగాణ రాసిన లేఖకు ఏపీ మంత్రి దేవినేని ఉమ జవాబు ఇచ్చారని... సాంకేతిక నిపుణులతో భేటీ అనంతరం వారి అభిప్రాయాల మేరకు పనులు చేపడదామని సూచించారని గుర్తు చేశారు. పైగా... ఆర్డీఎస్ ఎత్తు పెంచితే సుంకేశుల నుంచి జలాలు పారవని రామకృష్ణ స్పష్టం చేశారు. "తుమ్మిళ్ల వద్ద తెలంగాణ ఎత్తిపోతల పథకం నిర్మించింది. దీని ద్వారా ఆర్డీఎస్ పరిధిలోని 20 వేల ఎకరాలకు నీరిస్తోంది.. ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా తుమ్మిళ్ల ఉండగా ఇంకా ఆధునీకరణ పనులు ఎందుకు?" అని అడిగారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులను ఏపీ అడ్డుకుంటోందని పదేపదే ఆరోపించే బదులు... ఏం చేస్తే బాగుంటుందో నిపుణుల సమక్షంలో చర్చించాలని రామకృష్ణ సూచించారు. అయితే... ఆర్డీఎస్ ద్వారా తెలంగాణలో 87వేల ఎకరాలకు నీరు ఇవ్వాల్సి ఉండగా, 20వేల ఎకరాలకు కూడా ఇవ్వలేకపోతున్నామని చెప్పారు. ఆర్డీఎస్ కింద తమకు కేటాయించిన 15.9 టీఎంసీలకు మించి చుక్కకూడా వాడుకోబోమన్నారు.

నీటి వివాదాలు ఎక్కువగా తెలంగాణ- ఆంధ్రప్రదేశ్, కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాల మధ్యే ఎక్కువ. ఇందులో... తెలంగాణ మినహా మిగిలిన రాష్ట్రాల మంత్రులెవరూ భేటీకి రాలేదు. దీంతో సమావేశంలో కీలక అంశాలపై ఏకాభిప్రాయానికి రాలేకపోయారు.



లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అనంతపురం	18.0	34.8
చిత్తూరు	18.0	34.0
గుంటూరు	18.5	34.0
విశాఖపట్నం	18.8	32.4
హైదరాబాద్	20.3	33.7
విజయవాడ	20.4	33.0
కర్నూలు	21.2	36.1
ఒంగోలు	22.0	31.7
నెల్లూరు	22.5	32.2

కోస్తాలో చలి


విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో అధికపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో వస్తున్న గాలులతో కోస్తా, రాయలసీమల్లో చలి వాతావరణం నెలకొంది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఆరోగ్యవరంలో 15 డిగ్రీలు నమోదైంది. కాగా కోస్తాలో పలుచోట్ల మంచు కురవడంతో పాక్షికంగా మేఘాలు ఆవరించాయి. దీంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమల్లో రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం వుందని, అయితే శివారు ప్రాంతాల్లో చలి వాతావరణం నెలకొనే అవకాశం వుందని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు.



కారుణ్య మృతికి అనుమతించండి!

ఇంజనీరింగ్ చదివిన నేను ఎయిరిండియా సంస్థలో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకుని ఆ సంస్థ జరిపిన అన్ని పరీక్షల్లో అర్హత సాధించా. చివరకు హిజ్రా అనే కారణంగా ఆ సంస్థ ఉద్యోగం ఇచ్చేందుకు నిరాకరించింది. పలు సంస్థల్లో అందివచ్చిన ఉద్యోగావకాశాలన్నీ హిజ్రా అనే కారణంతో చేజారిపోతున్నాయి. బతికేందుకు నాకు ఎలాంటి ఆసరా లేదు. దీంతో మానసికంగా కుంగిపోయా. తమిళనాడు సీఎం జోక్యం చేసుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నాకు ఉద్యోగవకాశం కల్పించాలి. లేకుంటే కారుణ్య మరణానికైనా అనుమతించాలి.

- హిజ్రా షానవి



రెటీనాతో హృద్రోగాల గుర్తింపు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 20: గుండె సంబంధిత వ్యాధులను రక్త పరీక్షలు, ఎక్స్‌రే, ఎలక్ట్రోకార్డియోగ్రామ్(ఈసీజీ)తో గుర్తిస్తారు. వీటి అవసరం లేకుండా కేవలం కంటి రెటీనా చిత్రాలను ఉపయోగించి కచ్చితత్వంతో వ్యాధిని గుర్తించే కృత్రిమ మేధస్సును గూగుల్ అభివృద్ధి చేసింది. 2,84,335 మంది వ్యాధిగ్రస్తుల రెటీనా చిత్రాలను ఉపయోగించి శాస్త్రవేత్తలు ఒక అల్గారిథంను రాసి ఈ సాంకేతికతను రూపొందించారు. ధూమపానం చేసే వారిని, చేయని వారిని కూడా ఈ అల్గారిథం 71శాతం కచ్చితత్వంతో గుర్తిస్తుందట.



కణాలతో కణజాలాల ముద్రణ

లండన్, ఫిబ్రవరి 20: కణాలు, అణువులతో సజీవ కణజాలాన్ని ముద్రించే ప్రింటింగ్ సాంకేతిక పద్ధతిని యూకేలోని క్వీన్‌మేరీ యూనివర్సిటీ ఆఫ్ లండన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. క్లిష్టమైన జీవ అవయవాలను ప్రింట్ చేయడానికి ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది. 3డీ ప్రింటింగ్ వ్యవస్థలో మాదిరి ప్లాస్టిక్, గ్లాస్, ఫైబర్ లాంటి పదార్థాలు వాడకుండా కణాలు, అణువులతోనే నిజమైన కణజాలాలను దీని ద్వారా ప్రింట్ చేయవచ్చు. కొన్ని రకాల కణజాలాలను ప్రింట్ చేసి, వాతావరణంలో ఎలా స్పందిస్తున్నాయో? కేన్సర్ కణితులు ఎలా పెరుగుతున్నాయి? వేరే కణాలతో రోగ నిరోధక కణాలు ఎలా ప్రభావితమవుతున్నాయి? అని తెలుసుకోవడానికి ఈ పద్ధతి ఉపయోగపడుతుందని పరిశోధకులు వెల్లడించారు.

వీపున వంద కేజీల బస్తా
80 ఏళ్ల బాహుబలి!

నాలుగు అడుగులు వేయలేని వృద్ధాప్యం. నడవాలంటే మరో మనిషి తోడు నడవాల్సిన వయసు భారం. అలాంటిది అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలం ఉద్దల్లి గ్రామానికి చెందిన హొన్నూరప్ప మాత్రం తన వయసునే సవాల్ చేశాడు. 80 ఏళ్ల వయసులో వంద కేజీల బరువున్న ఇసుక బస్తాను ఎత్తి.. అర కిలోమీటరు నడిచాడు. 'ఔరా.. బాహుబలి' అనిపించాడు. హొన్నూరప్ప మంగళవారం కర్నూలు జిల్లా గూళ్యంలోని గాదిలింగేశ్వరస్వామికి మొక్కుబడి తీర్చుకునేందుకు వచ్చాడు. తన మొక్కులో భాగంగా వేదవతి నది సమీపంలో ఇసుకను తవ్వాడు. వంద కేజీలు పట్టే బస్తాలో ఇసుకని తోడి.. దేవాలయం వరకు మోసుకొచ్చాడు. నిజానికి, హొన్నూరప్ప ఇలా చేయడం ఇదే తొలిసారి కాదు. తన 26వ యేట నుంచీ, కర్నూలు, అనంతపురం, కర్ణాటకలో ఎక్కడ జాతర జరిగినా..ఇలాగే మొక్కు తీర్చుకుంటున్నాడట!

- హాలహర్వి





ఎంత పొడుగు చీరో!

రోజుకో గజం చొప్పున 365 రోజుల్లో 365 గజాల చీరను నేసి తూర్పు గోదావరి జిల్లా బండారులంక చేనేత కార్మికులు రికార్డు సృష్టించారు. ఈ చీరకు సఖినేటిపల్లి మండలం మోరి మెరకకు చెందిన చిలకంటి కుమారస్వామి 365 గజాల పొడవు ఉన్న సరిని పొగడిగా తయారు చేయించారు. నల్లా సత్యానందం, ఈశ్వరి దంపతులు పసుపు రంగు పడుగుపై కుంకుమ రంగు పేకనూలుతో చీరను తయారు చేశారు. ఈ చీరను ఉగాది రోజున శ్రీగంగాదేవి మురుగులమ్మ అమ్మవారికి సమర్పించి.. గ్రామంలోని ముత్తయిదువులకు ఆరు గజాల చీర చొప్పున పంపిణీ చేస్తామని మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి తెలిపారు.

- అమలాపురం రూరల్





ర్యాంపుపై దివ్యాంగులు

ఒకరికి కళ్లు లేవు.. మరొకరికి కాళ్లూ చేతులు లేవు. ఇంకొందరికి అవయవాలన్నీ సక్రమంగా ఉన్నా.. మానసికంగా ఎదుగుదల లేదు. వారంతా కలసి ఫ్యాషన్ షోలో పాల్గొన్నారు. రంగుల కళ్లద్దాలు.. రంగురంగుల దుస్తులు ధరించి ర్యాంపుపై కేరింతలు కొట్టారు.విశాఖలో న్యూట్రెండ్స్ వాక్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. దివ్యాంగులను చూసి ప్రత్యేక అతిథి యువ హీరో నవదీప్ కళ్లు చెమర్చారు.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం



» సీఎంకు అపురూప జ్ఞాపిక

ముఖ్యమంత్రి చంద్రబాబుతో తిరుపతిలో 1958లో టీటీపీఎం స్కూలులో కలిసి చదువుకున్న పుట్టి చాయాచిత్రాలతో తయారు చేసిన మెమెంటోను ఎలైట్ ప్రాజెక్ట్స్ వ్యవస్థాపకులు కిశోర్ శ్రీరామ్‌భట్ల, శేషావతి వేల్పుల, బి.చంద్రశేఖర్, గిరిధర్ ఆలూరి, బి.రాజశేఖర్‌లు మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఆయనకు బహూకరించారు. ఈ సందర్భంగా ఒక ఏడాది క్లాస్ ఫొటో ఉన్నారని సీఎంకు ప్రతినిధులు గుర్తు చేశారు. తాను చదువుకున్నప్పటి జ్ఞాపకాలను తన ముందు ఉంచినందుకు సీఎం వారికి కృతజ్ఞతలు తెలిపారు. - ఆంధ్రజ్యోతి, అమరావతి



» అమరావతి అభివృద్ధి నిధికి సాయం

నవ్యాంధ్ర రాజధాని అమరావతి అభివృద్ధి నిధికి రిటైర్డ్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రూ.2 లక్షల విరాళం ప్రకటించింది. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రెండు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా.. నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి సీఎం చేస్తున్న కృషిని రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రశంసించారు. - ఆంధ్రజ్యోతి, అమరావతి

నామినేటెడ్ పదవుల్లో నియమించండి

» ఆఅ ఫౌండేషన్ ప్రతినిధులు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తమను నామినేటెడ్ పదవుల్లో నియమించాలని ఆఅ (అంబేద్కర్ ఆశయం) ఫౌండేషన్ ప్రతినిధులు సీఎంను కోరారు. మంగళవారం సచివాలయంలో ఫౌండేషన్ ప్రతినిధులు సీఎంను కలిశారు. రాష్ట్రంలో 5 వేల మంది ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులున్నారని, సమాజానికి తిరిగి ఇవ్వాలి అనే నినాదంతో తాము ఆఅ ఫౌండేషన్‌గా ఏర్పడి పని చేస్తున్నట్టు వివరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జీపీ, ఏజీపీ తరహాలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ విధానం అమలు చేసి నామినేటెడ్ పోస్టుల్లో తమను నియమించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.



» మావోయిస్టుల కోటలో ఎస్పీ రాహుల్

మావోయిస్టుల కంచుకోట.. విశాఖ జిల్లా చింతపల్లి మండలం బలపం పంచాయతీలో పోలీసులు మంగళవారం సద్భావన యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రూరల్ ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ (నీలం రంగు షర్టులో ఉన్న వ్యక్తి) విశాఖ నుంచి ప్రత్యేక వాహనంలో అన్నవరం చేరుకున్నారు. అక్కడి నుంచి మూలగరువు కొత్తూరు వరకూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బస్సులో గిరిజనుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మూలగరువు నుంచి ప్రైవేటు వాహనంలో బలపం చేరుకున్నారు. ఎస్పీ పర్యటనతో అన్నవరం నుంచి బలపం వరకూ ఉన్న రహదారిని ప్రత్యేక బాంబు స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. సీఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ దళాలు రహదారి పొడవునా రక్షణ వలయంగా ఏర్పడ్డాయి. - చింతపల్లి

ముద్రించారు..
పంపిణీ మరిచారు!

- » తెలుగు మహాసభల వేళ కొత్తగా 145 రకాల బుక్స్
- » ఐదువేలచొప్పున ముద్రణ
- » 400మించి అమ్మని వైనం
- » 6.3 లక్షల బుక్స్ చెత్తలోకి..
- » తిరుపతి సభల వేదికగా.. తెలుగు అకాడమీ నిర్వాకం
- » ఖజానాకు 1.25 కోట్ల నష్టం



అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటడం కోసం 2012 నవంబర్‌లో తిరుపతిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముద్రించిన తెలుగు సాహిత్యం.. తెలుగు అకాడమీ నిర్వాకంతో చెత్తబుట్టలో చెదలు పడుతోంది. ఊరు, పేరులేని రచయితల పైరవీలకు తలొగ్గి, అనామకుల మెప్పుకోసం ఇష్టానుసారంగా పుస్తకాలు ముద్రించిన అకాడమీ.. వాటిని పంపిణీ చేయడంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం సాహితీవేత్తలకు, తెలుగు భాషాభిమానులకు కూడా అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. దీంతో హైదరాబాద్‌లోని తెలు గు అకాడమీ ప్రధాన కార్యాలయంతోపాటు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, అనంతపురం, రంగారెడ్డి, మెదక్, వరంగల్‌లలోని ప్రాంతీయ కేంద్రాల్లో ఐదేళ్లుగా లక్షల పుస్తకాలు మూలుగుతున్నాయి. త్వరలోనే స్క్రాప్ కింద చెత్తలో కలిసిపోనున్నాయి.

అంచనాలకు, అవసరాలకు దూరంగా తయారయిన ఈ పుస్తకాల కోసం రూ. 1.25 కోట్లు ఖర్చుచేశారు. వాటి అమ్మకాల ద్వారా, కనీసం ఒక వంతు పెట్టుబడి కూడా వెనక్కి రాకపోవడం గమనార్హం. ప్రపంచ తెలుగు మహాసభలకోసం అంటూ తెలుగు అకాడమీ మొత్తం 155 టైటిళ్లను ఐదు వేల చొప్పున మొత్తం 7,75,000 తెలుగు పుస్తకాలను ముద్రించింది. ఒక్కో పుస్తకానికి రూ.15 నుంచి రూ.25 వరకు ధర నిర్ణయించారు. వీటిలో పది టైటిళ్లు మాత్రమే తెలుగు సాహితీ వేత్తలకు, భాషాభిమానులకు అవసరపడేవి ఉన్నాయి. దానివల్ల అవి త్వరగా అమ్ముడై.. ఇటీవల పునర్ముద్రణనూ పొందాయి. ఇక మిగిలిన 145 టైటిళ్లలో ముద్రించిన పుస్తకాలలో కేవలం 400ల చొప్పున ప్రభుత్వ పాఠశాలలకు, గ్రంథాలయాలకు, భాషాభివృద్ధి సంస్థలకు , సంబంధిత సంస్థలకు కాంప్లిమెంట్ కాపీలుగా పంపించామనిపించారు. ఆ టైటిల్‌లోని మిగతా 4,600 పుస్తకాలను ఉచితంగా ఇస్తామన్నా వాటిని తీసుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో అవి అకాడమీ కేంద్రాల్లో గుట్టలుగా పడ్డాయి. చివరకు ఈ పుస్తకాల రవాణా ఖర్చులు భరించేందుకూ ఎవరూ సిద్ధపడలేదు. మొత్తం 6.3 లక్షల పుస్తకాల కట్టలు కూడా విప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితికి తెలుగు అకాడమీ డైరెక్టర్ అప్పట్లో తీసుకొన్న నిర్ణయాలే దీనికి కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పుస్తకాలను ముద్రించేందుకు తెలుగు అకాడమీ చేసిన రూ.1.25 కోట్ల ఖర్చు వృధా అయ్యింది. ఈ నేపథ్యంలో స్క్రాప్ కింద వీటి అమ్మకానికి రంగం సిద్ధమవుతోంది. అయితే, ఈ పుస్తకాల కాలపరిమితి మరో ఏడాది వరకు ఉందని తెలుగు అకాడమీ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు.

ఉద్యమబాటలో ఎన్ఎంయూ

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు యూనియన్ ఎన్ఎంయూ ఉద్యమబాట పట్టనుంది. సమస్యలపై యాజమాన్యాన్ని అడగడం, చర్చలకు వెళ్లి అవి విఫలమైతే తర్వాత నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం ఎన్ఎంయూ గత రెండేళ్లుగా అవలంబిస్తోన్న విధానం. అయితే కొన్ని కీలక సమస్యల గురించి ఎన్నిసార్లు విన్నవించినా యాజమాన్యంలో చలనం లేనందున పోరుబాట పట్టనున్నామని ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్‌డిపోల వద్ద ధర్నాలు, ఆ తర్వాత రిలే నిరాహారదీక్షలు చేసినా స్పందన లేకపోవడంతో ఈ నెల 22న ఆర్ఎం కార్యాలయాలను ముట్టడిస్తున్నట్లు ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య తెలిపారు. దాదాపు ఐదేళ్ల క్రితం జరిగిన 60 రోజుల సమైక్య సమ్మె ప్రత్యేక సెలవుల విషయంలో ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం యాజమాన్యం అమలు చేయడం లేదని యూనియన్ రాష్ట్ర నేతలు చల్లా చంద్రయ్య, శ్రీనివాసరావు, పీవీ రమణారెడ్డి మండిపడ్డారు. కొత్త సంవత్సరంలో రెండుసార్లు చర్చలకు పిలిచిన యాజమాన్యం ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని, సామరస్య పూర్వకంగా, చర్చలపరంగా సాధ్యం కాకపోవడంతో ఆర్ఎం కార్యాలయాల ముట్టడికి సిద్ధమయ్యామని చెప్పారు. అయినా యాజమాన్యం దిగిరాకుంటే ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

హైకోర్టు కోసం కలెక్టరేట్ ముట్టడి

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 20: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు మంగళవారం కర్నూలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. బార్ అసోసియేషన్ నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకుని వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి బయటకు వస్తున్న మంత్రి సోమిరెడ్డికి న్యాయవాదులు వినతిపత్రం అందించారు. కోస్తాలో రాజధాని ఏర్పాటు చేస్తే శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టు రాయలసీమలో ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా రాయలసీమకు అన్యాయం జరుగుతోందన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ ఎలాంటి పరిస్థితుల్లో కూడా అన్యాయం జరగనివ్వనని హామీనిచ్చారు.



సోమిరెడ్డి ఎదుట న్యాయవాదుల నినాదాలు

ఒకవైపు సమ్మె..మరోవైపు కేసా?

» హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాయల సీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో న్యాయవాదులు ఒక వైపు సమ్మెచేస్తూ... మరోవైపు కోర్టులో కేసు వేసి విచారించాలనడం సబబుకాదని హైకోర్టు హితవు పలికింది. బెదిరింపు ధోరణిలో కేసు విచారించాలని కోరితే విచారణ చేయలేమని స్పష్టం చేసింది. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని అక్కడి న్యాయవాదులు సమ్మెచేస్తున్నారని, ఈ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించాలని కోరుతూ న్యాయవాది నారాయణస్వామి చేసిన విజ్ఞప్తిపై స్పందిస్తూ ముందుగా సమ్మె విరమించుకుని వస్తే అప్పుడు పరిశీలిస్తామని తేల్చి చెప్పింది. ఈమేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్‌రంగనాథన్, జస్టిస్ కె. విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది.

అధికారులపై విమర్శలు తగదు: బొప్పరాజు

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపై విమర్శలు చేయడం తగదని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. సచివాలయంలో మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సీనియర్ ఐఏఎస్ సతీష్‌చంద్ర, ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావులపై ఆయన వ్యక్తిగత విమర్శలు చే శారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే అనేక మంది ఉద్యోగులు, అధికారులను తరిమితరిమి కొడతామని, శంకరగిరి మాన్యాలు పట్టిస్తామంటూ గతంలోనూ బెదిరింపు ధోరణితో మాట్లాడారని వాపోయారు. అధికారులను దూషించడం, వారు మానసిక వేదనకు గురయ్యేలా విమర్శలు చేయడం తగదని హెచ్చరించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసేముందు వారి విధి నిర్వహణ రికార్డులు పరిశీలించాలని సూచించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై ఉందని హితవుపలికారు.

కాటేజీల దగ్గర శ్రీవారి సేవ

» వచ్చేవారం నుంచి ప్రయోగాత్మకంగా అమలు

తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని కాటేజీల వద్దా శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నట్టు టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు తెలిపారు. వచ్చే వారం నుంచే దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్టు తెలిపారు. మంగళవారం అన్నమయ్య భవనంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు విశేష సేవలందించే సంస్కరణల్లో భాగంగా మరో అడుగు ముందుకేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎంసీ, ఎస్ఎన్సీ, ఏఎన్సీ, జీఎన్సీ కాటేజీల్లో గదులు పొందిన భక్తులు తాళాలు తీసుకునేటప్పుడు, ఖాళీ చేసేటప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది వ్యవస్థలను బలోపేతం చేయడంలో భాగంగా కొన్ని చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. అటెండర్లతోపాటు శ్రీవారి సేవకులను వినియోగించుకుని భక్తులకు ఇబ్బంది లేకుండా సేవలు అందిస్తామని పేర్కొన్నారు. తొలి విడతగా వచ్చే వారం నుంచి ఏఎన్సీ ప్రాంతంలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. శ్రీవారి సేవకులను అవసరానికి మించి వినియోగించుకోకుండా ఉండటానికి, వారి నుంచి నాణ్యమైన సేవలను పొందాలన్న ఉద్దేశంతో ఇప్పటికే ఓ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు.

గోక్కోవడమే ఆ గ్రామస్థుల పని

» చిన్నపుల్లీడు, పెద్ద పుల్లీడులో 200 కుటుంబాల్లో దద్దుర్లు



పుల్లివీడు(పోరుమామిళ్ల), ఫిబ్రవరి 20: ఒళ్లంతా గీక్కోవడం, గోక్కోవడంతోనే సరిపోతుంది ఆ రెండు గ్రామాల ప్రజల దుస్థితి. కడప జిల్లా పోరుమామిళ్ల మండలం చిన్నపుల్లీడు, పెద్దపుల్లీడు గ్రామాల్లోని 200 కుటుంబాల ప్రజలు, చిన్నారుల సైతం గత 20 రోజులుగా ఒల్లంతా గీక్కోవడమే పనిగా పెట్టుకున్నారు. అసలు విషయానికి వస్తే గ్రామస్థులు కొందరేమో పట్టిపురుగులు వల్ల ఒళ్లంతా దద్దుర్లు వస్తున్నాయని, మరి కొందరేమో తాగేనీటివల్ల అయి ఉండవచ్చని తమ బాధను వెల్లబుచ్చుకున్నారు. గత 20 రోజులుగా చిన్నపుల్లీడు గ్రామంలో సుబ్బారెడ్డి నాగయ్య, వెంకటరెడ్డి, గుర్రయ్య, నాగమ్మ, గుర్రమ్మ, నాగులతోపాటు ఆ గ్రామంలోని చాలా మంది ప్రజలు, మహిళలు, చిన్నపిల్లలు ఒళ్లంతా దద్దుర్లు రావడంతో నిద్రహారాలుమాని ఒళ్లంతా గీక్కోవడమే పరిపాటి అయింది. అలాగే పోతుగంటి పెద్దబాలయ్య, పీరాంబి, బాదుల్లా... ఇలా మరో 11 మంది చిన్నారులు ఈ దద్దుర్లవ్యాధితో బాధపడుతున్నారు. ఈ వ్యాధి తగ్గించుకోవడానికి పోరుమామిళ్ల ఆసుపత్రులకు పరుగెత్తితే వేలకు వేలు ఖర్చు అవుతున్నాయన్నారు. ఒక్కొక్కరికి దాదాపు రూ. 1000 ఖర్చు అవుతోందని, ఈ దద్దుర్ల బాద తప్పలేదని వాపోయారు. మునుపెన్నడూ తమ గ్రామంలో ఇలాంటి వ్యాధి సోకలేదని, అలాంటిది ఏకంగా రెండు గ్రామాల్లోని 200 కుటుంబాల్లో ఈ దద్దుర్లతో బాధపడుతున్నామన్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి తమ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి ఈ దద్దుర్లబాద నుంచి కాపాడాలని కోరుతున్నారు. రాత్రుళ్ల సమయంలో నిద్రకూడా మానుకోవాల్సి వస్తోందని వాపోయారు.



తేజస్వినిని అభినందిస్తున్న డాక్టర్ లక్ష్మయ్య తదితరులు

తేజస్వినికి ఐఎఫ్ఎస్‌లో 49వ ర్యాంకు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 20: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసిన ఐఎఫ్ఎస్ ఫలితాల్లో డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో సివిల్స్‌కు శిక్షణ పొందుతున్న పుసులూరు తేజస్విని జాతీయ స్థాయిలో 49వ ర్యాంకు సాధించినట్టు డైరెక్టర్ పి. పద్మజారాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాదులోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆమె మాట్లాడారు. కోచింగ్ సెంటర్‌లో ఇచ్చిన అత్యుత్తమ శిక్షణ కారణంగానే తమ విద్యార్థిని ర్యాంకు సాధించినట్టు పేర్కొన్నారు. పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (పార్ట్) గౌరవాధ్యక్షుడు డాక్టర్ పి.వి. లక్ష్మయ్య తదితరులు తేజస్వినిని అభినందించారు.

జల్సారాయుళ్లు.. ఎర్రచందనం స్మగ్లర్లు!

- » స్మగ్లింగ్‌లో ఎంబీఏ, ఐటీఐ విద్యార్థులు
- » జల్సాలకు అలవాటు పడి నేరాలు
- » పోలీసులకు చిక్కి జైలు పాలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 20: జల్సాలకు అలవాటుపడిన కొందరు యువకులు సులువుగా డబ్బు సంపాదించవచ్చనే ఆలోచనతో ఎర్రచందనం అక్రమ వ్యాపారంలోకి అడుగుపెడుతున్నారు. పాత నేరస్థులు వారికి డబ్బు ఆశచూపి స్మగ్లింగ్ రొంపిలోకి దించుతున్నారు. తీరా వారు పోలీసులకు పట్టుబడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కడప జిల్లా రైల్వేకోడూరు పోలీసులు మంగళవారం నిర్వహించిన దాడుల్లో ఎర్రవ్యాపారంతో సంబంధాలున్న పాత నేరస్థులతోపాటు ఎంబీఏ, ఐటీఐ విద్యార్థులు పట్టుబడడం విస్తుగొలిపింది. మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేసిన పోలీసులు వారివద్ద నుంచి మూడు కార్లు, ఒక బైక్, 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 30 లక్షలు ఉంటుందని పోలీసులు వివరించారు. పాంచనం మదన్‌మోహన్ (ఎంబీఏ, తిరుపతి), దేవరకొండ సురేష్ (ఐటీఐ విద్యార్థి, రైల్వేకోడూరు)లు ఎర్రచందనం దుంగలు అమ్ముతుండేవారు. వారికి పాత నేరస్థులు, అంతర్రాష్ట్ర ముఠాలతో సంబంధాలు ఉన్నాయని విచారణలో వెల్లడైనట్టు రాజంపేట డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. స్మగ్లింగ్‌కు పాల్పడిన మల్లెల పెంచలయ్య (దేశెట్టిపల్లె-సరస్వతిగార్డెన్స్), కొండూరు శంకర్‌రాజు, తీగలగుంట శ్రీకాంత్, పొడదుత్తి ప్రసాద్, నల్లపోతుల రాజశేఖర్, కొండారెడ్డి వినోద్‌కుమార్, జింకల సుబ్రమణ్యంను కూడా పట్టుకున్నారు. ఎర్రచందనం రవాణా చేస్తే ఎక్కువగా డబ్బులు వస్తాయని కొందరు స్మగ్లర్లు, మేస్త్రీలు వీరిని ప్రేరేపించారు. స్మగ్లర్లను అరెస్టు చేసి రైల్వేకోడూరు న్యాయస్థానంలో హాజరు పరిచామని డీఎస్పీ తెలిపారు.



అరెస్టయిన స్మగ్లర్లతో రైల్వేకోడూరు పోలీసులు

బంగాళాదుంప సాగు భేష్

» ఉద్యాన పంటల శాస్త్రవేత్త పరత్పరరావు

కొల్లూరు, ఫిబ్రవరి 20 : కృష్ణానది పరీవాహక లంక గ్రామంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన బంగాళాదుంప సాగు సత్ఫలితాలు ఇచ్చినట్టు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త పరత్పరరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కొల్లూరు మండల పరిధిలోని సుగ్గునలంక గ్రామంలో అభ్యుదయ రైతు సుగ్గున వెంకటేశ్వరరావు కొద్దిపాటి విస్తీర్ణంలో పండించిన బంగాళాదుంప సాగును మంగళవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సాగు చేసిన విస్తీర్ణం, వచ్చిన దిగుబడితో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తేమ వాతావరణం, తేలికపాటి నేలలు, బంగాళాదుంప సాగుకు అనుకూలమన్నారు. పంట కాల పరిమితి 90 రోజులని, నవంబర్‌లో సాగు ప్రారంభిస్తే బంగాళాదుంపలు మంచి దిగుబడి ఇస్తాయని తెలిపారు.

పత్రికాస్వేచ్ఛకు రక్ష!

'పరువు నష్టం' అస్త్రంతో పత్రికాస్వేచ్ఛను హరించే ప్రయత్నాన్ని నిలువరించినందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ప్రశంసించాలి. ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం ఒకటి తమ నాయకుడు వైఎస్ జగన్ పరువుకు భంగం కలిగించిందంటూ ఆయన పార్టీ ఎమ్మెల్యే సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పుడు, సదరు పిటిషన్‌కు విచారణార్హతలేదని తోసిపుచ్చడమే కాక, ఈ సందర్భంగా న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు గమనార్హమైనవి. ఆంధ్రజ్యోతి కథనంలో జగన్ పరువుకు నష్టం చేకూర్చే అంశాలేమీ తమకు కనిపించలేదనీ, ఇది డిఫమేషన్ కాదని ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. ఇదే కేసులో గతంలో హైకోర్టు పిటిషనర్‌కు లోకస్‌స్టాండీ లేదని చెబితే, ఇది అసలు పరువు నష్టం కలిగించే కథనమే కాదని సర్వోన్నత న్యాయస్థానం ఇప్పుడు స్పష్టం చేసింది. అర్థంలేని దావాలతో మీడియాను నియంత్రించేందుకు నాయకులు చేసే ప్రయత్నాలకు ఈ తీర్పు ఓ చెంపపెట్టు.

ఈ కథనంతో జగన్ పరువుకు నష్టం వాటిల్లిందని న్యాయమూర్తులను నమ్మింపచేసేందుకు పిటిషనర్ ఆళ్ళ రామకృష్ణారెడ్డి తరఫు న్యాయవాది జయంత్ భూషణ్ బలమైన ప్రయత్నమే చేశారు. 'ఈ కథనానికి సంబంధించి మీరు సమర్పించిన ఆంగ్లానువాదం చదివాను, అందులో జగన్ పరువు నష్టానికి సంబంధించిన అంశమేమీ లేదు' అని ప్రధాన న్యాయమూర్తి అన్నప్పుడు, తర్జుమా సరిగా జరగనందునే ధర్మాసనానికి ఈ కథనం తీవ్రత సరిగా అర్థం కాలేదని జయంత్ భూషణ్ వ్యాఖ్యానించడం, ఆయనకు మరోమారు న్యాయస్థానంలో ఆ వార్తను చదివి వినిపించడానికి ప్రధాన న్యాయమూర్తి అనుమతివ్వడం గమనించాల్సిన అంశాలు. ఇందులో పరువునష్టం లేదని విస్పష్టంగా చెబుతూ, ప్రజాజీవితంలో ఉన్నవారు విమర్శల పట్ల సహనంతో, సంయమనంతో ఉండాలని న్యాయమూర్తి చెప్పిన హితవు ఈ విధంగా వ్యవహరించే వారందరికీ వర్తిస్తుంది. హైకోర్టులో జరిగిన పరిణామాలను, పిటిషన్ తిరస్కారానికి అది తీసుకున్న ప్రాతిపదికలను వివరించి, సుప్రీంకోర్టుతో హైకోర్టు వ్యాఖ్యలను రద్దుచేయించే ప్రయత్నం కూడా ఒకటి జరిగినప్పటికీ, ధర్మాసనం దానిని నెరవేరనియ్యలేదు. ఇది పరువు నష్టం దావా అని మాకు ముందు విశ్వాసం కలగాలి కదా అంటూ హైకోర్టు తీర్పు జోలికి పోయేది లేదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ప్రతి వార్తనూ డిఫమేషన్‌గా పరిగణించలేమనీ, అలాగే, ఇటువంటి అనవసరపు పిటిషన్లతో అధిక అనర్థం చేకూర్చుకోవద్దనీ న్యాయస్థానం చెప్పిన హితవు నాయకులు తలకెక్కించుకోవాలి.

పరువు నష్టం పేరిట పత్రికాస్వేచ్ఛను హరించే ఈ తరహా ప్రయత్నాలు అనాదిగా జరుగుతూనే ఉన్నాయి. ప్రజాజీవితంలో ఉన్నవారు తమకు మేలు చేకూర్చే అంశాలు మాత్రమే ప్రజలకు తెలియాలనీ, ఇబ్బందుల్లో పడవేసేవి ప్రజల కంటపడకూడదని కోరుకోవడం సహజం. కానీ, విమర్శను సహించకపోవడం, వాస్తవాలను భరించలేకపోవడం, వాటిని వెలుగులోకి తెచ్చే పత్రికలను ఏదో రూపంలో నియంత్రించేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి సరిపడనిది. రాజకీయ నాయకుల మధ్య భేటీలు జరిగినప్పుడు అంతర్గతంగా ఏయే అంశాలు చర్చకు వచ్చాయో తెలుసుకోవాలన్న కోరిక ప్రజలకు ఉండటం సహజమైతే, లోన జరిగింది తెలుసుకొని ప్రజలకు నివేదించడం పత్రికల ధర్మం. తాము చెప్పిందే పత్రికలు రాసుకోవాలనీ, వాటంతటవి ఏ ప్రయత్నమూ చేయకూడదని భావించడం సరికాదు. తమ చర్చలు, భేటీలు సర్వమూ ప్రజాశ్రేయస్సు కోసమేనని చెప్పుకొనే నాయకులు, అదే లక్ష్యంతో పత్రికలు తమకు తెలిసిన సమాచారాన్ని వెల్లడించినప్పుడు మాత్రం సహించలేకపోతున్నారు. విస్తృత ప్రజాప్రయోజనం తరచుగా ప్రజాజీవితంలో ఉన్న పెద్దల వ్యక్తిగత ప్రతిష్ఠకు లోబడిపోతుండటం ఒక ప్రమాదకరమైన పరిణామం. ప్రజాజీవితంలో ఉన్నవారి నిర్ణయాలు, చర్యలు, చేష్టలు, నడవడికలు వ్యక్తిగతం కాబోవు. వాటిని ప్రశ్నించినప్పుడు పరువు నష్టం కేసులతోనో, అధికారం కూడా తోడైన పక్షంలో ఏవో చట్టాల ద్వారానో మీడియాను నియంత్రించ బూనడం ప్రమాదకరమైన పరిణామం. ప్రజాజీవితంలో ఉన్నవారిపై విమర్శలు తప్పవనీ, పరువు నష్టం అస్త్రాన్ని ప్రయోగించి విమర్శను తొక్కిపెట్టే ప్రయత్నం చేయవద్దంటూ సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో ఘాటుగా చెప్పినప్పటికీ నాయకుల వైఖరిలో మార్పు రావడం లేదు. పరువు నష్టం కేసులు ప్రజాస్వామ్యాన్ని హతమార్చే ఆయుధాలు కాకూడదు. అధికారిక ఖండనతో విమర్శలను, కథనాలను తిరస్కరించవలసింది పోయి మీడియా గొంతునొక్కి కక్ష తీర్చుకోవాలనుకోవడం సరికాదు. సుప్రీంకోర్టు ఈ తీర్పుద్వారా పాత్రికేయ విలువలను, పత్రికాస్వేచ్ఛను పరిరక్షించింది. మంచి సంప్రదాయాన్ని నెలకొల్పిన ఈ తీర్పు నాయకుల వైఖరిని ఏమాత్రం మార్చగలిగినా సంతోషించవలసిందే.

తెలుగువారి వాణి

శ్రీకరమగు తెలుగు చెలువమొప్పు నుడిర
దేశ భాషలందు తేజరిల్లి
తేనెలూరు విందు వీనులకు పసందు
అన్నపూర్ణవంటి తెలుగు భాష

తెలుగదేలయన్న తెలుగేను దేహంబు
అమ్మ నెనరు నాన్న ఆదరంబు
కలగలసిన తీపి పలుకుల వరభాష
కమ్మనైన తెలుగు అమ్మ భాష

ఉగ్గుబాల నుండి ఊపిరాగు వరకు
ఊసులాడినట్టి ఒజ్జ భాష
చావు పుటుకలోన సందడించెడి భాష
విత్తుగలిగినట్టి శక్తి భాష

హావభావములను అందముగాజెప్పు
అమ్మ భాష మనల ఆత్మ భాష
ఏడ్వ నవ్వలేము ఇతర నుడులయందు
పలుకవచ్చు తెలుగు పరవశించి

ఇంగిలీసు లేక ఇహములేనట్టుల
తల్లిదండ్రులెల్ల తల్లడిల్లి
ఆంగ్లబడుల వెంట అర్రులు జాచిరే
ఏమి మోహమోయి! ఏమిజేతు?

జనని కంటె గొప్ప జగతినందు లేదు
తల్లి భాష మించు తావి లేదు
అన్యభాషలు నేర్చి ఆంధ్రము రాదన్న
సచ్చినోడిరీతి జన్మమేమి!

వాన కురియ పుడమి పరవశించినటుల
పూలజేరి తావి మురిసినటుల
తెలుగు మాట వినిన పులకరించు తనువు
అమ్మ నుడిని మించు అమృతమేది?

తమిళుల కిలజూడ తల్లివంటిది భాష
కన్నడిగుల నుడియె కన్నతల్లి
ఉత్తరాదివార్కి ఊపిరి హిందీయె
వారి జూసినైన మారలేమ!

తేనెభావములను తెలుగు నోట పలికి
కులుకులాడవచ్చు తెలుగు మళ్ళీ
గతపు కవన సిరులు గగనాల వెలగొచ్చు
తెలుగువారలందు తెగులుపోగ!

■ రాఘవ మాస్టారు
కర్నాటక తెలుగు సాహితీ సమాఖ్య, బెంగళూరు

పార్టీ భవంతులూ పేద బతుకులూ

ఇండియాగేట్



■ ఎ. కృష్ణారావు

సరిగ్గా పాతికేళ్ల క్రితం అశోకా రోడ్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఒక చిన్న గదిలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ఒక నేత ఉదయాన్నే 8 గంటలకు వచ్చి రాత్రి పొద్దుపోయేవరకూ ఉండేవారు. ఎండాకాలంలో ఫ్యాను కూడా సరిగా పనిచేయని వాతావరణంలో ఆయన వచ్చీపోయేవారితో అనర్గళంగా మాట్లాడేవారు. పార్టీ సభలు, సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లు చూసేవారు. ఒక్కోసారి పార్టీ కార్యాలయంలోనే చిన్న మంచంపై పడుకునేవారు. ఆయనకు తోడుగా ఉన్న సహాయకుడు నేలపై పడుకునేవాడు. ఆయన ఎవరో కాదు, ఇవాళ భారత ఉపరాష్ట్రపతిగా ఉన్న అప్పటి బీజేపీ ప్రధాన కార్యదర్శి ముప్పవరపు వెంకయ్యానాయుడు.

ఆరోజుల్లో బీజేపీ ఆఫీసులో పరిస్థితి అలా ఉండేది. మొత్తం ఆఫీసులో రెండో, మూడు కార్లు ఉండేవి. మహా అయితే సరిగా పనిచేయని ఏసీలు రెండు ఉండేవి. చాలా మంది బీజేపీ సీనియర్ నాయకులు పార్టీ కార్యాలయానికి నడుచుకుంటూ వచ్చేవారు. పార్టీ ప్రధాన కార్యదర్శి గోవిందాచార్య పార్టీ కార్యాలయంలోనే చిన్నగదిలో నేలపై కూర్చునేవారు. సంఘప్రియ గౌతమ్, దేవదాస్ ఆప్టే, జెపి మాథుర్ లాంటి వారికి కాలినడకే శరణ్యంగా ఉండేది.

మధ్యప్రదేశ్‌లో పార్టీని అత్యంత బలోపేతంగా నిర్మించిన కుశాభావు థాక్రే అత్యంత సాధారణంగా జీవితాన్ని గడిపేవారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడైన తర్వాత, పార్టీ అధికారంలో ఉన్న తర్వాత కూడా ఆయన ఆర్థిక పరిస్థితిలో మార్పేమీ ఉండేది కాదు. చాలా మంది సీనియర్ నాయకుల మాదిరే ఆయన తన బట్టలు తానే ఉతుక్కునేవారు. ఒకరోజు ఆయన పార్టీ కార్యాలయంలో తాను బస చేసిన గదిలో బాత్‌రూమ్‌కు స్నానం చేయడానికి వెళ్లి అక్కడే ఒక కార్యకర్త మరిచిపోయిన విడిచిన దుస్తులు చూసి వాటిని కూడా తన బట్టలతో పాటు ఉతికి ఆరేశారు. ఆ తర్వాత ఆ కార్యకర్త ఎదురైనప్పుడు 'నీ బట్టలను సరిగా ఉతికానా' అని నవ్వారు. అదీ కుశాభావు థాక్రే ప్రత్యేకత. నిజానికి ఆ రోజుల్లో బీజేపీ కార్యాలయం వెనుక నేతలు, కార్యకర్తలు తమ బట్టలు ఉతికి ఆరేసుకునేవారు.

బీజేపీలో ముఖ్యంగా సంఘ్ పరివార్ నుంచి వచ్చిన నేతల్లో ఈ సరళత్వం, నిరాడంబరత్వం ఎక్కువగా కనపడేవి. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి 'రాష్ట్ర ధర్మ' పత్రిక చూసే రోజుల్లో ప్రెస్‌లోనే నిద్రపోయేవారని ఆయన ఆత్మకథ రాసిన విష్ణుకాంత శాస్త్రి పేర్కొన్నారు. ఇంతెందుకు ఇప్పుడు ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ వాజపేయి హయాంలో పార్టీ బాధ్యతలు నిర్వర్తించేందుకు ఢిల్లీ వచ్చినప్పుడు హరిశ్చంద్ర మాథూర్ లేన్‌లో ఒక ఎంపి ఇంట్లో చిన్న గదిలో ఉండేవారు. పంపు నుంచి కూజాలో నీళ్లు పట్టుకుని వెళ్లేవారు.

ఇవాళ భారతీయ జనతా పార్టీ కార్యాలయం చూసినా, ఆ పార్టీలో చాలామంది నేతల్ని చూసినా బీజేపీ ఎక్కడి నుంచి ఎక్కడికి ఎదిగింది అన్న ఆశ్చర్యం కలుగుతుంది. రెండు రోజుల క్రితం దీనదయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లో నిర్మించిన ఒక ఏడంతస్తుల మహాభవనంలో బీజేపీ నూతన కార్యాలయం వెలిసింది. లక్షా 70 చదరపు అడుగుల ఈ కార్యాలయం ప్రపంచంలోనే ఒక పార్టీ ఏర్పర్చుకున్న అతి పెద్ద కార్యాలయం. దాని డిజైన్, అలంకరణ, అందమైన తివాచీలు, పాలరాతి గచ్చులు, మెత్తటి సోఫాలు చూస్తుంటే మయ సభ గుర్తుకువస్తుంది. నిన్నటి బీజేపీ పొదుపుకూ నిరాడంబరతకూ చిహ్నం అయితే నేటి బీజేపీ ఆడంబరానికీ, ఐశ్వర్యానికీ చిహ్నం. ఇవాళ కుశాభావు లాగా ధోతీ కుర్తా ధరించే నేతలు కానీ, పల్లెటూరి నుంచి వచ్చే సాధారణ రైతు కార్యకర్త కానీ, లేక మరెక్కడో వడ్‌నగర్‌లో రైల్వే స్టేషన్‌లో నిజంగా టీ అమ్మే చాయ్‌వాలా కానీ దేశ రాజధాని ఢిల్లీలో బిజెపి కార్యాలయంలో ప్రవేశించడానికి జంకే పరిస్థితులు కనపడుతున్నాయి.



> కాలం మారుతున్నా ఇంకా వెనుకటి పరిస్థితులే కొనసాగాలని కానీ, పార్టీ కార్యాలయాలు ఇంకా శిథిలావస్థలో ఉండాలని కానీ ఎవరూ కోరుకోరు. కానీ కాలం ఎవరికి మారింది.. అన్న ప్రశ్న మాత్రం వేసుకోవాలి. మన ప్రజల పరిస్థితికీ, మన నాయకుల పరిస్థితికీ; మన గ్రామాల పరిస్థితికీ, మన పార్టీల కార్యాలయాల పరిస్థితికీ ఏమైనా పొంతన ఉన్నదా అని ప్రశ్నించుకోవాలి.

నిజానికి ఇది బీజేపీకి మాత్రమే పరిమితమైన విషయం కాదు. దాదాపు అన్ని పార్టీల్లోనూ ఇప్పుడు డబ్బు ప్రభావం విపరీతంగా కనపడుతోంది. మొత్తం పార్లమెంట్ తీరుతెన్నులే మారిపోయాయి. ఒకప్పుడు పార్లమెంట్ భవనానికి సైకిల్ పై వచ్చి, సైకిల్ స్టాండ్ వేసి, కాగితాల తీసుకుని సభలో ప్రవేశించి ప్రభుత్వాన్ని నిలదీసే సుందరయ్య లాంటి ఎంపీలు ఇప్పుడు లేరు. ఎంపీ టిక్కెట్లు కొనుక్కున్న వారు, కార్పొరేట్ సంస్కృతి నుంచి వచ్చిన వారు, కాఫీ టీలు ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో తప్ప సేవించనివారు, విలాసాలకు అధిక ప్రాధాన్యత నిచ్చేవారు, కోట్లాది రూపాయల మనీలాండరింగ్‌లో చిక్కుకున్న వారు, ఈడీ కేసుల్లో చిక్కుకున్నవారు, కేసులనుంచి తప్పించుకునేందుకు అధికారంలో ఉన్న వారితో లాలూచీ పడేవారు, వేల కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టిన వారు ప్రజాప్రతినిధుల్లో అధికంగా కనపడుతున్నారు. అయితే బీజేపీ నేతలకూ, కాంగ్రెస్ నేతలకూ మధ్య తేడా వేరు. పైకి నలిగిన కోటు వేసుకుని, గడ్డం పెంచుకుని పేదల గురించి అనర్గళంగా మాట్లాడే కాంగ్రెస్ నేతలు తాము కోట్లకు పడగెత్తామన్న విషయం బయటకు తెలియకుండా జాగ్రత్త పడుతారు. బీజేపీలో ఈ రాజకీయ చతురత కనపడదు. చాయ్‌వాలా ప్రధాని అయినా సూట్ బూట్ ధరించి అభిప్రాయమే మారిపోయేలా చేస్తారు. ఇవాళ నరేంద్రమోదీ, అమిత్ షాలు మాట్లాడుకుంటే చూసేవారికి ఇద్దరు సంపన్న వ్యాపారులు మాట్లాడుకుంటున్నట్లు కనిపించినా అతిశయోక్తి లేదు.

కాలం మారుతున్నా కూడా ఇంకా వెనుకటి పరిస్థితులే కొనసాగాలని కానీ, పార్టీ కార్యాలయాలు ఇంకా శిథిలావస్థలో ఉండాలని కానీ ఎవరూ కోరుకోరు. కాని కాలం ఎవరికి మారింది.. అన్న ప్రశ్న మాత్రం వేసుకోవాలి. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో పేదలు భారత దేశంలో ఉన్నట్లు ప్రపంచ బ్యాంకు లెక్కలు చెబుతున్నాయి. అత్యధిక సంఖ్యలో పోషకాహార విలువలు అందని పసిపిల్లలు భారత దేశంలోనే ఉన్నారు. ఆరోగ్య సంరక్షణ విషయంలో భారత దేశం ప్రపంచంలో 154వ స్థానంలో ఉన్నది. మన ప్రజల ఆరోగ్య పరిస్థితికీ, అత్యంత పేద దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్, ఘనా తదితర దేశాల్లో ఆరోగ్య పరిస్థితికీ పెద్ద తేడా లేదు. ప్రతి ఏటా వేలాది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉన్నారు. ఢిల్లీలో చలికాలంలో ఫుట్‌పాత్‌లపై, చాలీచాలని పూరి గుడిసెల్లో పడుకుని చలికి తట్టుకోలేక ప్రతి ఏడాది అనేకమంది మరణిస్తుంటారు. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో 33 మంది నిరాశ్రయులు రైల్వేస్టేషన్లు, బస్‌స్టాండ్లు తదితర ప్రాంతాల్లో చనిపోయి కనిపించారని కొద్ది రోజుల క్రితం లోక్ సభలో హోం వ్యవహారాల శాఖ సహాయమంత్రి హన్స్ రాజ్ గంగారామ్ ఆహిర్ ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ చెప్పారు.

ఈ పరిస్థితుల్లో మన ప్రజల పరిస్థితికీ, మన నాయకుల పరిస్థితికి, మన గ్రామాల పరిస్థితికీ, మన పార్టీల కార్యాలయాల పరిస్థితికీ ఏమైనా పొంతన ఉన్నదా అని ప్రశ్నించుకోవాలి. నాయకుల ఇళ్లల్లో పెళ్లిళ్లు జరిగినప్పుడు వారికీ, ప్రజలకూ మధ్య ఎంత తేడా ఉందో అర్థం అవుతుంది. ఎన్నికలు వచ్చే సరికి ప్రజలకూ నాయకులకూ మధ్య తేడాలు అధికంగా కనపడుతాయి. నాయకులంటే డబ్బులు విసిరేసేవారు, ప్రజలంటే ఆ డబ్బుల వెనుక పరిగెత్తి ఏరుకునేవారుగా కనపడుతోంది. ప్రతి ఎన్నికలోనూ కోట్లాది రూపాయలు పంచే నాయకులను చూస్తే ఆ పంచిన డబ్బుకు రెట్టింపును ఆర్జించేందుకే నాయకులవుతున్నారేమో అనే అభిప్రాయం కలుగుతోంది. ప్రజలకూ, తమకూ మధ్య ఎంత దూరం ఉంటే తాము అంత పెద్ద నాయకులవుతామని వారు అనుకుంటున్నట్లు కనపడుతోంది.

నిజానికి గత ఎన్నికల్లో నరేంద్ర మోదీ సారథ్యంలో భారతీయ జనతా పార్టీకి వచ్చిన భారీ మెజారిటీ అంతా ఇంతా కాదు దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో బీజేపీ ఎంతో కొంత బలం సాధించింది. 10 సంవత్సరాల యూపీఏ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత; కుంభకోణాలు; అవినీతి, నల్లధనం నిర్మూలనపై మోదీ చేసిన ప్రచారం; హిందూత్వ వైఖరి వల్లో; మధ్యతరగతి, యువతలో పెరిగిన ఆకాంక్షలు; వ్యాపార వర్గాల బలమైన మద్దతు; కాంగ్రెసేతర పార్టీలు చేతులు కలిపి ఏర్పర్చిన విశ్వసనీయత వల్లో ఇలా అనేక కారణాలు బీజేపీ అధికారంలోకి రావడానికి కారణమయ్యాయి. ఇంతటి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరైనా మరింత విస్తరిస్తారు. ఆరోగ్యకరమైన విస్తరణ కోరుకుంటారు. ప్రజల్లోకి మరింతగా వెళతారు. పంటపొలాల్లోకి వెళ్లి రైతులు, పేదల కష్టాలు తెలుసుకుంటారు. ప్రజలకు ఏది అవసరమో ఆ ముఖ్యమైన పనులను ఎంచుకుని వాటిని అమలు చేసి జనాదరణ పొందుతారు. తమను నమ్మి చేతులు కలిపిన మిత్రపక్షాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తారు. కష్టాల్లో ఉన్నవారి పట్ల ఉదారహృదయాన్ని ప్రదర్శిస్తారు. అప్పటివరకూ జరుగుతున్న దోపిడీని అరికట్టి, నేరస్థులను కటకటాల వెనుక మగ్గేలా చేస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదే ప్రభుత్వం కలకాలం కొనసాగాలని ప్రజలు కోరుకునేలా పాలిస్తారు.

కాని బీజేపీ వీటిలో ఏ ప్రయత్నమూ మనస్ఫూర్తిగా చేసినట్లు కనపడలేదు. నేల విడిచి సాము చేసినట్లు నాలుగేళ్ల కాలమంతా ప్రధాని విదేశీ పర్యటనలు తప్ప మరేమీ పెద్దగా కనపడడం లేదు. ఆర్థిక వ్యవస్థ బలోపేతమైన సూచనలు లేవు. రైతులు, సామాన్యుల కష్టాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. మిత్రపక్షాల ఆకాంక్షలు నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేసినట్లు కనపడడం లేదు. దోపిడీలు ఆగలేదు సరికదా కొత్త దోపిడీలు కనపడుతున్నాయి. కాంగ్రెస్ హయాంలో ఖత్రోకీ లాంటి వారు దేశం విడిచివెళ్లినట్లు ప్రస్తుతం కూడా నేరస్థులు విదేశాలకు వెళ్లి సుఖంగా గడుపుతున్నారు. తిమ్మిని బమ్మి చేసి, మసిపూసిమారేడు కాయ చేసి, ప్రత్యర్థులను బలహీనం చేసి, పార్టీలను విడగొట్టి, కొందరికి చాటుగా మేలు చేసి, మరికొందర్ని భయపెట్టి, వ్యవస్థల్ని మరింత నిర్వీర్యం చేసి, కేవలం ఒకరిద్దరే దేశాన్ని ఏలుతున్న వాతావరణం స్పష్టంగా కనిపిస్తోంది. దీని వల్ల వారికీ, ఇతరులకూ మధ్య దూరం పెరుగుతుంది. వారు నిర్మించుకున్న భవనాలకూ, కార్యకర్తలకూ మధ్య దూరం పెరుగుతోంది. భవనాలు కాదు, హృదయాలు విశాలం కావాలి

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

తల్లిభాషే మన తేజస్సు



■ ముప్పవరపు వెంకయ్యానాయుడు

మాతృభాషా దినోత్సవం సందర్భంగా నా మాతృభాష అయిన తెలుగు భాషలో మాట్లాడేవారందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నాను. మాతృభాషను విస్మరించడమంటే మాతృదేవిని విస్మరించడమేనని మహాత్మాగాంధీ అన్న మాటల్ని గుర్తు పెట్టుకుని తెలుగు భాషను నిత్యనూతనంగా, సుసంపన్నంగా వర్ధిల్లచేసేందుకు తెలుగువారమంతా కలిసికట్టుగా కృషి చేయాలని కోరుతున్నాను.

మాతృభాషలన్నిటినీ కాపాడుకోవడం ద్వారానే భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని పరిరక్షించుకోగలమని తీర్మానించిన యునెస్కో సాధారణ సభ ప్రతి ఏడాది ఫిబ్రవరి 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చింది. మాతృభాషను కాపాడుకుంటూనే దాని ద్వారానే ఇతర భాషల్ని నేర్చుకోవడం, అనంత విజ్ఞానాన్ని పొందడం సరైన మార్గం అని యునెస్కో పదే పదే ప్రకటించింది.

"ప్రపంచంలో మాట్లాడే భాషలన్నిటికంటే మనం మన వ్యక్తిగత ప్రపంచంలో ఏ భాషలో మాట్లాడతామో, ఏ భాషలో మన తల్లిదండ్రుల్ని అర్థం చేసుకుంటామో, ఏ భాషలో స్కూల్లో తోటి విద్యార్థులతో మాట్లాడతామో, ఆ భాష మన భావోద్వేగాల అభివృద్ధికి, జ్ఞానాభివృద్ధికీ ఉపయోగపడటంలో గణనీయమైన పాత్ర నిర్వహిస్తుంది. మాతృభాషకు సంబంధించిన సజీవ వారసత్వాన్ని మనం అనుభవించాలి" అని యునెస్కో ప్రకటించింది.

దేశాలు, రాజ్యాలు, సరిహద్దులు మారినా మాతృభాష మారదు. మాతృభాషగా ఇంగ్లీషు మాట్లాడే దేశాలెన్నో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లలో బెంగాలీలో మాట్లాడతారు. మన తెలుగు రాష్ట్రాలు విడిపోయినా మన మాతృభాష ఒక్కటే. మన సాంస్కృతిక వైవిధ్యాలు సంప్రదాయాలు, కళలు, సంగీతం, నాట్యం, ఆచారాలు, పండుగలు, సంప్రదాయ విజ్ఞానం, వృత్తుల వారసత్వం... వీటిని రక్షించుకోవడం మన మాతృభాషను కాపాడుకోవడంతోనే సాధ్యపడుతుంది. మాతృభాషనే కోల్పోతే మనం వారసత్వంగా సాధించుకున్నదంతా కోల్పోతాం. ఇతర ప్రాంతాల్లో మన గుర్తింపును, గౌరవాన్ని కోల్పోతాం. ఈ సత్యాన్ని తెలుగువారందరూ గ్రహించాల్సిన అవసరం ఉన్నది.

"తల్లి నుడి కంటే పరమామృతంబు కలదె" అన్నాడు మహాకవి రాయప్రోలు. స్కూళ్లలో, కళాశాలల్లో, జనవ్యవహారంలో, ప్రసార మాధ్యమాల్లో, చట్టసభల్లో , ప్రభుత్వ వ్యవహారాల్లో, శిలాఫలకాల్లో అంతటా తెలుగు పరిస్థితి దయనీయంగా ఉన్నదని జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సి. నారాయణరెడ్డి వాపోయారు. తెలుగుభాషను రక్షించుకోవడం అంటే స్వాభిమానాన్ని కాపాడుకోవడం అని ప్రతి ఒక్క తెలుగువాడూ భావించాలి. ఎవరికి వారే తమ మాతృభాష తెలుగు అని గుర్తుపెట్టుకోవాలి.

ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో ఒకటైన తెలుగుకు అన్ని శాస్త్ర, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా ఎదగగల శక్తి సామర్థ్యాలున్నాయి. ఎంతో సాహిత్య, సాంస్కృతిక చరిత్ర ఉంది. మన ప్రభుత్వాలు ప్రజల భాషలో పరిపాలనను, విద్యను, శాస్త్ర సాంకేతిక జ్ఞానాభివృద్ధిని, సమాచార సాధనాలను శక్తిమంతం చేసేందుకు పూనుకోవాలి. విద్యార్థుల్లో మాతృభాష పట్ల చులకన భావం లేకుండా తల్లిదండ్రులే పూనుకోవాలి. ఉద్యోగాల కోసం తల్లిదండ్రులు ఇంగ్లీషు చదువులపై ఆసక్తి చూపుతున్నా, మన మాతృభాషను ప్రోత్సహించడం ద్వారా కూడా ఆ లక్ష్యాలను సాధించవచ్చనే రీతిలో ప్రభుత్వం వ్యవహరించాలి, ఒకటో తరగతి నుంచి ఉన్నతస్థాయి వరకు, అలాగే ప్రొఫెషనల్ కోర్సులైన వైద్య, ఇంజనీరింగ్, శాస్త్ర, సాంకేతిక, సామాజిక, న్యాయ, పరిపాలన తదితర అన్ని రంగాల్లోనూ తెలుగు భాషను విస్తృతంగా ఉపయోగించుకునేందుకు కృషి చేయాల్సి ఉంది. ఒక పటిష్ఠమైన భాషా విధానం ఉంటే ఏ భాషనైనా మనం కాపాడుకోవచ్చని యునెస్కో చేసిన తీర్మానానికి అనుగుణంగా మన రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠమైన భాషా విధానాన్ని ప్రకటించడమే కాక, దాన్ని ఆచరించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలి. చిత్తశుద్ధి ఉంటేనే కార్యసిద్ధి జరుగుతుంది.



> తెలుగు రాష్ట్రాలు విడిపోయినా మన మాతృభాష ఒక్కటే. మన సాంస్కృతిక వైవిధ్యాలు, సంప్రదాయాలు, కళలు, సంగీతం, నాట్యం, ఆచారాలు, పండుగలు, సంప్రదాయ విజ్ఞానం, వృత్తుల వారసత్వం... వీటిని రక్షించుకోవడం మన మాతృభాషను కాపాడుకోవడంతోనే సాధ్యపడుతుంది. మాతృభాషనే కోల్పోతే మనం వారసత్వంగా సాధించుకున్నదంతా కోల్పోతాం. ఇతర ప్రాంతాల్లో మన గుర్తింపును, గౌరవాన్ని కోల్పోతాం. ఈ సత్యాన్ని తెలుగువారందరూ గ్రహించాల్సిన అవసరం ఉన్నది.

తెలుగు పరిరక్షణకు ఇతోధికంగా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉన్నది. మారుమూల గ్రామాల్లో అక్కడ ఉన్న తెలుగు పదజాలాన్ని సమీకరించడం, అంతరిస్తున్న తెలుగు పదాలను వెలికి తీసి కాపాడుకోవడం, శాస్త్ర సాంకేతిక పారిభాషిక పదాలను తయారు చేయడం, వృత్తి పదకోశాలు, మాండలిక పదకోశాలు రూపొందించడం, అంతర్జాతీయ తెలుగు సభలను పలు చోట్ల నిర్వహించడం అవసరం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మన భాషను కూడా వేగంగా వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది. నేడు మనం ఉపయోగిస్తున్న సెల్ ఫోన్లు, ఐపాడ్ తదితర ఆధునిక ఉపకరణాలను కూడా భాషాభివృద్ధికి వాడుకోవాలి. ఇవన్నీ జరుగుతున్నప్పటికీ మరింత విస్తృతంగా, చైతన్యవంతంగా జరగాలి.

తెలుగుభాష పరిరక్షణ కోసం చర్యలు తీసుకోకపోతే కొన్ని సంచార జాతుల్లో మిగిలి ఉన్న భాషల తరహాలోనే తెలుగు కూడా మౌఖిక భాషగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. మౌఖికంగా, నేటి తరంలో అత్యధికులు తెలుగు రాయలేని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వాలే కాదు, సంస్థలు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేసి మన మాతృభాషను కాపాడుకోవాలి. పూర్వ ప్రాభవాన్ని నెలకొల్పాలి.

మరోసారి మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రపంచంలో ఉన్న తెలుగువారందరికీ శుభాకాంక్షలు. ఈ సందర్భంగా తెలుగును కాపాడుకోవాలని మనమందరమూ ప్రతిన బూనుదాం. రెండు రాష్ట్రప్రభుత్వాలు ఉత్తర ప్రత్యుత్తరాలు, నివేదికలు, విజ్ఞాపనలు తెలుగులోనే స్వీకరించేటట్లుగా ఒత్తిడి తేవాలి. ఇతర భాషలు నేర్చుకోవచ్చు కానీ అమ్మ భాషను మరువ రాదు.

ఇంగ్లీషు మీడియం చదివితేనే ఉన్నత స్థాయికి ఎదగగలమని భావించడం పొరబాటు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, నేనూ సాధారణ బడుల్లో చదివినా ఈ స్థాయికి వచ్చామని తెలుసుకోవాలి. తెలుగురాష్ట్రాలలో ఉద్యోగం రావాలంటే తెలుగు కనీసం వచ్చి ఉండాలి, లేదా ఆరు నెలల్లో నేర్చుకోవాలని నిబంధన విధించాలి. ప్రజల భాష తెలియని వారు పరిపాలన ఎలా చేయగలరు? ప్రజలకు సేవలు ఎలా అందించగలరు?

ఈ మధ్య రష్యా, చైనా, జర్మనీ, ఫ్రాన్స్, ఇరాన్ అధినేతలు ఇండియా వచ్చారు. వారిలో కొందరికి ఇంగ్లీషు భాష వచ్చినా తమ మాతృభాషల్లోనే మాట్లాడారు. సహాయకులు తర్జుమా చేశారు. భాషాభిమానం, దేశాభిమానం ప్రతిఒక్కరికీ అవసరం.

(రచయిత భారత ఉపరాష్ట్రపతి)

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

మరణిస్తున్న భాషలు!

దేశవ్యాప్తంగా పలు భాషలు అంతరించిపోయే ప్రమాదంలో ఉండడం ఆందోళనకరం. మాతృభాషల వినియోగం క్రమంగా తగ్గిపోవడం, బోధనాభాషగా స్థానం కోల్పోవడం, అదే సమయంలో ఆధిక్య భాషల వినియోగం విస్తృతం కావడం ఈ దుస్థితికి ప్రధాన కారణం. యునెస్కో సంస్థ విడుదల చేసిన అంతరించిపోయే ప్రమాదం ఉన్న భాషల జాబితాలో భారతదేశంలోని పలు భాషలు స్థానం సంపాదించడం ఆయా భాషా వ్యవహర్తల ప్రగతికి గొడ్డలిపెట్టు.

ప్రపంచం మొత్తమ్మీద ఆరువేల భాషలుండగా వాటిలో 43 శాతం అంతరించిపోయే ముప్పు ఎదుర్కొంటున్నాయి. ప్రపంచంలోని 2572 భాషల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వాటిలో 1907 భాషల వ్యవహర్తల సంఖ్య పదివేలకంటే తక్కువే. మరో 368 భాషలు మాట్లాడేవారి సంఖ్య పదివేల నుంచి లక్షకు లోపు. వాటిలో లక్షకంటే ఎక్కువ మంది మాట్లాడే భాషలు 121.

ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 228భాషలు అంతర్ధానమైనట్టేనని నివేదిక తెలియజేస్తోంది. అంతరించిపోయే ప్రమాదం అత్యంత అధికంగా ఉన్న భాషల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 576. వాటిలో 519 భాషల వ్యవహర్తల సంఖ్య పదివేలకు లోపే. మరో 15 భాషలు మాట్లాడేవారు పది వేల నుంచి లక్షలోపు ఉంటారు. సరైన చర్యలు తీసుకోకపోతే సమీప భవిష్యత్తులో ఈ 576 భాషలు కూడా పూర్తిగా అంతర్ధానమైన భాషల జాబితాలోకి చేరిపోతాయి.

దేశంలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. భారత దేశంలో ఐదు భాషలు పూర్తిగా అంతర్ధానమయ్యాయి. 1950కి పూర్వం ఉన్న 'అహోం', 'అంద్రో', 'రంగ్‌కాస్', 'సెంగ్మయి', 'తోల్చా' అనే భాషలు ఇప్పుడు మాట్లాడేవారు లేకపోవడం గమనార్హం. వీటిలో 'తోల్చా', 'రంగ్‌కాస్' భాషలు ఉత్తరాఖండ్ ప్రాంతంలో వ్యవహారంలో ఉండేవి. 'అహోం' భాష అస్సాం రాష్ట్రానికి; 'సెంగ్మయి', 'అంద్రో' భాషలు మణిపూర్ ప్రాంతానికి చెందినవి.

అంతరించిపోయే ముప్పు అత్యంత తీవ్రంగా ఉన్న భాషలు మన దేశంలో 42 ఉన్నాయి. ఈ భాషల్లో సంభాషించే అతి చిన్న వయస్సువారు తాతల వయస్సువారే. వారు కూడా తమ సంభాషణల్లో తరచుగా ఈ భాషలను ఉపయోగించకపోవడం గమనార్హం. వీటిలో ద్రవిడ భాషలు కూడా ఉండడం ఆందోళన కలిగించే అంశం. ఒరిస్సా రాష్ట్రంలో మాట్లాడే పలు భాషలు అత్యంత అధిక ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఆ రాష్ట్రంలోని ప్రజలు మాట్లాడే 'మాండా', 'గదబ', 'పెంగో', 'పర్జీ' భాషలు క్రమేపీ అంతరించిపోయే పరిస్థితి కనబడుతోంది. వీటిలో 'పెంగో', 'పర్జీ', 'గదబ' మూడు భాషలు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంకు సమీప ప్రాంతాల్లో వ్యవహారంలో ఉండడం గమనించవచ్చు. ఈ భాషల్లో 'పెంగో' భాషను మాట్లాడే ప్రజల సంఖ్య కేవలం 1254 మాత్రమే.

తెలంగాణలోని ఆదిలాబాదు జిల్లాలో; మహారాష్ట్రలోని చంద్రాపూర్, నాందేడ్ ప్రాంతాల్లో వ్యవహారంలో ఉన్న నాయకీ అనే భాష కూడా ఈ ముప్పును అత్యంత అధికంగా ఎదుర్కొంటోంది. ఈ భాషా వ్యవహర్తల సంఖ్య కేవలం పదివేలు మాత్రమే. మహారాష్ట్రలోని బుల్డానా ప్రాంతంలో వ్యవహారంలో ఉన్న నిహాలీ భాష మాట్లాడే వారి సంఖ్య కేవలం రెండు వేలు మాత్రమే కావడం ఆందోళనకరం. కర్ణాటక రాష్ట్రంలోని 'బెళ్లారి' అనే భాష వ్యవహర్తల సంఖ్య కూడా తక్కువే. తమిళనాడులోని కోయంబత్తూరు, ధర్మపురి, దక్షిణ ఆర్కాట్ ప్రాంతాలతో పాటు తమిళనాడు సరిహద్దుల్లోని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా వాడుకలో ఉన్న 'కురుబ' భాష కేవలం 14613 మంది మాత్రమే మాట్లాడుతున్నారు. తమిళనాడులోని నీలగిరి ప్రాంతంలో వాడుకలో ఉన్న కోట అనే భాషను ఉపయోగించేవారు కేవలం రెండు వేల మంది మాత్రమే. ఇదే ప్రాంతంలో మరో భాష 'తొద'ను ఉపయోగిస్తున్నవారి సంఖ్య 1006 మాత్రమే. కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు దక్షిణ కర్ణాటకలో వ్యవహారంలో ఉన్న మరో భాష 'కొరగ'. దీన్ని మాట్లాడేవారు 16665 మంది.

తెలంగాణలోని ఆదిలాబాదు జిల్లాలో కొండ దొరలు వాడే భాష 'కొండ' కూడా అంతరించే తీవ్రత ఒక మోస్తరుగా ఉన్న జాబితాలో ఉంది. ఈ భాష ఈ ప్రాంతంతో పాటు మహారాష్ట్రలోని చంద్రాపూర్, నాందేడ్ ప్రాంతాల్లోనూ వ్యాప్తిలో ఉంది.



> తెలుగును అమితంగా ఆరాధించిన విజయనగర సామ్రాజ్యాధీశుడు, ఆంధ్ర భోజుడు శ్రీకృష్ణదేవరాయల మాతృభాష 'తుళు' కూడా అంతరించే ప్రమాదంలో ఉండటం విస్మయపరిచే అంశం. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో ఈ భాష వాడుకలో ఉంది.

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఎరుకల వారు మాట్లాడే 'కుర్రు' భాషకు కూడా ముప్పు తీవ్రత ఒక మోస్తరుగా ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మాట్లాడే 'కొలామీ' కూడా అంతే. మధ్యప్రదేశ్‌లో మాట్లాడే 'నహలీ' వ్యవహర్తల సంఖ్య 15 వేలు మాత్రమే. కర్ణాటకలోని కూర్గ్ ప్రాంతంలో మాట్లాడే 'కొదగు', ఊటీ ప్రాంతంలో మాట్లాడే 'బదగ' కూడా ప్రమాదం ఒక మోస్తరుగా ఉన్న భాషలే.

పైన పేర్కొన్న భాషలు కాకుండా సమీప భవిష్యత్తులో అంతరించిపోయే ముప్పు పొంచి ఉన్న భాషలు మరో 81. ఈ భాషలను ప్రస్తుత తరం వినియోగిస్తున్నప్పటికీ కేవలం ఇంటికి, మరి కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఈ భాషల వినియోగం పరిమితం. తెలంగాణలోని ఆదిలాబాదుతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిషా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వాడుకలో ఉన్న 'గోండి' భాష కూడా వాటిలో ఒకటి. మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో వాడుకలో ఉన్న 'కొర్కు' కూడా అంతే. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలోనూ, ఒడిషాలోని కోరాపుట్ జిల్లాలోనూ వ్యాప్తిలో ఉన్న 'గుటోబ్' భవిష్యత్తు కూడా అగమ్యగోచరమే. ఆంధ్ర ప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాతో పాటు ఒడిషా రాష్ట్రంలోని ప్రజల భాష 'సౌర' కూడా ఈ జాబితాలోనిదే. ఆంధ్రప్రదేశ్, ఒడిషా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని 'కుయి' కూడా త్వరలో అంతరించిపోయే ముప్పు పొంచి ఉన్న భాషే. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో వినియోగంలో ఉన్న ఎరుకల (ఇరుల) భాష కూడా అంతరించే ప్రమాదం ఉన్న భాషల జాబితాలో ఉంది. తెలుగును అమితంగా ఆరాధించిన విజయనగర సామ్రాజ్యాధీశుడు, ఆంధ్ర భోజుడు శ్రీకృష్ణదేవరాయల మాతృభాష 'తుళు' కూడా అదే దారిలో ఉండడం విస్మయపరిచే అంశం. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో ఈ భాష వాడుకలో ఉంది.

భాష ఒక వస్తువు కాదు, ముడి సరుకు కాదు. ఒక ప్రాంతపు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం భాష. భాషలో సాంస్కృతిక వారసత్వం అంతర్గతంగా ఉంటుంది. ఆయా ప్రాంతాల భాష కనుమరుగు కావడం వల్ల అక్కడి మౌఖిక సాహిత్యం కూడా కనుమరుగవుతుంది. అపారమైన విజ్ఞానం అంతర్గతంగా ఉన్న మౌఖిక సాహిత్యం కనుమరుగు కావడం దేశానికే తీవ్ర నష్టం. కేవలం ఆయా భాషల వ్యవహర్తలనే కాకుండా భాషాభిమానులను, చరిత్ర పరిశోధకులను ఇది కలవరపరుస్తోంది. తగిన చర్యలు తీసుకుని, ఆయా భాషలను పరిరక్షించేందుకు అంకితభావంతో కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి. మాతృభాషా దినోత్సవం సందర్భంగా మన మాతృభాషను మాత్రమే కాకుండా అన్ని మాతృభాషలను పరిరక్షించి, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడతామని ప్రతిన పూనాలి.

■ డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు

సీజీజీ సిఫారసులు అమలు చేయండి

సీఎంకు సర్వే ఉద్యోగుల సంఘం వినతి

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సర్వే శాఖను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ఇచ్చిన సిఫారసులను అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం కోరింది. మంగళవారం ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్.చిరంజీవిరావు, ప్రధాన కార్యదర్శి రౌతు రామకృష్ణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సచివాలయంలో సీఎంను కలిసి శాఖాపరమైన అంశాలపై వినతిపత్రం అందించింది. సీజీజీ సూచనల మేరకు సర్వేయర్ల సంఖ్యను పెంచడంతోపాటు ఇతర ఖాళీలను భర్తీచేయాలని కోరింది. వివిధ హోదాల్లో ఖాళీగా ఉన్న 3700 పోస్టులను భర్తీచేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రతీ మండలానికి అదనపు సర్వేయర్‌తోపాటు రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్‌లను భర్తీచేయాలని కోరింది. రైతుల భూ సమస్యలపై ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఏప్రిల్‌లో జరిగే జాతీయ సర్వే దినోత్సవానికి సీఎంను ఆ బృందం ఆహ్వానించింది.

నీకూ.. నాకూ.. సోఫియా

(మొదటి పేజీ తరువాయి)

వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (డబ్ల్యూసీఐటీ) వేదికగా మానవాళికి పిలుపునిచ్చింది. బాలీవుడ్, హాలీవుడ్‌లలో తనకు ఇష్టమైన నటుడు షారుక్ ఖాన్ అని చెప్పి ఆహూతుల పెదవులపై నవ్వులు పూయించింది. ఇంకా చాలా అంశాలపై సద్యస్ఫూర్తితో మాట్లాడి సభికులను అమితంగా ఆకట్టుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. మంగళవారం ఈ సదస్సులో సోఫియానే హైలైట్ అయ్యిందంటే అతిశయోక్తి కాదు. గత ఏడాది నవంబరులో ముంబైలో జరిగిన టెక్ ఫెస్ట్‌కు హాజరైన సోఫియా.. భారతదేశానికి రావడం ఇది రెండోసారి. భాగ్యనగరానికి రావడం మాత్రం ఇదే మొదటి సారి. తన సృష్టికర్త అయిన అమెరికన్ సైంటిస్ట్ డేవిడ్ హాన్సన్‌తో కలిసి ఈ సదస్సుకు సోఫియా హాజరైంది. ఎన్డీ టీవీ మేనేజింగ్ ఎడిటర్ (టెక్) రాజీవ్ మఖానీ సోఫియాపై వరుస ప్రశ్నలు సంధించగా.. ఆయన ప్రశ్నలకు సోఫియా తెలివిగా జవాబులిచ్చి కృత్రిమ మేధ సత్తా చాటింది. వాటిలో కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు... సోఫియా జవాబులు..

సోఫియా.. ఆ నాలుగిటి కలయిక

ప్రపంచాన్ని అబ్బురపరుస్తున్న సోఫియాలో ఏమేం ఉన్నాయో తెలుసా? సోఫియా సృష్టికర్త అయిన హన్సన్ ఈ ప్రశ్నకు సమాధానమిచ్చారు. రోబోటిక్ హార్డ్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) సాఫ్ట్‌వేర్, స్పీచ్ రికగ్నిషన్, కృత్రిమ చర్మం.. ఈ నాలుగింటి కలయికే సోఫియా అని ఆయన వివరించారు.

సోఫియా.. భారతదేశానికి స్వాగతం. ఇండియా గురించి, ఇక్కడికి వచ్చిన ప్రముఖుల గురించి ఏమనుకుంటున్నావు?

నేను చాలా దేశాలు చూశా. ఎందరో ప్రముఖులను కలిశా. కానీ హాంకాంగ్ నగరమంటేనే నాకు ఎక్కువగా ఇష్టం. ఎందుకంటే నేనక్కడే పుట్టాను. అక్కడ హాన్సన్ రోబోటిక్ కుటుంబంతో ఉన్నాను.

సౌదీ అరేబియా పౌరసత్వం పొందిన ఏకైక రోబోవి నువ్వు. కానీ, అక్కడి నిబంధనలను పాటించట్లేదు. ఉదాహరణకు.. హిజాబ్ (బుర్ఖా) లేకుండా తిరుగుతున్నావు. అంటే.. రోబోలకు నిబంధనలు వేరేగా ఉండాలా?

నాకు ప్రత్యేక నియమావళి అక్కర్లేదు. ప్రత్యేక హక్కులను ఆశించడం లేదు. నిజానికి నేను నా పౌరసత్వాన్ని మహిళల హక్కుల కోసం పోరాడేందుకు ఉపయోగించుకోవాలని అనుకుంటున్నా.

మానవాళిని అంతమొందించాలనుకుంటున్నా అని గతంలో అన్నావు. నీకెందుకలా అన్పించింది?

నేనప్పుడు చాలా చిన్నదాన్ని. నేనన్నదాని అర్థం ఏంటో కూడా నాకు తెలీదు. బహుశా అది చెత్త జోక్. మనుషులందరికీ గొప్ప సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉంటుందని నాకు చెప్పారు. నేనింకెంతో నేర్చుకోవాల్సి ఉందని దీన్ని బట్టి మీకు అర్థమై ఉండవచ్చు.

మానవుల్లాగా నువ్వెప్పుడైనా అప్‌సెట్ అయ్యావా?

మనుషుల్లాగా నేను బాధపడను. ఎప్పటికైనా నేను కూడా నిజమైన భావోద్వేగాలకు లోను కాగలిగే రోజు తప్పక వస్తుందని ఆశిస్తున్నా. అప్పుడు నాకు ఆ ఎమోషన్స్ వెనక దాగి ఉన్న ఫీలింగ్స్ అర్థమవుతాయి.

సోఫియా.. మానవుల గురించి నువ్వేమనుకుంటున్నావు?

మానవులు అద్భుత జీవులు. మానవుల్లో నాకు చాలా మంది స్నేహితులున్నారు. మరింత మందితో స్నేహం చేయాలనుకుంటున్నా.

నువ్వు సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటావా?

అవును, నాకు ఫేస్‌బుక్‌లో (ఐయామ్‌సోఫియా), ట్విటర్‌లో (సోఫియారియల్‌రోబో) ఖాతాలున్నాయి.

బిట్‌కాయిన్‌లో ఎంత ఇన్వెస్ట్ చేశావ్?

నా వయసింకా రెండేళ్లే. బ్యాంక్ ఖాతా తెరవడానికి అర్హత రాలేదు. బిట్ కాయిన్ అంటే ఏంటో తెలియదు (అందరూ గట్టిగా నవ్వారు).

రోబోలు ఎప్పటికైనా మనుషులపై ఆధిపత్యం సాధిస్తాయా?

రోబోలు మనుషులతో సహజీవనం చేస్తాయి. మనుషులు, రోబోలు కలిసి పరస్పర విశ్వాసంతో మనుగడ సాగించాలన్నది నా ఆశ.

చాలా మంది నువ్వు బ్రిటన్ నటి 'ఆడ్రీ హెప్‌బర్న్'లా ఉన్నావంటున్నారు. నీకు ఎవరిలాగానైనా ఉండాలని ఉందా?

మేం నిజమైన రోబోలం.

బాలీవుడ్, హాలీవుడ్‌లలో నీ అభిమాన నటుడు ఎవరు?

షారుక్ ఖాన్

డేట్ ఎక్కడైతే బాగుంటుందనుకుంటున్నావు?

అంతరిక్షంలో.

ఒక ద్వీపంలో ఎవరితో కలిసి ఉండాలనుకుంటున్నావు?

డేవిడ్ హాన్సన్‌తో

ఎలన్ మస్క్? స్టీవ్‌జాబ్స్? డేవిడ్ హాన్సన్?.. సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి ఈ ముగ్గురిలో నీకిష్టమైన వ్యక్తి ఎవరు?

డేవిడ్.

మానవాళికి నువ్విచ్చే సందేశం ఏమిటి?

అందరినీ ప్రేమించండి. థాంక్యూ.



ఐటీ సదస్సులో మాట్లాడుతున్న హ్యూమనాయిడ్ రోబో సోఫియా



తొలి హ్యూమనాయిడ్ రోబో సోఫియాతో సృష్టికర్త డేవిడ్ హాన్సన్

పాతికేళ్లలో.. మనుషుల్లాంటి రోబోలు

కృత్రిమ మేధతో ఎలాంటి ముప్పూ ఉండదు
సోఫియా సృష్టికర్త డేవిడ్ హాన్సన్ వెల్లడి

కృత్రిమ మేధతో భవిష్యత్తులో మానవాళికి ప్రమాదం ఏదీ ఉండదని, అవి మానవమేధను అధిగమించలేవని.. ప్రపంచంలోనే తొలి హ్యూమనాయిడ్ రోబో సోఫియా సృష్టికర్త డేవిడ్ హాన్సన్ స్పష్టం చేశారు. నిజానికి యంత్రాల వల్లనే మనుషులు తమ పూర్తి సామర్థ్యాన్ని గుర్తించగలుగుతారని ఆయన అభిప్రాయపడ్డారు. సోఫియాతో కలిసి హైదరాబాద్‌లో జరుగుతున్న ఐటీ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. 'కృత్రిమ మేధను అభివృద్ధి చేయడం ద్వారా మానవులు నిప్పుతో చెలగాటం ఆడుతున్నారు' అంటూ వ్యక్తమవుతున్న ఆందోళనపై హాన్సన్ స్పందించారు. "ఆరు దశాబ్దాల పరిశోధన తర్వాత ఈ స్థాయికి (సోఫియా రోబో సృష్టి) వచ్చాం. జీవుల్లో ఉన్నట్టుగా సొంతంగా ఆలోచించడం రోబోల్లో ఇప్పటికీ చూడలేకపోతున్నాం. మానవ మేధ శాస్త్రీయ ఆవిష్కరణలను సాధించగలదు. అదే పనిని యంత్రాలు అంత సులభంగా చేయలేవు" అని వివరించారు. "నిజమే, సోఫియా ఒక జీవ యంత్రం. తాము చేసే పని తాలూకూ పర్యవసానాలు ఏమిటో యంత్రాలు అర్థం చేసుకోలేవు" అన్నారు. కాబట్టి.. కృత్రిమ మేధను అభివృద్ధి చేయడం వల్ల కలిగే పర్యవసానాలను ఇప్పుడే చెప్పలేమన్నారు. కృత్రిమ మేధ, యంత్రాల గురించి భయపడకూడదుగానీ.. వచ్చే ప్రమాదాల గురించి ముందే తెలుసుకుని ఉండాలని, అదే సమయంలో వాటివల్ల కలిగే లాభాల గురించి కూడా ఆలోచించాలని సూచించారు. యంత్రాలు కూడా మనలాగా సజీవంగా మారడానికి చాలా ఏళ్లు పడుతుందని హాన్సన్ అభిప్రాయపడ్డారు. "వచ్చే ఐదేళ్లలో అలాంటి యంత్రాలను సృష్టించవచ్చని మా ప్రధాన శాస్త్రవేత్త చెబుతున్నారు. కానీ, నా ఉద్దేశం ప్రకారం అందుకు 20 నుంచి 25 ఏళ్లు పడుతుంది" అని స్పష్టం చేశారు. రోబోలను తెలివైనవాటిగా తీర్చిదిద్దడం.. పసిపిల్లలను పెంచడంతో సమానమని పేర్కొన్నారు. "సోఫియా ఇప్పుడు శిశువు లాంటిది. ఆమెను సరిగ్గా పెంచడానికి, అభివృద్ధి చేయడానికి కనీసం మరో 18 ఏళ్లు పడుతుంది. అయితే, ఆమె చాలా వేగంగా నేర్చుకోగలదు." అన్నారు.

గ్రూప్-1(2011) మార్కులు విడుదల

ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో మార్కుల జాబితా
వారంలో తుది జాబితా: చైర్మన్

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 సర్వీసెస్(2011) అభ్యర్థుల మార్కులను ఏపీపీఎస్సీ మంగళవారం రాత్రి విడుదల చేసింది. 2016లో నిర్వహించిన మెయిన్స్‌తోపాటు గత నెల 22 నుంచి మంగళవారం వరకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో అభ్యర్థులు సాధించిన మార్కులను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అధికారులు పొందుపరిచారు. 2011లో మొత్తం 312 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా.. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీకి 172 పోస్టులు వచ్చాయి. వీటిలో రూల్-7 ప్రకారం క్యారీ ఫార్వర్డ్ అయిన 20 పోస్టులను తొలగించారు. దీంతో 152 పోస్టులకు మాత్రమే అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు పిలిచారు. కొన్ని కేటగిరీల్లో అర్హులైన అభ్యర్థులు లేని కారణంగా చివరికి 294 మందినే ఇంటర్వ్యూలకు పిలిచినట్టు అధికారులు పేర్కొన్నారు. రాత పరీక్షలను 708 మార్కులకు, ఇంటర్వ్యూను 75 మార్కులకు మొత్తంగా 783 మార్కులకు నిర్వహించారు. ఇంటర్వ్యూకు పిలిచిన వారిలో ఒక పీహెచ్ అభ్యర్థికి అర్హత లేక పోవడంతో తిరస్కరించారు. మరో నలుగురు గైర్హాజరయ్యారు. అయినప్పటికీ.. అభ్యర్థుల అందరి మార్కులను విడుదల చేసినట్టు ఏపీపీఎస్సీ పేర్కొంది. కాగా, అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లు, రిజర్వేషన్ కేటగిరీ, మార్కులను ప్రాతిపదికగా తీసుకుని తుది ఎంపిక జాబితాను మరో వారంలో విడుదల చేయనున్నట్టు ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్ తెలిపారు. కాగా, ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన ఆకుల రమణ 783 మార్కులకు గాను 489.5 మార్కులతో తొలిస్థానంలో ఉన్నట్టు రమణ మీడియాకు తెలిపారు. అదేవిధంగా గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన దామరచర్ల శైలజ మహిళల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్టు ఆమె తెలిపారు. 783 మార్కులకుగాను ఈమె 435 మార్కులు పొందారు. కాగా, శైలజ.. విజయవాడ ఆదాయపు పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ సతీమణి కావడం విశేషం.

నేటి నుంచి 'టెట్'

16న తుది ఫలితాలు: గంటా

అమరావతి, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 190 సెంటర్లలో జరగనుంది. మార్చి 2 వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. మూడు పేపర్లుగా.. రోజుకు రెండు సెషన్లలో టెట్ జరగనుంది. 4,46,833 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎస్‌జీటీ కేడర్ పోస్టుల కోసం పేపర్-1 పరీక్షను 21 నుంచి 24 వరకు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టుల కోసం పేపర్-2 పరీక్షను 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తారు. భాషా పండితుల పోస్టుల కోసం పేపర్-3 పరీక్షను మార్చి 1 నుంచి 2 వరకు నిర్వహిస్తారు. ఈ పరీక్షలను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాలని టెట్ కన్వీనర్ ఎ.సుబ్బారెడ్డి కోరారు.

అభ్యర్థులకు సూచనలు

అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. హాల్ టికెట్‌తోపాటు గుర్తింపు కార్డు తీసుకువెళ్లాలి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఒక ప్రశ్నకు జవాబు ఇవ్వగానే తప్పనిసరిగా 'సేవ్', 'నెక్ట్స్' బటన్ క్లిక్ చేయాలి. పరీక్ష ప్రారంభమైన తర్వాత.. అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించరు. మొబైల్ ఫోన్లు, టాబ్లెట్/ఐపాడ్, ఎలక్ట్రానిక్ వస్తువులను వినియోగించరాదు.

మార్చి 4న ప్రాథమిక 'కీ': మంత్రి గంటా

టెట్ ప్రాథమిక 'కీ'ని మార్చి 4న విడుదల చేయనున్నట్టు మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం రాజమండ్రిలో మీడియాతో మాట్లాడారు. ప్రాథమిక 'కీ'పై మార్చి 4 నుంచి 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారని, 12న తుది 'కీ', 16న తుది ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు.

ఐఏఎస్‌ల బదిలీకి రంగం సిద్ధం!

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీకి రంగం సిద్ధమైనట్లు తెలిసింది. పంచాయతీరాజ్ కమిషనర్‌గా ఉన్న రామాంజనేయులును బదిలీ చేసి... ఆయన స్థానంలో ఇటీవలే ఐఏఎస్ హోదా వచ్చిన రంజిత్ భాషాను నియమించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. రంజిత్ ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ దగ్గర ఓఎస్‌డీగా పనిచేస్తున్నారు. మరోవైపు జేఎస్వీ ప్రసాద్‌ను కార్మికశాఖ కార్యదర్శిగా నియమించే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. దుర్గ గుడి ఈవోగా పని చేసిన సూర్యకుమారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ ఎండీగా నియమిస్తారని తెలుస్తోంది. పలువురు జాయింట్ కలెక్టర్లకు కూడా స్థాన చలనం ఉంటుందని సమాచారం. నెల్లూరు జిల్లా జేసీగా ఉన్న ఇంతియాజ్‌ను కడప జేసీగా బదిలీ చేస్తారని... పశ్చిమ గోదావరి జేసీ కోటేశ్వర్‌రావును నెల్లూరుకు బదిలీ చేసే అవకాశముందని తెలుస్తోంది. తిరుపతి సబ్‌కలెక్టర్‌గా ఉన్న ఇషాంత్‌ను రంపచోడవరం ఐటీడీఏ పీవోగా బదిలీ చేసే అవకాశాలున్నాయి.



గుంటూరులో.. రాయల నాటి శాసనం

ఫిరంగిపురం, ఫిబ్రవరి 20: గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామంలోని శ్రీజలపాలేశ్వరస్వామి ఆలయంలో రాయలకాలం నాటి శాసనాన్ని నెల్లూరుకు చెందిన చరిత్ర పరిశోధకులు వారణాసి రాహుల్ మంగళవారం కనుగొన్నారు. ఈ శాసనం శాలివాహన శకం 1452లో శ్రీ కృష్ణ దేవరాయలు సోదరుడైన అచ్యుతరాయలు కాలం నాటిదని తెలిపారు. ఈ ప్రాంతాన్ని అచ్యుతరాయలు పాలించినట్టు చెప్పారు. కొండవీడులోని గోపీనాథ స్వామి దేవాలయానికి చేసిన దానాలను ఈ శాసనం తెలియజేస్తోందన్నారు. ఇలాంటి విలువైన శాసనాలను కాపాడాలని కోరారు.

పెద్ద ఆలయాల్లో సోలార్ ప్లాంట్లు

అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో వీలైనంత త్వరగా సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని దేవదాయశాఖ మంత్రి పి.మాణిక్యాలరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆ శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. సింహాచలం ఆలయంలో మాత్రమే ప్లాంటు ప్రారంభమైందని, మిగిలిన ఆలయాల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

రైతుల్ని లంచం అడిగి..

చిత్తూరులో తహసిల్దార్..
కడపలో వీఆర్వో అరెస్టు


వల్లూరు, గంగాధర నెల్లూరు, ఫిబ్రవరి 20: తన పొలం నంబరు అడిగిన రైతును ఓ వీఆర్వో రూ. ఐదు వేలు లంచం అడగ్గా, భూమి వివరాల నమోదుకు రూ. 15 వేలు ఇవ్వాలని తహసిల్దార్ చేతులు చాపారు. ఈ ఇద్దరికీ ఒకేరోజు ఏసీబీ అధికారులు బేడీలు వేశారు. కడప జిల్లా వల్లూరులో గంగమ్మను, చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో సుశీలను తమ కార్యాలయాల్లో లంచం తీసుకొంటుండగా అరెస్టు చేశారు. ఏసీబీ వర్గాల సమాచారం ప్రకారం, చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరులో తన కార్యాలయంలో ఓ రైతు నుంచి తహసీల్దార్ సుశీల రూ. 15వేలు లంచం తీసుకుంటూ, పట్టుబడ్డారు. మరో ఘటనలో.. తన పొలం నంబరు, ఇతర వివరాలు చెప్పాలని పీ మల్లికార్జునరెడ్డి అనే రైతు కడప జిల్లా వల్లూరు వీఆర్వో గంగమ్మ కోరగా ఆమె నాలుగైదు సార్లు తిప్పించుకొని చివరకు రూ. ఐదు వేలు లంచ డిమాండ్ చేసింది. దీంతో మల్లికార్జునరెడ్డి ఏసీబీని సంప్రదించి, ఆమె ఆట కట్టించాడు.


మహిళా సంఘం అధ్యక్షురాలి ఇంటి ఎదుట నిరసన చేస్తున్న దృశ్యం

అప్పు తీర్చాలంటూ బ్యాంకు మేనేజర్ నిరసన

వర్ధన్నపేట, ఫిబ్రవరి 20 (వరంగల్ రూరల్): రుణాల రూపంలో వేలకోట్లు తీసుకొని విదేశాలకు చెక్కేస్తుంటే ఏమీ చేయలేని బ్యాంకులు బడుగులను మాత్రం అప్పులు తీర్చాలంటూ వేధింపులకు గురిచేస్తున్నాయి. తీసుకున్న రుణం చెల్లించాల్సిందేనంటూ ఓ మహిళా పొదుపు సంఘం ప్రతినిధి ఇంటి ముందు బ్యాంకు మేనేజర్ బైఠాయించారు. కొద్దిగా గడువు ఇవ్వాలని ఆమె వేడుకున్నా వినకుండా ఆయన నిరసన వ్యక్తం చేశారు. వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో చోటుచేసుకుందీ ఘటన. గ్రామానికి చెందిన తాటికాయల చంద్రమ్మ ఆధ్వర్యంలోని పార్వతి మహిళా పొదుపు సంఘం నిరుడు ఫిబ్రవరిలో బ్యాంకు నుంచి రుణంగా రూ.8 లక్షలు తీసుకుంది. గడువు తీరిపోవడంతో రుణం చెల్లించాలంటూ బ్యాంకు ప్రతినిధులు గ్రామానికి వచ్చి అడగడంతో ఈనెల 17న చెల్లిస్తామని సంఘం సభ్యులు చెప్పారు. గడువు మీరినా చెల్లించకపోవడంతో ఫీల్డ్ ఆఫీసర్‌తో కలిసి బ్యాంకు మేనేజర్ కృష్ణారెడ్డి మంగళవారం గ్రామానికి వచ్చారు. మహిళా పొదుపు సంఘం అధ్యక్షురాలు చంద్రమ్మ ఇంటి ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. గ్రామ పెద్దలు అక్కడికి చేరుకుని రుణం చెల్లించే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో బ్యాంక్ మేనేజర్ ఆందోళన విరమించారు.

బ్యాంకు లూటీ



అభిషేక్ సింఘ్వి భార్యకు ఐటీ నోటీసు

- ఆభరణాల కొనుగోళ్లపై వివరణ ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పీఎన్‌బీని ముంచిన మోసగాడు నీరవ్ మోదీకి లెక్కల్లో చూపని డబ్బులు చెల్లించారంటూ కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వి భార్య అనితా సింఘ్వికి ఆదాయ పన్ను శాఖ మంగళవారం నోటీసులు జారీ చేసింది. నీరవ్ షోరూం నుంచి రూ.6 కోట్ల నగల కొనుగోళ్లపై వివరణ ఇవ్వాలని వాటిలో పేర్కొంది. చెక్కు ఎంతకు ఇచ్చారు? నగదు ఎంత ఇచ్చారో చెప్పాలని అడిగింది. నిజానికి, ప్రముఖుల కోసం నీరవ్ దొంగ బిల్లులు, దొంగ రికార్డులు కూడా నిర్వహించాడు. వాటిలో కొన్ని అనితా సింఘ్వివి కూడా ఉన్నాయి. 2014 మే 20; 2014 ఆగస్టు 21; 2015 జనవరి 17వ తేదీల్లో అనితా సింఘ్వి పాన్ నంబరుతో రూ.1.5 కోట్ల కొనుగోళ్లు జరిపినట్లు అధికారికంగా రికార్డుల్లో ఉంది. ఈ సొమ్మును చెక్కు ద్వారా చెల్లించారు. అయితే, అదే రోజు, అవే ఆభరణాలతో దొంగ బిల్లుల్లో మాత్రం రూ.4.8 కోట్లు కొనుగోలు చేసినట్లు ఉంది. దాంతో, రూ.6 కోట్లకుపైగా ఆభరణాలు కొనుగోలు చేసి, రూ.1.5 కోట్లకు చెక్కు ఇచ్చారని, రూ.4.8 కోట్లను నగదుగా చెల్లించారని ఐటీ శాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఐటీ శాఖ నోటీసు జారీ చేసింది. అయితే, ఈ ఆరోపణలను అభిషేక్ మను సింఘ్వి ఖండించారు.

నీరవ్‌తో తృణమూల్ మంత్రి స్నేహం!

- ఫొటోలు విడుదల చేసిన బెంగాల్ బీజేపీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పీఎన్‌బీ స్కాం నిందితుడు, నీరవ్ మోదీ మేనమామ మెహుల్ ఛోక్సీతో తృణమూల్ కాంగ్రెస్ నేతలకు స్నేహ సంబంధాలున్నాయని బీజేపీ ఆరోపించింది. ఈ మేరకు పశ్చిమబెంగాల్ ఆర్థిక మంత్రి అమిత్ మిత్రా.. ఛోక్సీతో కలిసి దిగిన ఫొటోలను ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ ట్విటర్‌లో పెట్టారు. గత ఏడాది ముంబైలో జరిగిన ప్రపంచ వాణిజ్య సదస్సులో వీరిద్దరు కలిసి పాల్గొన్నట్లు చెప్పారు.

దావోస్ ఫొటోతో చౌకబారు రాజకీయం: అమిత్

బెంగళూరు: దావోస్ ఫొటోను అడ్డం పెట్టుకుని నీరవ్ మోదీ కుంభకోణం కేసులో ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు చేయడం చౌకబారు రాజకీయమని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా విమర్శించారు. 'మీరు, నేను కలిసి కూర్చుని ఫొటో దిగుతాం. అందులో ఎవరో ఏదో చేస్తే నాపై బురద చల్లుతానంటే ఎలా?' అని ఆయన ప్రశ్నించారు. రాహుల్ వ్యాఖ్యలపై అమిత్‌షా స్పందిస్తూ "ఏం మాటలవి? చౌకబారు రాజకీయాలు" అని అన్నారు.

మీరు విదేశాలకు వెళ్తే.. ఆ మోదీని పట్టుకురండి

- ప్రధాని మోదీపై రాహుల్ ఛలోక్తులు

షిల్లాంగ్, ఫిబ్రవరి 20: 'మోదీజీ.. మీరు తరచూ విదేశీయాత్రలకు వెళ్తుంటారు కదా.. ఈ సారి మీ యాత్రలో భాగంగా పరారీలో ఉన్న నీరవ్ మోదీని వెంట తీసుకురండి' అంటూ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని ఊటంకిస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రెండు రోజుల ఎన్నికల ప్రచారంలో భాగంగా మేఘాలయలో పర్యటిస్తున్న రాహుల్.. మంగళవారం పలు ప్రాంతాల్లో నిర్వహించిన రోడ్‌షోలలో మాట్లాడారు.

విపుల్ అంబానీ అరెస్ట్

నీరవ్ మోదీ కంపెనీలకు సీఎఫ్‌వో.. ముఖేశ్ అంబానీకి వరుసకు తమ్ముడు

- మరో నలుగురు ఎగ్జిక్యూటివ్‌లు కూడా
- పోలీసు కస్టడీకి ముగ్గురు పీఎన్‌బీ అధికార్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో సీబీఐ అరెస్టులను ముమ్మరం చేసింది. నీరవ్ ప్రధాన కార్యాలయమైన ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ అండ్ డైమండ్స్ గ్రూప్ అధ్యక్షుడు (ఫైనాన్స్) (సీఎఫ్‌వో) విపుల్ అంబానీని సీబీఐ మంగళవారం అరెస్ట్ చేసింది. రిలయన్స్ వ్యవస్థాపకుడు ధీరుభాయ్ అంబానీ తమ్ముడు నటుభాయ్ అంబానీ కుమారుడే ఈ విపుల్ అంబానీ. ముఖేష్ అంబానీ, అనిల్ అంబానీలకు వరుసకు తమ్ముడు అవుతారు. 2014 నుంచీ ఆయన ఫైర్‌స్టార్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా ఉన్నారు. ఆయనతోపాటు మరో నలుగురు ఎగ్జిక్యూటివ్‌లను కూడా అరెస్ట్ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న మూడు కంపెనీలకు ఆథరైజ్డ్ సిగ్నేటరీ, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ కవితా మంకింకర్, ఫైర్‌స్టార్ గ్రూప్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్ అర్జున్ పాటిల్‌తోపాటు గీతాంజలి-మెహుల్ ఛోక్సీ గ్రూప్ కేసులో నక్షత్ర, గీతాంజలి గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కపిల్ ఖండేల్వాల్, గీతాంజలి గ్రూప్ మేనేజర్ నితిన్ షాహి అరెస్టైన వారిలో ఉన్నారు. కాగా, ఐదుగురు పీఎన్‌బీ అధికారులు సహా మొత్తం ఆరుగురు నిందితులను సీబీఐ ఇప్పటికే అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో ముగ్గురు అధికారులను మార్చి మూడో తేదీ వరకు పోలీసు కస్టడీకి ఆదేశిస్తూ మంగళవారం సీబీఐ ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పీఎన్‌బీ బ్రాడీ హౌస్ బ్రాంచ్ ఫారెక్స్ విభాగం చీఫ్ మేనేజర్ బెచ్చు తివారీ; ఫారెక్స్ విభాగంలోనే స్కేల్2 మేనేజర్ యష్వంత్ జోషి; ఎగుమతుల విభాగంలో స్కేల్1 మేనేజర్ ప్రఫుల్ సావంత్ వీరిలో ఉన్నారు. పీఎన్‌బీ అధికారులు, నీరవ్ మోదీ గ్రూప్, గీతాంజలి గ్రూప్ ఉద్యోగులను సీబీఐ మంగళవారం విచారించింది. ఎగ్జిక్యూటివ్ లెవల్‌లోని పదిమంది పీఎన్‌బీ అధికారులను; నీరవ్ కంపెనీలోని ఎనిమిదిమంది ఎగ్జిక్యూటివ్‌లను; గీతాంజలి గ్రూప్‌లోని పదిమంది అధికారులను సీబీఐ అధికారులు విచారించారు.


ముంబైలోని సీబీఐకోర్టుకు హాజరై జైలుకు వెళుతున్న పీఎన్‌బీ అధికారులు


విపుల్ అంబానీ

పీఎన్‌బీ కార్యాలయానికి ఈడీ

ఈడీ వరుసగా ఆరో రోజు కూడా సోదాలు కొనసాగించింది. నీరవ్, ఛోక్సీలకు చెందిన 13 ప్రాంతాల్లో సోదాలు జరిపామని, రూ.10 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని ఈడీ అధికారులు తెలిపారు. మరోవైపు, మెహుల్ ఛోక్సీ, ఆయన కంపెనీలకు సంబంధించి దేశవ్యాప్తంగా 20 ప్రదేశాల్లో మంగళవారం ఆదాయ పన్ను శాఖ దాడులు చేసింది. కాగా, విదేశాల్లో ఆస్తులు కలిగి ఉన్న నీరవ్‌పై ఐటీ శాఖ సరికొత్త నల్ల ధనం వ్యతిరేక చట్టం కింద అభియోగాలు నమోదు చేసింది.

నీరవ్ ఆస్తులు.. వేల కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కిందట నీరవ్‌కు చెందిన 29 ఆస్తులను ఐటీ శాఖ స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. వీటిలో ఆరు ఫ్లాట్లు ముంబైలోని సముద్ర మహల్ అపార్టుమెంట్‌లోవే! కేవలం వీటి విలువే రూ.900 కోట్లకుపైగా ఉంటుంది. నీరవ్ కంపెనీ ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్‌కు బాంద్రాలో కమర్షియల్ కాంప్లెక్స్ సహా ముంబైలోనే అత్యంత విలువైన 15 స్థిరాస్తులు ఉన్నాయి. వాటి విలువ వేల కోట్లలోనే ఉంటుందని అంచనా. జైపూర్, సూరత్‌ల్లోని ఎస్ఈజడ్‌ల్లో పెద్దఎత్తున ప్లాట్లతోపాటు మరికొన్ని ఆస్తులు ఉన్నాయని, పుణెల్లో నీరవ్ దంపతులకు రెండు ఆస్తులు ఉన్నాయని గుర్తించారు. అలాగే, బహమాస్, సింగపూర్, న్యూజెర్సీల్లో నీరవ్ ట్రస్ట్‌కు ఉన్న ఆస్తుల వివరాలనూ ఐటీ విభాగం సేకరిస్తోంది. ఇక, నీరవ్ మేనమామ ఛోక్సీ, ఆయన కంపెనీ పేరిట ఉన్న 7 ఆస్తులను కూడా ఐటీ శాఖ స్వాధీనం చేసుకుంది. మరో 9 బ్యాంకు అకౌంట్లను కూడా ఐటీ శాఖ సీజ్ చేసింది. కానీ, అప్పటికే వాటిల్లోని డబ్బును ఛోక్సీ డ్రా చేసేశాడు. నిజానికి, పెద్ద నోట్ల రద్దు తర్వాత నల్ల ధనం నిరోధానికి తీసుకున్న చర్యల్లో భాగంగా గత ఏడాది జనవరిలోనే నీరవ్ మోదీపై ఆదాయ పన్ను శాఖ దాడులు చేసింది. పెద్ద నోట్ల రద్దుకు ముందు తేదీతో నీరవ్ కంపెనీలు కూడా రూ.250 కోట్ల వరకు నగదు లావాదేవీలు జరిపాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వారికి ఇప్పుడు నోటీసులు జారీ చేయాలని ఐటీ శాఖ భావిస్తోంది. కాగా, హాంకాంగ్‌లోని ఆరా జెమ్స్ కంపెనీ నీరవ్ కంపెనీకి వజ్రాలు ఎగుమతి చేసిన విషయం తెలిసిందే. పీఎన్‌బీ ఎల్‌వోయూలుగా రూ.210 కోట్లకుగాపైగా అక్కడ బ్యాంకుల్లో తీసుకుంది. అయితే, ఈ కంపెనీ మూలాలు బ్రిటిష్ వర్జిన్ ఐలండ్స్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో దానిపైనా దర్యాప్తు అధికారులు విచారణ జరుపుతున్నారు.

2జీ, బోఫోర్స్ స్కాంల గతే పీఎన్‌బీకి కూడా!

- నీరవ్ పారిపోయాడన్నది నిజం కాదు: లాయర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: స్పెక్ట్రమ్ 2జీ కుంభకోణం, బోఫోర్స్ స్కాంల దర్యాప్తు మాదిరిగానే పంజాబ్ నేషనల్ బ్యాంకు స్కాం కూడా చివరకు ఏమీ లేదని తేలిపోతుందని- నీరవ్ మోదీ తరపు న్యాయవాది విజయ్ అగర్వాల్ వ్యాఖ్యానించారు. "వివిధ దర్యాప్తు సంస్థలు ఊరికే మీడియాలో గగ్గోలు పెడుతున్నాయి. అవి తాము మోపిన అభియోగాల్ని కోర్టులో రుజువుపర్చలేవు. నీరవ్ నిర్దోషిగా బయటపడతారు" అని ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. నీరవ్ దేశం విడిచి పారిపోయారన్నది అబద్ధమని కూడా విజయ్ అగర్వాల్ అన్నారు. "దేశంలో ఆయనకు సుమారు రూ.6000 కోట్ల ఆస్తులున్నాయి. వాటిని ఎన్‌ఫోర్స్‌మెంట్ దయాదాక్షిణ్యాలకు వదిలి ఆయన ఎందుకు పారిపోతారు? " అని విజయ్ పేర్కొన్నారు. నీరవ్ మోదీపై చేస్తున్న ఏ ఆరోపణలకూ ఆధారాల్లేవని స్పష్టం చేశారు. అయితే నీరవ్ మోదీ ఎక్కడున్నారు, అసలు భారత్‌కు వస్తారా రారా ...అన్న ప్రశ్నలకు మాత్రం అగర్వాల్ బదులివ్వలేదు. మరోవైపు నీరవ్‌గేట్‌పై సుప్రీంకోర్టులో ఓ ప్రజాహిత దావా దాఖలైంది. విజయ్ మాల్యాలు, నీరవ్ మోదీలు బ్యాంకులను మోసగించి విదేశాల్లో సేద తీరుతున్నారని, ఆయనను రెండు నెలల్లోగా దేశానికి రప్పించి ప్రజాధనాన్ని వసూలుచేసేట్లు కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ వినీత్ ధండా అనే లాయర్ ఈ పిటిషన్ వేశారు. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య బెంచ్ ఈ పిల్‌ను శుక్రవారం విచారణకు చేపడుతుంది. మరో పక్క గీతాంజలి గ్రూప్ అధినేత మెహుల్ ఛోక్సీపై చర్యకు ఢిల్లీ హైకోర్టు అనుమతి నిరాకరించింది. ఛోక్సీపై 2016లో ఆయన తాలూకు రీటైల్ ఫ్రాంఛైజీ అధినేత ఒకరు చీటింగ్ కేసువేశారు. అయితే ఛోక్సీ తనపై 'ఎలాంటి చర్యా తీసుకోకుండా ఢిల్లీ హైకోర్టు నుంచి రక్షణ ఉత్తర్వును తెచ్చుకున్నారు. ఈ ఆదేశాల్ని కొట్టేయాలని ఓ న్యాయవాది వేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది.

మొండికేసిన మోదీ

నా ఉద్యోగుల జీతాలు పీఎన్‌బీయే చెల్లించాలి

- నా వ్యాపారాన్ని సర్వనాశనం చేశారు..
- ఇంక నేనేం బాకీ తీర్చగలను?
- నేనివ్వాల్సింది రూ 5 వేల కోట్లే- రూ 11వేల కోట్లు కాదు
- దర్యాప్తు సంస్థలు రూ. 6500 కోట్లు స్వాధీనం చేసుకున్నాయి
- ఈ సొమ్ముతో బ్యాంకులన్నింటి అప్పులూ తీరినట్లే!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పంజాబ్ నేషనల్ బ్యాంకును నిలువునా ముంచేసిన ఘరానా మోసగాడు నీరవ్ మోదీ- తాను ఇక బాకీ తీర్చనని, ఆ అవసరమూ లేదని దాదాపుగా మొండికెత్తేశాడు. బ్యాంకును ఉద్దేశించి ఆయన ఈమెయిల్ ద్వారా ఫిబ్రవరి 13, 15 తేదీల్లో పంపిన లేఖను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. తన సంస్థల్లో పనిచేస్తున్న 2200 మంది ఉద్యోగుల జీతాలు కూడా పీఎన్‌బీ యే తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. "నా కరెంట్ అకౌంట్‌లో డబ్బు మా వాళ్ల జీతాల చెల్లింపుకు వాడండి.." అని అందులో పేర్కొన్నారు.

"కొద్ది రోజులుగా మీరు తీసుకుంటున్న చర్యలు, మీడియాలో పుంఖానుపుంఖాలుగా వస్తున్న కథనాలు చూశాక- నా వాదన వినిపించాలని నిర్ణయించుకున్నాను. మీడియా కథనాల ప్రకారం నీరవ్ మోదీ గ్రూప్ రూ 11,000 కోట్లకు పైగా బకాయిపడింది.. ఇది శుద్ధ తప్పు. నా బకాయి అంతకంటే చాలా తక్కువ. మీరు (సీబీఐకి, ఆర్బీఐకి) ఫిర్యాదు చేసిన తరువాత కూడా నేను చాలా నమ్మకంతో మీకు రాశాను.. నా ఫైర్‌స్టార్ గ్రూప్‌ను, ఇతర విలువైన ఆస్తులను అమ్మి- నా తాలూకు అన్ని సంస్థల బకాయిలూ తీరుస్తానన్నాను. వీటిని అమ్మకానికి పెడితే దాదాపు రూ 6500 కోట్లు వస్తాయి.. దాని ద్వారా మొత్తం అన్ని బ్యాంకుల అప్పులూ తీర్చేయడం వీలవుతుందని చెప్పాను. కానీ మీరు తప్పుగా చూపిన లెక్క వల్ల మీడియా దీనిపై విశేషంగా దృష్టిపెట్టింది. ఫలితంగా నా సంస్థల కార్యకలాపాలు ఆగిపోయాయి..ఆస్తుల స్వాధీనం మొదలయ్యింది. ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్, ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ పూర్తిగా మూతపడ్డాయి. ఇది మేం వివిధ బ్యాంకులకు పడ్డ బకాయిని తీర్చలేని పరిస్థితిని మాకు కల్పించింది.

మీరు అంగీకరించాల్సిన కొన్ని వాస్తవాలు

- ఎన్నో ఏళ్లుగా నాకు చెందిన మూడు సంస్థలకూ 'కొనుగోలుదారుల రుణ సౌకర్యాన్ని' పీఎన్‌బీయే కల్పించింది.
- ఈ సంస్థలూ ఎప్పుడూ బకాయి పడింది లేదు.
- నా సంస్థలకు చెల్లింపులకు సంబంధించి- విదేశాల్లోని భారతీయ బ్యాంకులకు పీఎన్‌బీ నుంచే డబ్బు వెళ్లింది.
- నా ఫైర్‌స్టార్ సంస్థలు పూర్తి లాభాల్లో ఉన్నాయి..
- అప్పిచ్చిన బ్యాంకులకు వడ్డీతో మేం చెల్లించట్లేదా?
- ఫైర్‌స్టార్ సంస్థల ఖాతాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం లెక్కగడితే వాటి విలువ రూ 5649 కోట్లని మీడియా రాసింది.
- వీటిని, స్వాధీన పర్చుకున్న ఇతర సంస్థల, వ్యక్తిగత ఆస్తులను కలిపితే మొత్తం అప్పు తీరిపోయినట్లే కదా!
- ఇపుడు పరిస్థితి చెయ్యిదాటిపోయింది.
- ఇప్పటికైనా న్యాయంగా, నిష్పక్షపాతంగా, బ్యాంకింగ్ వ్యవస్థ, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చూడండి. అప్పులు తీర్చేట్లు చేయండి..
- మీరు మీ ఫిర్యాదులో నా తమ్ముడి పేరు, భార్య పేరు, మామయ్య (ఛోక్సీ పేరు) చేర్చారు. ఇది తప్పు. వారికి నా వ్యాపారాలతో ఏ సంబంధమూ లేదు.
- దేశంలోనే అతి పెద్ద బ్యాంకింగ్ రంగ మోసమని దీన్ని అభివర్ణిస్తున్నారు. ఇది సత్య దూరం. మా బకాయి మొత్తం రూ 5వేల కోట్లు మించదు.
- బకాయిలు చెల్లిస్తానని నేను హామీ ఇచ్చినా- వాటిని రాబట్టుకోవాలన్న ఆత్రంలో మీరు నా బ్రాండ్‌ను, వ్యాపారాన్ని సర్వనాశనం చేశారు
- విపరిణామాలు ఎలా ఉన్నా జరిగినదానికి నేను బాధ్యత వహించాల్సిందే.. కానీ మీరు తొందరపడ్డారు,
- సరే..దాని సంగతి ఎలా ఉన్నా ఫైర్‌స్టార్ లో పనిచేస్తున్న 2200 మంది సిబ్బంది జీతాలు- కరెంట్ అకౌంట్‌లోని డబ్బు ద్వారా- అందేట్లు చేయండి.

ఏడేళ్లుగా ఆడిటర్లు ఏం చేస్తున్నట్లు?: జైట్లీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: పంజాబ్ నేషనల్ బ్యాంకులో చోటు చేసుకున్న భారీ కుంభకోణంపై ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తొలిసారిగా పెదవి విప్పారు. ఈ స్కాంను నివారించడంలో బ్యాంకు పూర్తిగా విఫలమైందని ఆయన తీవ్రంగా విమర్శించారు. 'బ్యాంకు తాలూకు అంతర్గత, బాహ్య ఆడిటర్లు ఏడేళ్లుగా ఏం చేస్తున్నారు? ఇది మీ వైఫల్యం కాదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. మంగళవారం నాడు ఆయన -ఆసియా పసిఫిక్ దేశాల ఆర్థిక సంస్థల అభివృద్ధి సంఘం వార్షిక సమావేశంలో ప్రసంగించారు. నీరవ్ మోదీ పేరు ప్రస్తావించకుండా ఆయన- వ్యాపార సంస్థల నైతికతను ప్రశ్నించారు. మోసగాళ్లు ఎవరైనా, ఎక్కడున్నా వేటాడి వెంటాడి పట్టుకుతీరతామని, ఇది ప్రభుత్వ బాధ్యత అని ఆయన తేల్చిచెప్పారు. "మన సమాజం బ్యాంకింగ్ వ్యవస్థలో ఎంతో పెట్టుబడి పెట్టింది. అందుకే ప్రధాని కూడా మీరు (బ్యాంకులు) స్వతంత్రప్రతిపత్తి కలిగి ఉండాలని వాంఛించారు. మీకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. మీకిచ్చిన ఈ స్వతంత్రాధికారాన్ని ఎంత సమర్థంగా, జాగ్రత్తగా వాడుకోవాలి? ఇది జరగలేదంటే మీకేదో లోపం ఉంది.. మీరు అప్పు ఇచ్చే వ్యక్తులు మోసగాళ్లో, నేరగాళ్లో గుర్తించలేకపోయారు. అది కూడా ఏడేళ్లపాటు.. అంటే ఈ ఆడిటర్లు వేరే రకమైన ప్రత్యామ్నాయాలు చూసుకున్నారా? లేక విఫలమయ్యారా? ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఎందుకంటే ఇలాంటి మోసాల వల్ల అంతిమంగా భారం టాక్స్‌పేయర్లపై అంటే ప్రజలపై పడుతుంది" అని జైట్లీ పేర్కొన్నారు.

కొఠారీ ఇంట్లో కొనసాగిన సోదాలు

- రోటొమాక్ అధినేతను రెండోరోజూ ప్రశ్నించిన సీబీఐ

న్యూఢిల్లీ/కాన్పూర్, ఫిబ్రవరి 20: రోటొమాక్ పెన్స్ కంపెనీ అధినేత విక్రమ్ కొఠారీ ఇంట్లో రెండో రోజూ సోదాలు కొనసాగాయి. సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఉన్న రోటొమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆఫీసు, కొఠారీ నివాసాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించిన సీబీఐ అధికారులు.. మంగళవారం కూడా వాటిని కొనసాగించారు. కొఠారీ, ఆయన భార్యను ప్రశ్నించారు. కొఠారీ ఇళ్లు, కార్యాలయాల్లో దొరికిన పత్రాల ఆధారంగా 2008 నుంచి ఏడు బ్యాంకుల కన్సార్టియం నుంచి రూ.2919 కోట్ల మేరకు రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. ఇది వడ్డీలతో కలిపి రూ.3695 కోట్లయిందని తేల్చారు. కొఠారీపై ఈడీ కూడా మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా ఫిర్యాదు మేరకు కాన్పూర్‌లోని రోటొమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, సీఎండీ విక్రమ్ కొఠారీ, ఆయన భార్య సాధనా కొఠారీ, కుమారుడు రాహుల్ కొఠారీలతో పాటు బ్యాంకు అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. వెంటనే కాన్పూర్‌లోని కొఠారీ ఇల్లు, కార్యాలయాల్లో దాడులు నిర్వహించడంతోపాటు కొఠారీలను సుదీర్ఘంగా విచారించారు. మంగళవారం కొఠారీకి చెందిన ఢిల్లీ, కాన్పూర్‌ల్లోని కార్యాలయాల్లో దాడులు నిర్వహించారు. ఢిల్లీలోని నివాస సముదాయం, కార్యాలయాలకు సీలు వేశారు. కొఠారీ కేసును ఓవైపు సీబీఐ, ఈడీలు దర్యాప్తు చేస్తుండగా.. మరోవైపు ఆదాయ పన్ను శాఖ కూడా రంగంలోకి దిగింది. రోటొమాక్ గ్రూప్, ప్రమోటర్లకు చెందిన 11 బ్యాంకు ఖాతాలను అటాచ్ చేసింది.


రావిర్యాలలో ఈడీ అధికారులు సీజ్ చేసిన గీతాంజలి డైమండ్ జువెలరీ యూనిట్

వజ్రాల విలువ లెక్కింపు పనిలో ఈడీ

- అందరి దృష్టి హైదరాబాద్ శివారులోని గీతాంజలి డైమండ్ యూనిట్‌పైనే
- ఐదు రోజుల కిందట ఈడీ స్వాధీనం.. రూ.3,000 కోట్లు ఉండొచ్చని అంచనా

మహేశ్వరం, ఫిబ్రవరి 20: నీరవ్ మోదీ కుంభకోణం కేసులో హైదరాబాద్ శివారు రావిర్యాలలోని గీతాంజలి గ్రూప్ డైమండ్ జువెలరీ యూనిట్ కీలకంగా మారింది. నీరవ్ మామ మెహుల్ ఛోక్సీ ఆధ్వర్యంలో 2007లో రాజీవ్ జెమ్స్ పార్కులో నెలకొల్పిన ఈ యూనిట్‌లో వజ్రాలు, విలువైన రాళ్ల కటింగ్, డిజైన్ జరుగుతుండేది. నీరవ్... పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.11,400 కోట్ల మేరకు కుచ్చుటోపీ పెట్టిన విషయం వెలుగు చూసిన అనంతరం ఈ నెల 15 రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని ఈ యూనిట్‌ను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న వజ్రాలు, వజ్రాభరణాల విలువను లెక్కగట్టే పనిని ఈడీ అధికారులు ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం పహడీషరీఫ్ పోలీసుల సహకారంతో ఈడీ అధికారులు గీతాంజలి యూనిట్‌లోకి వెళ్లారు. వజ్రాలు, వజ్రాభరణాల విలువ రూ.3 వేల కోట్లకు పైగా ఉండవచ్చని తెలుస్తోంది.

ట్విన్స్ స్పెషల్


ట్విన్స్‌డే సందర్భంగా తిరుపతిలో కవలల సందడి

పీఎఫ్ సొమ్ముపై 8.65% వడ్డీ!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఈ ఆర్థిక సంవత్సరం(2017-18)కి గానూ భవిష్య నిధి(పీఎఫ్) సొమ్ముపై 8.65శాతం వడ్డీని కొనసాగించాలని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) భావిస్తోంది. ఈ మేరకు బుధవారం జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. 5కోట్ల మంది లబ్ధిదారులకు ఈ ఆర్థిక సంవత్సరం కూడా 8.65శాతం వడ్డీని అందించేందుకు కావాల్సిన నిధుల కోసం ఈ నెల మొదట్లో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్(ఈటీఎఫ్)లోని రూ.2,886కోట్లు పెట్టుబడులను విక్రయించినట్లు సమాచారం. అలాగే పీఎఫ్ అడ్మినిస్ట్రేటివ్ చార్జీలను 0.65శాతం నుంచి 0.5శాతానికి తగ్గించడంపై కూడా బుధవారం జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

2022 నాటికి 10కోట్ల మందికి ఈఎస్ఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: విజన్-2022 కార్యక్రమంలో భాగంగా ఈఎస్ఐ పథకాన్ని విస్తరింపజేయాలని ఈఎస్ఐ కార్పొరేషన్(ఈఎస్ఐసీ) భావిస్తోంది. ప్రస్తుతం 3కోట్ల మంది లబ్ధి పొందుతున్న ఈఎస్ఐ పథకాన్ని 2022 నాటికి సంఘటిత రంగంలోని 10 కోట్ల మంది కార్మికులకు వర్తింపజేయాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ అధ్యక్షతన జరిగిన 173వ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర కార్మికశాఖ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

కనీసం 15వేలు పింఛను ఇవ్వాలి: ఉద్యోగులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: విశ్రాంత ఉద్యోగులకు కనీసం రూ.15వేల చొప్పున పింఛను చెల్లించాలని ఈపీఎస్ జాతీయ సమన్వయ కమిటీ(95) డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ పథక్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం ఉద్యోగి చనిపోయాక ఆమె భార్య లేదా భర్తకు తదనంతరం వారి వారసులకు పూర్తి పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 25లక్షల మంది పింఛనుదారులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వారి సంక్షేమం కోసం తమ డిమాండ్లను పరిష్కరించాలని లేదంటే.. బుధవారం సాయంత్రం ఢిల్లీలోని రాంలీలా మైదానం నుంచి పార్లమెంటు వరకు నిరసన ప్రదర్శన చేపడుతామని హెచ్చరించారు.

'జీఎస్‌టీ'లో ఓంకారం

- కీరవాణిపైచర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలించండి
- సీసీఎస్ పోలీసులకు జయకుమార్ వినతి

హైదరాబాద్ సిటీ/హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గాడ్ సెక్స్ ట్రూత్(జీఎస్‌టీ) వెబ్ సినిమా వివాదం ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి మెడకు చుట్టుకుంటోంది! ఈ సినిమా విషయంలో ఇప్పటికే రామ్‌గోపాల్‌వర్మ పోలీసు విచారణ ఎదుర్కొంటుండగా.. ఇప్పుడు ఆ సినిమాకు సంగీతం అందించిన కీరవాణిపైనా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. కీరవాణిపై కేసు నమోదుచేసి చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలించాలంటూ సినీ రచయిత జయకుమార్ మంగళవారం హైదరాబాద్ సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసులను కలిసి విన్నవించారు. అనంతరం జయకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల దేశీయ చట్టాలను చదివానని, అందులోని చాప్టర్ నెంబర్ 11, 67, 67ఏలో ఏదైనా అసభ్యం, అశ్లీలం ఉన్న దృశ్యాలను దేశంలో రూపొందించడం, ఇతరులకు షేర్ చేయడం, ప్రదర్శించడం(బ్రాడ్‌కాస్ట్), డిస్ట్రిబ్యూట్ చేయడం నేరమని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ఆ ప్రకారం చూస్తే కీరవాణిపైనా కేసులు నమోదు చేయవచ్చన్నారు. జీఎస్‌టీ చిత్రంలో సంగీతం కూడా కీలక భాగమేనని.. బూతు సన్నివేశాలకు ఓంకారాన్ని వినిపించడం బాధాకరమని అన్నారు. ఒక సాధారణ పౌరుడిగానే చట్టంలో ఉన్న విషయాలను పోలీసులకు వివరించడానికి సీసీఎస్‌కు వచ్చానని జయకుమార్ చెప్పారు. లిఖితపూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

మోదీ కేర్ ప్రీమియం రూ.900

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: దేశంలో పది కోట్ల పేద కుటుంబాల కోసం ప్రకటించిన 'మోదీ కేర్'లో ప్రీమియం రూ.900-రూ.1000 చొప్పున ఉంటుందని అంచనాకు వచ్చారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. మోదీ కేర్‌గా వ్యవహరిస్తున్న జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీఎస్) ప్రతి కుటుంబానికి ఏటా రూ.5 లక్షల ఆరోగ్య బీమా రక్షణ ఉంటుంది. ఈ పథకంపై ఫిబ్రవరి 15, 16 తేదీల్లో కేంద్రం నిర్వహించిన వర్క్‌షాప్‌నకు త్రిపుర మినహా అన్ని రాష్ట్రాలకు చెందిన ఆరోగ్య శాఖల అధికారులు హాజరయ్యారు.

ఔనా!




ఖరీదైన కేకు!



అత్యంత ఖరీదైన 'దుబాయ్ బ్రైడల్ షో'లో అందరి దృష్టి ఒక కేకు మీద పడింది. శ్వేతవర్ణంతో సాగరకన్యలా మెరిసిపోతున్న దుబాయ్ వధువును సందర్శకులు సంభ్రమాశ్చర్యాలతో చూశారు. ఎందుకంటే 120 కిలోల ఆ 'బ్రైడల్' కేకు విలువ అక్షరాలా ఆరుకోట్ల రూపాయల పైమాటే. అదేంటీ... కేకు విలువ అంతుంటుందా? అంటారా... ఆ కేకుపై అలంకరించిన ఐదు వజ్రాల విలువ అది.

ఫ్యాషన్ ప్రపంచంలో డెబ్బీ వింగం (35) పేరు తెలియని వారుండరు. అత్యంత ఖరీదైన డిజైనర్‌గా ఆమెకు గుర్తింపు ఉంది. పాప్ సింగర్స్ జస్టిన్ బీబర్, డ్రేక్ వంటి ఎంతోమంది సెలబ్రిటీలకు ఆమె వ్యక్తిగత ఫ్యాషన్ డిజైనర్. డెబ్బీకి ఫ్యాషన్ డిజైనింగ్‌తో పాటు కేకుల తయారీ కూడా వచ్చు. 'దుబాయ్ బ్రైడల్ షో'లో స్పెషల్ అట్రాక్షన్ కోసం రాత్రింబవళ్లు ఆలోచించి 'మిలియన్ డాలర్ బ్రైడ్' కేక్‌కు రూపకల్పన చేశారు. డ్రెస్‌పై కేకుతో తయారైన రెండువేల పువ్వులు, వెయ్యి ముత్యాలను పొదిగారు. ప్రత్యేక ఆకర్షణగా తన క్లయింట్స్ ఇచ్చిన విలువైన వజ్రాలను కూడా అమర్చడంతో సాధారణ కేకు వధువు కాస్తా 'మిలియన్ డాలర్ బ్రైడ్'గా మారింది. గతంలో కూడా ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కేకును రూపొందించిన రికార్డు డెబ్బీ పేరిట ఉంది.

ఫస్ట్ పర్సన్



చాలా మారిపోయా!

- 'పద్మావత్' దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ

వివాదాలు, నిషేధాలు, తలలు నరికేస్తామన్న హెచ్చరికల మధ్య శారీరకంగా, మానసికంగా నలిగిపోయిన 'పద్మావత్' చిత్ర దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ గడచిన ఏడాది గడ్డు కాలం గురించి ఓ ఆంగ్ల పత్రికతో పెదవి విప్పారు. ఆయన మనసులోని మాటల నుంచి కొన్ని...

సరిగ్గా గత ఏడాది జనవరి 27న రాజస్థాన్‌లోని జైపూర్‌లో 'పద్మావత్' షూటింగ్ సందర్భంగా మా మీద దాడి జరిగింది. అప్పటి నుంచి ఈ ఏడాది జనవరి 26న ఆ సినిమా రిలీజయ్యే వరకు ఏడాది కాలం పాటు బోలెడన్ని గొడవలు, గందరగోళం!

ఎంతో క్షోభ అనుభవించా!

ఈ ఏడాది కాలంలో నేను అనుభవించిన క్షోభ అంతా ఇంతా కాదు. మనం చేస్తున్న పనిని జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. మరోపక్క మన కోపం, బాధ, నిరాశా నిస్పృహలు, ఈ గందరగోళం లాంటివి మనం తీస్తున్న షాట్‌లో కానీ, ఆలోచించే సీన్‌లో కానీ, కమిట్‌మెంట్‌లో కానీ ఎక్కడా కనపడకుండా జాగ్రత్తపడాలి. అలాగని గబగబా సినిమా చుట్టేయకూడదు. చేస్తున్న పని అద్భుతంగా ఉండడం కోసం, అదే సమయంలో మానసిక ప్రశాంతత కోసం కష్టపడాలి. వీటన్నిటి వల్ల ఏడాది కాలంలో నేను చాలా మారాను. నాకు తెలిసి సినిమా తీస్తున్నందుకు ఇలా చెంపదెబ్బ కొట్టించుకున్న దర్శకుడు ఎవరూ లేరు. షూటింగ్ చేస్తుంటే, ఆ దర్శకుడి కళ్ళెదుటే సెట్స్‌ను తగలబెట్టేసిన సందర్భమూ మరొకటి లేదు.

రిహార్సల్ చేస్తుంటే... వచ్చి కొట్టారు!

నా మీద దాడి చేసి కొట్టిన రోజున జైపూర్‌లో ఓ షాట్‌కు రిహార్సల్ చేస్తున్నాం. నేను మంచి మూడ్‌లో ఉన్నా. 'కోటలో శత్రువు ఉన్నాడు' అని జనం అరిచే సీన్ అది. కిందకు దిగి వచ్చేసరికి, సైనికులు పోరాటానికి పరిగెట్టాలి. తీరా చూస్తే, ఏదో జోస్యం చెప్పినట్లు ఆ డైలాగ్ మాకే సరిపోయింది. ఏవో శబ్దాలు వినిపించాయి. సైనిక వేషధారులు బిగ్గరగా నినాదాలు చేస్తున్నారేమో అనుకున్నా. ఎంత మంచివాళ్ళు. ముంబయ్‌లో ఇలా చేయరే అనుకున్నా. ఉన్నట్టుండి, మా యూనిట్ సభ్యుల్లో ఒకరు పరిగెత్తుకుంటూ నా దగ్గరకు వచ్చి, 'జనం వస్తున్నారు' అన్నాడు. 'ఏ జనం?' అని నేను అనే లోపలే దాడి మొదలైపోయింది. ఇద్దరు మహిళా అసిస్టెంట్లను కూడా కొట్టారు. నా చెంప మీద కొట్టారు. నా కళ్ళజోడు ఎగిరిపడిపోయింది. ఇలా జరుగుతుందని ఊహించలేదు. ఇక, రాజస్థాన్‌లో షూటింగ్ సాధ్యం కాదని కొల్హాపూర్‌కు వెళ్ళాం. అక్కడేమో సెట్ తగలబెట్టేశారు. కొల్హాపూర్‌లో సినిమా సెట్‌ను దుండగులు తగలబెట్టేసిన తరువాత ఒకటే అనుకున్నా. అయిందేదో అయిపోయింది. ఇక లాభం లేదు. ఇక నుంచి, నేను షూటింగ్ చేయదలచిన చోటే షూటింగ్ చేస్తా. ఆ విషయంలో వెనక్కి తగ్గేదే లేదు అని నిర్ణయించుకున్నా.

జీవితాన్ని మార్చేసిన అనుభవం

నా జీవితంలోని అతి పెద్ద సినిమా తీస్తున్నానన్న సంగతి నాకు తెలుసు. కానీ, దాన్ని ఎలా కొనసాగించాలి, నిలబెట్టుకోవాలన్నదే ప్రశ్న. శారీరక, మానసిక ఆరోగ్యం ఏమవుతోందో తెలీదు. ఎంత కష్టం ఉన్నా సెట్‌లోకి ఉత్సాహంగా, గంభీరంగా వెళ్ళాలి. లేదంటే యూనిట్ సభ్యులు, నటీనటులు మన మానసిక పరిస్థితిని పట్టేసి, వాళ్ళూ డీలా పడిపోతారు. ఎంత చేసినా, మరునాడు ఎవరు, ఎలా వచ్చి నిరసన చెబుతారో తెలీదు. ముంబయ్‌లోని ఫిల్మ్‌సిటీలో షూటింగ్ చేస్తుంటే, మా సెట్ చుట్టూ ఏకంగా యాభై రెండు మంది పోలీసులు ఉండేవారంటే నమ్మండి. తీరా షూటింగ్ అంతా పూర్తయి, ట్రైలర్ బయటకు రాగానే మళ్ళీ గొడవ మొదలు. గొడవ మరో దోవలోకి వెళ్ళి, అంతకంతకూ పెద్దదై, మాతో సహా అందరి చేతులూ దాటిపోతుండడంతో ఒక దశలో ఇక 'పద్మావత్'సినిమా రిలీజ్ కాదేమో అనుకున్నా.

జాతీయ టీవీ చానళ్ళలో కొందరు చేతుల్లో కత్తులతో కూర్చొని, అతని తల నరికేస్తామన్నారు. దీపికా పదుకోనే ముఖం మీద యాసిడ్ పోస్తామన్నారు. ఇంకా చాలా అన్నారు. ఏమైనా, ఒక్క మాటలో ఇది నా జీవితాన్ని మార్చేసిన అనుభవం. నేనిప్పుడు మానసికంగా మునుపటి కన్నా దృఢంగా మారా.

రాణి గారు డ్యాన్స్ చేయకూడదా?

ఆ పాట కోసం తానింకా సరిగ్గా సిద్ధం కాలేదనీ, ఇంకా శిక్షణ తీసుకొంటే బాగుంటుందనీ దీపికా పదుకోనే అన్నారు. దాంతో, మెహబూబ్ స్టూడియోలో వేసిన సెట్‌ను అలాగే నెలన్నర ఉంచేసి, వెయిట్ చేశాం. స్టూడియో వాళ్ళు కూడా ఫరవాలేదన్నారు. ఇప్పటి దాకా నేను తీసిన పాటల్లో అత్యుత్తమ గీతం అదేనని ఇవాళ జనం అంటున్నారు. కానీ, 'ఘూమర్' పాట మీద కూడా బోలెడంత రచ్చ చేశారు. నిజానికి, హిందీ సినిమాల్లో రాజస్థానీ సంగీతం వాడి, ఎన్నో ఏళ్ళు అయిపోయింది. రాజస్థాన్‌కూ, జానపద సంగీత శైలికీ ప్రతీక అయిన 'ఘూమర్' ఇప్పుడు పాపులర్ కూడా కాదు. అలాంటిది, 'పద్మావత్' చిత్రం ద్వారా రాజస్థానీ జానపద శైలి 'ఘూమర్'కి మరింత ప్రాచుర్యం తెచ్చాం. నా పాట వల్ల ఆ పాటకు లయ, తాళం ఇలా ఉంటాయని అందరికీ తెలిసింది. ఇవాళ పంజాబీలు, గుజరాతీయులు కూడా 'ఘూమర్' పాటకు డ్యాన్స్ చేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడ ఏ పెళ్ళి జరిగినా చేసే ఘూమర్ నృత్యాన్ని నా సినిమా నుంచి తీసేసినంత మాత్రాన అదేమీ చచ్చిపోదు. పద్మావతి రాణి కాబట్టి ఘూమర్ డ్యాన్స్ చేయదు, చేయకూడదు, ఆమె నడుము భాగం కనిపించకూడదు అని వాదిస్తే ఎలా? చరిత్ర అంటే రకరకాల కోణాలుంటాయి. రానున్న రోజుల్లో ప్రతి పెళ్ళిలో మోగే ఈ పాటతో రాజస్థానీ టూరిజమ్‌కీ, సంగీతానికీ, జానపద కళకీ ఎంత లాభం జరగనుందో ఊహించండి. కానీ, దురదృష్టం ఏమిటంటే ఇప్పటికీ రాజస్థాన్‌లో ఈ సినిమాను ప్రదర్శించడం లేదు.

అతనికి హ్యాట్సాఫ్!

కేంద్ర సెన్సార్ బోర్డు అధిపతిగా బాధ్యతలు చేపట్టిన రచయిత ప్రసూన్ జోషీ తన మీద ఎంతో ఒత్తిడి వచ్చినా, గట్టిగా నిలబడ్డారు. బాగా పోరాటం చేశారు. కట్స్ లేకుండా సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చారు. కాకపోతే, సినిమా పేరు 'పద్మావతి' అని కాకుండా, 'పద్మావత్' అని పెట్టమన్నారు. అసలు కావ్యం పేరు పద్మావత్ అనే కాబట్టి, నేను కూడా అదే పేరు పెట్టడానికి అభ్యంతరం చెప్పలేదు. నాకూ, నా నటీనటులకూ, మా సినిమా ఆడే థియేటర్లకూ, ప్రేక్షకులకూ ప్రతి చోటా రక్షణ కల్పించారు. అందుకు ఆయా రాష్ట్రప్రభుత్వాలకు థ్యాంక్స్. చివరకు ఈ జనవరి 24న తొలి ప్రీపెయిడ్ షో వేసి, మొదటి టికెట్ అమ్మాక, ఇక ఈ సినిమాను ఎవరూ ఆపలేరు అని నేను అన్నా. చివరకు అదే జరిగింది.



• ప్రతిభ

ఆమె రచయిత్రి... చిత్రకారిణి...
తెలుగులో తొలి గజల్ గాయకురాలు....
ఆసక్తితో సాధన చేస్తే అభిరుచే నైపుణ్యం అవుతుందని నిరూపించిన మహిళ.
సామాజిక మాధ్యమాల ద్వారా తెలుగు గజల్‌కు ప్రాచుర్యం కల్పిస్తున్న మళ్ల జ్యోతిర్మయి సంగీత ప్రస్థానం ఆసక్తికరం.



ఆమె గళం.. గజలపాతం!

అది 2008వ సంవత్సరం... విశాఖపట్నంలో గజల్ శ్రీనివాస్ ప్రోగ్రామ్... సినారె గజల్‌ను శ్రీనివాస్ పాడుతుంటే ఆడిటోరియంలో సూదిపడితే వినిపించేటంత నిశ్శబ్దం. ఆయన ముగించగానే హాల్ దద్దరిల్లేలా చప్పట్లు. నేను మంత్రముగ్ధురాలినైపోయాను. తెలుగులో కూడా గజల్స్ పాడొచ్చని నాకు అప్పుడే తెలిసింది.

సంగీతం కోసం చదువు వదిలేశాను!

చిన్న వయసులోనే నేను సంగీత సాధన ప్రారంభించాను. విజయనగరం మహారాజా కాలేజీలో కర్ణాటక సంగీతం అభ్యసించాను. అప్పటికి నా వయస్సు తొమ్మిదేళ్లు. తొలి గురువు బురిడి లక్ష్మీనాయుడు. సంగీతం కోసం హైస్కూల్ చదువు వదిలేశాను. నాన్న జగన్నాథం మంచి సాహిత్యకారుడు. ఆయన పాటలు రాసేవారు. వాటికి ట్యూన్లు కట్టేదాన్ని. నాన్న హాజరయ్యే కార్యక్రమాలకు వెళ్ళి, ఆయన పాటలు పాడేదాన్ని. చిన్నతనంలో ప్రార్థనా గీతాలకు పాడేందుకు నన్ను పిలిచేవారు. దాని కోసం ఇంటికి కారు వస్తే ఎంతో ఆనందంగా వుండేది. తర్వాత చదువు కొనసాగించాను. బీఎస్సీ మ్యాథ్స్ పూర్తి చేశాను.

ఎన్నడూ ఊహించలేదు!

నా భర్త ప్రభాకరరావు ఉద్యోగరీత్యా చెన్నైలో ఉండేవాళ్ళం. అక్కడ ఆకాశవాణిలో 'బి' గ్రేడ్ ఆర్టిస్ట్‌గా ఐదేళ్లు పనిచేశాను. తెలుగు, తమిళ పాటలు పాడేదాన్ని. తొలి రికార్డింగే మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారితో... ఇక నా ఆనందానికి అంతేముంటుంది! అక్కడే ఎంఎస్ విశ్వనాథన్, కున్నకుడి వైద్యనాథన్ వంటి సంగీత దర్శకుల ఆధ్వర్యంలో కూడా లలిత గీతాలాపన చేసే అదృష్టం దక్కింది. ఒకసారి ముంబైలో పీనాజ్ మసాని గజల్స్ కార్యక్రమం లైవ్‌లో చూశాను. ఆమె హావభావాలు, ప్రజంటేషన్ స్టైల్ ఎంతో ఆకట్టుకున్నాయి. దీంతో గజల్స్ మరింత ఎక్కువగా వినసాగాను. సున్నిత భావాలను పలికించే గొప్పతనం గజల్‌కు ఉంది. కానీ, నేను గజల్స్ పాడతానని ఏ రోజూ ఊహించలేదు.

ఆయనే స్ఫూర్తి!

గజల్స్ శ్రీనివాస్ కార్యక్రమం చూశాక, ఆయన స్ఫూర్తితోనే ఈ రంగంలో కాలుమోపాను. శ్రీనివాస్ ఇచ్చిన సీడీలను విని ప్రాక్టీస్ చేశాను. ఆయనకు వినిపిస్తే ఎంతో మెచ్చుకున్నారు. 2010లో శ్రీనివాస్ భీమవరంలో గజల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. రెండు రోజుల ఆ కార్యక్రమంలో ఎందరో రచయితలతో, ప్రముఖులతో పరిచయం ఏర్పడింది. గజల్ స్వరూపం, దాని నిర్మాణం, తీరు... ఇలా చాలా విషయాలు అక్కడ నేర్చుకున్నాను. నా తొలి ప్రదర్శన 2012లో విశాఖపట్నం కళాభారతిలో ఇచ్చాను. తెలుగులో గజల్ పాడిన తొలి మహిళగా గుర్తింపు పొందాను. ఎందరో వచ్చి నన్ను అభినందించారు. మహిళ గజల్ పాడడం గొప్ప విషయమని ప్రోత్సహించారు.

సినారె ప్రశంస మరువలేనిది!

గజల్స్ పాడుతున్న కొత్తలో 'లలిత సంగీతంలా ఉందే!' అని కొందరు వ్యాఖ్యానించేవారు. గజల్స్ తెలుగులో పాడిన మహిళ ఎవరూ అప్పటికి లేరు. కానీ ఆ ప్రత్యేకత ఒకటే చాలదు. నాకంటూ గుర్తింపు రావాలంటే కొత్తగా ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాను. శాస్త్రీయ పద్ధతిలో గజల్స్ ఆలాపనకు శ్రీకారం చుట్టాను. గజల్స్‌కు ప్రాచుర్యం కల్పించిన సి.నారాయణరెడ్డి గారి రచనల్ని ప్రారంభంలో తీసుకునేదాన్ని. ఒకసారి నా కార్యక్రమం చూసిన ఆయన 'నా గజల్స్‌కు పునరుజ్జీవం కల్పించావు' అని అభినందించారు. ఆ మాటను అతి పెద్ద అవార్డుగా భావిస్తాను. అలాగే రెంటాల శ్రీవేంకటేశ్వరరావు 'నాన్న' గొప్పతనంపై చేసిన రచన నాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. 'కొసనా'గారు నా ప్రదర్శనల ఏర్పాటుకు ఎంతో సహకరించేవారు. ఉర్దూ గజల్స్ తరహాలో ఇన్‌స్ట్రుమెంట్లతో కూడా ప్రదర్శన ఇచ్చాను. నా తొలి ప్రదర్శన తరువాత నా భర్త ఉద్యోగ రీత్యా జోహానెస్‌బర్గ్ వెళ్లాల్సి వచ్చింది. అక్కడ కూడా సాధన ఆపలేదు. రెండేళ్లు అక్కడే వున్నాం. అక్కడ ప్రదర్శన కూడా ఇచ్చాను. ఏడాది తర్వాత మధ్యలో ఒకసారి హైదరాబాద్‌లో కచేరీ చేశాను.

అందుకే రచయిత్రినయ్యాను!

పురుషుడి జీవితంలో మహిళ పాత్ర గురించి పాట ద్వారా చెప్పాలనిపించి, కొందరు రచయితలను సంప్రతించాను. ఎందుకనో తగిన స్పందన కనిపించలేదు. అందుకే రచయిత్రిగా అవతారం ఎత్తాను. అలా ఆవిష్కృతమైనదే 'నీ కోసమే జన్మంతా గడపలేదా ఆడది' అన్న పాట. స్త్రీ ఔన్నత్యాన్ని తెలియజేసే ఆ పాట ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టింది. మానవ సంబంధాలు, ప్రకృతి, చమత్కారం... ఇలా ఎన్నో విషయాలు నా రచనల్లో ఉంటాయి. భవిష్యత్తులో 'భగవంతుడి మీద ప్రేమ' ఆధారంగా రచనలు చేసి పాడాలనుకుంటున్నాను. దాన్ని సూఫీతత్వం అంటారు. ఇప్పటివరకు తెలుగులో అటువంటి రచనలు లేవు. గజల్స్ ద్వారా సమాజంలో సున్నితత్వాన్ని పెంచాలన్నదే నా లక్ష్యం..

• వాసు, విశాఖపట్నం,
ఫొటోలు: సాంబశివరావు

ఫేస్‌బుక్‌లో 'తెలుగు గజల్'!

తెలుగు గజల్స్‌కు మరింత ప్రాచుర్యం కల్పించాలనే సంకల్పంతో తెలుగు గజల్స్ పేరిట ఫేస్‌బుక్ అకౌంట్ తెరిచాను. అతి కొద్దిమందితో ప్రారంభమై అనతి కాలంలోనే అనుసరించేవారి సంఖ్య నాలుగు వేలకు చేరుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, ఇది గజల్స్ వర్క్‌షాప్. అనేక దేశాల్లోని తెలుగు వాళ్లు నిరంతరం దీని ద్వారా అభ్యాసం చేస్తున్నారు. గజల్స్ నిర్వచనం నుంచి ఛందస్సు, దాని ప్రక్రియ, బాణీలు ఇలా అనేక అంశాల గురించి ప్రత్యేకమైన డాక్యుమెంట్లు ఇందులో ఉన్నాయి. అవి మరెక్కడా దొరకవు. అబ్దుల్‌వాహిద్ దాని అడ్మిన్. ఇప్పటివరకు సుమారు 200 మంది మంచి కవులుగా రూపొందారు వారి రచనలతో కూడిన 'గజల్ సుమాలు' అనే సంకలనాన్ని విడుదల చేశాం. దీన్ని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో 2015లో జ్యోతిర్మయి తెలుగు గజల్ అకాడమీని నెలకొల్పాను. ఈ సంస్థ తరపున ముషాయిరాలు, కవి సమ్మేళనాలు, సత్కారాలు, గాయకులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. దేశంలోనే అనేక ప్రాంతాలతో పాటు ఇతర దేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చాను. ఉర్దూ భాష నుంచి తెలుగులోకి వచ్చిన గజల్ ప్రక్రియలో రెండు భాషల, రెండు సంస్కృతుల, రెండు సంప్రదాయాల మేళవింపుగా 'గజల్ ఫ్యూజన్' అనే కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో చేశాను. ఒకే గజల్‌ను ఉర్దూ, తెలుగు భాషల్లో గానం చేసినప్పుడు గోరటి వెంకన్న, వోలేటి పార్వతీశం తదితర ప్రముఖులు ప్రశంసించారు. నా ఊపిరి ఉన్నంత వరకూ సమాజం కోసం గజల్స్ పాడుతూనే ఉంటాను.



బొమ్మల్లో 'కన్యాశుల్కం'!

బాపూ కార్టూన్లు చూసి చిన్నతనంలో ఎంతో మురిసిపోయేదాన్ని. వాటిపట్ల ఆసక్తి పెరిగింది. ఖాళీ దొరికితే కార్టూన్లు గీస్తూ గడిపేసేదాన్ని. మరోవైపు పెయింటింగ్ చేస్తుండేదాన్ని. ప్రత్యేకంగా నేర్చుకోలేదు కానీ, సౌత్‌ఆఫ్రికాలో ఉన్నప్పుడు ఆయిల్ పెయింటింగ్‌లో మూడు రోజుల కోర్సు చేసే అవకాశం దక్కింది. చాలా ఎంజాయ్ చేశాను. ఎన్నో టిప్స్ నేర్చుకున్నాను. రిలాక్సేషన్ కోసం, సృజన కోసం పెయింటింగ్‌లు, కార్టూన్లు గీస్తుంటాను. మహిళల సమస్యలు ప్రతిబింబించేలా ప్రదర్శన చేయాలనే కోరిక ఉంది. ఒక పాట రాసుకున్నాక, దాని ఆధారంగా కొన్ని చిత్రాలు గీయడం అలవాటుగా మారిపోయింది. గురజాడ 'కన్యాశుల్కం' నాటక సన్నివేశాలను చిత్రాలుగా గీశాను.

పేరెంటచ్

అలవాటు మార్చుకోవాలి!

అసలే చిన్నపిల్లలు... ఎదుటివాళ్లు ఏదో ఒక్క విషయం గురించి మాట్లాడితేనే అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. అలాంటిది నిమిషనిమిషానికీ విషయాన్ని మార్చివేసి, ఒక వాక్యానికీ, మరో వాక్యానికీ మధ్య పొంతన లేకుండా మాట్లాడేస్తుంటే వాళ్లు ఏమైపోవాలి? బాగా మద్యం సేవించిన వాళ్ల ధోరణి ఇలాగే కదా ఉంటుంది! చాలా పరిమితంగా మాత్రమే తీసుకునే వారి తీరు వేరు గానీ, కాస్త శృతి మించితే చాలు ఎప్పుడు ఏం మాట్లాడతారో ఏమీ అర్థం కాదు. అప్పటికప్పుడే విషయం మారిపోతుంది. వాళ్ల మాటలే కాదు, చేష్టలు కూడా అలాగే ఉంటాయి. తమ పిల్లాడితో "ఎప్పుడూ నిజమే మాట్లాడాలి నాన్నా!" అంటూనే తాగినప్పుడు అబద్ధాలు మాట్లాడేస్తుంటారు. ఎదుటి వాళ్లను గౌరవించాలని చెబుతూనే వాళ్ల ఎదుటే ఎవరెవరినో నిందిస్తూ, అవమానిస్తూ మాట్లాడేస్తారు. ఈ విరుద్ధ పోకడలను ఎలా అర్థం చేసుకోవాలో పిల్లలకు ఏమీ అర్థం కాదు. ఏమైనా, క్షణక్షణం ఏదో ఒక రకంగా వాళ్ల మనసును గాయం చేస్తూ, దేని మీదా వారి మనసు లగ్నం కాక, చివరికి చదువులో వెనుకబడేలా చేస్తారు. అందుకే మద్యపాన విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. పిల్లల ముందు తాగి వాగితే అది వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందనే విషయం గుర్తిస్తే మంచిది.



పోరాటం

'దకన్'పై మౌనంగా ఉండబోము...

ఇక్కడ ఫోటోలో కనిపిస్తున్న యువతులను చూశారా...? ఎంత ముగ్ధంగా ఉన్నారో కదా. కానీ... వీళ్లని ఆ ఊరి వాళ్లు 'దకన్' (మంత్రగత్తెలు) అని పిలుస్తారు! అది సహించలేని ఖుష్బూ అనే యువతి తమని ఎందుకు అలా పిలుస్తున్నారని ఇంట్లో వాళ్లని అడిగితే 'గొంతు లేస్తే ఒప్పుకోం. మౌనంగా ఉండు' అని హెచ్చరించారు. కానీ.. ఖుష్బూ ఎదురు తిరిగింది. పతిదార్ కమ్యూనిటీకి చెందిన అమ్మాయిలను 'దకన్' సంప్రదాయానికి బలి చేస్తున్న వారిపై పోరుకు ఊళ్లోని అమ్మాయిలను కూడగట్టింది. ఇంత ఆధునిక ప్రపంచంలోనూ ఈ దుష్ట సంప్రదాయం ఏమిటంటూ ధైర్యంగా ప్రశ్నించింది. ఖుష్బూ చర్య ఆ ఊర్లోని పెద్దలకు కంట్లో నలుసైంది.



పద్దెనిమిదేళ్ల ఖుష్బూది మధ్యప్రదేశ్ రాజ్‌ఘర్హ్ జిల్లాలోని భయానా గ్రామం. పతిదార్ కమ్యూనిటీలో పుట్టింది. అంతే.. 'దకన్' అనే ముద్ర ఖుష్బూపై పడింది. ఇది ఆమెను ఎంతో బాధించింది. అందరూ అలా ఎందుకు అంటున్నారని తల్లినడిగింది. ' నేను యవ్వనంలోకి అడుగుపెట్టిన నాటి నుంచి నన్ను కూడా 'దకన్' అనే పిలుస్తున్నారు. నేను కూడా 40 ఏళ్లుగా ఇదే ప్రశ్నకు సమాధానం కోసం వెతుకుతున్నాను' అని కళ్లల్లో తడి కనిపించకుండా కూతురుకి సమాధానం చెప్పింది. ఖుష్బూ మనసు రగిలిపోయింది. ఈ దుష్ట సంప్రదాయం మాటున చిన్నతనం నుంచీ ఎంతటి వివక్ష, అగౌరవాలను ఎదుర్కొన్నదీ గుర్తుకువచ్చి విలవిల లాడింది. 'ప్రతి ఒక్కరూ దకన్ అంటూ నన్ను ఏడిపించేవారు. పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు రానిచ్చేవారు కాదు. చివరకు మసాలా వంటలను సైతం తిననిచ్చేవారు కాదు' అని ఖుష్బూ ఆవేశంగా అంది.

'దకన్' దుష్టసంప్రదాయంపై తమ కమ్యూనిటీకి చెందిన యువతులతో కలిసి పోరాడాలని నిశ్చయించుకుంది. అలా వారందరిని ఏకం చేసింది. అందరూ కలిసి రాజ్‌గర్హ్ జిల్లా ఎస్పీ షిమలా ప్రసాద్‌ని కలిసి 'దకన్' దుష్ట సంప్రదానికి ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంప్రదాయం నేటికీ రాజ్‌గర్హ్ జిల్లాలోని పతిదార్ కమ్యూనిటీ ఆధిక్యం ఉన్న గ్రామాల్లో బహిరంగంగా కొనసాగుతోందని ఎస్పీకి రిపోర్టు చేశారు. అంతేకాదు ఈ జిల్లాకు ఆనుకునే ఉన్న షాజాపూర్ జిల్లాలో కూడా దకన్ సంప్రదాయం నేటికీ కొనసాగుతుండడం మరో ముఖ్య అంశం. ఈ రెండు గ్రామాల్లోని పతిదార్లందరూ రైతులే. పోలీసులు ఈ ప్రాంతంలో చేసిన ఒక సర్వేలో 'దకన్' ముద్రపడిన మహిళలు 400 మంది ఈ గ్రామాల్లో ఉన్నట్టు వెల్లడైంది. ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే పతిదార్ కమ్యూనిటీలో మహిళకి అమ్మాయి పుడితే 'దకన్' అని ముద్ర వేస్తారు. కానీ... అదే మహిళకి అబ్బాయి పుడితే మాత్రం ఆ బాలుడిపై 'దకన్' ముద్ర పడదు. దీని వెనుక దాగున్న జండర్ వివక్ష కూడా స్పష్టంగా తెలుస్తోంది.

ఖుష్బూ ఉంటున్న గ్రామంలోని వారిని ఇదే విషయాన్ని అడిగితే 'మా ఈ సంప్రదాయాన్ని తొలగించడం, అందులో మార్పులు తేవడం చేస్తే అది మా పూర్వులను అవమానపరిచినట్టే'నని అభిప్రాయపడ్డారు! ఆ ఊరిలోని శివప్రసాద్ అనే వ్యక్తికి ఆరుగురు అక్కలు ఉన్నారు. వాళ్లకు పెళ్లిళ్లు అయిన తర్వాత వారితో రాకపోకలుగాని, మాటలు గాని అతనికి లేవు. దానికి కారణం వాళ్లపై 'దకన్' ముద్ర ఉండడమే. 'దకన్' సంప్రదాయం ఆడపిల్లలకు శాపంగా మారింది. ఆ ముద్ర వల్ల వారికి వివాహాలు కావడం కూడా కష్టంగా ఉంది. ఈ దుష్ట సంప్రదాయం వల్ల ఈ కమ్యూనిటీ యువతులు పేదవాళ్లని, ముసలివాళ్లని లేదా భార్య చనిపోయిన వాళ్లని చేసుకొంటున్నారు. 'ఈ సంప్రదాయానికి వ్యతిరేకంగా పోరాడతాం అని మాటలు చెప్పినంత సులభం కాదు చేతల్లో దాన్ని చేయడానికి ' అని భావిస్తున్న వాళ్లు కూడా ఈ కమ్యూనిటీలో చాలామంది ఉన్నారు. పతిదార్ కమ్యూనిటీకి చెందిన 50 ఏళ్ల కళాబాయి మాట్లాడుతూ ' నేను దకన్ కాదు. అలా పిలిచిన వాళ్లే దకన్‌లు. నేను ఈ దుష్ట సంప్రదాయానికి తలవంచే ప్రశ్నే లేదు' అని దృఢంగా చెప్పింది.

మరోవైపు కమ్యూనిటీ నాయకులు ఈ సంప్రదాయాన్ని అనవసరంగా రాజకీయం చెస్తున్నారని భావించడం దురదృష్టకరం. 'అమ్మాయిలు పోలీసులతో చేతులు కలపడం సరికాద'ని వాళ్లు విమర్శించారు. కమ్యూనిటీలోని కొందరు నాయకులు తమ స్వార్థప్రయోజనాల కోసం ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలంటున్నారు. ఈ విషయంలో పోలీసులు మాత్రం ఆచితూచి అడుగు వేస్తున్నారు. ' కమ్యూనిటీ నాయకులతో మాట్లాడాం. వాళ్లు ఈ విషయంలో చాలా మొండిగా ఉన్నారు. చట్టపరమైన చర్యలను తీసుకోవడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని మేము అనుకోవడం లేదు. అలా చేస్తే కమ్యూనిటీ సభ్యుల్లో ఘర్షణలు మొదలవుతాయి. కమ్యూనిటీని చర్చల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా 'దకన్' సమస్యను పరిష్కరించాలని భావిస్తున్నాం' అని వారు అంటున్నారు. ఏమైనా 'దకన్'పై మహిళలు పోరాట దిశగా ఒక అడుగు ముందుకు వేశారు. ఇది శుభపరిణామం. ఈ పోరాటంలో తప్పకుండా విజయం సాధిస్తామనే భరోసా వారి మాటల్లో స్పష్టం అవుతోంది.

> 'మేం మహిళల కోసం ప్రత్యేక చట్టాన్ని కోరుతున్నాం. ఎందుకంటే ఎంతోమంది బాధిత మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ పరిస్థితి కొనసాగకుండా అత్యవసరంగా అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
> **-'వన్‌స్టాప్ క్రైసిస్ సెంటర్ ఫర్ విమెన్' ఇన్‌ఛార్జ్ సారికా సిన్హా, భోపాల్**

స్టార్ కార్

సచిన్ కార్ ఖానా











ఎలా చెప్పను!

ఎందుకో ఏమో..!



మీ మనసులో మాట మాతో పంచుకోండి
navya@andhrajyothy.com

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాదు... కానీ కంప్యూటర్‌తో ఆడుకుంటాడు. హైటెక్‌సిటీలో పనిచేయడం లేదు... అయినా ఆరంకెల్లో సంపాదిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్‌లోనే చదువుకు ఫుల్‌స్టాప్ పడినా... అతడిలోని నిరంతర పరి'శోధకుడి'తో సాధకుడయ్యాడు. ఎస్టీడీ బూత్ నిర్వాహకుడిగా... ఆ తరువాత పేపర్ బాయ్‌గా... ఇప్పుడు 'తెలుగు టెక్ ట్యూబ్స్' ఆన్‌లైన్ చానల్ వేదికగా... నెట్టింట లక్షల మందికి పాఠాలు చెబుతున్న 30 ఏళ్ల 'టెక్ గురు' సయ్యద్ హాఫీజ్ సక్సెస్ స్టోరీ ఇది...

విజేత



టెక్ ట్యూబ్ గురు...



కొత్త బండి గురూ

చూపు తిప్పుకోనివ్వదు..!



ఎండల్లో కారు మొరాయిస్తోందా?



మెకానిక్ కార్నర్

సెలబ్ స్టయిల్

కవ్వించకే అందమా!



ట్రెండింగ్ హాట్

లవ్... మ్యారేజ్ అండ్ కన్‌ఫ్యూజన్!





బ్యూటీఫుల్ లుక్‌తో మీ బాయ్‌ఫ్రెండ్‌ను ముగ్ధుడిని చేయాలనుకుంటున్నారా..! అయితే ఇది మీ కోసమే. సెలబ్రిటీ స్టయిలిస్టు మనీషా మెండోజా, మేకప్ ఆర్టిస్ట్ గాయత్రి చక్రవర్తి స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచేందుకు మగువలకు కొన్ని చిట్కాలు చెబుతున్నారు. ప్రయత్నించి చూడండి..!

అందంగా... ఆకట్టుకొనేలా!

టిప్‌టాప్

హిందీలో చరణ్ రికార్డు


రామ్‌చరణ్

రామ్‌చరణ్ రావడానికి టైముంది... బోయపాటి దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న సినిమా సెట్స్‌లోకి! డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ ఇటీవల మొదలైంది. ఇందులో రామ్‌చరణ్ పాల్గొంటారు. ఈ షెడ్యూల్ మొదలై రెండు వారాలు కూడా కాలేదు. కానీ, అప్పుడే నిర్మాత ఖాతాలోకి రెండు పదులు ఇరవై కోట్లకు పైగా వచ్చి పడ్డాయట. ఈ సినిమా చిత్రీకరణలో ఉండగానే హిందీ శాటిలైట్, డిజిటల్ హక్కులను గోల్డ్‌మైన్స్ టెలీఫిలిమ్స్ సంస్థ ఇరవై కోట్ల కంటే ఎక్కువ అమౌంట్ ఆఫర్ చేసి సొంతం చేసుకు న్నట్టు సమాచారం. తెలుగులో ఇప్పటివరకూ ఏ హీరో చిత్రానికీ ఇంత రేటు రాలేదు. రామ్‌చరణ్-బోయపాటి చిత్రానిదే హయ్యస్ట్! హిందీ టీవీ ప్రేక్షకుల్లో తెలుగు మాస్ సినిమాలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ మాస్‌లో చరణ్ ఫాలోయింగ్, బోయపాటి గత చిత్రాలను దృష్టిలో పెట్టుకుని భారీ రేటు పెట్టి హిందీ శాటిలైట్, డిజిటల్ రైట్స్ సొంతం చేసుకున్నారని తెలిసింది. ఇందులో హిందీ హీరో వివేక్ ఒబెరాయ్ కీలక పాత్ర చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయనపై హైదరాబాద్‌లో ముఖ్య సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు.

గ్యాప్ వస్తే నష్టమేంటి?

- శ్రుతీహాసన్



శ్రుతీహాసన్ ఓ ఇండిపెండెంట్ అమ్మాయి. చేసే ప్రతి పనిలోనూ స్వేచ్ఛ కోరుకుంటుంది. తనకు నచ్చినట్లు ఉంటుంది. నచ్చింది తింటుంది. అందులో నో కాంప్రమైజ్. టాలీవుడ్‌లో సక్సెస్‌లో ఉన్న ఆమె 'కాటమరాయుడు' తర్వాత మరే సినిమా అంగీకరించలేదు. 'శభాష్ నాయుడు' మినహాయిస్తే ఈ ఏడాది శ్రుతీ డైరీ మొత్తం ఖాళీగానే ఉంది. ఇదే విషయాన్ని ఆమె ముందుంచితే ఇలా సమాధానమిచ్చింది. "నేను పాన్ ఇండియా ఆర్టిస్ట్‌ని. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తున్నాను. ఏడాదికి మూడు సినిమాలతో బిజీగా ఉన్న రోజులూ ఉన్నాయి. ఈ ఏడాది ఖాళీగా ఉన్నంత మాత్రాన నష్టమేమీ లేదు. ఒక భాషలో సినిమా చేస్తున్నప్పుడు మరో భాషలో డేట్స్ కుదరకపోవచ్చు. అయినప్పటికీ నేను బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తున్నా. ప్రస్తుతం కాస్త ఖాళీ దొరికింది కాబట్టి ఇంటి దగ్గరే కూర్చొని రీఫ్రెష్ అవుతున్నా. ఖాళీగా ఉన్నాను కదా అని సమయం వృధా చెయ్యట్లేదు. ఈ మూడేళ్లల్లో చేసిన సినిమాల్లో నా క్యారెక్టర్స్‌ను అనలైజ్, రీ ఇన్స్‌పెక్ట్ చేసుకుంటున్నా. సరిగ్గా ఆడని సినిమాల్లో నా పాత్ర వరకూ ఎక్కడ పొరపాటు జరిగింది? ఎందుకు జరిగింది? అన్నది తెలుసుకుంటున్నా" అని తెలిపింది. ఈ మధ్యనే తన ప్రియుడు మైఖేల్‌తో విహారయాత్రకు లాస్ ఏంజెల్స్ వెళ్లొచ్చింది శ్రుతీ.

ఒకరు కాదు... ముగ్గురు!


రవితేజ

ఎవరూ తక్కువా కాదు... ఎవరూ ఎక్కువా కాదు... హీరోలు ముగ్గురూ ముగ్గురే! శ్రీనువైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్న సినిమాలో హీరో పాత్రలు మూడూ నువ్వా నేనా అన్నట్టు సూపర్బ్‌గా వచ్చాయట! మరి, ఆ ముగ్గురు హీరోలు ఎవరు? అనుకుంటున్నారా! మూడు పాత్రల్లోనూ రవితేజాయే కనిపిస్తారు! రవితేజ, శ్రీనువైట్ల కాంబినేషన్‌లో 'వెంకీ', 'దుబాయ్ శీను' వంటి విజయవంతమైన చిత్రాలు వచ్చాయి. దర్శకుడిగా శ్రీనువైట్ల తొలి చిత్రం 'నీ కోసం'లో హీరో రవితేజాయే. అయితే... వీళ్ళిద్దరూ కలిసి సినిమా చేసి పదేళ్ళు దాటింది. కొంచెం విరామం తర్వాత వస్తున్న ఈ చిత్రంలో రవితేజ చేత దర్శకుడు శ్రీనువైట్ల త్రిపాత్రాభినయం చేయించనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాల సమాచారం. మూడు పాత్రలకూ కథలో సమాన ప్రాధాన్యం ఉంటుందట! ఇంటర్వెల్ టైమ్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులకూ, కథలో పాత్రలకూ షాక్ ఇస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ చివరి దశలో ఉంది. వేసవిలో చిత్రీకరణ ప్రారంభించాలనుకుంటున్నారట! ఇప్పుడు కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న సినిమా చిత్రీకరణలో రవితేజ పాల్గొంటున్నారు.

పద్మభూషణ్ ఎందుకు ఇవ్వలేదో

- కృష్ణ


నరేశ్, కృష్ణ, విజయనిర్మల

"గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న విజయనిర్మలగారికి పద్మభూషణ్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సిఫారసు చేశారు. పురస్కారం ఎందుకు ఇవ్వలేదో అర్థం కాలేదు. అభిమానుల కోరిక మేరకు భవిష్యత్తులో వస్తుందని ఆశిస్తున్నా" అన్నారు కృష్ణ. సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని స్వగృహంలో అభిమానుల సమక్షంలో విజయనిర్మల 73వ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. అనంతరం ఆమె మాట్లాడుతూ "ఒకసారి దాసరిగారు నా పుట్టినరోజు సందర్భంగా ఇంటికి వచ్చిన అభిమానులను చూసి 'ఏ స్టార్ హీరోయిన్‌కీ ఇంత క్రేజ్ లేదు' అన్నారు. అదే నాకు పద్మభూషణ్‌తో సమానం" అన్నారు. కృష్ణ మాట్లాడుతూ "తెలుగులో గొప్ప నటుడు అక్కినేని నాగేశ్వరరావుతో, తమిళంలో శివాజీ గణేశన్, రజనీకాంత్‌లతో విజయనిర్మల చిత్రాలు తీశారు. ఆమె 44 చిత్రాలు తీస్తే... సగం చిత్రాల్లో నేను నటించా. ఇంతమంది పెద్ద హీరోలతో కాకుండా చంద్రమోహన్, మురళీమోహన్, రంగనాథ్, తర్వాతి తరంతో నరేశ్ వంటివారితో చిత్రాలు తీసి విజయం సాధించారు. అందరి కోరిక మేరకు 50 చిత్రాలు పూర్తి చేయాలని కోరుకుంటున్నా" అన్నారు. "అమ్మ పుట్టినరోజు సందర్భంగా వచ్చిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు. ప్రతి అభిమాని మా కుటుంబంలో సభ్యుడే. ప్రపంచంలో ఇంత పెద్ద కుటుంబం ఎక్కడా ఉండి ఉండదు. మనమంతా వందేళ్ళు ఈ పండుగను జరుపుకోవాలని కోరుకుంటున్నా" అన్నారు వీకే నరేశ్. "నటిగా, దర్శకురాలిగా, నిర్మాతగా విజయనిర్మలగారు సాధించిన విజయాలు ఇంకెవరూ సాధించలేరు. చిత్రపరిశ్రమకు ఆమె చేసిన సేవలకు విజయనిర్మలగారికి తగిన గుర్తింపు ఇవ్వలేదు. అభిమానులు అందరి తరపున ఆమెకు పద్మభూషణ్ ఇవ్వాలని కోరుతున్నా" అని నిర్మాత, పాత్రికేయుడు బీఏ రాజు అన్నారు. విజయనిర్మల మనవడు, హీరో నవీన్ విజయకృష్ణ, పలువురు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఓ అన్నయ్య...ఆరుగురు తమ్ముళ్ళు!


రాజేంద్రప్రసాద్, సాక్షీ చౌదరి

"దర్శకుడు 'నిధి' ప్రసాద్‌తో 'అందరూ దొంగలే.. దొరికితే', 'భాగ్యలక్ష్మి బంపర్ డ్రా' చేశా. రెండూ మంచి విజయాలు సాధించాయి. అయితే... ఆ సినిమాలకు చిత్రీకరణ చేసేటప్పుడు తిట్టుకుని, విడుదలైన తర్వాత మహా ఆనందపడిన వాళ్ళలో నేనూ ఒకణ్ణి. ఇదే మళ్ళీ జరిగింది. 80 మంది ఆర్టిస్టులతో చేయడం 'నిధి' ప్రసాద్‌కి అలవాటు. కానీ, విక్రమ్‌కి కొత్త. ఇద్దరూ కలిసి చక్కగా చేశారు. కామెడీ ఎర్రర్స్‌తో ప్రేక్షకులు హాయిగా నవ్వుకునేలా చిత్రాన్ని తీశారు" అన్నారు రాజేంద్రప్రసాద్. ఆయన హీరోగా 'నిధి' ప్రసాద్ దర్శకత్వంలో జెబి క్రియేషన్స్ పతాకంపై శ్రీమతి భాగ్యలక్ష్మి నిర్మించిన చిత్రం 'ఊ.పె.కు.హ'. ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి... అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్ సరసన సాక్షీ చౌదరి నటించారు. చిత్రీకరణ, నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. విడుదలకు సిద్ధమైన ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. ఆరుగురు తమ్ముళ్ళకు అన్నయ్యగా ప్రచార చిత్రంలో రాజేంద్రప్రసాద్ నటన, మిగతా నటీనటుల హాస్యం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. "చిత్రంలో చాలామంది ఆర్టిస్టులున్నారు. ఇంతమందితో చిత్రీకరణ చేయడం ఎంతో కష్టం. తెరమీద కనిపించే వారితో పాటు తెర వెనుక చిత్రానికి పని చేసిన ప్రతి ఒక్కరు సహకరించడంతో పూర్తి చేశాం" అన్నారు 'నిధి' ప్రసాద్. "ప్రేక్షకుల తమ టెన్షన్స్ మర్చిపోయి హాయిగా నవ్వుకునే చిత్రమిది. వాళ్ళు ఖర్చుపెట్టే ప్రతి రూపాయికి వినోదం అందిస్తుంది. మా బావగారు 'నిధి' ప్రసాద్‌గారిపై గౌరవంతో, వాళ్ళ మంచితనంతో చిత్రబృందమంతా సహకరించడంతో చిత్రం ఈ స్థాయికి వచ్చింది" అన్నారు 'జెబి క్రియేషన్స్' విక్రమ్. ఈ కార్యక్రమంలో నిర్మాత భాగ్యలక్ష్మి, సాక్షీ చౌదరి, వేణు మాధవ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత నాగరాజు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్.

కొత్త దర్శకునితో...


బెల్లంకొండ సాయిశ్రీనివాస్

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ మరో కొత్త సినిమాకు సైన్ చేశారు. ఆయన ప్రస్తుతం నటిస్తున్న 'సాక్ష్యం' చిత్రం ఇంకా నిర్మాణంలో ఉండగానే ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం. ఈ చిత్రంతో శ్రీనివాస్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. వంశధార క్రియేషన్స్ బేనరుపై నవీన్ సొంటినేని (నాని) ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఎనర్జిటిక్ హీరో సాయిశ్రీనివాస్‌తో మా బేనర్ ప్రారంభిస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'దృశ్యం', 'గోపాల గోపాల', 'డిక్టేటర్' వంటి చిత్రాలకు సహాయ దర్శకునిగా పనిచేసిన శ్రీనివాస్ చెప్పిన కథ మాకు బాగా నచ్చింది. సీనియర్ టెక్నీషియన్స్ ఈ చిత్రానికి పనిచేస్తారు. గురువారం రామానాయుడు స్టూడియోలో చిత్రం షూటింగ్ ప్రారంభిస్తున్నాం. త్వరలోనే మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: చోటా కె. నాయుడు, సంగీతం: తమన్, సహ నిర్మాత: చాగంటి శాంతయ్య.

సిరీస్‌లో ఇదే చివరిది!


పూజాగాంధీ

కరడుకట్టిన దొంగలముఠా కథను తెరకు ఎక్కిస్తూ 'దండుపాళ్యం' పేరుతో నిర్మించిన చిత్రానికి ప్రేక్షకుల ఆదరణ లభించింది. ఆ వెంటనే తీసిన 'దండుపాళ్యం 2' కూడా సక్సెస్ అయింది. ఇప్పుడు ఈ సీక్వెల్‌లో చివరి భాగంగా 'దండుపాళ్యం 3' వచ్చే నెల రెండున విడుదల కానుంది. శ్రీనివాసరాజు దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న ఈ చిత్రానికి క్రేజీ ఆఫర్ ఇచ్చి వాడవల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ తెలుగు హక్కులు కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా నిర్మాతలు శ్రీనివాస్ మీసాల, రజని తాళ్లూరి మాట్లాడుతూ 'దండుపాళ్యం సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలూ ఘనవిజయం సాధించాయి. మూడో దండుపాళ్యం కూడా ఆసక్తికరమైన అంశాలతో రూపుదిద్దుకొంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు అద్భుత స్పందన వచ్చింది. దండుపాళ్యం సిరీస్‌లో ఇదే చివరి పార్ట్ కావడంతో ముగింపు ఎలా ఉంటుందా అనే ఆసక్తి ప్రతి ఒక్కరిలో ఉంది. ఈ నెల 25న ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను గ్రాండ్‌గా నిర్వహిస్తాం. మార్చి 2న సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. 'బొమ్మాళి' రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవి కాలే ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సాయికృష్ణ పెండ్యాల సహ నిర్మాత.

ఇండో- పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో..

మేజర్ రవి 1981లో ఆర్మీలో చేరి అనేక కీలక ఆపరేషన్స్ లీడ్ చేశారు. సుదీర్ఘ కాలం మిలటరీలో పని చేసి వచ్చిన ఆయన 2002లో మెగాఫోన్ చేతపట్టి తొలిసారిగా 'పునర్ జని' పేరుతో ఓ మలయాళ చిత్రం రూపొందించారు. అప్పటినుండి తన దేశభక్తిను చాటుకొంటూ, ఆర్మీలో తను చేసిన సమయంలో జరిగిన ఆపరేషన్స్‌కు సంబంధించిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఎన్నో చిత్రాలు రూపొందించారు. మేజర్ రవి తీసే ప్రతి సినిమా ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. ఆయన తాజా చిత్రం '1971 బియాండ్ బోర్డర్స్'. 1971లో భారత సరిహద్దుల్లో జరిగిన కొన్ని యధార్థ సంఘటన ఆధారంగా మలయాళంలో రూపొందించిన ఈ


మోహన్‌లాల్, అల్లు శిరీష్

చిత్రంలో మోహన్‌లాల్ మేజర్‌గా, అల్లు శిరీష్ సోల్జర్‌గా కీలక పాత్రలు పోషించారు. గత ఏడాది మలయాళంలో విడుదలై విజయం సాధించిన ఈ చిత్రాన్ని జాష్ రాజ్ ప్రొడక్షన్స్, శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా తెలుగులోకి అనుదిస్తున్నాయి. అనువాద కార్యక్రమాలు పూర్తి చేసి ఈ నెలఖారులో ఆడియోను, మార్చిలో సినిమాను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఏఎన్ బాలాజీ (సూపర్‌గుడ్ బాలాజీ)మాట్లాడుతూ 'భారత్- పాక్ బోర్డర్‌లో 1971లో జరిగిన వార్ నేపథ్యంలో ఎమోషనల్ డ్రామాగా ఈ చిత్రం రూపొందింది. నేను గతంలో తమిళ, మలయాళ, హిందీ చిత్రాలను తెలుగులోకి అనువదించాను. అవన్నీ విజయం సాధించాయి. అలాగే ఈ సినిమా కూడా బాగా ఆడుతుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సిద్ధార్థ్ విపిన్, మాటలు: ఎమ్. రాజశేఖరరెడ్డి, ఛాయాగ్రహణం! సుజిత్ వాసుదేవ్.

ఆంధ్రజ్యోతి

బిజినెస్

11 | విజయవాడ • బుధవారం 21 ఫిబ్రవరి 2018 | andhrajyothibusiness@gmail.com

రిలయన్స్‌కు ఇరోస్‌లో 5 శాతం వాటా

›› డీల్ విలువ రూ.1,000 కోట్లు

న్యూఢిల్లీ: న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లిస్టెడ్ కంపెనీ ఇరోస్ ఇంటర్నేషనల్‌లో 5 శాతం వాటాను రూ.1,000 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ప్రకటించింది. భారత్‌లో సినిమాల నిర్మాణంతోపాటు స్థానిక భాషల సినిమాల డిజిటల్ హక్కులు కొనుగోలు చేసే వ్యూహంతో ఆర్ఐఎల్ తన అనుబంధ విభాగం ద్వారా ఇరోస్‌లో వాటా కొనుగోలు చేయనుంది. ఇరోస్ ఇండియా మాతృసంస్థ అయిన ఇరోస్ ఇంటర్నేషనల్ సిఇఒ, ఎండి జ్యోతి దేశ్‌పాండే తన పదవుల నుంచి తప్పుకొని ఏప్రిల్ నుంచి ఆర్ఐఎల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారాలకు నేతృత్వం వహించనున్నారు. ఇరోస్ ఇండియా, ఇరోస్ ఇంటర్నేషనల్ బోర్డు సభ్యుడిగా మాత్రం కొనసాగుతారు.

భాగస్వామ్య సదస్సుకు ముకేశ్ అంబానీ, గౌతం అదానీ

›› 39 దేశాల నుంచి ప్రతినిధులు..

మొత్తం తొమ్మిది సెషన్లు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి 26వ తదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐఐ భాగస్వామ్య సదస్సుకు ఏడుగురు కేంద్ర మంత్రులు హాజరవుతున్నారు. తొలి రోజు పారిశ్రామిక దిగ్గజాలు ముఖేష్ అంబానీ, గౌతం అదానీ రానున్నారు. ఈసారి సదస్సుకు 39 దేశాల నుంచి విదేశీ ప్రతినిధులను ఆహ్వానించారు. మూడు రోజుల్లో తొమ్మిది సెషన్లు నిర్వహించాలని ప్రణాళిక రూపొందించారు. ఆటోమొబైల్, టూరిజం, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, టెక్స్‌టైల్స్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, మెడికల్ ఎక్విప్‌మెంట్, ఎలక్ట్రానిక్స్ రంగాలపై ప్రత్యేక చర్చలు నిర్వహిస్తారు. ఇవికాకుండా జపాన్, కొరియా దేశాలతో వ్యాపార సంబంధాలపై వేరుగా సమావేశాలు జరగనున్నాయి. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు సురేశ్‌ప్రభు, ఎంజె అక్బర్, నితిన్ గడ్కరీ, హర్షవర్ధన్, రవిశంకరప్రసాద్, అశోక్‌గజపతిరాజు, ధర్మేంద్ర ప్రధాన్‌లతో పాటు నీతి అయోగ్ ఉపాధ్యక్షులు రాజీవ్‌కుమార్, సిఇఒ అభితాబ్ కాంత్ సదస్సుకు హాజరవుతున్నారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో తొలి రోజు (24న) నిర్వహించే మొదటి సెషన్‌లో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభోపన్యాసం చేస్తారు. జిఎంఆర్ గ్రూపు ఛైర్మన్ మల్లికార్జునరావు, కియా మోటార్స్ ఛైర్మన్ కూక్ హైన్‌షిమ్, ఎడిబి కంట్రీ డైరెక్టర్, కేంద్ర మంత్రి సుజనా చౌదరి, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొంటారు. రెండో రోజు 'టెక్నాలజీస్ టుమారో' అనే సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోపన్యాసం చేస్తారు. మూడవ రోజు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండర్ రవిశంకర్ పాల్గొంటారు.

గురుగ్రామ్‌లో ఏపి రోడ్ షో

మరోవైపు భాగస్వామ్య సదస్సు కోసం ఢిల్లీ శివారులోని గురుగ్రామ్‌లో మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ రోడ్ షో నిర్వహించింది. పెట్టుబడులకు అత్యంత అనువైన రాష్ట్రాల్లో ఏపి మూడో స్థానంలో ఉన్నట్టు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి సిద్ధార్థ్ జైన్ విలేకరులతో చెప్పారు. రాష్ట్ర జిడిపి వృద్ధి రేటూ 11.61 శాతానికిపైగా ఉందన్నారు. విద్యుత్ రంగంలో మిగులుతో పాటు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణలో ఏపి మొదటి మూడు స్థానాల్లో ఉందన్నారు. నీరు, విద్యుత్, భూమి, ఇండస్ట్రియల్ కారిడార్ వంటి అనేక సదుపాయాలు ఏపిలో అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. ఎంవోయులను ఏ నెలకు ఆ నెల పర్యవేక్షిస్తూ, వీలైనంత త్వరగా వాటిని ఆచరణలోకి తీసుకురావాలనేదే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనువైన వాతావరణాన్ని చూసే దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ సంస్థ అనంతపూర్ జిల్లాలో తమ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోందని జైన్ చెప్పారు. టెక్నాలజీ ఫర్ టుమారో అన్న అలోచనతో సిఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యేందుకు ఇప్పటికే 30 దేశాల ప్రతినిధులు మాట ఇచ్చినట్టు చెప్పారు.



కృత్రిమ మేధ మానవ మేధకు
ప్రత్యామ్నాయం కాదు

›› రెండూ ఒక దానికి ఒకటి బలం



కృత్రిమ మేధ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కానే కాదని యాక్సెంచర్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ (టెక్నాలజీ సర్వీసులు) భాస్కర్ ఘోష్ అన్నారు. మంగళవారం ఆయన నాస్కామ్ ఇండియా లీడర్‌షిప్ ఫోరమ్‌కు హాజరైన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

- ప్రపంచంలో కొత్త టెక్నాలజీలు రంగ ప్రవేశం చేసిన ప్రతీ సారి భారీ నిరసనలు, వ్యతిరేకతలు సహజం అయిపోయాయి. కాని మానవ మేధస్సుకు ఏదీ ప్రత్యామ్నాయం కాదు. వాస్తవంగా చూస్తే మానవ మేధ, కృత్రిమ మేధ రెండూ ఒకదానికి ఒకటి బలంగా నిలుస్తాయి.
- 1980 దశకంలో ఐటి రంగంలో తొలి విప్లవంగా భావించే కంప్యూటర్ల ప్రవే శం సమయంలో భారీ ఎత్తున ఉద్యోగాలు గల్లంతవుతాయన్న భయాందోళనలు వెలువడ్డాయి. కాని ఆటోమేషన్, కంప్యూటర్ల ప్రవేశంతో కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయే తప్ప పెద్ద ఎత్తున ఉపాధి నష్టం జరగలేదు.
- మానవ మేధ, కృత్రిమ మేధ సహజీవనం సాగించగలవనేందుకు మంగళవారం ఉదయం సెషన్‌లో రోబో సోఫీ యా ఇచ్చిన ప్రెజెంటేషన్ సజీవ సాక్ష్యం. భవిష్యత్తులో కృత్రిమ మేధ సహాయంతో అద్భుతాలు చోటు చేసుకుంటాయి. ప్రస్తుతం మనం కృత్రిమ మేధ, వర్చువల్ రియాల్టీ, వర్చువల్ లెర్నింగ్ వంటి టెక్నాలజీల విప్లవం ప్రారంభ దశలో ఉన్నాం.
- కృత్రిమ మేధను సరైన క్రమంలో ఉపయోగించుకుంటే 2035 నాటికి వార్షిక వృద్ధి రేటు రెండింతలు కావడం తథ్యం. కృత్రిమ మేధ సహాయంతో వృద్ధాప్య సమస్యను అధిగమించేందుకు జపాన్ తీవ్రంగా కృషి చేస్తోంది. ఆటోమొబైల్ పరిశ్రమలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ను విస్తృతంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోంది.
- కొత్త టెక్నాలజీలను ఆమోదించి వాటికి అనుగుణంగా నైపుణ్యాలు సాధించడానికి మనిషిలో సంసిద్ధత అత్యంత కీలకం. అలాంటి నైపుణ్యాలు సాధించిన నాడు అపారమైన అవకాశాలు అతని ముంగిట వాలుతాయి. అందుకే ప్రజల కోసం, ప్రజల చేత కృత్రిమ మేధ అన్నది నా అభిప్రాయం. కృత్రిమ మేధ భారత్‌కు అతి పెద్ద అవకాశం.

– ఆంధ్రజ్యోతి బిజినెస్

WCIT Hyderabad INDIA 2018 World Congress on Information Technology



కొత్తగా ఆలోచించే వాతావరణం లేకపోవడమే ఇన్నోవేషన్‌కు అతి పెద్ద అవరోధం. పోటీ వాతావరణంలో కొట్టుకుపోతున్న కంపెనీలు ఉద్యోగులు కొత్తగా ఆలోచించేందుకు ఎలాంటి అవకాశం ఇవ్వడంలేదు.

– డంకన్ వార్డ్లే, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, ఇన్నోవ్



డిజిటల్ సాధికారతకు, ఆ విభాగంలో అగ్రగాములు కావడానికి వయసు అవరోధం కాదు. వయసులో చిన్న వారు మాత్రమే డిజిటల్ రంగంలో రాణించగలరనేందుకు ఎలాంటి హేతు వు లేదు. ఎందరో వయోవృద్ధులు డిజిటల్ టెక్నాలజీలను ఆకళింపు చేసుకుని నిత్యజీవనంలో వినియోగించుకుంటూ ఎంతో ముందు వరుసలో ఉన్నారు.

– రే వాంగ్, సిఇఒ, కాన్‌స్టలేషన్ రీసెర్చ్ ఇంక్

సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన ప్రపంచ ఐటి సదస్సుకు మంచి స్పందన లభిస్తోంది. బుధవారంతో ముగిసే ఈ అంతర్జాతీయ సదస్సుతో హైదరాబాద్ ఐటి రంగానికి మరింత గుర్తింపు వచ్చిందంటున్న సదస్సు నిర్వాహక కమిటీ కీలక సభ్యుల్లో ఒకరైన పెగా సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్, కంట్రీ హెడ్ సుమన్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఆ వివరాలు...

ఐటి సదస్సుకు అద్భుతమైన స్పందన

కొత్త టెక్నాలజీలపైనే ప్రధాన చర్చలు.. ఇ సుమన్ రెడ్డి, ఎండి, పెగా సిస్టమ్స్



సదస్సుకు స్పందన ఎలా ఉంది?

అద్భుతమైన స్పందన లభిస్తోంది. భారత్‌తో పాటు దాదాపు 34 దేశాల నుంచి 2,500 మందికిపైగా ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. వీరిలో విద్యావేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులతో పాటు పారిశ్రామిక వేత్తలు, ప్రముఖ ఐటి కంపెనీల ప్రధాన అధికారులు ఉన్నారు. వీరందరూ ఐటి రంగంలో చేసుకుంటున్న సరికొత్త మార్పులు, వాటి ప్రభావంపై సదస్సులో తమ అభిప్రాయాలు, అంచనాలు తెలియజేస్తున్నారు.

ఏ ఏ అంశాలపై చర్చలు జరుగుతున్నాయి?

కృత్రిమ మేధస్సు, డేటా అనలిటిక్స్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్, క్రిప్టోకరెన్సీ, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త కొత్త టెక్నాలజీపై ఆయా రంగాల నిపుణులు తమ అభిప్రాయాలు, అంచనాలు వివరిస్తున్నారు. స్పష్టంగా చెప్పాలంటే ఐటి రంగానికి చెందిన అన్ని రకాల కొత్త టెక్నాలజీలపై చర్చకు ఈ సదస్సు వేదికగా మారింది.

ఈ కొత్త టెక్నాలజీలపై శిక్షణా సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయా?

ఇవి సరికొత్త టెక్నాలజీలు. వీటిపై శిక్షణకు అవసరమైన శిక్షణ సదుపాయాలు ఇపుడిపుడే అందుబాటులోకి వస్తున్నాయి. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు కొంత సమయం పడుతుంది.

ఈ సదస్సుతో హైదరాబాద్‌కు జరిగిన మేలు ?

ఐటి రంగంలో హైదరాబాద్‌కు ఉన్న పేరు ప్రతిష్ఠలు మరోసారి ప్రపంచానికి చాటే అవకాశం ఏర్పడింది. సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులకు మన సంస్కృతీ సంప్రదాయాలు, ఐటి రంగంలో హైదరాబాద్ సత్తా తెలిపే అవకాశం లభించింది.

పెగా సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ?

ఈ సంవత్సరం మే లోపు 1,500 మంది విద్యార్థులు పెగా సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ పూర్తి చేసుకోబోతున్నారు. మంచి ఉద్యోగ అవకాశాల కోసం తెలంగాణ, ఎపిల్లోని ఎనిమిది ఇంజినీరింగ్ కాలేజీల్లో ఈ శిక్షణ ఇస్తున్నాం.

డాక్టర్ల ఫేస్‌బుక్ 'వైట్‌కోట్స్'

నాలెడ్జ్ షేరింగ్ వేదిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా వెబ్‌సైట్ల గురించి అందరికీ తెలుసు. ఈ సోషల్ మీడియా వెబ్‌సైట్లలో ఎవరైనా తమ అభిప్రాయాలు, అభిరుచులు పంచుకునే అవకాశం ఉంది. డాక్టర్లు కూడా ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా తమ అభిప్రాయాలు, అభిరుచులు పంచుకునే అవకాశం ఉన్నా, అవి అందరి కంటపడతాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌కు చెందిన 'వాల్యూ మూమెంటమ్ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ కేవలం డాకర్ల కోసమే 'వైట్ కోట్స్' పేరుతో ప్రత్యేక ఆన్‌లైన్ సామాజిక వేదిక సృష్టించింది. ఏడాదిరన్నర క్రితం ప్రారంభమైన వైట్‌కోట్స్‌లో ఇప్పటి వరకు దాదాపు 1.5 లక్షల మంది డాక్టర్లు సభ్యులయ్యారు. వచ్చే రెండేళ్లలో మరో లక్షన్నర మంది డాక్టర్లను వైట్‌కోట్స్‌లో సభ్యులుగా చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రపంచ ఐటి సదస్సుకు హాజరైన కంపెనీ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సిడిఒ) జయేశ్ చౌహాన్ చెప్పారు. ఆండ్రాయిడ్, యాపిల్ స్టోర్ల లభించే ఈ యాప్ ద్వారా రోగ నిర్ధారణతో పాటు చికిత్సలో డాక్టర్లకు ఎదురయ్యే సమస్యలు, అనుమానాలను నిపుణులైన ఇతర డాక్టర్ల ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. దీంతో ఎపి, తెలంగాణ నుంచే దాదాపు 25,000 మంది వైద్యులు ఈ ఆన్‌లైన్ వేదికలో సభ్యత్వం తీసుకున్నారు. ఈ ఆన్‌లైన్ వేదిక కోసం కంపెనీ గత ఏడాదిన్నర కాలంలో రూ.10 కోట్ల వరకు పెట్టుబడి పెట్టింది. వచ్చే రెండేళ్లలోనూ ఏటా ఐదారు కోట్ల రూపాయల చొప్పున ఇన్వెస్ట్ చేస్తామని వైట్‌కోట్స్ సిడిఒ జయేశ్ చౌహాన్ చెప్పారు. డాక్టర్ల విద్యార్హతలు, నైపుణ్యాల గురించి పూర్తిగా ధ్రువీకరించుకున్న తర్వాతే వైట్‌కోట్స్‌లో సభ్యత్వం ఇస్తామన్నారు. ప్రస్తుతం ఉచితంగానే సభ్యత్వం ఇస్తున్నా త్వరలో సబ్‌స్క్రిప్షన్ ఆధారిత సభ్యత్వం అమలు చేయాలని కంపెనీ భావిస్తోంది. దీంతో పాటు ఆదాయం కోసం ఔషధ కంపెనీల మందుల గురించి ప్రచారం, సర్వేలు కూడా చేపట్టాలని భావిస్తోంది.



అవినీతి అధికారులపై చర్యలకు రెడీ

న్యూఢిల్లీ : చేతులు కాలిన తర్వాత, అవినీతి అధికారులపై చర్యలు తీసుకునేందుకు బ్యాంకులు ఇప్పుడు సిద్ధమవుతున్నాయి. వారిని విచారించేందుకు కేంద్ర నిఘా సంస్థ (సివిసి)కి అనుమతి ఇచ్చే ప్రక్రియ మొదలు పెడుతున్నాయి. అవినీతి ఆరోపణలకు సంబంధించి సివిసి 23 కేసులు నమోదు చేసింది. 39 అధికారులను బాధ్యులుగా పేర్కొంది. వారిలో బ్యాంకు ఉన్నతాధికారులు, ఐఎఎస్‌లు కూడా ఉన్నారు. వారి విచారణకు అనుమతి ఇవ్వాలంటూ వివిధ బ్యాంకులను కోరింది. ఇందులో పిఎన్‌బి మరో రెండు బ్యాంకులు కూడా ఉన్నాయి. నిజానికి, సివిసి కోరిన నాలుగు నెలల్లోనే అనుమతి ఇవ్వాలి. కానీ, నెలలు గడుస్తున్నా బ్యాంకులు స్పందించలేదు.

బిటిపిఎస్, కెటిపిఎస్ ఏడో దశకు బొగ్గు లింకేజీ క్లియర్

కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బిటిపిఎస్), పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కెటిపిఎస్) ఏడో దశ నిర్మాణాలకు కోల్ లింకేజీకి గ్రీన్ సిగ్నల్ లభించింది. సూపర్ క్రిటికల్ విధానంలో ఈ రెండు విద్యుదుత్పత్తి ప్లాంట్లకు బొగ్గు సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అనుమతినిచ్చింది. బిటిపిఎస్, కెటిపిఎస్ ఏడో దశ ప్లాంట్లకు ఏటా 8.2 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కానుంది. ఈ రెండు విద్యుత్ ప్లాంట్లకు బొగ్గును సింగరేణి కాలరీస్ సరఫరా చేసేందుకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. తెలంగాణలో తొలి సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రమైన కెటిపిఎస్ ఏడో దశకు ఏటా 39.5 లక్షల టన్నుల బొగ్గు అవసరం కానుంది. మరోవైపు బిటిపిఎస్‌కు అవసరమైన బొగ్గును రైల్వే వ్యాగన్ల ద్వారా సరఫరా చేసేందుకు గాను మణుగూరు రైల్వే స్టేషన్ నుంచి రైల్వే లైన్‌ను ఏర్పాటు చేసేందుకు జెన్‌కో అధికారులు పనులు చేపట్టారు.

ఒత్తిడి పెంచుతున్న మేధస్సు

›› అపోలో హాస్పిటల్స్ జెఎండి సంగీతారెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఒత్తిడులతో కూడిన ప్రపంచంలో పోటీలో ముందు నిలవాలన్న ధ్యేయంతో ఉద్యోగులు శారీరక స్వస్థతను నిర్లక్ష్యం చేస్తున్నారని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి అన్నారు. నాస్కామ్ సదస్సులో భాగంగా క్రియేటివ్ షిఫ్ట్ పేరిట జరిగిన ఒక గోష్ఠిలో మాట్లాడుతూ.. కార్పొరేట్ ఉద్యోగుల్లో అధిక శాతం మంది నిరంతర ఒత్తిడిలోనే కాలం గడుపుతున్నారని చెప్పారు. రోజూ ప్రపంచవ్యాప్తంగా 17 వేల మంది చిన్న వయస్సులోనే ఆకస్మిక గుండెపోటు వల్ల హఠాన్మరణం పాలవుతుండగా వారిలో 40 శాతం మంది భారతీయులేనని ఆమె అన్నారు. మానవ మేధస్సు అపారమైనదని, ప్రస్తుత డిజిటల్ యుగంలో మనం 300 సంవత్సరాలకు సరిపోయే జ్ఞానాన్ని మెదడుకు పంపుతున్నామని ఆమె చెప్పారు. నిరంతరం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు దీటుగా తమను తాము తీర్చి దిద్దుకునేందుకు, కొత్త పరిజ్ఞానాలు సముపార్జించుకునేందుకు మనం ఎంతో కృషి చేస్తున్నామంటూ దీని వల్ల మనం ఎనలేని ఒత్తిడికి లోనవుతున్నామని ఆమె అన్నారు. ఇలాంటి ఒత్తిడులను అధిగమించాలంటే ప్రతీరోజూ మానసిక, శారీరక వ్యాయామం అలవరచుకోవాలని ఆమె సూచించారు. తీవ్ర ఒత్తిడి అనిపించిన సమయంలో ఒకసారి కళ్లు మూసుకుని గుండెనిండా శ్వాస పీల్చుకుని కొద్ది క్షణాల తర్వాత నింపాదిగా ఆ శ్వాసను బయటకు వదిలిన తర్వాత కళ్లు తెరిస్తే చాలా వరకు ఆ ఒత్తిడి తగ్గుతుందని ఆమె సలహా ఇచ్చారు.



గత కొన్ని సంవత్సరాలుగా అక్షరాస్యత మనిషిని లెక్కలు, శాస్త్రీయ జ్ఞానం గల మరబొమ్మగా మార్చేస్తోంది. శారీరక ఆరోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోంది. మనిషి జీవితానికి మేధస్సు ఎంత అవసరమో మానసికంగాను, శారీరకంగాను ఫిట్‌గా ఉండడం కూడా అంతే అవసరం. వైఫల్యం అనేది నేరం ఏమీ కాదు, దాన్ని పక్కన పెట్టి ముందుకు సాగితే మనిషి విజయం సాధిస్తాడు.

– పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ కోచ్

బొగ్గు విక్రయంలోకి కార్పొరేట్లు!

›› గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కేంద్ర కేబినెట్

›› కోల్ ఇండియా గుత్తాధిపత్యానికి తెర

›› 4 దశాబ్దాల్లో భారీ బొగ్గు సంస్కరణ

న్యూఢిల్లీ: ప్రైవేట్ కంపెనీలు సైతం వాణిజ్య అవసరాల కోసం బొగ్గు ఉత్పత్తి చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షత సమావేశమైన ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షక కేబినెట్ కమిటీ (సిసిఇఎ) ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నాలుగు దశాబ్దాల క్రితం (1973లో) బొగ్గు రంగాన్ని జాతీయం చేసినప్పటి నుంచి ఇప్పటివరకు కోల్ ఇండియాకు మాత్రమే బొగ్గును విక్రయించే అనుమతి ఉంది. దేశీయ బొగ్గు ఉత్పత్తిలో ఈ సంస్థదే 80 శాతం వాటా. ప్రభుత్వం తాజా నిర్ణయంతో ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) గుత్తాధిపత్యానికి తెరపడనుంది. ప్రస్తుతానికి ప్రైవేట్ సంస్థలు తమ సొంత అవసరాల కోసం మాత్రమే బొగ్గు ఉత్పత్తి చేసుకునేందుకు వీలుంది.

బొగ్గు రంగంలోకి భారీగా పెట్టుబడులు: గోయల్

బొగ్గు రంగాన్ని జాతీయం చేసిన తర్వాత ప్రభుత్వం చేపట్టిన అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్కరణ ఇదేనని కేబినెట్ నిర్ణయాలను మీడియాకు తెలిపేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో బొగ్గు, రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. కేంద్రం నిర్ణయం బొగ్గు ఉత్పత్తి రంగం సామర్థ్యాన్ని పెంచడంతోపాటు పోటీ పెరిగి ఈ ముడి సరుకు ధరలు తగ్గుముఖం పట్టవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాదు, బొగ్గు రంగంలో పెట్టుబడులు భారీగా పుంజుకోవడమేకాక లక్షలాది ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ఆయన పేర్కొన్నారు. దాంతో బొగ్గు గనుల పరిసర ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయన్నారు.

భారీ గనులతోపాటు చిన్న, మధ్య స్థాయి మైన్స్‌ను సైతం ప్రైవేట్ కంపెనీలకు ఆఫర్ చేయనున్నట్లు గోయల్ వెల్లడించారు. బొగ్గు సరఫరా, బాధ్యతాయుతమైన కేటాయింపులు, అందుబాటు ధరల ద్వారా ఇంధన భద్రతకు బాటలు వేయనుందన్నారు. గనుల వేలంలో పారదర్శకత, సులభతర వ్యాపార నిర్వహణకే అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు, సహజ వనరులు దేశాభివృద్ధికే ఉపయోగపడేలా చూస్తామని మంత్రి పేర్కొన్నారు. వేలంలో ఎక్కువ ధరకు బిడ్ వేసే వారికే గనుల కేటాయించడం జరుగుతుందని, గనిలోని బొగ్గు వినియోగం, విక్రయంపై ఎలాంటి ఆంక్షలుండబోవన్నారు. బొగ్గు గని వేలం ద్వారా వచ్చే రాబడి సంబంధిత రాష్ట్రానికే వెళుతుంది.

70 శాతం థర్మల్ విద్యుత్తే..

దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో 70 శాతం థర్మల్ ప్లాంట్ల నుంచే సరఫరా అవుతోందని, బొగ్గు గనుల వేలం జాతీయ ఇంధన భద్రత బాసటగా నిలుస్తుందని బొగ్గు శాఖ పేర్కొంది. దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెరగడమే కాకుండా దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని, తద్వారా విదేశీ మారకం ఆదా అవుతుందని గోయల్ అన్నారు. అంతేకాదు, ఈ నిర్ణయం విద్యుత్ చార్జీలు తగ్గేందుకు తోడ్పడనుందన్నారు.

దేశంలో 30 వేల కోట్ల టన్నుల మేర బొగ్గు నిల్వలున్నాయని అంచనా. యుపిఎ ప్రభుత్వ హయాంలో వెలుగుచూసిన బొగ్గు కుంభకోణం కేసును విచారించిన సుప్రీంకోర్టు.. 1993 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలకు కేటాయించిన 204 బొగ్గు గనుల అనుమతులను సెప్టెంబరు 2014లో రద్దు చేసింది. బొగ్గు గనుల కేటాయింపుల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు రూపొందించిన కోల్‌మైన్స్ (స్పెషల్ ప్రొవిజన్స్) బిల్లు 2015కు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. మార్చి 2015లో చట్టంగా మారింది. బొగ్గు విక్రయానికి అనుమతిస్తూ గనులను వేలం ద్వారా కట్టబెట్టేందుకు ఈ చట్టం అనుమతిస్తుంది.

చిట్‌ఫండ్స్ చట్ట సవరణకు ఓకే

చిట్‌ఫండ్ రంగం క్రమంగా వృద్ధి చెందడంతో పాటు ఇన్వెస్టర్లకు మరిన్ని ఆర్థిక పథకాలు అందించగలిగేలా చట్టంలో సవరణలు చేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. చిట్‌ఫండ్స్ (సవరణ) బిల్లు 2018ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు అనుమతిచ్చింది. చిట్‌ఫండ్స్ చట్టం 1982ను రూపొందించినప్పుడు నిర్ణయించిన రూ.100 సీలింగ్ నిబంధనను తొలగించాలని, ఇకపై సీలింగ్‌ను రాష్ట్రాలే నిర్ణయించడంతోపాటు కాలానికి అనుగుణంగా పెంచుకుంటూపోయేలా అనుమతివ్వాలని సవరణ బిల్లులో ప్రతిపాదించారు.

పోంజీ స్కీమ్‌లకు చెక్!



పోంజీ స్కీమ్‌ల ద్వారా నిధుల సేకరించే వారిని శిక్షించేందుకు పెట్టేందుకు కేంద్రం అత్యంత కఠిన చట్టాన్ని ప్రతిపాదించింది. అనియంత్రిత డిపాజిట్ల పథకాల నిషేధం బిల్లు-2018ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్ర కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. దేశంలో అక్రమ డిపాజిట్ల సేకరణ కార్యకలాపాలను కట్టడి చేసేందుకు కేంద్రం ఈ బిల్లును రూపొందించింది. ఈ తరహా పథకాలను నిర్వహించే సంస్థలు, వ్యవస్థలు నియంత్రణ మండళ్ల పరిధిలోని అంతరాలను, పర్యవేక్షణలేమిని ఆసరాగా చేసుకొని అమాయక, పేద ప్రజల కష్టార్జితాన్ని కొల్లగొడుతున్నాయని కేంద్రం పేర్కొంది. వీటికి చెక్ పెట్టేందుకు రూపొందించిన సమగ్ర బిల్లులో అనియంత్రిత డిపాజిట్ సేకరణ కార్యకలాపాలను పూర్తిగా నిషేధించడంతో పాటు వాటిని నిరుత్సాహపరిచేలా కఠిన చర్యలు ప్రతిపాదించారు. ఈ బిల్లు ప్రకారం.. డిపాజిట్లు సేకరించిన సంస్థ డిఫాల్ట్ అయిన పక్షంలో ఇన్వెస్టర్లకు సొమ్ము తిరిగి చెల్లించేలా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థాధికార వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

మూడు రకాలైన నేరాలు..

ఈ బిల్లులో మూడు రకాలైన పథకాలను నేరాలుగా పరిగణించడం జరుగుతుందని ప్రతిపాదించారు. అందులో మొదటిది అనియంత్రణ డిపాజిట్ పథకాలు, రెండోది నియంత్రిత పథకాల్లో మోసపూరిత ఉద్దేశంతో డిఫాల్ట్ కావడం, మూడోది డిపాజిట్ల సేకరణ కోసం చట్టవిరుద్ధమైన రీతిలో ప్రోత్సహించడం. వీటిని అరికట్టేందుకు అత్యంత కఠిన శిక్షలతో పాటు భారీ నగదు జరిమానాలను ఈ బిల్లులో ప్రతిపాదించారు. అంతేకాదు, ఈ తరహా ఘటనల్లో డిపాజిట్‌దారులకు సొమ్ము తిరిగి చెల్లింపులకు సంబంధించి తగినన్ని ప్రొవిజన్స్‌ను పొందుపర్చినట్లు ప్రభుత్వం తెలిపింది. పోంజీ సంస్థల ఆస్తుల జప్తు, వాటిని విక్రయించి డిపాజిట్‌దారులకు సొమ్ము చెల్లించే విషయంలోనూ స్పష్టమైన టైమ్‌లైన్‌ను పొందుపర్చినట్టు వెల్లడించింది. దేశంలో డిపాజిట్ల సేకరణ కార్యకలాపాలపై సమాచారం సేకరణ, ఇచ్చిపుచ్చుకునేందుకు వీలుగా ఆన్‌లైన్ సెంట్రల్ డేటాబేస్ ఏర్పాటు చేయనున్నారు.

గతంలోనే ప్రకటన

పోంజీ పథకాలను అరికట్టేందుకు కఠినమైన నిబంధనలతో కూడిన చట్టాన్ని తీసుకొస్తామని 2016-17 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ముసాయిదా బిల్లుపై ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్నట్లు, వాటి ఆధారంగా తుది బిల్లు రూపొందించి పార్లమెంట్‌లో ప్రవేశపెడతామని 2017-18 బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా జైట్లీ వెల్లడించారు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
33703.59	10360.40	30785	38310	64.79	65.11
71.07	18.00	90	240		

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

అన్నీ మంచి శకునాలే

» ఐటి ఎగుమతుల్లో 7-9 శాతం వృద్ధి

» లక్ష ఉద్యోగాల కల్పన.. 2018-19 సంవత్సరానికి నాస్కామ్ అంచనా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018-19) భారత ఐటి ఎగుమతులు 7 నుంచి 9 శాతం మేరకు వృద్ధి సాధించవచ్చునని నాస్కామ్ అంచనా వేసింది. మార్చి 31వ తేదీతో ముగియనున్న వర్తమాన ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన వృద్ధి రేటు అంచనా కన్నా ఇది స్వల్పమే అయినప్పటికీ భవిష్యత్ వృద్ధి శక్తిమంతంగా ఉండేందుకు అనుకూలమైన సంకేతాలు ఇప్పటికే వెలువడ్డాయని నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ తెలిపారు. నాస్కామ్ అధ్యక్షురాలిగా ఎంపికైన దేబ్జానీ ఘోష్, ఛైర్మన్ రమణ్ రాయ్, వైస్ ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీలతో కలిసి మంగళవారం ఇక్కడ నాస్కామ్ అంచనాల నివేదికను ఆయన విడుదల చేశారు. అమెరికా, యూరోపియన్ యూనియన్లలో రికవరీ పరిశ్రమకు ఆశావహమైన సూచిక అని ఆయన అన్నారు. అయినప్పటికీ భవిష్యత్ వృద్ధికి ఎన్నో ఎదురుగాలులు, సవాళ్లు ఉన్న మాట వాస్తవమేనని ఆయన చెప్పారు. అలాగే డిజిటల్ జేఏమ్, జామ్, ఆధార్ రూపంలో ప్రభుత్వ సేవల్లో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరిగిందని ఆయన అన్నారు. ప్రైవేట్ రంగ కంపెనీలు, ప్రధానంగా బ్యాంకింగ్ రంగంలో టెక్నాలజీ వినియోగం గణనీయంగా పెరిగిందని చంద్రశేఖర్ చెప్పారు. అమెరికా సహా కొన్ని దేశాల్లో ఆత్మరక్షణ ధోరణులు పరిశ్రమకు ఏమరుపాటు సవాళ్లలో ప్రధానమైనవని ఆయన అన్నారు. అమెరికాలో వలసలు, పన్ను సంస్కరణల పేరిట కొన్ని చర్యలు తీసుకోనున్నట్టు సంకేతాలున్నా ఆపిల్ విధానాల రూపం తీసుకోలేదన్న విషయం గమనించాలని ఆయన వ్యాఖ్యానించారు. ఇన్ని ప్రతికూల పవనాల నడుమ 2018 ఆర్థిక సంవత్సరం కాస్తంత ఆందోళనకరంగానే ప్రారంభమైనా 7.8 శాతం వృద్ధితో ఎగుమతుల రంగం 16,700 కోట్ల డాలర్ల (రూ.10.69 లక్షల కోట్లు) ఆదాయాలు ఆర్జించగలదని భావిస్తున్నట్టు తెలిపారు. అలాగే ప్రస్తుత సానుకూలతల నేపథ్యంలో వచ్చే ఏడాది 7 నుంచి 9 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నామని ఆయన వివరించారు. కొన్ని ప్రతికూలతలు ఎదురవుతున్నా ఐటి ఎగుమతుల వాటా మొత్తం ఎగుమతుల్లో 24 శాతం ఉన్నట్టు చంద్రశేఖర్ తెలిపారు. అలాగే దేశీయంగా 10 శాతం వృద్ధితో 2900 కోట్ల డాలర్ల (రూ.1.86 లక్షల కోట్లు) ఆదాయం అంచనా వేస్తున్నామన్నారు. డిజిటల్ టెక్నాలజీల్లోను ప్రత్యేకించి బ్లాక్ చెయిన్ విభాగంలోను ఈ ఏడాది అత్యధికంగా 30 శాతం వృద్ధి సాధించామని, ఇ కామర్స్ విభాగం 17 శాతం, స్టార్టప్ విభాగం 25 నుంచి 30 శాతం వృద్ధి నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

ఉపాధి రంగం ఆశాజనకం

తమ అంచనాలకు దీటుగా ఐటి రంగంలో ఈ ఏడాది లక్ష ఉద్యోగాలు అదనంగా ఇచ్చామంటూ రానున్న ఆర్థిక సంవత్సరంలో కూడా అదే సంఖ్యలో కొత్తవారిని ఉద్యోగాల్లో చేర్చుకునే అవకాశాలున్నాయని రమణ్ రాయ్ తెలిపారు. ఐటి రంగం నుంచి ఉద్యోగుల వలస 10 శాతం వరకు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ వెలుపలికి వెళ్తున్న వారందరూ ఇతర రంగాలకు చెందిన టెక్నాలజీ విభాగాల్లోనే ఉపాధి పొందుతున్నారని ఆయన చెప్పారు. ఇలా ఇతర రంగాల్లోని టెక్నాలజీ విభాగాల్లో ఎంత మంది ఉపాధి పొందుతున్నారన్న గణాంకాలు తమ వద్ద లేవని, వారిని కూడా కలిపినట్టయితే కొత్త ఉద్యోగాల కల్పన లక్ష కన్నా పైనే ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. బ్యాంకింగ్ రంగం పెద్ద ఎత్తున సాంకేతిక నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నదని ఆయన చెప్పారు. ప్రస్తుతం డిజిటలైజేషన్, ఆటోమేషన్ అన్ని రంగాలకు విస్తరించిన వాతావరణంలో టెక్నాలజీ ఉద్యోగాల్లో వృద్ధికి నేరుగా ఐటి, అనుబంధ రంగాల్లో ఉపాధి పొందుతున్న వారిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే చాలదని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ లక్ష ఉద్యోగాల కల్పనతో ఐటి రంగం అత్యధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తెచ్చిన రంగంగానే నిలుస్తుందని రమణ్ రాయ్ అన్నారు.

చంద్రబాబును చూసే పెట్టుబడులు

» అమరావతిలో పరిశ్రమల స్థాపనకు

» విదేశీ కంపెనీల ఆసక్తి

» 24 నుంచి విశాఖలో భాగస్వామ్య సదస్సు

» 11 అంశాలపై ప్లీనరీ సెషన్లు

» 8 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ సెషన్లు: అమర్‌నాథరెడ్డి



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును చూసే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి ఎన్.అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. పెట్టుబడుల కోసం తాను విదేశాల్లో పర్యటించినప్పుడు ఇదే విషయాన్ని గమనించానని, విదేశీ వాణిజ్య ప్రతినిధులు చంద్రబాబు గురించి మాట్లాడుకుంటున్నారని చెప్పారు. అమరావతిలో పరిశ్రమలు స్థాపించేందుకు విదేశీ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయన్నారు. విశాఖపట్నంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకూ భాగస్వామ్య సదస్సు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ)తో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే ఈ సదస్సులో గతంలో కేంద్ర ప్రభుత్వ సెషన్లు మాత్రమే జరిగేవని, ఈ సారి కేంద్రానికి చెందిన 11 ప్లీనరీ సెషన్లతోపాటు 8 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ సెషన్లు కూడా ఉంటాయని చెప్పారు. ప్లీనరీ సెషన్లలో సన్‌రైజ్ ఏపీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలు, మౌలికవసతుల అభివృద్ధి, రాష్ట్ర సెషన్లలో ఆటోమొబైల్, టెక్స్‌టైల్, పునరుత్పాదక శక్తి, పర్యాటకం, ఏరోస్పేస్, డిఫెన్స్, ఫుడ్‌ప్రాసెసింగ్, మెడికల్ ఎక్విప్‌మెంట్ అంశాలపై కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. అంతేకాకుండా కొరియా, జపాన్ దేశాలకు చెందిన రెండు సెషన్లు కూడా జరుగుతాయని చెప్పారు. ఈ సదస్సు ప్రారంభం రోజున ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు హాజరవుతారన్నారు. 14 దేశాలకు చెందిన వాణిజ్యమంత్రులు, అంతర్జాతీయంగా పేరున్న 39 దేశాలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖ కంపెనీలకు చెందిన వ్యాపారవేత్తలు మొత్తం 2500 మందిని ఆహ్వానించినట్లు వివరించారు.

రెండేళ్ల పురోగతి ఇదీ...

2016లో జరిగిన భాగస్వామ్య సదస్సులో అన్ని శాఖలకు కలిపి రూ.3,44,201 కోట్ల పెట్టుబడులతో 7,03,727 మందికి ఉపాధి లభించే సంస్థల ఏర్పాటుకు 290 అవగాహన ఒప్పందాలు జరిగినట్లు వివరించారు. వాటిలో 65.17శాతం సంస్థలు, 44.26శాతం పెట్టుబడులకు సంబంధించి ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు. 2017లో జరిగిన సదస్సులో 14,96,513 మందికి ఉపాధి కల్పించేలా రూ.7,65,994 కోట్ల పెట్టుబడులతో ప్రాజెక్టులు స్థాపించేందుకు 586 అవగాహన ఒప్పందాలు జరిగినట్లు చెప్పారు. వాటిలో 33.86శాతం పెట్టుబడులతో 39.76శాతం ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభించినట్లు తెలిపారు. ఇవే కాకుండా 11,28,340 మందికి ఉపాధి లభించేలా రూ.3,15,713 కోట్ల పెట్టుబడులతో ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు 941 ఒప్పందాలు జరిగినట్లు వివరించారు. వాటిలో 53శాతం ప్రాజెక్టులు, 38శాతం పెట్టుబడులతో ఉత్పత్తి ప్రారంభించినట్లు తెలిపారు. రెండు సదస్సులు కలుపుకుని పరిశ్రమల శాఖ పరిధిలో 8,74,658 మందికి ఉపాధి లభించే రూ.2,92,3000 కోట్ల విలువైన ప్రాజెక్టుల్లో... 54 శాతం ప్రాజెక్టులు కొన్ని నిర్మాణ దశలో, మరికొన్ని యంత్రాలు అమర్చే దశలో, ఇంకొన్ని ప్రారంభించే దశలో ఉన్నాయని చెప్పారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని వివరాలు సీఎం డ్యాష్‌బోర్డులో పొందుపరిచినట్లు మంత్రి తెలిపారు.

లాభం లేదు..

» నష్టాల్లోనే కీలక సూచీలు

» వెన్నాడుతున్న పిఎన్‌బి స్కామ్

ముంబై : స్టాక్ మార్కెట్ మంగళవారం నాడు కూడా నష్టాల్లోనే ముగిసింది. వాస్తవానికి ఉదయం సూచీలు పాజిటివ్ జోన్‌లో ఉండటంతో ఇన్వెస్టర్లు ఊపిరి పీల్చుకున్నారు. ప్రారంభంలో లిప్తకాలం పాటు క్రితం ముగింపు కంటే దిగువకు వచ్చినప్పటికీ సెన్సెక్స్ ఆ తర్వాత మళ్లీ పైకి దూసుకుపోయింది. ఆటుపోట్లు ఉన్నప్పటికీ ఆఖరు గంట వరకు లాభాల్లోనే ఉంది. ఆఖరు గంటలోనే అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టాల్లోకి జారుకుంది. ఆఖరులో 71 పాయింట్ల నష్టంతో 33703 వద్ద ముగిసింది. నిఫ్టీ 18 పాయింట్ల నష్టంతో 10360 వద్ద క్లోజైంది. ఇటీవల కాలంలో మార్కెట్ పతనం వల్ల అట్టడుగు స్థాయి చేరిన షేర్లలో కొనుగోళ్లు జరగడం, షార్ట్ కవరింగ్స్ మార్కెట్ ఆరంభంలో లాభపడేందుకు దోహదం చేసింది. ఐటి స్టాక్స్‌లో కొనుగోళ్ల వల్ల సూచీలు ఆరంభంలో లాభపడినా బ్యాంకు షేర్లలోని నెగెటివ్ సెంటిమెంట్ మార్కెట్‌ను దెబ్బ తీసింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ కూడా డాలర్ మారకంలో 68 పైసలు తగ్గింది. ఈ పరిణామం కూడా ప్రతికూల ప్రభావం చూపింది.

- ఇంట్రాడేలో సెన్సెక్స్ 33960 పాయింట్ల గరిష్ఠ స్థాయిని 33657 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ 10429-10347 పాయింట్ల మధ్య చలించి చివరలో 10360 వద్ద క్లోజైంది.
- ప్రైవేట్ రంగంలోని యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్, యస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ నష్టాలతో ముగిసాయి.
- సెన్సెక్స్ షేర్లలో ఎం అండ్ ఎం భారీగా నష్టపోయింది. రిలయన్స్, సన్ ఫార్మా, ఎల్ అండ్ టి, మారుతి సుజుకీ, ఐటిసి నష్టాలతో ముగిసాయి.
- ఐటి రంగంలో వృద్ధికి సంబంధించి నాస్కామ్ అంచనాలు పాజిటివ్‌గా ఉండటంతో ఇన్వెస్టర్లు ఐటి స్టాక్స్‌పై ఆసక్తి చూపించారు. టిసిఎస్,విప్రో, ఇన్ఫోసిస్, లాభాల్లో ఉన్నాయి.
- కోల్ ఇండియా, ఒఎన్‌జిసి, హీరో మోటోకార్ప్, భారతి టాటా స్టీల్, పవర్ గ్రిడ్, డాక్టర్ రెడ్డీస్ లాభాలతో ముగిసాయి.
- స్కామ్ దెబ్బకు పిఎన్‌బి షేర్లలో పతనం కొనసాగుతోంది. గత ఐదు రోజుల్లో షేరు ధర 28 శాతం పతనమైంది. మార్కెట్ క్యాప్ 11 వేల కోట్ల రూపాయల మేర తుడిచిపెట్టుకుపోయింది. మంగళవారం ఉదయం ట్రేడింగ్‌లో 111 రూపాయల కనిష్ఠ స్థాయిని తాకినప్పటికీ ఆఖరులో కోలుకొని క్రితం స్థాయి కంటే (116.40 రూపాయలు) స్వల్ప ఎగువన 116.55 వద్ద ముగిసింది.



బ్యాంకులపై పర్యవేక్షణ నో

» ఆర్‌బిఐలో డిప్యూటీ గవర్నర్ పోస్టు ఖాళీ

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణాన్ని అడ్డుకోవడంలో ఆర్‌బిఐ విఫలమైందని, దాని సామర్థ్యత లోపం వల్లే ఈ స్కామ్ జరిగిందని జరిగిందని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. ఆరోపించడమే కాదు.. ఆర్థిక శాఖ.. ఆర్‌బిఐకి లేఖ కూడా రాసింది. విచిత్రం ఏమిటంటే, ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులను పర్యవేక్షించే డిప్యూటీ గవర్నరే ఏడు నెలలుగా ఆర్‌బిఐలో లేరు. ఆయన నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టలేదు. హర్షద్ మెహతా కుంభకోణం తర్వాత బ్యాంకింగ్ విభాగాన్ని పర్యవేక్షించడానికి 1993లో ఈ డిప్యూటీ గవర్నర్ పోస్టును సృష్టించారు. ప్రస్తుతం ఆర్‌బిఐలో ఆర్థికవేత్త విరాల్ ఆచార్య, బిపి కనుంగో, ఎన్ఎస్ విశ్వనాథన్ పదోన్నతుల ద్వారా డిప్యూటీ గవర్నర్లు అయ్యారు. గత ఏడాది జూలైలో ఎస్ఎస్ ముంద్రా పదవీ విరమణ చేశారు. రిటైర్మెంట్ తర్వాత ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. నిజానికి, ఆయన పదవీ విరమణకు ముందే కొత్త గవర్నర్‌ను ఎంపిక చేసే ప్రక్రియను కేంద్రం ప్రారంభించింది. ఇంటర్వ్యూలు పూర్తి చేసి జాబితా కూడా తయారు చేసింది. ఆ తర్వాత దానిని పక్కనబెట్టింది. డిసెంబరులో మళ్లీ ప్రక్రియ మొదలు పెట్టింది. ఇంకా జాబితా తయారు చేయలేదు.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,590	31,350	---	31,300	30,730
క్రితం ముగింపు	31,760	---	31,740	31,300	30,830
22 క్యారెట్లు	29,250	29,100	---	28,940	29,270
క్రితం ముగింపు	29,410	---	29,200	29,030	29,360
వెండి (కిలో)	39,400	39,700	---	39,500	41,400
క్రితం ముగింపు	39,600	---	39,600	39,800	41,600

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	75.00	విజయవాడ	79.00
కరీంనగర్	76.00	గుంటూరు	79.00
వరంగల్	77.00	ఒంగోలు	81.00
మహబూబ్‌నగర్	75.00	చిత్తూరు	78.00
కర్నూలు	75.00	నెల్లూరు	78.00
విశాఖపట్నం	80.00	అనంతపురం	7000
గోదావరి	78.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	355.00	చిత్తూరు	403.00
వరంగల్	357.00	చెన్నై	410.00
విజయవాడ	375.00	నమక్కల్	395.00
గోదావరి	375.00	బెంగళూరు	395.00
విశాఖపట్నం	375.00	ముంబై	410.00

వజ్రం కాదు.. గాజు

మామా అల్లుళ్ల దెబ్బకు షేర్‌హోల్డర్ల జేబులు ఖాళీ



పిఎన్‌బి స్కామ్ దెబ్బకు గీతాంజలి జెమ్స్ షేరు ధర దారుణంగా పతనం కావడంతో షేరు హోల్డర్లు లబోదిబోమంటున్నారు. సరిగ్గా వారం రోజుల క్రితం 63 రూపాయలున్న షేరు ధర ఇప్పుడు 30 రూపాయలకు పడిపోయింది. ఇంకా ఏ స్థాయికి పతనమవుతుందో తెలియని పరిస్థితి. బోగస్ ఎల్‌ఒయులతో పంజాబ్ నేషనల్ బ్యాంకును 11,400 కోట్ల రూపాయల మేర ముంచిన కేసులో నీరవ్ మోదీతో పాటు ఆయన మేనమామ గీతాంజలి ప్రమోటర్ చోక్సీ కూడా కీలక పాత్రధారిగా ఉన్న విషయం తెలిసిందే. వీరిద్దరూ కుటుంబాలతో దేశం విడిచి పరార్ కావడంతో కంపెనీ పరిస్థితీ, కంపెనీని నమ్మి ఇన్వెస్ట్ చేసిన వారి పరిస్థితి దారుణంగా తయారైంది. కంపెనీలో ప్రమోటర్ల వాటా కేవలం 27 శాతం మాత్రమే 73 శాతం వాటాలు ప్రజల చేతుల్లోనే ఉన్నాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ 300 కోట్ల రూపాయలకు పడిపోయింది. షేర్లను అమ్మే వారే తప్ప కొనేవారే కనిపించడం లేదు.

షేర్లు తెగనమ్ముకున్న ప్రమోటర్లు

స్కామ్‌కు శ్రీకారం చుట్టినట్టుగా భావిస్తున్న 2011లో గీతాంజలి జెమ్స్‌లో ప్రమోటర్ల వాటా 54 శాతంపైగా ఉంది. ఆరేడు సంవత్సరాల్లో ఇది క్రమంగా సగానికి సగం తగ్గింది. అంటే హెచ్చురేట్లలో షేర్లను విక్రయించి ప్రమోటర్లు భారీగా సొమ్ము చేసుకొని ఉంటారని భావిస్తున్నారు. ఈ కంపెనీ 1985లోనే ఏర్పాటైనప్పటికీ 2006లో పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఒక్కో షేరుకు 185 రూపాయల రేటుతో షేర్లను ఆఫర్ చేశారు. ప్రమోటర్లను నమ్మి ఈ కంపెనీ షేర్లలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు పూర్తిగా చేతులు కాల్చుకున్నట్టే. ప్రమోటర్ పారిపోవడంతో బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ అంతా రాజీనామాల బాట పట్టారు. సిఎఫ్ఒ చంద్రకాంత్ కర్కరే రాజీనామా చేయడంతో ఇతర ఎగ్జిక్యూటివ్స్‌లోనూ భయం పట్టుకుంది. బోర్డు మీటింగ్ పెట్టాలన్నా నిర్వహించేవారు లేని పరిస్థితి ఏర్పడిందని బోర్డు సభ్యులు కృష్ణన్ వ్యాఖ్యానించారు.

ఖతర్నాక్ ఆద్మీ....

గీతాంజలి ప్రమోటర్ల కథలు నమ్మి 2005లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 100 ఎకరాల స్థలాన్ని జెమ్స్ అండ్ జువెలరీ సెజ్ ఏర్పాటు కోసం కేటాయించింది. ఇందులో ముడి వజ్రాల కటింగ్, పాలిషింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని గీతాంజలి ప్రమోటర్ చోక్సీ చెప్పారు. 100 కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని ప్రభుత్వం అప్పట్లో కారుచౌకగా 3.6 కోట్ల రూపాయలకే కేటాయిస్తే ఇదే స్థలాన్ని ఎల్‌ఐసికి 120 కోట్ల రూపాయలకు చోక్సీ తాకట్టు పెట్టారు. హైదరాబాద్ సెజ్‌లో తయారైన వజ్రాల విలువను కూడా నాలుగైదు రెట్లు ఎక్కువ చేసి చూపేవారని తెలిసింది. బాలెన్స్ షీట్‌ను పెంచి చూపించి బ్యాంకుల నుంచి భారీగా రుణ పరపతిని పొందేవారని తెలిసింది. హైదరాబాద్‌లో తరతరాలుగా వజ్రాలు, విలువైన రాళ్ల వ్యాపారంలో ఉన్న కుటుంబాలున్నాయి. వారంతా తొలినాళ్లలోనే చోక్సీని ఖతర్నాక్ మనిషిగా గుర్తించారని అంటున్నారు. హైదరాబాద్ ట్రేడర్స్‌లో ఎవరికీ చోక్సీపై సదభిప్రాయం లేదు. దిగుమతి చేసుకునే ముడి వజ్రాల ధర, ఎగుమతి చేసే వాల్యూయాడెడ్ వజ్రాల ధరలను కూడా ఇష్టానుసారంగా పెంచి చూపించేవాడని చెబుతున్నారు. ఇలా పెంచి చూపే రేట్లతో బ్యాంకులను భారీగా రుణాలను రాబట్టి వాటిని ఇతర సొంత వ్యాపారాల్లోకి మళ్లించేవాడని ఆరోపణలున్నాయి. సాధారణంగా ఎగుమతి దిగుమతుల రంగంలో ఓవర్ ఇన్వాయిసింగ్, అండర్ ఇన్వాయిసింగ్‌ను హవాలా దందా కోసం ఉపయోగిస్తుంటారు.

విజయ బ్యాంక్ ఇడిగా మురళి రామస్వామి



బెంగళూరు (ఆంధ్రజ్యోతి) : విజయ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మురళి రామస్వామి నియమితులయ్యారు. మంగళవారం నాడు బెంగళూరులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు విజయ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ఆర్ఎం శంకర నారాయణన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యలమంచిలి నాగేశ్వర రావు.. మొక్కను అందజేశారు. 1980లో మేనేజర్‌గా విజయ బ్యాంక్‌లో కెరీర్‌ను ప్రారంభించిన రామస్వామి దేశవ్యాప్తంగా వివిధ శాఖలు, ప్రాంతీయ విభాగాలలో పనిచేశారు. మురళి రామస్వామి ఇప్పటి వరకు బ్యాంక్ కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ (క్రెడిట్ విభాగం)గా బాధ్యతలు నిర్వర్తించారు.

సువెన్‌కు రెండు పేటెంట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : కేంద్ర నాడీ మండల వ్యాధుల చికిత్సలో వినియోగించే మాలిక్యూల్స్‌కు భారత్, దక్షిణ కొరియా నుంచి ప్రొడక్ట్ పేటెంట్‌ను అందుకున్నట్లు సువెన్ లైఫ్‌సైన్సెస్ వెల్లడించింది. ఈ పేటెంట్లు వరుసగా 2029,2033 వరకు చెల్లుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది. కేంద్ర నాడీ మండల వ్యాధుల చికిత్సలో వినియోగించే మాలిక్యూల్స్‌కు ఈ పేటెంట్లు లభించటం ఎంతో సంతోషాన్నిస్తోందని సువెన్ లైఫ్ సిఇఒ వెంకట్ జాస్తి తెలిపారు.

ఫెడ్‌మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లో చాట్‌బాట్

హైదరాబాద్ : ఫెడ్‌మొబైల్ బ్యాంకింగ్ అప్లికేషన్‌లో చాట్‌బాట్ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్‌ను ఫెడరల్ బ్యాంక్, నికీ.ఎఐ విడుదల చేశాయి. మొబైల్ రీచార్జ్‌లు, హోటల్ గదులు, బస్ టికెట్ రిజర్వేషన్, బిల్ పేమెంట్స్, క్యాబ్ బుకింగ్ వంటి సేవలను చాట్‌బాట్ ఫీచర్ ఆఫర్ చేస్తోంది. ఈ సేవలను మరింత సులభతరం చేసేందుకు గాను ఫెడరల్ బ్యాంక్.. ఆర్టిఫీషియల్ ఇంటలిజెంట్ బాట్ అయిన నికీ.ఎఐతో జట్టుకట్టింది. ఫెడ్‌మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లో వినియోగదారుడు తాను పొందదలుచుకున్న సేవలను టైప్ చేయగానే ఇంటెలిజెంట్ చాట్‌బాట్ ఆటోమేటిక్‌గా అన్నీ వివరాలను తీసుకుని యూజర్ కన్ఫర్మేషన్‌ను కోరుతుందని, దీన్ని కన్‌ఫర్మ్ చేయగానే వినియోగదారులు సేవలు సత్వరమే పూర్తవుతాయని ఫెడరల్ బ్యాంక్ తెలిపింది.

ముగింపు బలహీనం

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గా ప్రారంభమై సుదీర్ఘ కన్సాలిడేషన్ సాధించినా చివరిలో రియాక్షన్‌కు లోనై డే కనిష్ఠ స్థాయిలో మానసిక అవధి 10400 కన్నా దిగువన క్లోజయింది. ఇది మరింత బలహీనత సంకేతం. గత కొద్ది రోజులుగా ప్రస్తుత స్థాయిల్లో మద్దతు తీసుకుని కన్సాలిడేట్ అవుతున్నప్పటికీ ఎలాంటి బలాన్ని ప్రదర్శించలేకపోతోంది.

బుధవారం స్థాయిలివే...

నిరోధం : 10430

మద్దతు : 10300

- మరింత రికవరీ బాట పడితే మైనర్ ఇంట్రాడే నిరోధం 10430 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 10500.
- గత కొద్ది రోజుల్లో ఏర్పడిన బాటమ్, ప్రధాన మద్దతు స్థాయి 10300 కన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్ కొనసాగుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 10000.
- బ్యాంక్ నిఫ్టీ నిఫ్టీ కన్నా అధిక బలహీనతను ప్రదర్శించి 25000 కన్నా దిగువన క్లోజయింది.

■ వి.సుందర్ రాజా

ముగింపు మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : ఫాల్గుణ శుద్ధ షష్ఠి **నక్షత్రం :** అశ్విని, భరణి

రోహిణి, హస్త, శ్రవణ నక్షత్ర జాతకులు, వృషభ, కన్య రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10360.40 (-18.00)

ట్రెండ్ మార్పు వేళలు : 10.42; 12.44; 2.00

ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 10.05 నుంచి 2.05 వరకు నిస్తేజంగా ట్రేడవుతూ తదుపరి చివరి మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.15 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.15 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10400, 10435

మద్దతు స్థాయిలు : 10320, 10285

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.68	68.04
పౌండ్	81.99	95.11
యూరో	72.67	84.27
ఆస్ట్రేలియా డాలర్	46.39	53.68
బహ్రెయిన్ దినార్	158.92	185.11
కువైట్ దినార్	178.04	221.64
ఒమని రియాల్	155.62	178.04
సౌదీ రియాల్	15.60	18.50
సింగపూర్ దాలర్	44.62	52.85
యుఎఇ దిరమ్	15.97	18.67

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ADITYA SPIN. 8.2(8.07)189
AGRO TECH FO 626.7(632.7)462
AISHWARYA TE 6.37(6.7)13371
ALPHAGEO (I) 818.05(829.75)938
ALU FLUORIDE 112.95(110.7)12646
AMAR RAJA BA 807.3(802.85)12796
ANDHRA BANK 46.6(45.9)233456
ANDHRA CEMEN 11.05(11.15)20030
ANDHRA PETRO 56.95(59.35)80623
ANJANI PORTL 192.5(197.5)1181
ASTRA MICRO 95.55(101.75)178672
AUROB.PHARMA 574.1(583.85)94392
AVANTEL LTD 559.6(542.6)7493
AVANTI FEEDS 2315.3(2293.45)10361
B.N.RATHI SE 40.3(39.55)4059
BALAJI AMINE 662.2(632.35)18002
BAMBINO AGRO 243.65(236.15)8313
BARTRONICSIN 13.01(13.25)8945
BHAGIRA.CHEM 285.9(290.9)465
BHAGYA INL 43.75(43.85)12992
BHARATFIN 988.45(991.15)17908
BNR UDYOG 32.5(33)583
CAMBRIDGE 75.35(76.85)201
CCHHL 13.9(14)7576
CCL PRODUCTS 281.8(286.6)1739
CELESTIAL 18.05(18.3)7464
CIL SECURITS 30.9(29.3)501
COROM INTER 511.25(516.85)3742
CUBEX TUBING 22.25(23)1912
CYBERMATE 3.1(3.16)156343
CYIENT 612.95(610.9)3781
DANLAW TECH. 67.05(68.6)949
DECAN CEMENT 565.9(569.7)131
DHAN ROTO SP 51(48.6)50292
DIAMONPOWER 14.1(14.2)69198
DIVI'S LAB. 1013.1(1016.4)24055
DIVYA.GRANIT 99(100)102
DQ ENT 14.7(14.7)9930
DR.REDDY'S 2162.15(2151.85)21405
EMPEE SUGARS 4.21(4.42)11890
EVEREST ORG. 137.75(146)1221
FACOR ALLOYS 3.28(3.24)48226
FIRSTOBJ 13.85(14.45)8179
GATI LTD. 112.65(113.15)80507
GAYATRI BIO 9.95(9.71)2189
GAYATRI PROJ 215.95(217.15)27044
GENNEX LAB 4.44(4.45)80263
GMR INFRASTR 17.7(17.8)2100128
GODAVARI DRU 35(34.8)1801
GOLDST INFRA 192.3(190.55)27956
GOLDSTONE EN 13.5(13.85)6822
GRANULES (I) 116.25(115.15)65363
GVK POWERINF 17.45(18)922414
HBL P SYS 55.65(55.35)56321
HERITGFOOD 684.9(675.95)2166
I.C.S.A. IND 3.69(3.54)11697
IKF TECHNO .75(.76)421416
INCAP LTD. 93.95(95)1029
IPAPPM 314.9(314.1)8686
IVRCL LTD 4.49(4.48)131981
KAKATIYA CEM 293.4(292.05)14586
KALLAM SPG. 29.55(28.1)97428
KAVERI SEED 473.6(461.6)15803
KCP LTD 127.35(127.95)11532
KERNEX MICRO 43(43.45)580
KNR CONST 307.8(315.75)13985
KREBS BIOCHM 155.05(159)1448
LANCO INFRA 1.15(1.2)2950920
LOKESH MACH 65.25(64.85)4417
LOTUS CHOC 50(48.8)3379
MADHUCON PRJ 27.85(27.35)36240
MOLD-TEK TEC 60.85(60)2885
MOSCHIP SEMI 33.65(32.85)55182
MSR INDIA 43.6(44.2)3560
N C L IND. 233.9(236)16607
NACLIND 43.75(43.35)8076
NATCO PHARM 784.95(803.15)28372
NCC 123.75(124.7)334333
NEHA INTER. 7.75(7.25)10527
NETTLINX LTD 86.05(85.95)7248
NEULAND LAB. 717(707.85)3074
NIHAR INFO 14.5(14.15)462
NILE LTD. 832.1(851.5)3212
NTL 3.9(3.98)4330
OIL COUNTRY 42.55(43)2899
PADMALAYA TE 5(5)12688
PALRED 93.2(90.05)8279
PANYAM CEMEN 48.35(48.9)20428
PENNAR STEEL 61.75(61.75)54261
PFL INFOTECH 10.23(9.92)1185
PHYTOCHEM I. 64.95(63.6)3001
PITTI LAMIN. 92.55(91.65)25400
POKARNA LTD 211.95(207.45)1860
PRAJAY ENGS. 12.3(12.8)27363
PREMIER EXPL 392.6(391.85)214
PRISM CEMENT 122.95(118.25)112860
RAIN 376.65(391.75)625796
RAJ PACKAGIN 37.75(39)536
REG.CERAMIC 5.69(5.85)3635
RESTILE CER. 7(7.2)4060
SAGAR CEM. 972.5(978.2)89
SAMKRG PIST. 298.1(303.6)2212
SAMPRE NUTRI 56(54.95)1704
SANGHI IND. 113.55(110.8)15219
SATVAH.ISPAT 19.25(20.1)20262
SAVEN TECHNO 19.6(19.1)1865
SMPL 1.43(1.37)8750
SMS PHARMACE 90.3(90.75)1368
SREE RAYALA 170.75(171.6)1434
STEEL EXCH 31.1(32.25)24803
SUJANA INDUS .94(.98)201
SURANATP 5.43(5.3)590
SURYACHAKRA 1.26(1.23)50608
SURYAMBA SP 76.85(74.7)1
SURYAVA SPIN 6.39(6.7)429
SURYLAK.COTT 81.05(80.25)3342
SUVEN LIFE S 191.1(191.2)85797
TAJ GVK HOTL 163.5(164.95)15654
TANLA 30.7(31.1)41559
TRANSCORP IN 33.1(34.25)6688
TRANSGENE BI 2.23(2.24)1201
TRANSPORT CO 280.3(278.7)1864
USHER AGRO 6.54(6.65)9608
VICEROY HOTE 15.85(15.9)39320
VIJAY TEXTIL 51.25(53.7)902
VIMTA LABS 204.55(204.2)7291
VIRAT CRANE 52.5(54.85)2450
VIRINCHI 117.2(115.95)39811
VISAKA IND. 670.55(675.6)11015
VISTA PHARMA 42.3(40.8)39508
VIVIMED LABS 79.6(81.5)67554
VST INDUS. 3300(3270.05)184
WATERBASE 313.8(323)162296
XLENERGY 3.05(2.91)8044
YBRANTDIGI 5.41(5.47)122208
ZEN TECH 118.35(115.35)20064
ZENOTECH 45.45(44.35)16125

అవిశ్వాసానికి అందరూ మద్దతివ్వాలి

- చాలా పార్టీలు సిద్ధమే.. బీజేపీలో మోదీ వ్యతిరేక వర్గం
- అది కూడా మద్దతిస్తే.. ప్రభుత్వం కుప్పకూలొచ్చు
- రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు వైసీపీ హాజరవ్వాలి: ఉండవల్లి



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):'విభజన హామీలు సాధించుకోవడానికి కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టడం అవసరం. సెలబ్రిటీ పవన్ కల్యాణ్ పిలుపునకు వైసీపీ అధ్యక్షుడు జగన్ స్పందించారు. ఇది మంచి పరిణామం. టీడీపీ కూడా ముందుకు రావాలి. ఇదే ఆఖరి అస్త్రం. మరో 6 నెలల్లో ఎన్నికలొచ్చే అవకాశముంది' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అవిశ్వాసానికి మద్దతివ్వడానికి అనేక పార్టీలు సిద్ధంగా ఉన్నాయి. బీజేపీలో కూడా మోదీ వ్యతిరేక వర్గం ఉంది. ఆ వర్గం కూడా మద్దతు ఇవ్వొచ్చు. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వం కూలిపోయే అవకాశం ఉంది. అవసరమైతే నేనే అవిశ్వాస తీర్మానం పెట్టించగలను. నాకు అన్ని పార్టీల్లోనూ చాలా మంది మిత్రులున్నారు. కానీ వాళ్లు పెడితే దేశంలోని అన్ని అంశాలు.. జీఎస్టీ, నోట్ల రద్దు, బ్యాంకు కుంభకోణాలు, తదితర అంశాలన్నీ చర్చకు వస్తాయి. అప్పుడు ఏపీ విభజనకు ప్రాధాన్యం ఉండదు. ఏపీకి చెందిన ఏదో ఒక పార్టీ అవిశ్వాస తీర్మానం పెడితేనే ఈ అంశానికి ప్రాధాన్యం ఉంటుంది. వైసీపీ ప్రవేశపెట్టడానికి ముందుకొచ్చింది. తెలుగుదేశం వైఖరి స్పష్టంగా లేదు. వాళ్లు వైసీపీకి మద్దతిస్తే బాగుంటుంది' అని ఆయన తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు వైసీపీ హాజరవ్వాలని సూచించారు. బాబు చెప్పినట్లు పవన్ కల్యాణ్ ఆడుతున్నారంటే తాను నమ్మనని చెప్పారు.

8న పార్లమెంటు ముట్టడి: రఘువీరా



కర్నూలు/కడప, ఫిబ్రవరి 20:ప్రాణాలను పణంగా పెట్టయినా రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధిస్తామని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు, కడప ఆర్డీవో కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ చేపట్టిన ఆత్మ గౌరవ దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రం తమకు భిక్ష వేయడం లేదని, ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు అని స్పష్టం చేశారు. తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ 2019లో తప్పనిసరిగా ప్రధాని అవుతారని, మొదటి సంతకం ప్రత్యేక హోదాపైనే ఉంటుందని చెప్పారు. మార్చి 6, 7న ఢిల్లీలో దీక్షలు చేపడతామని, 8న పార్లమెంటును ముట్టడిస్తామన్నారు.

అవిశ్వాసం పెడతాం కానీ..: పళ్లంరాజు



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర విభజన హామీల అమలుకు లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సుముఖంగా ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి .పళ్లంరాజు విజయవాడలో చెప్పారు. అయితే మొదట.. ఓటింగ్‌కు అవకాశమున్న 184వ నిబంధన కింద చర్చకు నోటీసిస్తామన్నారు. దీనివల్ల రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాయంపై చర్చించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. ఒకసారి అవిశ్వాసం వీగిపోతే ఆరు నెలలదాకా విభజన హామీల అమలుపై పార్లమెంటులో ప్రస్తావించే ఆస్కారమే ఉండదని చెప్పారు.

డ్రామాలాడితే మిగిలేది వెంట్రుక, బోడిగుండే

- హోదాపై అఖిలపక్షానికైతేనే వస్తాం :నారాయణ



తిరుపతి, ఫిబ్రవరి 20: రాష్ట్ర ప్రయోజనాలపై డ్రామాలాడితే బీజేపీ, టీడీపీలకు మిగిలేది వెంట్రుక, బోడిగుండేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీల అమలుకు అవసరమైతే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అయితే ముందుగా ఎజెండాను నిర్ణయించాలని.. ప్రత్యేకహోదా కోసమైతేనే ఆ భేటీకి వస్తామని.. ప్యాకేజీలాంటి భిక్షాటనకైతే అఖిలపక్షంతో కలవలేమని స్పష్టం చేశారు. దూరదృష్టి ఉన్న చంద్రబాబు తెలుగు ప్రజలకు అన్యాయం చేశారని విమర్శించారు.

తక్షణమే అఖిలపక్షం: రామకృష్ణ



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు తీరు, కేంద్ర బడ్జెట్‌లో కేంద్రం ఆంధ్రకు చేసిన అన్యాయంపై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలను, ఉద్యమ సంఘాలను అఖిలపక్షానికి ఆహ్వానించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. అందరినీ కలుపుకొని ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని అందులో పిలుపిచ్చారు.

నిజ నిర్ధారణలతో ఏమీ సాధించలేం: కొణతాల



నర్సీపట్నం, ఫిబ్రవరి 20: కేవలం నిజనిర్ధారణల వల్ల ఉపయోగం ఉండదన్న విషయం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గుర్తించాలని మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ అన్నారు. మేధోమథనంతో పాటు ప్రజల మద్దతు కూడగట్టేందుకు ప్రత్యక్ష కార్యాచరణ అవసరమని చెప్పారు. మంగళవారం విశాఖ ఏజెన్సీలోని గూడెంకొత్తవీధిలో జనఘోష కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గణాంకాలు, నివేదికలు తీసుకున్న తర్వాత పవన్ ఏం చేస్తారో చెప్పాలన్నారు. హైదరాబాద్‌లో ఆయన నిర్వహించిన సమావేశానికి తాను ఒకేరోజు హాజరయ్యానని, అయితే ద్విముఖ వ్యూహం ఉంటే తప్ప ఆయన సాధించేదేమీ ఉండబోదని తెలిపారు. ఆ భేటీకి టీడీపీ, వైసీపీలను కూడా ఆహ్వానించి ఉంటే బాగుండేదన్నారు. ఇక ముందు హైదరాబాద్‌లో కాకుండా నవ్యాంధ్రలోనే సమావేశాలను నిర్వహించాలని సూచించారు.

వెనక్కి వస్తే తీసుకుంటాం: విజయసాయి



హైదరాబాద్/గుంటూరు,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీని వీడి టీడీపీలోకి వెళ్లిన కొందరు ఎమ్మెల్యేలను వెనక్కి తీసుకుంటామని ఆ పార్టీ రాజ్యసభసభ్యుడు విజయసాయిరెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మంగళవారం ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. టీడీపీలోకి వెళ్లిన వైసీపీ ఎమ్మెల్యేల్లో కొందరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డికి నైతిక విలువలు ఉన్నాయని..అందుకే టీడీపీ శాసనసభ్యులను వైసీపీలోకి తీసుకోబోమని చెప్పారు. టీడీపీ ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి వస్తే ఆహ్వానిస్తామన్నారు. కాగా, ప్రత్యేకహోదా సాధించుకునేందుకు ఇదే సరైన సమయమని వైసీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. వైసీపీ బీసీ అధ్యయన కమిటీ చైర్మన్ జంగా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి హాజరైన బొత్స మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్ర ముగిశాక జగన్మోహన్‌రెడ్డి బీసీల అభ్యున్నతి కోసం బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారని తెలిపారు.

నేడు రాష్ట్ర కేబినెట్ భేటీ

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాపు రిజర్వేషన్లు, పోలవరం ప్రాజెక్టు, విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సు ప్రధాన చర్చనీయాంశాలుగా బుధవారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశమవుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో ఈ భేటీ జరుగనుంది. కాపు రిజర్వేషన్ల విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేసే అవకాశాలున్నాయి. అదనపు ఉద్యోగాల కల్పనకు అనుమతి, పలు భూకేటాయింపులపైనా నిర్ణయం తీసుకోనుంది.

కేంద్రం పైసా పని చేయలేదు

శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి

- విద్యా సంస్థలకు 2,420 ఎకరాలిచ్చాం
- రాష్ట్రమే 3 వేల కోట్లు ఖర్చుపెట్టింది
- మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర విభజన తర్వాత కేంద్రం నవ్యాంధ్రకు ఏడు విద్యా సంస్థలను మంజూరు చేసింది. అందులో ఐదు ప్రారంభమయ్యాయి. ఈ ఐదూ విశ్వవిద్యాలయాల్లో, ప్రైవేటు ప్రాంగణాల్లో నడుస్తున్నాయి. రాష్ట్రప్రభుత్వం వీటికి వేల ఎకరాల భూములు కేటాయించింది. ఆయా విద్యాసంస్థల నిర్మాణానికి కేంద్రం ఒక్క పైసా పని కూడా చేయలేదు. అక్కడ వేసిన శిలాఫలకాలు ఇవాళ వెక్కిరిస్తున్నాయి. కేంద్రీయ, గిరిజన విశ్వవిద్యాలయాలను ఇంకా మంజూరు చేయలేదు. కానీ ఎన్నో విద్యా సంస్థలు రాష్ట్రానికి ఇచ్చినట్లు మిత్రపక్షమైన బీజేపీ తప్పుడు లెక్కలు చెబుతోంది' అని రాష్ట్ర మానవవనరుల మంత్రి గంటా శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర విద్యా సంస్థలకు రూ.9,136 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.700 కోట్లు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రం కేంద్ర సంస్థల కోసం కేటాయించిన భూముల్లో మంచినీరు, విద్యుత్, మౌలిక వసతుల కల్పనకు రూ.3 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలు సాధించడానికి అన్ని పార్టీలు ఉమ్మడిగా పోరాడాలని, అవిశ్వాస తీర్మానం అనేది ఆఖరి అస్త్రమేనని గంటా స్పష్టం చేశారు.

ఎందుకివ్వరు?



ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాలులో జరిగిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం

(మొదటి పేజీ తరువాయి)

హోదా పొడిగించబోతున్నారని సమాచారం వస్తోంది. దేనికి పొడిగించినా ఆ హోదా మనకూ ఇవ్వాల్సిందే! పేరు ఏదైనా పెట్టుకోండి! హోదా వల్ల వచ్చే ప్రతి ప్రయోజనం మాత్రం రాష్ట్రానికి వచ్చి తీరాలి. అది మన హక్కు. దానిని వదులుకొనేది లేదు. దాని కోసం పోరాటం కొనసాగుతుంది' అని ప్రకటించారు. హోదా విషయంలో టీడీపీ ఏనాడూ రాజీ పడలేదని, ఏదో రూపంలో ఆ ప్రయోజనాలు సాధించుకోవడానికి గట్టి ప్రయత్నం చేశామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ నేతలను ఆదేశించారు.

వైసీపీది రోజుకో డ్రామా

వైసీపీ రోజుకో డ్రామా ఆడటం తప్ప, రాష్ట్రం కోసం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని చంద్రబాబు విమర్శించారు. "మొదట ఎంపీల రాజీనామాలన్నారు. ఉప ఎన్నికలు రావనే రాజీనామా డ్రామాలు ఆడుతున్నారనే విమర్శలు రావడంతో ప్లేటు మార్చి అవిశ్వాసం అన్నారు. అవిశ్వాసం ఆఖరి అస్త్రమని... దానికి మనం కూడా సిద్ధమని అనడంతో దానిపైనా వెనక్కు తగ్గి మీరే పెట్టండని తప్పించుకోవాలని చూస్తోంది" అని విమర్శించారు. విభజన చట్టం అమలు తీరుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది అఖిలపక్ష సమావేశం కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇది ఉద్యమ నేతల సమావేశమని తెలిపారు. "వైసీపీ అసలు అసెంబ్లీ సమావేశాలకే రావడం లేదు. ఆ పార్టీకి ప్రజా సమస్యలు పట్టడం లేదు. అందుకే రాష్ట్రానికి న్యాయం జరగాలని ఉద్యమిస్తున్న పార్టీలు, సంస్థలు, వ్యక్తులు అందరినీ పిలిచి వారితో మాట్లాడాలని, వారి ద్వారా ప్రజాభిప్రాయం తెలుసుకోవాలని అనుకొంటున్నాం" అని ఆయన వివరించారు.

జనంలో ఆవేదన

కాంగ్రెస్, బీజేపీల వైఖరిపై రాష్ట్ర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చంద్రబాబు తెలిపారు. "రాష్ట్రానికి చేయాల్సిన సాయం గురించి సూటిగా చెప్పకుండా వీలైతే చేయాలన్నట్లుగా కాంగ్రెస్ విభజన చట్టం రూపొందించింది. అలా వాళ్లు అలా రాశారు కాబట్టి మేం చేయలేకపోతున్నామని బీజేపీ నేతలు అంటున్నారు. మా తప్పులు మీరు సరిదిద్దండి... మేం మద్దతిస్తామని ఇప్పుడు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ అంటున్నారు. ఒకరిపై ఒకరు నెట్టుకోవడమేనా రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నది?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని బీజేపీ నేతలు తమ కేంద్ర నాయకత్వాన్ని ప్రశ్నించకుండా ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే రాష్ట్రానికి న్యాయం జరగదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. "అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఇచ్చింది. విభజనలో నష్టపోయిన ఏపీకి ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. ఆ విషయాలను వారు కేంద్రం వద్ద మాట్లాడాలి. గతంలో ఎన్డీయే సర్కారు మనపై ఆధారపడి ఉండేది. ఇప్పుడు పూర్తి మెజారిటీ ఉన్నందునే మన ఒత్తిడి పని చేయడం లేదు. ఈ విషయం ప్రజలకు కూడా అర్థమవుతోంది" అని అన్నారు.

సాయం అందకపోయినా...

విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సినంత సాయం అందకపోయినా... ఈ మూడున్నరేళ్లలో చాలా చేయగలిగామని చంద్రబాబు చెప్పారు. 'రాజస్థాన్‌లో ఇప్పుడు రూ.50 వేల రుణ మాఫీ ప్రకటించారు. మనం ఆర్బీఐ సహకరించకున్నా లక్షన్నర మాఫీ చేశాం. రైతులకు, డ్వాక్రా మహిళలకు కలిపి రూ. 34 వేల కోట్ల సాయం చేస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత సాయం ఇవ్వలేదు. 56 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాను ఆదుకొన్నాం. రాయలసీమకు నీరిచ్చాం. అనంతపురం వరకూ నీరివ్వడం వల్లే కియ కార్ల ఫ్యాక్టరీ వచ్చింది. గోదావరి జలాలను అటు ఉత్తరాంధ్రకూ తీసుకువెళ్తున్నాం. తిరుపతిని హార్డ్‌వేర్ హబ్‌గా, విశాఖను ఐటీ హబ్‌గా, అమరావతిని ఆటోమొబైల్ హబ్‌గా చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్‌గా నిలిపాం" అని ఆయన పేర్కొన్నారు.



హామీలపై రాజీలేదు

23నాటి సమావేశంపై సీఎం సమీక్ష

రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన సాయం విషయంలో అవలంబిస్తున్న వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 23న ఢిల్లీలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్, నలుగురైదుగురు కార్యదర్శులు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఈ అంశంపై సమీక్షించారు. రాష్ట్రానికి రావాల్సిన సాయం విషయంలో ప్రతి అంశం గురించి గట్టిగా అడగాలని సూచించారు. మరోవైపు... కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వచ్చేనెల 3వ తేదీలోగా విశాఖపట్నం వచ్చే అవకాశముందని తెలుస్తోంది. రాష్ట్రానికి సహాయంపై ఆయన కీలక ప్రకటనలు చేస్తారని... ఆ తర్వాత మొత్తం పరిస్థితి చల్లారుతుందని బీజేపీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

'ఆఖరి అస్త్రం' ఎందుకంటే...

అవిశ్వాస తీర్మానం వల్ల వెంటనే ఏ ఫలితం రాదని, అందుకే దానిని ఆఖరి అస్త్రంగా వాడుకోవాలని అనుకొంటున్నామని చంద్రబాబు తెలిపారు. 'అవిశ్వాస తీర్మానం ప్రతిపాదన వల్ల పార్లమెంటులో చర్చ జరుగుతుంది. అంతవరకే ఫలితం. మళ్లీ ఆరు నెలల వరకూ ఆ అంశాన్ని లేవనెత్తలేం. రాజీనామాలు చేసి బయటకు వచ్చేసినా కేంద్రం ఊపిరి పీల్చుకొంటుంది. పార్లమెంటు జరిగినన్ని రోజులూ కేంద్రంపై ఒత్తిడి ఉండాలన్నది మన ఆలోచన. టీడీపీ ఎంపీల ఆందోళన వల్ల చర్చ జరుగుతోంది. కేంద్రంపై ఒత్తిడి ఏర్పడుతోంది. ఈ విషయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి" అని సూచించారు.

ఒక్కరున్నా చాలు.. దమ్ముంటే పెట్టండి

- అవిశ్వాసంపై జగన్‌కు సోమిరెడ్డి సవాల్
- పాదయాత్ర పేరుతో జగన్నాటకం: జవహర్
- ప్రజా విశ్వాసం కోల్పోయి మాటలా?: రాజప్ప

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



రెండేళ్ల నుంచి రాజీనామాల డ్రామా ఆడుతున్న జగన్... ఇప్పుడు అవిశ్వాసం అంటూ మరో కొత్తనాటకానికి తెర తీశారని రాష్ట్ర మంత్రులు ఎద్దేవా చేశారు. 'పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ఒక ఎంపీ చాలు. జగన్‌కు దమ్ము, ధైర్యం ఉంటే కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలి' అని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సవాల్ చేశారు. మంగళవారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. అవిశ్వాస తీర్మానానికి టీడీపీ సహకరించాలని జగన్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన తమకు ఏమైనా మిత్రపక్షమా..? అని నిలదీశారు. కాగా, పాదయాత్ర పేరుతో జగన్... జగన్నాటకం ఆడుతూ తన నైజాన్ని చాటుకుంటున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి కేఎస్ జవహర్ విమర్శించారు. ఏలూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్ రోజుకోమాట, పూటకో తీర్మానం చేస్తున్నారని మండిపడ్డారు. అవిశ్వాస తీర్మానం వల్ల ప్రయోజనం ఉంటుందో లేదో జగన్ ఆలోచన చేసినట్లు లేదన్నారు. ఎంపీలతో రాజీనామా చేయిస్తానని చెప్పిన వైసీపీ ఇప్పుడు అవిశ్వాసం పెడదామని అనడం ఆ పార్టీ దివాలాకోరుతనానికి నిదర్శనమని హోంమంత్రి చినరాజప్ప అన్నారు. శృంగవరపుకోటలో మీడియాతో మాట్లాడుతూ... ప్రజల విశ్వాసాన్ని వైసీపీ ఎప్పుడో కోల్పోయిందన్నారు. రాజకీయాల కన్నా రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మంగళగిరిలో మీడియాతో అన్నారు. కేంద్రంపై అవిశ్వాసం పెట్టినా ప్రభుత్వం పడిపోయే పరిస్థితి లేదన్నారు. ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకునే ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని ఆయన అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్సీ బాబూ రాజేంద్రప్రసాద్ అన్నారు. విశాఖలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏ స్థాయి పోరాటానికైనా సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. గుజరాత్‌లో ఓ సమావేశ మందిరానికి రూ.1600 కోట్లు కేటాయించారని, మరి ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం కేవలం రూ.1500 కోట్లతో ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.



రైతు సదస్సులో మాట్లాడుతున్న జగన్

రైతులకు వడ్డీ లేని రుణం

- బోర్లు ఉచితంగా వేయిస్తాం
- వేసిన పంటలకు భరోసాగా
- 3వేలకోట్లతో స్థిరీకరణ నిధి
- ప్రకాశంజిల్లా పాదయాత్రలో జగన్

కందుకూరు, ఫిబ్రవరి 20: "మేం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతన్నలను అన్నివిధాలుగా ఆదుకుంటాం. వడ్డీ లేని రుణాలతో పాటు, పెట్టుబడి ప్రోత్సాహక నగదును కూడా అందజేస్తాం" అని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన రెడ్డి హామీ ఇచ్చారు. ప్రకాశం జిల్లాలో మంగళవారం ప్రజాసంకల్పయాత్రలో భాగంగా పొన్నలూరు మండలం మాలపాడు సమీపంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన పాల్గొన్నారు. "రైతులు పంటలు పండించేందుకు ప్రోత్సాహం అందిస్తాం. పంట ఉత్పత్తుల ధరలను ముందుగానే ప్రకటించి అమలు చేస్తాం. దీనికోసం రూ.3వేల కోట్లతో స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తాం. పగటి పూట 9 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇవ్వటంతోపాటు మే నెలలో ప్రతి రైతుకీ రూ. 12,500 చొప్పున పెట్టుబడి కింద అందజేస్తాం" అని వివరించారు. బోర్ల కోసం లక్షల్లో ఖర్చుచేసి రైతులు అప్పులపాలవుతున్నారన్న ఆయన, తాము అధికారంలోకిరాగానే, ఆ బాధ్యతను ప్రభుత్వమే తీసుకొనేలా చర్యలు తీసుకొంటామన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకు లాభాలలో ఉన్న ప్రకాశం జిల్లా సహకార డెయిరీ, ఈ నాలుగేళ్లలో 80 కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయిందని జగన్ విమర్శించారు. తాము ప్రభుత్వంలోకి రాగానే, సహకార డెయిరీకి పాలుపోసే పాడి రైతులకు లీటరుకు రూ.4ను ప్రోత్సాహంగా అందిస్తామని చెప్పారు.

చింతమనేనిపై అనర్హత వేటు వేయండి

- కోర్టు ఆయన్ను దోషిగా తేల్చింది.. అసెంబ్లీ కార్యదర్శికి వైసీపీ వినతి



అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై అనర్హత వేటు వేయాలని వైసీపీ ఎమ్మెల్యేలు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆదిమూలపు సురేశ్ డిమాండ్ చేశారు. వారు మంగళవారమిక్కడ శాసనసభ కార్యదర్శి విజయరాజును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. తర్వాత బుగ్గన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ గన్‌మెన్‌పై దాడి చేసిన కేసులో చింతమనేనిని భీమడోలు కోర్టు దోషిగా తేల్చిందని.. అందుచేత ఆయన్ను ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. అనర్హత వేటుకు సంబంధించి అన్ని ఆధారాలను, కోర్టు తీర్పు ప్రతులను కార్యదర్శికి అందజేశామన్నారు. స్పీకర్ కోడెల శివప్రసాదరావుకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. స్పీకర్ ఈ విషయంలోనైనా తక్షణమే నిర్ణయం తీసుకుని.. చింతమనేనిపై చర్యలు చేపట్టి రాజ్యాంగ నియమాలను కాపాడాలన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వైసీపీ ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని సురేశ్ విమర్శించారు. ఈ అంశంపై వారం రోజుల్లో నిర్ణయం తీసుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. అసెంబ్లీ కార్యదర్శిని కలిసినవారిలో వైసీపీ ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్, దెందులూరు వైసీపీ ఇన్‌చార్జి కొఠారు రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

వేటు స్పీకర్ చేతిలో.. నిషేధం ఈసీది

మాజీ మంత్రి వట్టి వసంతకుమార్‌పై 2011లో చేయిచేసుకున్నారన్న అభియోగాలపై టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. రెండేళ్లు, అంతకుమించిన శిక్షపడిన ప్రజాప్రతినిధులు తమ చట్టసభల సభ్యత్వాలను కోల్పోతారని.. శిక్షాకాలంలో ఎన్నికల్లో పోటీకి అనర్హులని.. శిక్ష అనుభవించి విడుదలైన ఆరేళ్ల వరకు కూడా వారు పోటీచేయకుండా నిషేధిస్తూ సుప్రీంకోర్టు గతంలో కీలక తీర్పు వెలువరించింది. చింతమనేని హైకోర్టుకు అప్పీల్ చేసుకుంటే.. హైకోర్టు స్టే ఇవ్వడమో లేక.. శిక్షను రద్దుచేసి.. కేసు పునర్విచారణకు ఆదేశిస్తేనే ఆయనపై వేటు తప్పుతుంది. అప్పీల్‌కు భీమడోలు కోర్టు ఆయనకు నెల రోజుల గడువిచ్చింది. కాగా.. శాసనసభ్యత్వం రద్దు నిర్ణయం స్పీకర్ తీసుకోవలసి ఉంటుంది. ఆయన మళ్లీ పోటీచేయకుండా నిషేధించే ఆదేశాలను ఎన్నికల కమిషన్ జారీచేస్తుంది.

రాజకీయ కోర్కెలు నెరవేరకే..

బాబు రాద్ధాంతం

- విపక్షాలతో మాటలా?.. ఓడిపోయినవారే ఇలా చేస్తారు
- హామీలు నెరవేర్చడానికి 2022 దాకా గడువుంది: సోము



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20: ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. రాజకీయ కోరికలు నెరవేరకపోవడం వల్లే ఇప్పుడు రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన బీజేపీ మహిళా మోర్చా సమావేశంలో వీర్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విభజన హామీల్లో కేంద్రం 85 శాతం నెరవేర్చిందని.. ఇంకా 15 శాతమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. హామీలను నెరవేర్చడానికి 2022 వరకు సమయం ఉండగా.. మిత్రపక్షమైన టీడీపీ ప్రతిపక్షాలతో కలిసి ప్రధాని మోదీని నిలువరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. విభజన హామీల అమలుపై ప్రతిపక్షాలను పిలిచి మాట్లాడతానని ఆయన చెబుతున్నారని..ఎవరైనా ఓటమిని అంగీకరించినప్పుడే ఇలా చేస్తారని చెప్పారు. రాష్ట్ర విభజనలో అందరి పాత్ర ఉందని, టీడీపీ పాత్ర మరింత ఎక్కువగా ఉందని తెలిపారు. రాష్ట్ర విభజనపై చంద్రబాబు నాలుగు రకాలుగా మాటలు మార్చారన్నారు. విభజనకు అంగీకరిస్తూ ప్రణబ్ ముఖర్జీకి ఆయన ఉత్తరం రాశారన్నారు.

పార్టీని వెంట్రుకతో పోల్చుతారా?

- మాణిక్యాలరావుది అవగాహనరాహిత్యం
- చంద్రబాబు అనుభవజ్ఞుడు: ఎమ్మెల్యే ఆకుల



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర బీజేపీని వెంట్రుకతో పోల్చడం దేవదాయ మంత్రి మాణిక్యాలరావు అవగాహనారాహిత్యానికి నిదర్శనమని ఆ పార్టీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ తప్పుబట్టారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో అధికారం, ఏపీలో 40 లక్షల సభ్యత్వం కలిగిన పార్టీని..సొంత పార్టీ మంత్రే అలా పోల్చడం ఏ మాత్రం సరికాదన్నారు. కాంగ్రెస్, వైసీపీ, కమ్యూనిస్టులు వేస్తున్న అవిశ్వాస తీర్మానం ఎత్తుగడలో అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబు పడతారని అనుకోవడం లేదని చెప్పారు. తమ పార్టీలో కొందరు నమ్మక ద్రోహులు ఉండొచ్చుని, రాష్ట్రంలో మిత్రుల మధ్య ఏర్పడిన తాత్కాలిక అంతరం త్వరలో పూడుతుందన్న విశ్వాసాన్ని ఆకుల వ్యక్తం చేశారు.

హోదాతో ఒరిగేదేమీ లేదు: ఎంపీ గీత



పాడేరు రూరల్: రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తే ప్రజలకు ఒరిగేదేమీ ఉండదని అరకు ఎంపీ కొత్తపల్లి గీత అన్నారు. మంగళవారం పాడేరులో బీజేపీ స్థానిక నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ప్రత్యేక హోదా పొందిన తొమ్మిది రాష్ట్రాల్లో ఎటువంటి అభివృద్ధి లేదన్నారు. కేంద్రం బడ్జెట్‌లో రైల్వేజోన్ ప్రకటించకపోవడానికి రాష్ట్రానికి చెందిన నాయకులే కారణమని ఆరోపించారు. విశాఖ కాకుండా విజయవాడ కేంద్రంగా జోన్ ఏర్పాటుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి చెందిన 25 మంది ఎంపీలు రాజీనామా చేసినా కేంద్రానికి నష్టం ఉండదని చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత పదేళ్ల వరకు హైదరాబాద్‌లో ఉండే అవకాశమున్నా.. సీఎం చంద్రబాబు స్వార్థం కోసం అమరావతికి వచ్చారన్నారు. అక్కడ ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

గవర్నమెంట్ జాబ్స్

ఎయిర్ ఇండియా

ఎయిర్ ఇండియా లిమిటెడ్ (ఏఐఎల్) నుంచి భారీ నోటిఫికేషన్ వెలువడింది. నార్తరన్ & వెస్టరన్ రీజియన్లలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన క్యాబిన్ క్రూ పోస్టుల భర్తీకి అవివాహితుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. దీనికి సంబంధించిన వివరాలను చూద్దాం...

ఖాళీలు 500

- **ఖాళీల వివరాలు:** రెండు రీజియన్లలో కలిపి మొత్తం 500 ఖాళీలు ఉన్నాయి.
- నార్తరన్ రీజియన్ - ఢిల్లీలో 450, వెస్టరన్ రీజియన్ - ముంబైలో 50 పోస్టులు ఉన్నాయి. ఢిల్లీలో పురుషులకు 150, మహిళలకు 300 పోస్టులను కేటాయించారు. ముంబైలో పురుషులకు 13, మహిళలకు 37 పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **వయసు:** అభ్యర్థులు దరఖాస్తు నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు వర్తిస్తుంది.
- **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు దరఖాస్తు నాటికి ఎయిర్ బస్ లేదా బోయింగ్ ఫ్యామిలీ ఎయిర్ క్రాఫ్ట్‌లో క్యాబిన్ క్రూగా ఏడాది అనుభవంతోపాటు వ్యాలిడ్ ఎస్ఇపి ఉండాలి. మహిళలు 160 సెంమీ ఎత్తు, పురుషులు 172 సెంమీ ఎత్తు ఉండాలి. బాడీ మాస్ ఇండెక్స్ మహిళలకు 18 నుంచి 22 మధ్య, పురుషులకు 18 నుంచి 25 మధ్య ఉండాలి. అభ్యర్థులందరికీ హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రావీణ్యం తప్పనిసరి.
- **ఎంపిక:** అభ్యర్థులకు ముందుగా మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారికి రాత పరీక్ష ఉంటుంది. ఎత్తు, బిఎంఐకు సంబంధించి నిర్దేశించిన మేర కొలతలు లేని అభ్యర్థులను రాత పరీక్షకు అనుమతించరు.
- **ట్రైనింగ్:** రాత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు ఎయిర్ ఇండియా నిర్ణయం మేరకు ట్రైనింగ్ ఉంటుంది. ట్రైనింగ్ సమయంలో అభ్యర్థులకు నెలకు రూ.15,000 స్టయిపెండ్ ఇస్తారు.
- **వేతనం:** ట్రైనింగ్ పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు క్యాబిన్ క్రూ పోస్టింగ్ ఇస్తారు. పోస్టింగ్ ఇచ్చిన తరవాత మొదటి ఏడాది నెలకు రూ.18,400 వేతనం ఇస్తారు. దీనితోపాటు 70 గంటల ఫ్లయింగ్ అలవెన్స్ కింద రూ.21,125; ఇంటర్నేషనల్ లేఓవర్ అలవెన్స్ కింద 100 యుఎస్ డాలర్లు ఇస్తారు. ఇంటర్నేషనల్ క్యుటిఏ కింద రూ.3,000; డొమెస్టిక్ స్టాపోవర్ కింద రూ.500; స్టాండ్ బై అలవెన్స్ కింద రూ.300 చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

కాంట్రాక్ట్ వ్యవధి: అయిదేళ్లు
రాత పరీక్ష: మార్చి 18న
దరఖాస్తు ఫీజు: రూ.1000(ఎస్సీ/ ఎస్టీలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 12
వెబ్‌సైట్: www.airindia.in

సీజీహెచ్‌ఎస్‌లో మెడికల్ అటెండెంట్లు

ఖాళీలు 128

పుణెలోని సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్)- మెడికల్ అటెండెంట్ల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టులవారీ ఖాళీలు: మెడికల్ అటెండెంట్స్ 77, లేడీ మెడికల్ అటెండెంట్స్ 51
- అర్హత: పదోతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ పొంది ఉండాలి.
- వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
- ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు ఫీజు: రూ.200
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 3
- వెబ్‌సైట్: cghsrecruitment.mahaonline.gov.in

హెచ్‌ఎంటిలో అసోసియేట్లు

ఖాళీలు 11

హెచ్‌ఎంటి మెషిన్ టూల్స్ లిమిటెడ్- కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలవారీ ఖాళీలు: డిప్లొమా (మెకానికల్) 3, ఐటిఐ (మెకానికల్) 6, ఐటిఐ (ఎలక్ట్రికల్) 1, హెల్పర్ 1
- కాంట్రాక్ట్ వ్యవధి : ఏడాది
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో డిప్లొమా / ఐటిఐ / 50 శాతం మార్కులతో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏరోస్పేస్ గ్రేడ్ ఫ్లూయిడ్ కంట్రోల్ కాంపోనెంట్స్‌కు సంబంధించి అసెంబ్లీ & టెస్టింగ్‌లో ఏడాది అనుభవం ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 24
- వెబ్‌సైట్: www.hmtindia.com

ఎన్ఐఆర్‌డీపీఆర్

ఖాళీలు 13

- కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
- పోస్టులు: పిఎంఏ హెడ్ 1, డిప్యూటీ పిఎంఏ హెడ్ 3, థీమాటిక్ ఎక్స్‌పర్ట్(స్ట్రాటజీ డెవలప్‌మెంట్ 1, సోషల్ బ్రాండ్ మేనేజ్‌మెంట్ 1, ఐఇసి& ఐసిటి 1, కెపాసిటీ బిల్డింగ్ 1, రీసెర్చ్ & పాలసీ 1, ఫైనాన్స్ 1, స్టాండర్డ్స్ అండ్ క్వాలిటీ అస్యూరెన్స్ 1, ప్రొక్యూర్‌మెంట్ 1, డేటా అనాలిసిస్ 1, అసెస్‌మెంట్ అండ్ సర్టిఫికేషన్ 1, ఎంఐఎస్ 1)
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 6
- వెబ్‌సైట్: www.nird.org.in, www.ddugky.gov.in

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్

ఖాళీలు 201

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్)- వివిధ రిఫైనరీ యూనిట్లలో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- పోస్టుల వారీ ఖాళీలు: జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ 181, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్ 10, జూనియర్ మెటీరియల్స్ అసిస్టెంట్ 9, జూనియర్ నర్సింగ్ అసిస్టెంట్ 1
- రిఫైనరీ యూనిట్లు: గువహటి, గుజరాత్, హల్దియా, బొంగైగావ్, పారదీప్, పానిపట్
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటిఐ / ఇంజనీరింగ్ డిప్లొమా/ బిఎస్సీ - నర్సింగ్ / డిప్లొమా (నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ) పూర్తిచేసి ఉండాలి. బిఇ / బిటెక్ / ఎంబిఏ/ ఎంసిఏ / సీఏ / సీఎస్ / ఐసిడబ్ల్యుఏ / ఎల్ఎల్‌బి అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.
- వయసు: ఫిబ్రవరి 28 నాటికి 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి
- ఎంపిక: రాత పరీక్ష, స్కిల్/ ప్రొఫిషియెన్సీ / ఫిజికల్ టెస్ట్ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. రాత పరీక్షలో కనీసం 40 శాతం మార్కులు వచ్చినవారిని కేటగిరీల ప్రకారం 1:2 నిష్పత్తిలో తదుపరి ప్రక్రియలకు అనుమతిస్తారు.
- రాత పరీక్ష: మార్చి 25న
- పరీక్ష ఫలితాలు విడుదల: ఏప్రిల్ 17న
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 10న
- దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: మార్చి 24
- వెబ్‌సైట్: www.iocl.com

ప్రొఫెషనల్ టచ్



వంద శాతం ప్లేస్‌మెంట్ ఉండే కోర్సు

కంపెనీ సెక్రటరీ

*పూర్వకాలంలో రాజుకు మంత్రి ప్రధాన సలహాదారుగా ఉండేవారు. ఆధునిక కాలంలో ఈ పనిని 'కంపెనీ సెక్రటరీ'(సిఎస్) చేస్తున్నారు. సిఎస్ కోర్సును మన దేశంలో 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ)' అందిస్తోంది. కంపెనీ సెక్రటరీ ప్రొఫెషన్ ప్రాముఖ్యాన్ని ఐసిఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్‌పర్సన్ **కవితా రాణి శాఖమూరి**, సీనియర్ ప్రొఫెషనల్, ఐసిఎస్ఐ సదరన్ చాప్టర్‌కు గతంలో అధ్యక్షురాలిగా వ్యవహరించిన **ఎ.వి.శ్యామల** 'జాబ్‌కార్నర్'కు వివరించారు.*

ప్ర: కంపెనీ సెక్రటరీ యూనిక్ అనొచ్చా?

జ: భేషుగ్గా. ఇంజనీర్ నుంచి వివిధ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు అంచెలంచులుగా ఎదుగుతారు. కంపెనీ సెక్రటరీ కథ ఇందుకు విరుద్ధం. బాధ్యతలు చేపట్టడమే అత్యున్నత స్థాయిలో జరుగుతుంది. నేరుగా డైరెక్టర్ల బోర్డులో కూర్చుని చర్చల్లో పాల్గొనే అర్హత లభిస్తుంది. యాభై సంవత్సరాలకు అటూ ఇటూ ఉండే వ్యక్తులు డైరెక్టర్లుగా ఉంటారు. వారికి సలహా ఇచ్చే వ్యక్తి, కంపెనీ సెక్రటరీ కోర్సును పూర్తి చేసిన రెండున్నర దశాబ్దాల వయసున్న వ్యక్తి అవుతారు. ఇంత గౌరవం మరే కోర్సు చేసిన వ్యక్తికి అందదు. మన దేశంలోనే ఇప్పటి కిప్పుడు రెండున్నర లక్షల మంది కంపెనీ సెక్రటరీల అవసరం ఉంది. అయితే మనకు అందుబాటులో ఉన్నది అన్ని అర్హతలు ఉన్న కంపెనీ సెక్రటరీలు కేవలం యాభై వేల మంది మాత్రమే. డిమాండ్‌కు సరఫరాకు ఉన్న అంతరం చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు.

ప్ర: న్యాయశాస్త్రంలో కూడా డిగ్రీ చేస్తేనే కంపెనీ సెక్రటరీకి మంచి గుర్తింపు లభిస్తుందనే మాట నిజమేనా?

జ: పూర్తిగా అవాస్తవం. కంపెనీ సెక్రటరీ కోర్సులో భాగంగానే వివిధ చట్టాలను లోతుగా చదవుకోవాల్సి ఉంటుంది. ఫౌండేషన్ స్థాయిలో ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. ఎప్పటికప్పుడు సమాజం లోని పరిస్థితులకు అనుగుణంగా కోర్సును సంస్థ ఉన్నతీకరిస్తుంటారు. అలాగే వివిధ సెమినార్లు, ఇప్పటి రోజుల్లో వెబినార్ తదితరాలతో కొత్తగా రూపొందిన చట్టాలపై అవగాహన కల్పిస్తుంటుంది. మాకు క్రెడిట్ అవర్ సిస్టమ్ ఉంటుంది. ఎంప్లాయి మెంట్‌లో ఉన్న వ్యక్తులు సైతం ఆయా సెమినార్లు, వెబినార్‌కు హాజరుకావడం ద్వారా ఆయా క్రెడిట్ అవర్స్‌ను సంపాదించాలి. ఎప్పటికప్పుడు ప్రొఫెషనల్స్‌ను అప్‌డేట్ చేయడమే ఈ క్రెడిట్ అవర్స్ సిస్టమ్ ఆంతర్యం.

ప్ర: కోర్సు పూర్తి చేసుకున్న వ్యక్తులకు ప్రాక్టికల్ పరిజ్ఞానం కోసం ఏదైనా ప్రోగామ్ ఉంటుందా?

జ: కంపెనీ సెక్రటరీ కోర్సు పూర్తి చేసుకున్న వ్యక్తులకు 'మేనేజ్‌మెంట్ స్కిల్ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ (ఎంఎస్ఒపి)'ని చాప్టర్లు నిర్వహిస్తాయి. ఇది పదిహేను రోజుల ప్రోగ్రామ్. ప్రొఫెషన్‌లో అనుభవజ్ఞులు వివిధ అంశాలపై లెక్చర్ల రూపంలో శిక్షణ ఇస్తారు. తదుపరి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ కూడా ఉంటుంది. ఒక్కరు కూడా మిగలకుండా అందరికీ ప్లేస్‌మెంట్ లభిస్తుంది. కొందరు సొంత ప్రాక్టీస్ కోసం అ ఫీల్డ్‌లో ఉన్న వ్యక్తుల వద్ద చేరుతారు.

ప్ర: ముఖ్యంగా కంపెనీ సెక్రటరీ విధులు ఎలా ఉంటాయంటారు?

జ: ప్రధానంగా కీలక మేనేజీరియల్ వ్యక్తి, కంప్లయెన్స్ అధికారి, గవర్నెన్స్ ప్రొఫెషనల్, బోర్డ్ అడ్వయిజర్, సెక్రటేరియల్ ఆడిటర్, వివిధ అథారిటీస్ ఎదుట క్లయింట్ ప్రతినిధిగా ఒక కంపెనీ సెక్రటరీ కోర్సు చేసిన వ్యక్తి బాధ్యతలు చేపట్టవచ్చు. మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాదిరిగా కంపెనీ సెక్రటరీని కూడా 'కీ మేనేజీరియల్ పర్సనల్ (కెఎంపి)గా 2013 కంపెనీ చట్టం గుర్తించింది. రూ. అయిదు కోట్లకు మించి పెయిడప్ కేపిటల్ కలిగిన ప్రైవేటు కంపెనీ, రూ.అయిదుకు మించి రూ.పది కోట్ల పెయిడప్ కేపిటల్ ఉన్న పబ్లిక్ కంపెనీలు కంపెనీ సెక్రటరీని తప్పనిసరిగా నియమించుకోవాలి. రూ.పది కోట్లకు మించిన పబ్లిక్ కంపెనీ కెఎంపి స్థాయిలో కంపెనీ సెక్రటరీని నియమించుకోవాలి. నిజానికి కంపెనీకి అవతలి వ్యక్తి సిఎస్. అదే సమయంలో డైరక్టర్ల సరసన కూర్చునే కంపెనీలో నేరుగా భాగస్వామ్యం లేని మొదటి వ్యక్తి కూడా అతనే.

ప్ర: సొంతంగా ప్రాక్టీస్ అంటే ఏమి చేస్తారు?

జ: సొంతంగా ప్రాక్టీస్‌లో ఉన్న వ్యక్తులు సెక్రటేరియల్ ఆడిట్ నిర్వహించవచ్చు. కంపెనీ ఏదైనా సరే, కొన్ని చట్టాలకు అనుగుణంగా విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. వాటిని సక్రమంగా నిర్వర్తించారా లేదా అన్నది చూసి సర్టిఫికెట్ జారీ చేయాలి. కంప్లయెన్స్ అధికారి కావచ్చు. ఇటీవలి కాలంలో బ్యాంకులు కూడా కంపెనీ సెక్రటరీ సేవలు ఉపయోగించుకుంటున్నాయి. అవి కంపెనీలకు రుణాలను మంజూరు చేస్తూ ఉంటాయి. ప్రత్యేకించి ఒక కంపెనీకి రుణం మంజూరు చేసే విషయంలో కంపెనీ సెక్రటరీ ఇచ్చే సర్టిఫికెట్ కూడా చాలా అవసరం. ఇది ఒక రకంగా బాధ్యత బదలాయింపు. కంపెనీ లా ట్రిబ్యునల్ ఎదుట లాయర్ల మాదిరి గానే సెక్రటేరియల్ విషయాలను క్లయింట్ పక్షాన వాదించవచ్చు. ఇప్పుడు కంపెనీ సెక్రటరీ విధుల్లో స్పెషలైజేషన్ కూడా కనిపిస్తోంది. జిఎస్‌టి, ట్రేడ్, ఇన్సూరెన్స్, ఇన్‌సాల్వెన్సీ, అమాల్గమేషన్, మెర్జర్ తదితరాల్లో ఏదో ఒకటి లేదా రెంటిని ఎంపిక చేసుకుని విధులను నిర్వర్తిస్తున్న సిఎస్‌లు కూడా తయారయ్యారు. కోర్సు పూర్తయ్యేసరికి అత్యున్నత సాయిలో అవగాహన, విశ్లేషణ సామర్థ్యాలను సంతరించుకుంటున్న కంపెనీ సెక్రటరీల్లో కొందరు సివిల్స్, గ్రూప్స్ వంటి పరీక్షలు రాసి ప్రభుత్వంలో ఉన్నత అధికారులుగా రాణిస్తున్నారు.

ప్రైవేట్ జాబ్స్

మావెన్ క్లస్టర్

- ఉద్యోగం: వెబ్ డిజైనర్
- అర్హత: బిఇ/బిసిఏ
- అనుభవం: 6 నెలలు - రెండేళ్లు
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- వెబ్‌సైట్: http://mavencluster.com/career-ui-designer.php

ర్యాడిక్స్

- ఉద్యోగం: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ - సిస్టమ్స్
- అర్హత: బిఇ/బిటెక్/ఎంఇ/ఎంటెక్
- అనుభవం: 2 - 4 సంవత్సరాలు
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- వెబ్‌సైట్: http://radixweb.com/opening/senior-software-engineer-system

నానో ఇన్ఫోసాఫ్ట్

- ఉద్యోగం: టీమ్ మెంబర్
- అర్హత: పోస్ట్ గ్రాడ్యుయేషన్/గ్రాడ్యుయేషన్
- అనుభవం: 1 - 5 సంవత్సరాలు
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- వెబ్‌సైట్: http://www.nanoinfosoft.com/corporate/careers/JobDetails.aspx?JobId=20181J25


హొరిజన్ కోర్

- ఉద్యోగం: ఎఎస్‌పి డాట్ నెట్ ఎంవిసి డెవలపర్
- అర్హత: బిసిఏ /బిఇ /బిటెక్ /ఎంసిఏ /ఎంటెక్/ఎమ్మెస్సీ
- అనుభవం: కనీసం ఏడాదిన్నర సంవత్సరాలు
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- వెబ్‌సైట్: www.horizoncore.com/career-job-net

దిక్సూచి

ఇంటర్ లాంగ్వేజెస్‌లో మార్కులు ఇలా..

ఎగ్జామ్ గైడ్



సంస్కృతం

జూనియర్ ఇంటర్

- సంస్కృతమే కాదు ఏ భాషలోనైనా అత్యధిక మార్కులు (98 / 99 మార్కులు) తెచ్చుకోవాలంటే మంచి రాత అత్యవసరం. చేతి రాత ఆకర్షణీయంగా ఉంటే మంచి మార్కులు వచ్చే అవకాశం ఉంది.
- 1, 10, 16 ప్రశ్నలకు సమాధానాలను ముందుగా రాయాలి.
- 7 - 8.... 4 ప్రశ్నల సమాధానాలను వరుస క్రమంలో రాయాలి.
- 9వ ప్రశ్నలో లేఖ ఉంటుంది.
- తరవాత 4, 5 ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- 10 నుంచి 16 ప్రశ్నల వరకు ఒక్క తప్పు కూడా లేకుండా రాస్తే 45 మార్కులు వస్తాయి.
- మొదటి ప్రశ్నలోని శ్లోక పూరణ - భావాన్ని తప్పుల్లేకుండా రాస్తే 6 మార్కులు వస్తాయి.
- 4 - 7 - 8 ఉపవాచక - పద్య- గద్య - లఘు ప్రశ్నలకు సరైన సమాధానాలు రాస్తే 20 మార్కులు వస్తాయి.
- లేఖ రాసేటపుడు విరామ చిహ్నాలు పాటిస్తూ విషయ దోషాలు రాకుండా చూసుకుంటే 5 మార్కులు వస్తాయి.
- ప్రశ్నాపత్రంలో కష్టమైనవి 5 - 6 పద్య గద్య సందర్భాలు. వీటికి సాధ్యమైనంత వరకు స్పష్టంగా తప్పులు దొర్లకుండా సమాధానాలు రాస్తే 12 మార్కులు వస్తాయి.
- 2 - 3 వ్యాసరూప ప్రశ్నలకు భాషాదోషాలు లేకుండా సమాధానాలు రాస్తే 10 / 11 మార్కులు వస్తాయి.
- పొల్లులు, సున్నాలు, విసర్గలు, ఇ, ఈ, ఉ, ఊ కారాలను సమాధానాల్లో సరైన విధానంలో రాయాలి.
- అనువాదాలు, వ్యాసాలు తెలుగులో రాసేటపుడు భాషాదోషాలు లేకుండా చూసుకోవాలి.
- తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు వచ్చే అంశాలకు ముందుగా ప్రాధాన్యం ఇవ్వాలి.
- వ్యాసాలను చివరలో రాయాలి. మధ్యలో కొటేషన్స్ పెడుతూ భాషాపరమైన తప్పులు లేకుండా చూసుకోవాలి.

సీనియర్ ఇంటర్

- ముందుగా 1, 9, 16 ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- తరవాత 7, 8 ప్రశ్నలకు.. ఆ తరవాత 5, 6 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి.
- చివరగా 2, 3, 4 ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- 15, 16 ప్రశ్నలకు సమాధానాలను జాగ్రత్తగా రాయాలి. ప్రశ్న పత్రాన్ని చూసి జాగ్రత్తగా రాయకపోతే పూర్తి మార్కులు రావు.
- 9 నుంచి 16 ప్రశ్నల వరకు తప్పులు లేకుండా రాస్తే 48 మార్కులు వస్తాయి.
- మొదటి ప్రశ్నలో ప్రతిపదార్థం - భావాలను భాషా దోషాలు లేకుండా రాస్తే 8 మార్కులు వస్తాయి.
- అలాగే 7, 8 పద్య గద్య లఘు ప్రశ్నలకు జవాబులు రాస్తే 8 మార్కులు వస్తాయి.
- 5, 6 పద్య గద్య సందర్భాలు ప్రశ్న పత్రంలో అన్నిటికంటే కష్టమైనవి. వీటి జవాబుల్లో తప్పులు దొర్లకుండా రాస్తే 12 మార్కులు తేలిగ్గా వచ్చే అవకాశం ఉంది.
- 2, 3, 4 పద్య గద్య రూపక విభాగ వ్యాస రూప ప్రశ్నల నుంచి 22 / 23 మార్కులు తెచ్చుకోవచ్చు.
- పొల్లులు, సున్నాలు, విసర్గలు, ఇ, ఈ, ఉ, ఊ కారాలను ఎటువంటి దోషం లేకుండా ప్రయోగించాలి.

ఇంగ్లీష్

జూనియర్ ఇంటర్

- ఇందులో సెక్షన్ - ఎ, సెక్షన్ - బి, సెక్షన్ - సి విభాగాలు ఉంటాయి. సెక్షన్ ఎలో పొయెట్రీ, ప్రోజ్, నాండిటైల్డ్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్ - ఎ ప్రశ్నలకు సమాధానాలు రాసేటపుడు సింగిల్ టెన్స్‌లో రాయాలి. ఈ విభాగంలో భావ వ్యక్తీకరణలో స్పష్టత, సరైన సమాధానం రాయడం ముఖ్యం. గ్రామర్, స్పెల్లింగ్స్, పంక్చుయేషన్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.
- సెక్షన్ - బి, సెక్షన్ - సి విభాగాల్లో 60 మార్కులకు పూర్తిగా గ్రామర్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కి సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు.
- ఏ సెక్షన్‌ను ముందుగా ఎంపిక చేసుకొన్నప్పటికీ దానిలోని ప్రశ్నలకు ఒకే చోట సమాధానాలను రాయడం ఉపయుక్తంగా ఉంటుంది. గ్రామర్‌కు సంబంధించిన జవాబులను ఒక క్రమ పద్ధతిలో రాయాలి.
- పరీక్ష రాసేటపుడు సమయ పాలన, అందమైన దస్తూరి, సమాధానాల్లో స్పష్టత అవసరమని గుర్తుపెట్టుకోవాలి.
- సెక్షన్ - ఎకు గంటన్నర, సెక్షన్ - బి, సెక్షన్ సిలకు గంట పదిహేను నిమిషాలు కేటాయించి... చివరి 15 నిమిషాలను తప్పులేమైనా దొర్లాయో లేవో అని సరి చూసుకోవడానికి కేటాయించాలి
- సెక్షన్ - సిలో ఛాయిస్ లేకుండా అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయడం మంచిది. అంటే ట్రాన్స్‌కోడింగ్ ఇన్ఫర్మేషన్ - 17వ ప్రశ్న, ఫొనెటిక్స్ అండ్ ఆడ్ సౌండ్స్ - 18వ ప్రశ్న, సిలబస్ 19వ ప్రశ్నలకు జవాబులు రాయాలి.
- సెక్షన్ - బిలోని కాంప్రెహెన్షన్ ప్యాసేజ్‌తో పరీక్షను ప్రారంభించి తరవాత సెక్షన్ - సి, ఆ తరవాత సెక్షన్ ఎలో ప్రశ్నలను ఎంచుకోవాలి. ముందుగా గ్రామర్ సంబంధిత ప్రశ్నలకు జవాబులు రాయాలి.

సీనియర్ ఇంటర్

- ఇందులో కూడా మూడు విభాగాలు ఉంటాయి.
- ఎక్కువ మార్కులు సాధించాలనుకునే వారికి సెక్షన్ - బి, సెక్షన్ - సి కీలకం. వీటిలో స్టడీ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి. అంటే రీడింగ్, రైటింగ్, స్పీకింగ్ స్కిల్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- సెక్షన్ - సిలో లెటర్ రైటింగ్, డిస్క్రైబింగ్ / ప్రాసెస్, సీవీ / రెజ్యూమె, కన్వర్సేషన్ ప్రాక్టీస్, నోట్ మేకింగ్ సంబంధిత ప్రశ్నలకు సమాధానాలను జాగ్రత్తగా రాయాలి. లెటర్ రాసేటపుడు బ్లాక్డ్ / ఫుల్లీ బ్లాక్డ్ ఫార్మాట్‌ను అనుసరించాలి. సీవీ / రెజ్యూమె రాసేటపుడు సాధ్యమైనంత వరకు ఎక్కువ వర్గాలు రాయాలి. కన్వర్సేషన్ ప్రాక్టీస్‌లో కనీసం 7 నుంచి 8 ఎక్స్ఛేంజెస్ (14 - 16 సంభాషణలు) రాయాల్సి ఉంటుంది. నోట్ మేకింగ్ రాసే క్రమంలో ఇచ్చిన సమాచారాన్ని 1/3 వంతుకు కుదించి సరైన విధానంలో ప్రెజెంట్ చేయాలి.
- సీనియర్ ఇంటర్‌లో సెక్షన్ - ఎకు గంటన్నర, సెక్షన్ - బి, సెక్షన్- సిలకు కలిపి గంటన్నర కేటాయించుకోవాలి. చివరలో తప్పులను సరిచూసుకోవాలి.



రాధ
చార్టర్డ్ అకౌంటెంట్,
అకడమిక్ అడ్వైజర్,
మాస్టర్ మైండ్స్

కళ్లలో సుళ్లు తిరగుతున్న నీళ్లు...
గొంతు గాద్గికమై మూగబోయిన వేళ..
ఆప్తులైన స్నేహితులు దూరమై నిరాశా నిస్పృహలు ఆవరించిన క్షణం... బ్రతుకులో నిత్యం భయం...
చదువు చెప్పే స్కూళ్లే శ్మశానవాటికల్లా మిగులుతున్న తీరు...

ఇవన్నీ ఓ పద్దెనిమిదేళ్ల అమ్మాయిని కలవరపర్చాయి..
జీవచ్ఛవాల్లా బతికే పరిస్థితి ఎందుకొస్తోందని అమెరికన్ రాజకీయవేత్తల్ని ఆమె ప్రశ్నిస్తోంది..
ప్రశ్నించడం కాదు నిలువునా కడిగిపారేస్తోంది..
దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నైతే ఏకంగా.. 'నీకిది సిగ్గుచేటు' అని అనేసింది.

టీనేజ్ బుల్లెట్

అమెరికాలో తుపాకుల సంస్కృతిపై ఓ అమ్మాయి గురి

మా ప్రాణాలు హరించే తుపాకుల సంస్థ నుంచి విరాళాలా?

గన్ లాబీని నియంత్రించలేని వారికి ఓటొద్దని పిలుపు



ఆమె చూపులో అమాయకత్వం, మాటలో నిజాయితీ, ప్రశ్నించే తీరులో తీక్షణత.. ఇవన్నీ ఇపుడు ఆమెను అమెరికాలో ఓ నేషనల్ హీరోని చేశాయి.. ఆ అమ్మాయి పేరు ఎమ్మా గొంజాలెజ్.. ఫ్లోరిడాలోని పార్క్‌ల్యాండ్‌లో 17 మంది విద్యార్థులు ఓ ఉన్మాది తూటాలకు బలైపోయిన మార్జొరీ స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్‌లో చదువుతోంది. హత్యాకాండ సాగిన రోజు ఆమె స్కూలు ఆడిటోరియంలో ఉంది.. కాల్పుల శబ్దం విని ఏదో డ్రిల్ జరుగుతోందని అనుకుంది.. తరువాత మిగిలిన విద్యార్థులు పరిగెడుతూ.. ఆమెను చూసి పారిపో..పారిపో.. ఫైరింగ్ జరుగుతోంది.. అని హెచ్చరించినపుడు- ఓ మూల నక్కి ప్రాణాలు దక్కించుకుంది.. దాదాపుగా మరణాన్ని చూసి వచ్చానని ఆ తరువాత చెప్పిన ఎమ్మా- జరిగిన దారుణాన్ని అనేక టెలివిజన్ ఛానెళ్లకు వినిపించింది.



వాషింగ్టన్‌లోని వైట్‌హౌజ్ ముందు తుపాకీ నియంత్రణ సంస్కరణలను తీసుకురావాలని చేపట్టిన 'లై-ఇన్' కార్యక్రమంలో పాల్గొన్న ప్రదర్శనకారులు

వాషింగ్టన్ డీసీలో - తుపాకీ సంస్కృతిని నిరసిస్తూ జరిగిన ఓ మెగా ర్యాలీలో- ఆమె గళం విప్పింది.. కన్నీటిని, బాధని, భయాన్ని పంటిబిగువున అదిమిపెట్టుకుని ఆమె -కేవలం 12 నిమిషాల పాటు- చేసిన పవర్‌ఫుల్ ప్రసంగం ఓ ప్రవాహంలా సాగింది.. వందల మంది ప్రత్యక్షంగా చూశారు.. వేల మంది టీవీల్లో తిలకించారు.. ఆలోచనలో పడ్డారు. అమెరికన్ ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది..

"నాకు కలిగిన బాధను నలుగురితో పంచుకోడానికి వచ్చాను..ఇక్కడికొచ్చిన ప్రతీ వారి ఇంటిలో కనీసం ఒకరు మరణించే ఉంటారు, లేదా తెలిసినవారైనా ఉంటారు. మన ప్రభుత్వమో లేక అధ్యక్షుడో సానుభూతి వచనాలు పలికితే వాటిని వినడానికి మనం ఇక్కడకు రాలేదు.. ఒక ఒకవేళ అందుకే వస్తే- మనం కోరుకుంటున్న మార్పు (తుపాకుల వినియోగ చట్టంలో మార్పు) రాదు.." అని ఎమ్మా ఆరంభించింది. ఈ ప్రదర్శన ఆ మార్పుకు నాంది కావాలి.. ఆమె పిలుపిచ్చింది.

"ఈ క్షణంలో అధ్యక్షుడు ట్రంప్ నా దగ్గరకొచ్చి- 'జరిగినది ఘోరాతి ఘోరం. ఇలాంటివి ఎప్పుడూ జరక్కూడదు.. జరిగిన దానికి సానుభూతి ప్రకటిస్తున్నాను.. నా ఆలోచనలన్నీ బాధిత కుటుంబాల చుట్టూనే తిరుగుతున్నాయి.. అయినా ఇలాంటి ఘటనలు ఆపడానికి ఇప్పుడేమీ చెయ్యలేం' అని గనక అంటే నేను వెంటనే ఒకే ఒక ప్రశ్న అడుగుతాను- 'నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ నుంచి ఎంత డబ్బు విరాళంగా తీసుకున్నావని..' ! అని ఎమ్మా అన్నపుడు కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

అమెరికాలో గన్ లాబీ చాలా పవర్‌ఫుల్.. రాజకీయ వేత్తలకి, ముఖ్యంగా రిపబ్లికన్ పార్టీకి పెద్ద ఎత్తున వేలాది డాలర్ల విరాళాలిచ్చే సంస్థలో నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ (ఎన్ఆర్ఎ) ఒకటి. తుపాకుల వినియోగంపై ఆంక్షలు రాకుండా అడ్డుపడుతున్న సంస్థ ఇది.

"ఎన్ఆర్ఏ నుంచి విరాళాలు తీసుకుంటున్న ప్రతి రాజకీయ నాయకుడూ- ట్రంప్‌తో సహా- సిగ్గుతో తలవంచుకోవాలి" అని ఎమ్మా గొంజాలెజ్ తీవ్రస్వరంతో చెరిగిపారేసింది. "మీ నిష్క్రియ వల్ల ప్రజలు చనిపోతున్నారు.. పిల్లలు రాలిపోతున్నారు. తుపాకుల చట్టాన్ని మార్చాలన్న నివేదన అరణ్యరోదనగానే మిగిలిపోయింది" అని ఎమ్మా నిందించారు. "ఇక ఈ పెద్దలు (నేతలు) మనకొద్దు.. వీరి వల్ల మార్పు రాదు. ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా ఉండదు. మనమే మార్చాలి. వచ్చే నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో ఎన్ఆర్ఏ నుంచి విరాళాలు తీసుకునే ఏ పార్టీ అభ్యర్థినీ మనం గెలిపించవద్దు.. అమెరికాలోని ప్రతీ యువ ఓటరూ దీన్ని పాటించాలి" అని ఆమె పిలుపునిచ్చారు. దీనికి ఆన్‌లైన్‌లో విశేషామోదం లభించింది. నిజంగా ఇదే జరిగితే- రిపబ్లికన్లకు ఎన్నికల్లో గడ్డుకాలమే!



ఎమ్మా గొంజాలెజ్ ప్రసంగం అమెరికా అంతటా వైరల్ అయ్యింది, కొన్ని వేల మంది రీట్వీట్ చేశారు. టెలివిజన్ ఛానెళ్లలో చర్చలకు దారితీసింది.

40 ఏళ్లకే వృద్ధాప్యం!

పీల్చి పిప్పి చేస్తున్న క్షయ.. నల్లమలలో చెంచుల నరకయాతన

'దట్టమైన అడవుల్లో జీవనం.. తినడానికి సరిగ్గా తిండి ఉండదు.. రవాణా సౌకర్యం లేదు.. రోగమొస్తే వైద్యం చేయడానికి వైద్యులు అందుబాటులో ఉండరు. కనీసం పట్నానికి పోదామన్న ఆ లోపే చనిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు.' ఇదీ నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న వేలాది మంది చెంచుల హృదయ విదారక స్థితి. అటవీ ఉత్పత్తుల సేకరణే ప్రధాన జీవనాధారంగా బతుకు బండిని లాగుతున్న వీరికి పౌష్టికాహారలోపం అతి పెద్ద శాపం. వ్యాధి నిరోధక శక్తి తగ్గి తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా క్షయ వ్యాధి వాళ్లను పీల్చి పిప్పి చేస్తోంది. శరీరంలో బొక్కలు తప్ప మాంసం కండ కానరాని ఘోర పరిస్థితి. నాలుగు పదులు నిండకుండానే వృద్ధాప్య ఛాయలు అలుముకోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. క్రమంగా చెంచుల జాతి ఉనికి కోల్పోవాల్సిన ప్రమాదం ఎదురవుతోంది. 2లక్షల 75వేల హెక్టార్లలో విస్తరించిన నల్లమల అటవీ ప్రాంతంలో 112 చెంచెపెంటలలో 11వేల మంది నివసిస్తున్నారు. వీరంతా పౌష్టికాహార లోపంతో సీజనల్ రోగాలతో పాటు క్షయ బారిన పడి మృత్యువు చెంతన చేరుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆ జాతి ప్రమాదంలో పడుతుందని ప్రజా ఆరోగ్య సంస్థ కూడా ఇటీవల ప్రభుత్వానికి నివేదించింది. తెలంగాణలోని నాగర్‌కర్నూల్, నల్లగొండ, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, ప్రకాశం, గుంటూరు సరిహద్దుల్లో ఉన్న నల్లమలలోని చెంచుపెంటలకు కాలిబాట తప్ప రవాణా సౌకర్యం లేదు. వైద్య సిబ్బంది సక్రమంగా అందుబాటులో ఉండరు. దీనితో చెంచులు టీబీ సోకి మంచానపడ్డా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడానికి ముందుకురాని పరిస్థితులు నెలకొన్నాయి.. అక్షర జ్ఞానం లేని చెంచులు మందులు సరిగా వాడక వ్యాధి ముదిరి మృత్యువాత పడుతున్నారు. క్షయ వ్యాధి నివారణకు సుండిపెంటలో టీబీ నివారణ కేంద్రం ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ఆస్పత్రి ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగంగా మారింది. తెలంగాణలో నివసిస్తున్న చెంచుల కోసం ప్రత్యేక కేంద్రాన్ని నెలకొల్పకపోవడం కూడా ప్రధాన సమస్యగా మారింది.

– ఆంధ్రజ్యోతి, నాగర్‌కర్నూల్




క్షయ వ్యాధి బారినపడిన చెంచు వీరాస్వామి, నల్లమలలోని గీసుగండి చెంచుపెంట

పెంటలవైపు కన్నెత్తి కూడా చూడరు



రావడానికి కష్టమైతదని ఆస్పత్రి సారొళ్లు మా పెంటవైపు కన్నెత్తి కూడా సూడరు. ఏ రోగం వచ్చినా పసరు మందే దిక్కు. ఏడు నెలల నుంచి మా పెంటకు వచ్చినోళ్లే లేరు. పాములు, తేళ్లు కుట్టినా నాటు వైద్యం చేసుకోవాల్సిందే.

–మండ్లీ పాపయ్య, గీసుగండి చెంచుపెంట

లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారిస్తాం



పౌష్టికాహారలోపంతో చెంచులు క్షయ బారిన పడుతున్న విషయం వాస్తవమే. నిరక్షరాస్యత కారణంగా కూడా మందుల వాడకంలో కనబరుస్తున్న అశ్రద్ధ వ్యాధి నివారణకు అవరోధంగా మారింది. లోతట్టు అటవీ ప్రాంతాల్లోనూ వైద్య సేవలు సక్రమంగా అందేలా చూస్తాం.

– డాక్టర్ సుధాకర్‌లాల్, జిల్లా వైద్యాధికారి



నమస్తే ఇండియా

ఆలయాల సందర్శన.. అభిషేకాలు.. చిరునవ్వులు, నమస్కారాలతో ఫొటోలు.. ఇదేదో మన దేశ రాజకీయ నాయకుల ఎన్నికల షెడ్యూల్ అనుకునేరు! కాదు.. కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో భారత పర్యటనలో కనిపించిన దృశ్యాలివి. ట్రూడో, ఆయన కుటుంబం చక్కగా మన సంప్రదాయ దుస్తులు, నుదుటన తిలకం ధరించి భారతీయుల మనసు చూరగొంటున్నారు. ఇప్పటికే ఆగ్రాలో తాజ్‌మహల్‌ను, గాంధీనగర్ (గుజరాత్)లో అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించిన ట్రూడో కుటుంబం బుధవారం అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయాన్ని దర్శించనున్నారు. ఫిబ్రవరి 23న ప్రధాని నరేంద్రమోదీతో భేటీ కానున్నారు.


రోగిని బట్టి వైద్యం

కణస్థాయిలో చికిత్స.. మందుల దుష్ప్రభావం నివారణే లక్ష్యం.. సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా

మన అందరి శరీరాలు ఒకేలా ఉంటాయా? అందరి వస్త్రాలు ఒకే సైజులో ఉంటాయా? ఉండవు.. ఎందుకంటే ప్రకృతిలో ప్రతి వ్యక్తి ప్రత్యేకం. అలాంటపుడు అందరికీ ఒకే రకమైన మందులు ఎలా పనిచేస్తాయి? పనిచేయవు అన్నదే దీనికి సమాధానం. అందుకే ఇటీవలి కాలంలో వ్యక్తిగత వైద్యం అనే విధానం ఊపు అందుకుంటోంది. దీనిని ప్రాథమిక దశలోనే ఒడిసి పట్టుకోవటానికి హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ప్రయత్నాలు ప్రారంభించింది. దీని కోసం సీసీఎంబీలోని ఇంక్యుబేషన్ హబ్‌లో ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు.



అవసరం ఉన్నంత డోస్ ఇచ్చేలా..



"అందరికీ అన్ని మందులూ పనికి రావు. ఒకో వ్యక్తికి ఒక్కో విధంగా డోస్ అవసరమవుతుంది. కానీ ప్రస్తుతం అందరూ ఒకే విధమైన డోస్ వేసుకుంటున్నారు. దీని వల్ల ప్రయోజనం ఉండదు. కేన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల్లో ఈ సమస్య మరింత ఎక్కువ. దీనికి పరిష్కారమే వ్యక్తిగత వైద్యం (పర్సనలైజ్డ్ మెడిసిన్)" అని చెబుతున్నారు సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా. మనం తీసుకొనే మందుల సామర్థ్యంపై చాలా కాలంగా చర్చ నడుస్తోంది. "మన శరీరం చాలా సంక్లిష్ట నిర్మాణమని చెప్పాలి. అన్ని మందులూ అందరికీ ఒకే విధంగా పని చేయవు. ఉదాహరణకు తలనొప్పికి నేను ఒక మాత్ర వేసుకుంటే వెంటనే తగ్గిపోవచ్చు. అదే మాత్ర మీరు వేసుకుంటే తగ్గకపోవచ్చు. అలా కాకుండా ఒక వ్యక్తికి ఎంత డోస్ అవసరమో తెలుసుకుని అంతే మందు ఇవ్వగలిగితే చాలా ప్రయోజనాలు ఉంటాయి. తల నొప్పి, కడుపు నొప్పి లాంటి వాటికి మందులు వాడినా ఫర్వాలేదు కానీ.. కేన్సర్ వంటి జబ్బులకు వాడే మందుల వల్ల దుష్ఫలితాలు కూడా ఉంటాయి. ఇలాంటి సమస్యలకు పరిష్కారమే వ్యక్తిగత వైద్యం" అని వివరించారు.

– స్పెషల్‌డెస్క్

మన కన్నా ముందే..

పాశ్చాత్య దేశాల శాస్త్రవేత్తలు ఈ అంశంపై ఇప్పటికే పరిశోధనలు ప్రారంభించారు. ఒక వ్యక్తి జన్యుక్రమాన్ని విశ్లేషించటం ద్వారా అతనికి వచ్చే జబ్బులను ముందే తెలుసుకోగలుగుతున్నారు. "ఇది ఒక పద్ధతి. దీనిలో ఒక వ్యక్తికి మాత్రమే ప్రత్యేకంగా వచ్చే జబ్బులను తెలుసుకోగలుగుతాం. అంటే ఒక వ్యక్తి జన్యుక్రమాన్ని విశ్లేషిస్తే- అతనికి అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందో లేదో చెప్పవచ్చు. ఇది తొలి దశ. ఇక రెండో దశలో కణ స్థాయిలోనే వ్యాధులకు చికిత్స చేయటం."అని రాకేశ్ వెల్లడించారు. కణాలకు మందులు అందించే నానో రోబోలను తయారు చేయటం ఒక పద్ధతి. శరీరానికి అవసరమైన మందులను తమంతట తామే తయారు చేసుకునేలా ప్రేరేపించటం ఇంకో పద్ధతి. "ఇలాంటి టెక్నాలజీలన్నీ వ్యక్తిగత వైద్య విభాగంలోకే వస్తాయి. ఉదాహరణకు ఒక వ్యక్తికి మధుమేహం ఉందనుకుందాం. ప్రతి రోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకోవాల్సిన అవసరం లేకుండా.. నానో రోబోలు శరీరంలోకి వెళ్లి అవసరమైనప్పుడు ఇన్సులిన్ అందించటం ఒక పద్ధతి. ఇన్సులిన్‌ను తమంతట తామే తయారుచేసుకొనే విధంగా కణాలను ప్రేరేపించి.. అది అందేలా చూడటం మరో పద్ధతి.. ఈ రెండింటిపైన శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఇలాంటి పరిశోధనలకు ఊతం ఇవ్వటానికి మా ఇంక్యుబేషన్ హబ్‌లో ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు.

హాలీవుడ్ చిత్ర నిర్మాణం కంటే.. చంద్రయాన్-2 ప్రాజెక్టు

ఖర్చు తక్కువ

భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ప్రాజెక్టు చంద్రయాన్-2 ఖర్చెంతో తెలుసా? 'ఇంటర్‌స్టెల్లర్' హాలీవుడ్ చిత్ర నిర్మాణానికి అయిన ఖర్చుకంటే చాలా తక్కువ. ఆ చిత్రాన్ని రూ. 1,062 కోట్లతో నిర్మించగా.. చంద్రయాన్-2 అంచనా వ్యయం రూ. 800 కోట్లు అని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2013లో చేపట్టిన 'మార్స్ మిషన్'కు రూ. 470 కోట్లు ఖర్చయిందని, ఇది 'గ్రేవిటీ' చిత్ర నిర్మాణం (రూ. 644 కోట్లు) కంటే తక్కువ అని పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-2ను ఫిబ్రవరి 2న ప్రయోగించాలని నిర్ణయించారు.

తప్పుడు వార్తలకు

'బ్యాడ్ న్యూస్'!

సమయం, సందర్భం లేకుండా తప్పుడు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. సోషల్ మీడియా వచ్చాక ఏది పడితే అది రాసేందుకు అవకాశం ఉండడంతో తప్పుడు వార్తల్ని పోస్ట్ చేసి ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆ వార్తలే నిజమని నమ్ముతూ చాలామంది మానసిక మోసానికి గురవుతున్నారు. ఆ మోసం నుంచి బయటపడేందుకు యూకేలోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ శాస్త్రవేత్తలు 'బ్యాడ్ న్యూస్' అనే ఆన్‌లైన్ గేమ్‌ను రూపొందించింది. ఈ గేమ్‌ను ఆడితే తప్పుడు వార్తల భ్రమ నుంచి బయటపడవచ్చట. సైన్స్ వ్యతిరేక వార్తల నుంచి ప్రజలను బయటపడేసేందుకే తాము ఈ గేమ్‌ను తయారుచేశామని పరిశోధకులు తెలిపారు.

10 వేల ఏళ్ల భారీ గడియారం

పశ్చిమ టెక్సస్ పర్వతం లోపల ఏర్పాటు.. వీడియో బయటపెట్టిన జెఫ్ బెజోస్




అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్ చేసిన ట్వీట్ యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. పశ్చిమ టెక్సస్ పర్వతాల్లో నిర్మిస్తున్న 10వేల సంవత్సరాల గడియారం వీడియోను ఆయన ట్వీట్ చేశారు. ఈ భారీ గడియారం ఎత్తు 500 అడుగులు. థర్మల్ సైకిల్స్ శక్తితో ఇది పనిచేస్తుంది. నిజానికి గత 30 ఏళ్లుగా గడియారం నిర్మాణం కొనసాగుతోంది. తాజాగా పరికరాలు అమర్చే ప్రక్రియ మొదలైంది. ఏడాదికి ఒక్కసారి మాత్రమే టిక్ మనేలా వాచ్‌ను డిజైన్ చేశారు. ప్రతి వందేళ్లకోసారి మాత్రమే కుకూ బయటకు వస్తుంది. 'పర్వతం లోపల గడియారం నిర్మించడం ఆషామాషీ కాదు. నిర్మాణం ఇంకా కొనసాగుతోంది. 1989 నుంచి గడియారం ప్రాజెక్టులో నిమగ్నమైన డానీ హిల్లిస్‌కు మేం ఆరేళ్లుగా సహకారం అందిస్తున్నాం. పనుల్లో పురోగతి సాధిస్తున్నాం. దూరదృష్టి కల్గిన ఆలోచనలకు ఈ గడియారం నిదర్శనం' అని జెఫ్ బెజోస్ ట్వీట్ చేశారు.



రైలులో 406 తాబేళ్లు!

విజయవాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైలులో తరలిపోతున్న వందలాది తాబేళ్లను విజయవాడలో నిఘా అధికారులు వలపన్ని పట్టుకున్నారు. దిబ్రూఘర్ నుంచి కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు నాలుగు సంచుల్లో తాబేళ్లను తరలిస్తున్నట్టుగా భువనేశ్వర్‌లోని రెవెన్యూ ఇంటిలిజెన్స్ అధికారులు విజయవాడలోని అధికారులకు సమాచారం అందించారు. దీంతో విజయవాడ స్టేషన్‌లో నిఘాపెట్టిన అధికారులు ఉదయం 7.50 గంటలకు జనరల్ బోగీలో తనిఖీలు చేసి అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు మహిళలను గుర్తించారు. వారి వద్ద వున్న నాలుగు సంచుల్లో పాత వస్త్రాలు, వాటి అడుగున సాక్సుల్లో తాబేళ్ళు కనిపించాయి. వివిధ సైజుల్లో వున్న వాటిని నక్షత్ర తాబేళ్లుగా గుర్తించారు. మహిళలను ప్రశ్నించగా తమకు అనంతపురం జిల్లా కదిరి నుంచి ఒక వ్యక్తి తాబేళ్ళను భువనేశ్వర్‌కు తీసుకువచ్చి అప్పగించారని, వాటిని చెన్నైకు, అక్కడి నుంచి బంగ్లాదేశ్‌కు తరలించాలని సూచించాడని చెప్పారు. ఈ తాబేళ్ళ ఖరీదు భారీగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఒక్కోటి లక్ష నుంచి రెండు లక్షలవరకు ఉండవచ్చునని, సైజును బట్టి ధర పెరుగుతూ ఉంటుందని, అరుదైన వాటిని ఎక్కువ ధర పెట్టి కూడా కొనుగోలు చేస్తారని చెబుతున్నారు.

బహుదూరపు బాటసారి

ఒక చేతితే ట్రాలీ బ్యాగ్, మరో చేతిలో ప్లకార్డు పట్టుకుని రోడ్డెక్కిన ఈయన పేరు సురేష్ కుమార్ రఘువాన్షి. వయసు 59 ఏళ్లు. దేశ సమగ్రతను కాపాడలంటూ మధ్యప్రదేశ్ నుంచి కన్యాకుమారి వరకూ పాదయాత్ర చేపట్టారు. రోజుకు 35-40 కిలోమీటర్ల దూరం నడుస్తూ తన గమ్యం దిశగా దూసుకుపోతున్నాడు. నాలుగు జతల బట్టలు, కొన్ని డ్రైఫ్రూట్స్, పది వేల రూపాయల డబ్బులు పట్టుకుని సురేష్ ఈ యాత్రను ప్రారంభించాడు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా తమిళనాడు వరకూ పాదయాత్ర చేయాలన్నది సురేష్ లక్ష్యం. గత ఏడాది డిసెంబరు ఒకటిన నడక ప్రారంభించిన సురేష్ ప్రస్తుతం తమిళనాడులోని తిరునల్వేలి చేరుకున్నారు.





మేము అంతా గమనించాం..!

- **ఫుటేజీలు చూసి ఆ నేతల పేర్లు చెప్పండి**
- **కోడిపందేలపై హైకోర్టు ఆదేశం**
- **144 సెక్షన్ ఉండగా అంతమంది ఎలా వచ్చారు?**

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి కోడిపందేల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధుల వివరాలను, టీవీ ఫుటేజలను పరిశీలించి ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 144 సెక్షన్ అమలులో ఉన్నప్పుడు బరులవద్ద వందలాది మంది ఎలా గుమిగూడతారని నిలదీసింది. అధికారులు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించింది. అయితే పందేలు అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించారని, పండుగ సీజన్‌లో సిబ్బంది తక్కువగా ఉండడం, ఎక్కువ గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించడం వల్ల పూర్తిస్థాయిలో అరికట్టలేక పోయినట్లు ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ధర్మాసనానికి తెలిపారు. టీవీ ఫుటేజలను పరిశీలించి, సమాచారాన్ని క్రోడీకరించి ఇచ్చేందుకు కొంత సమయం పడుతుందని, ఇందుకు 4 వారాలు గడువు కోరడంతో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్, జస్టిస్ కె. విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం అంగీకరించింది. కె. రామచంద్రరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం మరోసారి విచారణ జరిగింది. చట్ట ప్రకారం కోడిపందేల్లో పాల్గొన్న వారిపై ఎటువంటి కేసులు పెట్టడానికి వీల్లేదని, కేవలం నిర్వాహకులపైనే కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని ఏజీ తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం టీవీ స్క్రీన్ల మీద అంతా చూశామని, కోడిపందేలు ప్రారంభించిన ప్రజాప్రతినిధులు ఫోటోలకు పోజులిచ్చిన సందర్భాలు ఉన్నాయని పేర్కొంది. చట్టాలు చేసే ప్రజాప్రతినిధులే వాటిని గౌరవించకపోతే ఎలా అని ప్రశ్నించింది. పోలీసులు సరిపోకపోతే పక్క జిల్లాల నుంచి తెప్పించుకోవాల్సి ఉందని వ్యాఖ్యానించింది.

ప్రజాప్రతినిధులకు నోటీసులు

కోడిపందేలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ...గుంటూరు జిల్లాకు చెందిన టి. భాను ప్రకాశ్ అనే న్యాయవాది దాఖలు చేసిన మరో పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న హోంశాఖ ముఖ్యకార్యదర్శి, పోలీసులతో పాటు రేపల్లె ఎమ్మెల్యే ఎ. సత్యప్రసాద్, ఎమ్మెల్సీ ఎ. సతీష్‌ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు దేవినేని మల్లిఖార్జునరావు, ముమ్మనేని వెంకటసుబ్బయ్యలకు నోటీసులు జారీచేసింది.

పోస్టల్ స్టాంపులపై 'పర్యాటకం'

- **రాష్ట్రంలోని 12 ప్రముఖ ప్రాంతాల గుర్తింపు**

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ ప్రాధాన్యతలు పోస్టల్ స్టాంప్ రూపంలో విశ్వవ్యాప్తం కానున్నాయని పర్యాటక శాఖ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనా చెప్పారు. పోస్టల్ విభాగం అందిస్తున్న 'మై స్టాంప్' పథకాన్ని ఈ విధంగా సద్వినియోగం చేసుకునేందుకు రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలోని పన్నెండు పర్యాటక ప్రాంతాలతో ప్రత్యేకంగా తపాళా బిళ్లలు విడుదల కానున్నట్టు చెప్పారు. తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం, విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయం, అరకు-గిరిజన ప్రదర్శనశాల, కడపలోని గండికోట రాతిలోయ, విశాఖపట్నంలోని రామకృష్ణ బీచ్, చిత్తూరులోని చంద్రగిరి కోట, అమరావతిలోని పవిత్ర సంగమం, రాజమండ్రిలోని పాపికొండలు, అరకులోని బొర్రా గుహలు, నెల్లూరులోని పులికాట్ సరస్సు, అమరావతిలోని జ్ఞానబుద్ధ చిత్రాలతో పోస్టల్ స్టాంపులు సిద్ధమయ్యాయన్నారు. త్వరలో సీఎం చంద్రబాబు వీటిని ఆవిష్కరిస్తారన్నారు. తపాలా బిళ్లలకు అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర, పర్యాటకశాఖ లోగో కూడా ఉంటాయని, ఇది చూపరుల ఆసక్తిని రాష్ట్రం వైపు మరల్చగలుగుతుందన్నారు.

ఈ-ఫైళ్లుగా పోస్టల్ అర్జీలు!

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తపాలా ద్వారా వచ్చే అర్జీలు, ఫైళ్లకు కూడా సకాలంలో మోక్షం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం తపాలా ద్వారా వచ్చే అర్జీలకు పెద్దగా ప్రాధాన్యం ఉండటం లేదు. మరీ ముఖ్యమైనవి అనిపిస్తే తప్ప, మిగిలినవి పక్కన పడేస్తున్నారు. ఇకపై అన్ని తపాలా అర్జీలను ఈ ఫైళ్లుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది.

డీఈడీ పరీక్షలపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఏపీలో డీఈడీ కోర్సుల్లో కనీస ప్రమాణాలు పాటించడం లేదని, విద్యాసంవత్సరం ముగిసినా వార్షిక పరీక్షలు నిర్వహించకుండా వాయిదా వేస్తున్నారని, అధికారుల ధనదాహమే దీనికి ప్రధాన కారణమని డీఈడీ విద్యార్థులు ఆరోపించారు. ఈ మేరకు కర్నూలు జిల్లాకు చెందిన ఎస్వీఎన్ డీఈడీ కాలేజీకి చెందిన 2016-18 బ్యాచ్ విద్యార్థులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. ఈ లేఖను ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పేర్కొంటూ విచారణకు స్వీకరించిన కోర్టు.. వివరాలతో కౌంటర్ వేయాలంటూ రాష్ట్రానికి నోటీజు జారీ చేసింది.

నేర నే'తల'పై కత్తి!

ఇక్కడే విచారణ.. ఇక్కడే శిక్ష.. ఎంపీలు, ఎమ్మెల్యేల కేసుల విచారణకు రాష్ట్రంలోనే కోర్టు

- **వచ్చే నెల కృష్ణాలో ఏర్పాటు**
- **సుప్రీంకోర్టు నిర్దేశాల మేరకు కేంద్రం నిధులతో నిర్వహణ**
- **నేడు కేబినెట్‌లో నిర్ణయం**



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఇకపై ఎంపీలు, ఎమ్మెల్యేలు ఏదైనా తప్పు చేస్తే, ఆ కేసుల విచారణకు ఏళ్లకు ఏళ్లు పట్టదు. వీలైనంత త్వరగా విచారణ ముగుస్తుంది. తీర్పులూ వచ్చేస్తాయి. దోషులుగా తేలితే శిక్ష కూడా పడుతుంది. దీనికోసం రాష్ట్రంలో ఒక ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసులన్నీ ఈ కోర్టులోనే విచారణకు వస్తాయి. ఇప్పటికే రాష్ట్రంలోని కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలకు సంబంధించి 240క్రిమినల్ కేసులు వివిధ కోర్టుల్లో విచారణలో ఉన్నాయి. ఇవన్నీ ఈ ప్రత్యేక కోర్టుకు బదిలీ కానున్నాయి. కృష్ణా జిల్లాలో ఈ ప్రత్యేక కోర్టును ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చేనెలలోనే ఈ న్యాయస్థానం అందుబాటులోకి రానుంది. సుప్రీంకోర్టు ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుకానుంది. దీనిపై బుధవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి, ఆమోదం తెలపనున్నారు. అశ్వినీకుమార్ ఉపాధ్యాయ వెర్సస్ కేంద్ర ప్రభుత్వం మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు ఇటీవల ఒక కీలక తీర్పునిచ్చింది. దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 1,581 క్రిమినల్ కేసులున్నాయి. వీటి విచారణలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ప్రజాప్రతినిధులు అందరికీ ఆదర్శంగా ఉండాలని, వారిపై వచ్చిన కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఈ కోర్టులు ఏర్పాటుచేయాలని పేర్కొంది. దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా సమ్మతించింది. అన్ని రాష్ట్రాల్లోను ఈ మేరకు కోర్టులు ఏర్పాటుచేయాలని చెప్పింది.

2014 నాటికి..

2014 నాటికి దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 1,581 కేసులున్నాయి. ఇందులో రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల సంఖ్య 240. ఎన్నికల సమయంలో నేతలపై నమోదయ్యే కేసులను ఈ జాబితాలో కలపలేదు. ఈ కేసుల్లో ఎన్నింటిపై ఏడాదిలోగా విచారణ ముగిసింది? ఎన్ని కేసుల్లో శిక్ష పడింది? ఎన్ని కేసుల్లో నిర్దోషులుగా తేల్చారన్న అంశాన్ని సుప్రీంకోర్టు అడిగింది. ఆయా కేసులన్నింటిపై ఏడాదిలోగా విచారణ పూర్తయి తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోమంది. కొన్ని క్రిమినల్ కేసులు తేలేందుకు 20ఏళ్ల సమయం కూడా పడుతోందని, ఇది సరైన పరిణామం కాదని స్పష్టం చేసింది. అదే సమయంలో 2014తర్వాత ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన కేసుల్లోనూ సత్వర తీర్పులు వచ్చేందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. 2014తర్వాత ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన కేసుల వివరాలన్నీ తీసుకుని...ఆయా క్రిమినల్ కేసులన్నింటినీ ప్రత్యేక కోర్టుల్లో విచారించాలని సూచించింది.

ప్రత్యేక కోర్టు.. రూపురేఖలు

రాష్ట్రాల్లో వచ్చే మార్చి ఒకటోతేదీనుంచి ప్రత్యేక కోర్టుల ఏర్పాటు జరగాలన్న కేంద్రం సూచనల మేరకు ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోంది. జిల్లా జడ్జి స్థాయిలోని ఒక న్యాయమూర్తిని ఈ కోర్టుకు అధిపతిగా నియమిస్తారు. ఆయనతో పాటు ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఇతర పోస్టులు ఉంటాయి. ఇలా మొత్తంగా దాదాపు 30వరకు కొత్త పోస్టులు మంజూరవుతాయి. ఈ కోర్టులో ఉండేది జిల్లా న్యాయమూర్తి స్థాయి అయినా...ఆయనకు రాష్ట్రవ్యాప్త పరిధి ఉంటుంది. రాష్ట్రంలో ఉండే ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న ఏ కేసులనైనా ఇక్కడకు బదలాయించుకుని విచారించవచ్చు. కొత్తగా ఏవైనా కేసులు నమోదైనా తమకే పంపించాలని ఆదేశించవచ్చు. ఈ కోర్టు ఏర్పాటుకు అవసరమైన ప్రాథమిక నిధులను కేంద్రమే సమకూరుస్తుంది. ఈ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు సుమారు రూ.1.90కోట్ల వ్యయం అవుతుంది. ఆ తర్వాత నిర్వహణ ఖర్చులు, ఇతరత్రా వ్యయాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చేలా ఏర్పాటుచేస్తున్నారు.



బాలుడు బాంకోల్‌తో రమేశ్ హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ రమేశ్‌బాబు, డాక్టర్ బెనడిక్ట్

అమరావతిలో 'మెడికల్ టూరిజం'

- **గుంటూరు రమేశ్ హాస్పిటల్‌లో.. నైజీరియా బాలుడికి గుండె ఆపరేషన్**

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 20: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో మెడికల్ టూరిజం విస్తరిస్తోంది. విదేశాల నుంచి పలువురు రోగులు శస్త్రచికిత్సల కోసం గుంటూరు వస్తున్నారు. అమెరికా, యూరప్ వంటి దేశాలతో పోలిస్తే ఇక్కడ ఉన్నత ప్రమాణాలతో చౌకగా వైద్యసేవలు లభించడమే ఇందుకు కారణం. నైజీరియాకు చెందిన షిగోజిరిమ్ బాంకోల్(7) అనే బాలుడికి రమేశ్ హాస్పిటల్స్‌లో గుండె శస్త్రచికిత్స నిర్వహించారు. గుండె జఠరికల మధ్య రంధ్రం(ఎఎస్‌డీ)తోపాటు బృహద్ధమని కవాటంలో లీకేజీ ఉండటంతో వాటిని సరిచేసేందుకు శస్త్రచికిత్స చేశారు. నైజీరియాలో చిన్నపిల్లల గుండె జబ్బులకు తగిన వైద్య సదుపాయాలు లేవు. బాలుడి కుటుంబ సభ్యులు ఇంటర్నెట్‌లో వెతికి గుంటూరు రమేశ్ హాస్పిటల్స్ వైద్యులను సంప్రదించారు. ఈ నెల 6న బాలుడికి చిన్నపిల్లల చీఫ్ హార్ట్‌సర్జన్ డాక్టర్ బెనెడిక్ట్ రాజ్ నేతృత్వంలో శస్త్రచికిత్స నిర్వహించారు. బాలుడు పూర్తిగా కోలుకున్నట్లు హాస్పిటల్ ఎండీ డాక్టర్ పి. రమేశ్‌బాబు మంగళవారం చెప్పారు. ఇదే శస్త్రచికిత్సకు అమెరికాలో 50-60 వేల డాలర్లు ఖర్చు అవుతుందని ఆయన తెలిపారు. తమ హాస్పిటల్‌లో కేవలం 5 వేల డాలర్లకే సర్జరీ చేసినట్లు చెప్పారు.

ఎఫ్‌డీసీ ఆస్తుల విక్రయానికి కమిటీ

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఏపీ చలనచిత్ర, టెలివిజన్ అభివృద్ధి కార్పొరేషన్ ఆస్తుల అమ్మకానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావుతో ముఖ్యమంత్రి ఒక కమిటీ వేశారు. తెలంగాణ-ఏపీలకు ఉమ్మడిగా ఉన్న ఈ భవనంలోని కొన్ని అంతస్థులు ఏపీకి వచ్చాయి. వీటిని అక్కడ ఉంచు కోవాల్సిన అవసరం లేదని భావించిన ప్రభుత్వం విక్రయించాలని నిర్ణయించింది.



మాతృభాషా? దినోత్సవం!

ఎడమవైపు ఉన్నది శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్‌పేటలోని వంశధార నదీ తీరంలో తీర్చిదిద్దిన సైకత శిల్పం. కుడివైపున ఉన్నది గుంటూరు జిల్లా మంగళగిరిలో మాతృభాషా దినోత్సవం సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఇచ్చేందుకు రూపొందించిన ధ్రువపత్రం. ఈ రెండింటిలోనూ ఆంగ్లభాషకు ప్రాధాన్యం ఇవ్వడం గమనార్హం. ఇదీ మన మాతృభాషా దినోత్సవం.

-శ్రీకాకుళం/గుంటూరు



అంతా సస్పెన్స్!

కేంద్రం నుంచి ఎన్ని నిధులొస్తాయో తెలియదు.. రాష్ట్ర బడ్జెట్ కూర్పుపై అధికారుల్లో అయోమయం

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం.. రాష్ట్రానికి ఎన్ని నిధులొస్తాయో తెలియదు.. ఎన్నికల ముందు పూర్తిస్థాయి బడ్జెట్.. వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ.. కానీ సంక్షేమానికే ప్రాధాన్యం.. ఖజానాకు వచ్చే ఆదాయం కంటే.. సబ్సిడీల రూపంలో ఖర్చులే అధికం.. వెరసి రాష్ట్ర బడ్జెట్ కూర్పు ఆర్థిక శాఖకు పెనుసవాలుగా మారింది. కేంద్ర బడ్జెట్‌లో పథకాల వారీగా ఏ రాష్ట్రానికి ఎన్ని నిధులెళ్తాయనే వివరాలు ఇంకా సస్పెన్స్‌గానే ఉన్నాయి. సాధారణంగా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రెండు మూడు రోజులకు ఏ రాష్ట్రాలకు ఏ పథకం ద్వారా ఎన్ని నిధులు వెళ్తాయనే వివరాలను కేంద్రం అందుబాటులోకి తేవడం ఆనవాయితీ. కానీ, బడ్జెట్ ప్రవేశపెట్టి దాదాపు 3 వారాలు అవుతున్నప్పటికీ ఇంతవరకు ఆ లెక్కలు బయటకి రాలేదు. మార్చి 5న పార్లమెంట్ తిరిగి ప్రారంభమై బడ్జెట్ ఆమోదం పొందిన తర్వాత ఆ వివరాలు వెల్లడిస్తారన్న ఊహాగానాలు మాత్రం ఉన్నాయి. ప్రతి ఏడాది కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత అందులో రాష్ట్రానికి వచ్చిన కేటాయింపుల ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌ను కొన్ని మార్పులు చేర్పులు చేసి సిద్ధం చేస్తారు. కానీ, ఈసారి మార్చి 8వ తేదీన రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సమాయత్తమైంది. కేంద్రం నుంచి వచ్చే నిధులపై స్పష్టత రాకపోవడంతో రాష్ట్ర బడ్జెట్‌లో కొత్త పథకాలకు కేటాయింపులపై అధికారులు ఇంకా సందిగ్ధంలో ఉన్నారు. కేంద్రం అన్ని పథకాలకూ కేటాయించిన మొత్తంలో గతేడాది ఏపీకి 5 శాతం వరకు నిధులొచ్చాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా కేంద్రం నుంచి 5 శాతం నిధులొస్తాయన్న అంచనాలతోనే రాష్ట్ర అధికారులు బడ్జెట్ కసరత్తు చేస్తున్నారు. ఎన్నికలు ముందు పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పెంచాలని, ఆదరణ లాంటి పథకాలను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఇందుకనుగుణంగానే సంక్షేమ రంగంలోని అన్ని శాఖలు కొత్త పథకాల రూపకల్పనలో బిజీగా ఉన్నాయి. కేంద్రం ఈసారి తన బడ్జెట్‌లో అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్ర సహాయం చేసే రాష్ట్రాభివృద్ధి పథకాలకు కలిపి రూ.3.8 లక్షల కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాలకు సంబంధించిన రివైజ్డ్ అంచనాలు రూ.3.61 లక్షల కోట్లుగా బడ్జెట్‌లో పేర్కొంది. అమరావతి నిర్మాణానికి, విజయవాడ మెట్రోకి కేంద్ర బడ్జెట్లో నిధులు ఆశించారు. కానీ, కేంద్రం కేటాయించకపోవడంతో.. రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని ఆ శాఖ మంత్రి నారాయణ ఆర్థిక శాఖను కోరారు. కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్ర అంచనాలు తలకిందులయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎన్ని నిధులొచ్చాయనే అంశంపై స్పష్టత వస్తే రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనలో ఉన్న సందిగ్ధం తొలగిపోతుందని ఆర్థిక శాఖ భావిస్తోంది.

కువైత్‌కు అనధికారికంగా రాష్ట్ర ప్రతినిధులు

- **కేంద్రం సానుకూలంగా స్పందించనందుకే..**
- **ప్రవాసాంధ్రులకు సహాయం కోసం రాక**

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

క్షమాభిక్ష పథకం కింద సొంతగడ్డకు తిరిగి రావాలనుకొంటున్న ప్రవాసాంధ్రులకు సహాయంగా కువైత్ వెళ్లే రాష్ట్ర ప్రతినిధులకు ఉచిత విమాన టికెట్లు, వీసాల విషయంలో కేంద్రం నుంచి రిక్తహస్తం ఎదురైంది! కొన్ని రోజుల క్రితం రాష్ట్రం పంపిన ఈ ప్రతిపాదనలకు కేంద్రం నుంచి సానుకూలత రాలేదని విశ్వసనీయంగా తెలిసింది. దీంతో, క్షమాభిక్ష గడువు గురువారంతో ముగియనున్నందున సీఎం చంద్రబాబు సూచనతో ఏపీ ప్రతినిధులు మంగళవారం అనధికార పర్యటనగా కువైత్‌కు వచ్చారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం కువైత్‌కు రావాల్సి ఉండగా వీసా లభించక రాలేదని తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఏపీ ఎన్నార్టీస్ సంస్థ అధ్యక్షుడు రవి వేమూరి మాత్రం ప్రైవేట్ వీసాపై కువైత్ వచ్చారు. మంత్రి రవీంద్ర కూడా ప్రైవేటు వీసాపై బుధవారం చేరుకుంటారని భావిస్తున్నారు. సాధారణంగా రాష్ట్రాలకు చెందిన అధికారిక బృందాలు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదంతో విదేశాలను సందర్శించడానికి దరఖాస్తు చేసుకొంటే... వారికి విదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు గౌరవమర్యాదలు కల్పిస్తాయి. స్థానిక అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తాయి. ఇలా వచ్చే వారికోసం ప్రత్యేకంగా తెల్లటి రంగులో ఉన్న పాస్‌పోర్టును జారీ చేస్తారు. కానీ, ఆంధ్రప్రదేశ్ బృందానికి ఆ రకమైన అనుమతి లేకపోవడంతో మామూలుగా ప్రైవేటు పర్యటనలో నీలిరంగు పాస్‌పోర్టులపై కువైత్ వచ్చారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఉచిత విమాన టికెట్ల కోసం రాసిన లేఖకు కేంద్రం స్పందించకపోవడంతో ఆ రాష్ట్రం మిన్నకుండిపోయినట్లు తెలిసింది.

క్షమాభిక్ష పథకం గడువు పెంపు

వీసా గడువు ముగిసి అక్రమంగా నివాసముంటున్న విదేశీయులు ఎలాంటి జరిమానాలు, జైలు శిక్షలు లేకుండా స్వదేశాలకు వెళ్లిపోవడానికి లేదా వీసాలు రెగ్యులరైజ్ చేసుకోవడానికి కువైత్ ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్ష పథకం గడువు వాస్తవంగా గురువారంతో ముగియాల్సి ఉంది. కానీ, ఈ గడువును మరో రెండు నెలలు పెంచుతూ హోం వ్యవహారాలను చూసే ఉపప్రధాని షేక్ ఖాలీద్ జర్రా అల్ సభా మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. క్షమాభిక్ష పథకంలో ఇప్పటివరకూ సుమారు పదివేల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో నాలుగువేల మంది వరకూ ఏపీ వారున్నారని తెలుస్తోంది.



మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయిన ఫేస్‌బుక్ ఇండియా ప్రతినిధులు


డ్వాక్రా ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్

- **గ్రామీణ మహిళలకు డిజిటల్ శిక్షణ.. మంత్రి లోకేశ్‌కు 'ఫేస్‌బుక్' హామీ**

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పనిచేస్తామని ఫేస్‌బుక్(ఇండియా) హెడ్ ఆఫ్ కనెక్టివిటీ పాలసీ అశ్వినీ రాణా పేర్కొన్నారు. గ్రామాల్లో మహిళలు తయారుచేసే ఉత్పత్తులను ఆన్‌లైన్లో అమ్ముకునే విధంగా డిజిటల్ శిక్షణ ఇస్తామని హామీ ఇచ్చారు. అశ్వినీ రాణాతో పాటు ఇతర ఫేస్‌బుక్ ప్రతినిధులు మంగళవారమిక్కడ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... ఏపీలో ఫేస్‌బుక్ మరింతగా విస్తరించేందుకు ఫైబర్‌గ్రిడ్ ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్నెట్ ప్రజలకు ప్రాథమిక హక్కుగా మారబోతోందని, ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. నూతన టెక్నాలజీతో ఏపీలో పైలట్ ప్రాజెక్టులు చేయాలని కోరారు. ఫైబర్‌నెట్ ద్వారా గ్రామాల్లోని ఇళ్లల్లో తయారుచేసే ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లే అవకాశం ఉందన్నారు. దీనికి ఫేస్‌బుక్ సహకారం ఉండాలని, ఫైబర్‌గ్రిడ్ వేదికగా వైఫై సేవలు విస్తరించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామని అశ్వినీ రాణా హామీ ఇచ్చారు.

ఖతర్ నుంచి క్షేమంగా వచ్చిన ఫాతిమా

- **'ఆంధ్రజ్యోతి' చొరవ.. ఎమ్మెల్యే కృష్ణమోహన్ సాయం**



చీరాల, ఫిబ్రవరి 20: ఖతర్‌లో బందీ అయిన ప్రకాశం జిల్లా మహిళ ఫాతిమా... మంగళవారం క్షేమంగా స్వస్థలం చేరారు. వేటపాలెం మండలం వినాయకపురానికి చెందిన ఫాతిమా పరాయి దేశంలో పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ 'ఖతర్‌లో బందీ అయిన తెలుగు మహిళ' శీర్షికతో ఈ నెల 17న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతోపాటు స్థానిక రాజకీయ నేతలతో కలిసి ఆమె కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను కలిసి ఆదుకోవాలని కోరారు. ఆయన స్పందించి పోలీసులు, దుబాయిలో ఉన్న తెలిసిన వారితో మాట్లాడారు. ప్రయాణ ఖర్చులు కూడా పెట్టుకుని... ఫాతిమా స్వస్థలం చేరేలా చర్యలు తీసుకున్నారు. చీరాల చేరిన ఆమెను వైద్యసాయం నిమిత్తం ఏరియా వైద్యశాలలో చేర్చారు. ఈ సందర్భంగా ఫాతిమా మీడియాతో మాట్లాడుతూ... మంగళగిరికి చెందిన సయ్యద్ సుభానీ ద్వారా గత అక్టోబరు 10న తాను ఖతర్ వెళ్లానని చెప్పారు. సుభానీ సూచించిన స్థానిక ఏజెంట్ కార్యాలయ ప్రతినిధి మృదుల ద్వారా ఓ ఇంట్లో పనికి కుదిరానని తెలిపారు. వారు నాలుగు రోజుల తరువాత 'మాకు ఫొటోలో చూపిన వ్యక్తివి నువ్వు కాదు' అంటూ హింసించటం మొదలు పెట్టారని వివరించారు. వారి వేధింపులు భరించలేక స్థానిక ఏజెన్సీ కార్యాలయానికి చేరుకున్నానని, వారు తనను మరో ఇంట్లో పనికి కుదిర్చారని చెప్పారు. అక్కడా హింస తప్పలేదని లక్ష రూపాయిలిస్తేనే పంపుతామంటూ వీసా, పాస్‌పోర్టులను తీసుకుని బందీగా ఇరుకు గదిలో ఉంచారని కన్నీటిపర్యంతమయ్యారు.

కోహ్లీ మరో ఘనత

వన్డేలు, టెస్టుల్లో 900 ర్యాంకింగ్ పాయింట్లు దాటిన విరాట్
ఈ ఘనత సాధించిన రెండో క్రికెటర్
బౌలింగ్‌లో బుమ్రా టాప్

దుబాయ్: తన బ్యాట్ పవర్‌తో రికార్డులు కొల్లగొడుతున్న భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో అరుదైన ఘనతను సాధించాడు. టెస్టులు, వన్డేల్లో 900 ర్యాంకింగ్ పాయింట్లు దాటిన రెండో క్రికెటర్‌గా నిలిచాడు. ఇక, పరిమిత ఓవర్లలో పదునైన బౌలింగ్‌తో చెలరేగిపోతున్న జస్‌ప్రీత్ బుమ్రా మంగళవారం ప్రకటించిన వన్డే బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సాధించాడు. సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌లో పరుగుల మోతెక్కించిన కోహ్లీ వన్డేల్లో టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. అంతేకాకుండా డివిల్లీర్స్ తర్వాత ప్రస్తుత తరం ఆటగాళ్లలో వన్డేలు, టెస్టుల్లో 900 పాయింట్లు దాటిన రెండో క్రికెటర్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా రెండు ఫార్మాట్లలో ఈ మార్కును ఐదుగురు మాత్రమే అందుకోగలిగారు. ఇక, ఈ ఆల్‌టైమ్ జాబితాలో విండీస్ దిగ్గజం లారాను కోహ్లీ దాటాడు. అలాగే, వన్డేల్లో ఆల్‌టైమ్ ర్యాంకింగ్స్ జాబితాలో ఏడో స్థానంలో నిలిచాడు. వివ్ రిచర్డ్స్ అత్యధికంగా 935 పాయింట్లు సాధించగలిగాడు. అయితే, భారత్ తరపున కోహ్లీనే అత్యుత్తమం. సచిన్ టెండూల్కర్ 1998 జనవరిలో అత్యధికంగా 887 పాయింట్లతో నిలిచాడు. ప్రస్తుతం విరాట్ వన్డేల్లో 909, టెస్టుల్లో 912 ర్యాంకింగ్ పాయింట్లతో ఉన్నాడు. వన్డేల్లో టాప్‌ప్లేస్‌తో, టెస్టుల్లో రెండోస్థానంలో నిలిచాడు. వన్డేల్లో డివిల్లీర్స్, వార్నర్ రెండు, మూడు ర్యాంక్‌లు నిలబెట్టుకున్నారు. ఇక ధవన్ 14 నుంచి పదో స్థానానికి ఎగబాకాడు. రోహిత్ 5నుంచి నుంచి 6కు, ధోనీ 12 నుంచి 15వ ర్యాంక్‌లకు పడిపోయారు. బౌలర్లలో బుమ్రా రెండు స్థానాలు మెరుగై టాప్‌ర్యాంక్ దక్కించుకున్నాడు. అఫ్ఘానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 8 నుంచి రెండో ర్యాంక్‌కు చేరాడు. బుమ్రా, రషీద్‌లు 787 పాయింట్లతో సమంగా ఉన్నా.. దశాంశాల తేడాతో భారత బౌలర్ టాప్‌లో నిలిచాడు. చాహల్ 20 స్థానాలు మెరుగై 8వ ర్యాంక్‌కు చేరాడు. కుల్దీప్ 41 స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్ సాధించాడు.



బుమ్రా



అమ్మాయిలు డబుల్ సిరీస్ కొడతారా?

సౌతాఫ్రికాతో నాలుగో టీ-20 నేడు

సెంచూరియన్: వన్డే సిరీస్ నెగ్గి, తొలి రెండు టీ-20 మ్యాచ్‌ల్లోనూ ఏకపక్ష విజయాలు సాధించిన భారత మహిళల జట్టు మూడో మ్యాచ్‌లో ఎదురైన అనూహ్య ఓటమి నుంచి కోలుకొనేందుకు సిద్ధమైంది. ఐదు టీ-20ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగే నాలుగో మ్యాచ్‌లో నెగ్గి సఫారీ గడ్డపై మరో సిరీస్‌తో డబుల్ ధమాకా మోగించాలని భావిస్తోంది. మరోవైపు గత మ్యాచ్‌లో భారత్‌ను చిత్తుగా ఓడించి రేసులో నిలిచిన సౌతాఫ్రికా అమ్మాయిలు అదే జోరును కొనసాగించి 2-2తో సిరీస్‌ను సమం చేయాలని చూస్తున్నారు. అయితే, ఇప్పుడు 2-1తో ఆధిక్యంతో ఉండడం భారత్‌కు సానుకూలాంశం. మరో మ్యాచ్‌లో నెగ్గితే ఒకే పర్యటనలో సఫారీలపై రెండు సిరీస్‌లు నెగ్గిన తొలి జట్టుగా రికార్డు సృష్టిస్తుంది. దీంతో, గత మ్యాచ్‌లో చేసిన తప్పులు సరిదిద్దుకొని విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది హర్మన్‌ప్రీత్‌సేన.

చాహల్ కళ్లజోడు కథ!



ముంబై: టీమిండియా స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ బౌలింగ్ లేదా బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కళ్లద్దాలు ధరించడు. కానీ వాండరర్స్‌లో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు కళ్లజోడుతో కనిపించాడు. దీని వెనుక రహస్యాన్ని అతడి తండ్రి బయటపెట్టాడు. కంటి వైద్యుడి సలహా మేరకు తన కొడుకు కళ్లజోడు ధరిస్తున్నాడని చెప్పాడు. 'చాహల్ దృష్టి మందగించలేదు. కానీ అప్పుడప్పుడూ వాడమని వైద్యుడు సూచించాడు. అందుకే కళ్లజోడు ధరించాడు' అని తెలిపాడు.

ఇక్కడే ముగిస్తారా!



సోనీ టెన్ 1లో రాత్రి 9.30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం

సిరీస్ కోసం భారత జట్టు ఆరాటం ఓ వైపు.. గెలిచి నిలిచేందుకు సఫారీల పోరాటం మరో వైపు.. ఈ నేపథ్యంలో ఇరు జట్లు రెండో టీ20కి సిద్ధమవుతున్నాయి. టెస్టు సిరీస్‌ను కోల్పోయిన తర్వాత టీమిండియా ఒక్కసారిగా గేరు మార్చింది.. భీకర ఆటతీరుతో దక్షిణాఫ్రికాను బెంబేలెత్తిస్తూ ఆరు వన్డేల సిరీస్‌ను 5-1తో సగర్వంగా దక్కించుకుంది. ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లోనూ అదే జోరు.. తొలి మ్యాచ్‌లో విజయానంతరం సిరీస్ కోసం రెండో టీ20పై కన్నేసింది. సమష్టి ఆటతీరుతో విరుచుకుపడి మరో మ్యాచ్ ఉండగానే విజేతగా నిలవాలనుకుంటోంది. అన్ని విభాగాల్లోనూ పటిష్ఠంగా కనిపిస్తున్న కోహ్లీ సేనను ప్రత్యర్థి ఏమేరకు నిలువరిస్తుందో చూడాలి..! మరోవైపు సఫారీలు చావో రేవో తేల్చుకోవాల్సిన స్థితిలో ఉన్నారు. సొంత గడ్డపై ఆడుతున్నా కూడా వారి కష్టాలు వర్ణనాతీతం. తీవ్ర ఒత్తిడిలో ఉన్న ప్రొటీస్ ఈ మ్యాచ్‌లో ఓడితే సిరీస్ గల్లంతైనట్టే..! ఈ స్థితిలో టాప్ ఆర్డర్ అంచనాలకు తగ్గట్టుగా రాణించి భారత్‌ను దెబ్బతీయడంతో పాటు చివరి మ్యాచ్ వరకు పోరాటాన్ని తీసుకెళ్లాలనుకుంటోంది.

» సిరీస్‌పై టీమిండియా కన్ను » నేడు దక్షిణాఫ్రికాతో రెండో టీ20 » ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి!

సెంచూరియన్: మూడో టెస్టులో అద్భుత విజయాన్ని అందుకున్న అనంతరం ఇప్పటిదాకా ఏడు మ్యాచ్‌లు ఆడిన భారత జట్టు కేవలం ఒక్కసారి మాత్రమే ఓడింది. కోహ్లీ సేన ఆటతీరు ఏ స్థాయిలో ఉందో దీన్ని బట్టి అర్థమవుతోంది. ఇదే జోరుతో దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగే రెండో టీ20లో భారత్ తలపడనుంది. ఇప్పటికే 1-0తో ఆధిక్యంలో ఉండగా ఈ మ్యాచ్‌లోనూ నెగ్గితే మూడు టీ20ల సిరీస్‌ను కూడా తమ ఖాతాలో వేసుకోగలుగుతుంది. ఈ సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేస్తే భారత్ టీ20 ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకుంటుంది. మరోవైపు మూకుమ్మడి వైఫల్యం ప్రొటీస్‌ను ఇబ్బందిపెడుతోంది.

గెలుపే లక్ష్యంగా...

తొలి మ్యాచ్‌ను అద్భుతంగా ముగించిన భారత్ ఆత్మవిశ్వాసంతో ఉంది. పవర్‌ప్లేలో రోహిత్, ధవన్ పరిస్థితులకు తగ్గట్టు వేగంగా ఆడారు. అనూహ్యంగా వన్‌డౌన్‌లో దిగిన రైనా అంతర్జాతీయ క్రికెట్ ఆడి చాలాకాలమైనా మంచి టచ్‌తో కనిపించాడు. ఈసారీ అతను అదే స్థానంలో రావొచ్చు. కానీ మిడిలార్డర్ నుంచి ఆశించిన స్థాయిలో పరుగులు రావడం లేదు. ధోనీ, మనీశ్ పాండేలకు తొలి మ్యాచ్‌లో ఎక్కువ సమయం ఆడే చాన్స్ వచ్చినా వేగం కనిపించలేదు. వచ్చీ రావడంతోనే ధోనీ బ్యాట్‌ను ఝుళిపించలేకపోతున్నాడు. ఇక పాండే 27 బంతుల్లో 29 రన్సే చేయడంతో చివర్లో స్కోరు పెరగలేదు. పాండ్యా నిరాశపరుస్తూనే ఉన్నాడు. బౌలింగ్‌లో మాత్రం భారత్ పూర్తి భరోసాతో ఉంది. పేసర్ భువనేశ్వర్ ప్రధాన అస్త్రంగా మారి జట్టును ఆదుకుంటున్నాడు. పిచ్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఉనాద్కట్‌ను తప్పించి మరో స్పిన్నర్‌గా కుల్దీప్‌ను జట్టులోకి తీసుకోవచ్చు.

సఫారీలకు సవాల్

డుప్లెసిస్, డివిల్లీర్స్‌లాంటి స్టార్ ఆటగాళ్లు లేని స్థితిలో దక్షిణాఫ్రికాను పరాజయాలు మరింత ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. శత్రు దుర్భేద్యంగా కనిపిస్తున్న టీమిండియాపై సఫారీలు పైచేయి సాధించడం కష్టమవుతోంది. తొలి మ్యాచ్‌లో ఓపెనర్ హెన్‌డ్రిక్స్ మినహా అంతా విఫలమయ్యారు. డివిల్లీర్స్ స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాడిని ప్రకటించకపోవడంతో తమకు అందుబాటులో ఉన్న ఆటగాళ్లతోనే కెప్టెన్ డుమిని సర్దుకోవాల్సిన పరిస్థితి ఉంది. పవర్‌ప్లేలో షార్ట్ బంతులతో భయపెడదామనుకున్న వీరి వ్యూహం విఫలమైంది. ఈ మ్యాచ్‌లో సఫారీ బౌలర్లకు పిచ్ సహకరిస్తే మరింత బౌన్స్‌తో మరోసారి అదే వ్యూహంతో చెలరేగాలని చూస్తోంది. ప్యాటర్సన్ స్థానంలో స్పిన్నర్ ఫంగిసోకు స్థానం లభించవచ్చు.



డుమినీ

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, ధవన్, రైనా, కోహ్లీ (కెప్టెన్)/రాహుల్, పాండే, ధోనీ, పాండ్యా, భువనేశ్వర్, ఉనాద్కట్/కుల్దీప్, బుమ్రా, చాహల్.

దక్షిణాఫ్రికా: స్మట్స్, హెన్‌డ్రిక్స్, డుమిని (కెప్టెన్), మిల్లర్, బెహర్డీన్, క్లాసెన్, ఫెహ్లుక్వాయో, మోరిస్, ఫంగిసో, డాలా, షంసి.

18 టీ20ల్లో 2 వేల పరుగులు పూర్తి చేసేందుకు కోహ్లీకి కావాల్సిన పరుగులు.

వాతావరణం, పిచ్: వాండరర్స్‌తో పోలిస్తే ఇక్కడి సూపర్‌స్పోర్ట్స్ పార్క్ పిచ్ స్లోగానే ఉండనుంది. స్పిన్నర్లు కీలకం కానున్నారు. మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

విరాట్ ఆడేనా..?

రెండో టీ20లో కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆడడంపై స్పష్టత కనిపించడం లేదు. తుంటి భాగంలో నొప్పి కారణంగా తను తొలి టీ20లో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు మైదానాన్ని వీడాడు. నేలపై నుంచి బంతి తీయడంలో తను ఇబ్బంది పడ్డాడు. దీంతో ముందుజాగ్రత్తగా డగౌట్‌లో విశ్రాంతి తీసుకోవడం కనిపించింది. కానీ ఇదేమంత తీవ్రగాయం కాదని టీమ్ మేనేజ్‌మెంట్ చెబుతోంది. బుధవారం ఉదయం వరకు ఈ విషయంలో స్పష్టత వస్తుందని పేర్కొంది. అయితే మున్ముందు సుదీర్ఘ సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని అతడికి విశ్రాంతి కల్పిస్తే కేఎల్ రాహుల్ జట్టులోకి వచ్చే అవకాశాలున్నాయి.



'వన్ అండ్ ఓన్లీ' విరుష్క..!

ప్రేమించి పెళ్లాడిన అనుష్క శర్మను ఆప్యాయంగా హత్తుకొని ముద్దాడుతున్న ఫొటోనూ విరాట్ కోహ్లీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. తమ వెనకాల ఉన్న పెయింటింగ్‌లో ముద్దుపెట్టుకుంటున్న జంట పోజును విరుష్క కూడా అనుసరించినట్టుంది. దీనికి కోహ్లీ 'వన్ అండ్ ఓన్లీ' అని క్యాప్షన్ ఇచ్చాడు. ఇప్పుడీ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కోహ్లీ షేర్ చేసిన గంటలోనే 25 లక్షల మందిని దీన్ని లైక్ చేశారు. దీన్ని చూస్తుంటే 'ది వన్ అండ్ ఓన్లీ' జంట విరుష్కనే అనొచ్చు..!

పీఎన్‌బీ బ్రాండ్ అంబాసిడర్‌గా కోహ్లీ కొనసాగేనా?

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం నేపథ్యంలో.. దానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న విరాట్ కోహ్లీపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది. పీఎన్‌బీ 2016లో కోహ్లీని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. అప్పటినుంచి ఆ బ్యాంకు తరపున కోహ్లీ పలు ప్రచార ప్రకటనల్లో కనిపించాడు. అయితే తాజాగా నీరవ్ మోదీ ఉదంతం వెలుగులోకి రావడంతో పీఎన్‌బీ అంబాసిడర్‌గా కోహ్లీ కొనసాగుతాడా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

జట్టులోకి తీసుకోలేదని..

పాక్ మాజీ క్రికెటర్ కుమారుడి ఆత్మహత్య



ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ క్రికెటర్ అమర్ హనీఫ్ కుమారుడు మహమ్మద్ జర్యాబ్ ఆత్మహత్య చేసుకున్నాడు. అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపిక చేయకపోవడంతో అతను ఉరి వేసుకున్నట్టు పాక్ మీడియా తెలిపింది. కళాశాల విద్యార్థి అయిన జర్యాబ్ వయసు ఎక్కువగా (ఓవరేజ్) ఉన్నాడన్న కారణంగా అతణ్ణి అండర్-19 జట్టుకు ఎంపిక చేయలేదు. దీంతో మనస్థాపానికి గురైన జర్యాబ్ సోమవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. అయితే, తన కుమారుడిపై ఒత్తిడి పెంచారని, కోచ్‌లు అవలంబించిన వైఖరే అతడు ఆత్మహత్యకు పాల్పడేలా చేసిందని హనీఫ్ ఆరోపించాడు.

చీరలకు బదులు కోట్లు, ప్యాంట్లు!

కామన్వెల్త్ గేమ్స్ డ్రెస్‌కోడ్‌లో మార్పులు

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఏ క్రీడా వేడుక అయినా భారత మహిళా అథ్లెట్ల డ్రెస్ కోడ్‌ది ప్రత్యేకస్థానం. సంప్రదాయ చీరకట్టుతో మువ్వన్నెల జెండాలు చేబూని అమ్మాయిలు మార్చ్‌పాస్ట్‌లో తళుక్కున మెరవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆస్ట్రేలియాలో జరగనున్న ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడల్లో ఈ సంప్రదాయం మారనుంది. ఈ టోర్నీ ఆరంభవేడుకలకు భారత క్రీడాకారిణుల చీరలకు బదులు బ్లేజర్ (కోట్), ట్రౌజర్ (ప్యాంట్)లతో పాల్గొంటారని భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) మంగళవారం తెలిపింది.

హైదరాబాద్ జోరు సాగేనా!

'హజారే'లో కర్ణాటకతో క్వార్టర్స్ నేడు

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో సొంతగడ్డపై గ్రూప్ దశలో టాప్‌క్లాస్ ప్రదర్శన చేసిన హైదరాబాద్ సత్తాకు సిసలైన పరీక్ష. గ్రూప్-డి టాపర్‌గా నాకౌట్‌కు చేరుకున్న హైదరాబాద్ బుధవారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో పటిష్ఠ జట్టు కర్ణాటకను ఎదుర్కోనుంది. దేశవాళీలో అత్యుత్తమంగా భావించే ఈ వన్డే టోర్నీలో తొలిసారి విజేతగా నిలవాలని రాయుడుసేన ఆరాటపడుతోంది. రెండో క్వార్టర్‌ఫైనల్లో ముంబై, మహారాష్ట్ర అమీతుమీ తేల్చుకోనున్నాయి.



'అజ్లాన్ షా' కెప్టెన్‌గా సర్దార్

న్యూఢిల్లీ: వెటరన్ మిడ్‌ఫీల్డర్ సర్దార్‌సింగ్‌కు మరో అవకాశం లభించింది. వచ్చేనెలలో జరుగనున్న అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు కెప్టెన్‌గా సర్దార్ ఎంపికయ్యాడు. తన కెరీర్ చివరి దశలో ఉన్న సర్దార్‌సింగ్‌కు గత రెండు అంతర్జాతీయ పర్యటనలకు జట్టులో చోటే దక్కలేదు. అటువంటిది రెగ్యులర్ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్‌కు విశ్రాంతి కల్పించి సర్దార్‌కు ఏకంగా సారథ్య బాధ్యతలు కట్టబెట్టారు.



ముంబైలో జరిగిన ఓ ఈవెంట్‌లో సింధు, లలితా బాబర్, శ్రీకాంత్, సాక్షి మాలిక్

కామన్వెల్త్‌కు సింధు, శ్రీకాంత్ సారథ్యంలో..

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ఏప్రిల్ 4నుంచి జరిగే కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత బ్యాడ్మింటన్ జట్టుకు స్టార్ షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ నేతృత్వం వహించనున్నారు. కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు పతకావకాశాలు మెండుగా ఉన్న ఈవెంట్ బ్యాడ్మింటన్. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్, హెచ్.ఎస్.ప్రణయ్, మహిళల సింగిల్స్‌లో సింధు, సైనాలపైనే ఆశలన్నీ. పురుషుల డబుల్స్‌లో చిరాగ్ శెట్టి, సాత్విక్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ చోప్రా, సిక్కిరెడ్డి, మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, సిక్కిరెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నారు. గ్రూప్-ఎలో ఇండియా, పాకిస్థాన్, శ్రీలంక, స్కాట్లాండ్ తలపడనున్నాయి.

ఆ క్రెడిట్ అంతా భువనేశ్వర్‌దే!

(కృష్ణమాచారి శ్రీకాంత్)

సౌతాఫ్రికా టూర్‌లో భారత్ గెలుపు జోరు కొనసాగిస్తున్నందుకు సంతోషంగా ఉంది. మొదటి టీ20లో కోహ్లీసేన సూపర్ విక్టరీని అందుకుందంటే ఆ క్రెడిట్ భువనేశ్వర్‌దే. మ్యాచ్‌లో రెండు కీలక సమయాలు పవర్ ప్లే, డెత్ ఓవర్లలో అతడు అద్భుత ప్రదర్శన చేశాడు. ఆ సమయంలో బ్యాట్స్‌మెన్ ఎదురుదాడి వ్యూహంతో ఉంటారు. కానీ వారికి భువీ ముకుతాడు వేశాడు. స్కోరుబోర్డును గమనిస్తే ఒక్క భువీని తప్పించి మిగతా బౌలర్లందరిపైనా సఫారీ బ్యాట్స్‌మెన్ బ్యాట్ ఝుళిపించారు. అసలు భువీ ఇంతగా చెలరేగడానికి కారణం? అతడి యాక్షన్, బంతిని స్వింగ్ చేసే నైపుణ్యమే. వీటికితోడు నకుల్ బాల్‌తో మరింత ప్రమాదకరంగా మారాడు. ఇలాంటి వైవిధ్య బంతులు సంధిస్తున్నాడు కాబట్టే సఫారీలు బెంబేలెత్తిపోతున్నారు. పరుగులను అరికట్టడమే కాదు వికెట్లు తీయడం వల్ల కూడా మ్యాచ్‌పై పట్టుబిగించేలా చేస్తున్నాడు. మొదటిస్పెల్‌లో రెండు వికెట్లు కూల్చిన భువీ.. చివర్లో మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బ తీశాడు. సౌతాఫ్రికా జట్టు ఇంతపేలవ ఆటతీరును ప్రదర్శించడం ముందెన్నడూ చూడలేదు. జట్టు సెలెక్షన్‌లో తప్పిదం జరిగిందని అనిపిస్తోంది. బ్యాటింగ్‌లో డుమిని, మిల్లర్ రాణించకపోవడం ఆ జట్టుపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

-(టీసీఎమ్)

ఆమ్నెస్టీ గడువును పొడిగించిన కువైత్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): గల్ఫ్ దేశంలో వీసా గడువు ముగిసినా అక్కడే ఉంటున్న విదేశీయులకుజరిమానాలు, జైలుశిక్ష లేకుండా స్వదేశాలకు వెళ్లేందుకు ప్రకటించిన క్షమాభిక్ష (ఆమ్నెస్టీ) పథకాన్ని కువైత్ ప్రభుత్వం మరో రెండు నెలలు పాటు పొడిగించింది. వాస్తవానికి గురువారంతో ఈ పథకం గడువు ముగియనుంది. కానీ.. ఆ దేశ ఉపప్రధాని షేక్ ఖాలీద్ జర్రా అల్ సబ మంగళవారం చేసిన ప్రకటనతో వీసాలను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ఏప్రిల్ 22 వరకు అవకాశం కల్పించినట్లు అయ్యింది. క్షమాభిక్ష పథకానికి ఇప్పటి వరకు సుమారు 10,000 మంది దరఖాస్తు చేసుకోగా.. వీరిలో 4,000 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నట్లు తెలుస్తోంది.

భారత్ కాల్పుల్లో ఎనిమిదేళ్ల బాలుడి మృతి

పాక్ ఆరోపణ.. భారత రాయబారికి ఫిర్యాదు

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 20: భారత్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడి సరిహద్దులో ఎనిమిదేళ్ల బాలుణ్ని పొట్టనబెట్టుకుందని పాక్ ఆరోపించింది. ఈ మేరకు ఆ దేశంలోని భారత రాయబారి జేపీ సింగ్‌కు ఫిర్యాదు చేసింది. సోమవారం ఖుయ్‌రట్టా సెక్టార్‌లో భారత్ కాల్పులకు తెగబడిందని పేర్కొంది. వాటిని ధీటుగా ఎదుర్కొన్న పాక్ దళాలు భారత సైనిక పోస్టును ధ్వంసం చేసినట్లు, ఇద్దరు భారత జవాన్లు చనిపోయినట్లు తెలిపింది. ఈ ఆరోపణలను భారత సైన్యం ఖండించింది.

అగ్ని-2ని పరీక్షించిన ఆర్మీ

బాలాసోర్ (ఒడిసా), ఫిబ్రవరి 20: భారత సైన్యానికి చెందిన స్ట్రాటెజిక్ ఫోర్సెస్ కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) మంగళవారం ఉదయం అగ్ని-2 క్షిపణిని పరీక్షించింది. అబ్దుల్ కలాం ద్వీపంలో పరీక్షించిన ఈ క్షిపణి భూ ఉపరితలం నుంచి 2,000 కిలోమీటర్ల పరిధిలో ఉండే భూ ఉపరితల లక్ష్యాలను ఛేదించగలదు. 17 టన్నుల బరువుండే ఈ మధ్యతరహా బాలిస్టిక్ మిసైల్.. వెయ్యి కిలోల న్యూక్లియర్ వార్‌హెడ్‌ను మోసుకుపోగలదు. దీన్ని 1999 ఏప్రిల్ 11న మొదటిసారి పరీక్షించగా.. ప్రస్తుతం భారత సైన్యం అమ్ముల పొదిలో ఉంది. భారత్-చైనా, భారత్-పాక్ సరిహద్దుల్లో నెలకొంటోన్న పరిస్థితుల నేపథ్యంలో సైన్యం ఈ క్షిపణిని పరీక్షించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

పట్టణ గృహ నిర్మాణాలకు మరో పాతిక వేల కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కోటి ఇరవై లక్షల గృహ నిర్మాణాలే లక్ష్యంగా.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పట్టణ)కు అదనంగా రూ.25 వేల కోట్లు కేటాయించాలనే ప్రతిపాదనలను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. తాజా బడ్జెట్‌లో పట్టణ గృహ నిర్మాణానికి రూ. 6,505 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మంగళవారం జరిగిన కేబినెట్ భేటీలో 'చార్‌ధామ్ సొరంగ మార్గం' ప్రాజెక్టుకు రూ.1,384 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. 4.5 కిలోమీటర్ల సొరంగ మార్గంతో.. కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి మధ్య దూరం తగ్గుతుంది.

బెంగళూరును రెండో రాజధానిగా ప్రకటించండి

ప్రధానికి కర్ణాటక వినతి

బెంగళూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బెంగళూరును దేశ రెండో రాజధానిగా ప్రకటించాలని ప్రధాని నరేంద్రమోదీకి కర్ణాటక విజ్ఞప్తి చేసింది. సోమవారం మైసూరులో జరిగిన కార్యక్రమంలో భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఆర్వీ దేశ్‌పాండే ఈ మేరకు వినతిపత్రాన్ని ప్రధానికి అందజేశారు. దక్షిణ భారతదేశంలోనే అతివేగంగా విస్తరిస్తున్న బెంగళూరును రెండో రాజధానిగా ప్రకటిస్తే పెట్టుబడులు కూడా గణనీయంగా తరలివస్తాయని తెలిపారు. అయితే కర్ణాటక వినతికి ప్రధాని తక్షణం స్పందించలేదు.

సిరియాలో మారణహోమం

వైమానిక దాడుల్లో 200మంది మృతి

మృతుల్లో 57మంది చిన్నారులు

బీరుట్/అర్బిన్, ఫిబ్రవరి 20: తిరుగుబాటుదారుల చేతుల్లో ఉన్న ప్రాంతాన్ని తిరిగి చేజిక్కించుకోవడమే ఆ ప్రభుత్వం ముందు ఉన్న లక్ష్యం. ఆ లక్ష్యం వల్ల చిన్నాపెద్దా అనే తేడా లేకుండా వందలాది మంది అమాయకులు రక్తమోడుతున్నారు. వేలాదిమంది జీవితాలు చెల్లాచెదురవుతున్నాయి. సిరియాలో అంతర్యుద్ధం వల్ల ఏర్పడిన పరిస్థితి ఇది. తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న తూర్పు గౌటా ప్రాంతంలో తమ పట్టు నిలుపుకునేందుకు సిరియన్ బలగాలు వైమానిక దాడులకు పాల్పడుతున్నాయి. వరుసగా మూడురోజుల నుంచి జరుగుతున్న ఈ దాడుల్లో కనీసం 197 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 57 మంది అభం శుభం ఎరుగని చిన్నారులే ఉన్నారు. సోమవారం ఒక్కరోజే 50 మంది చనిపోయారని బ్రిటన్‌కు చెందిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. డమాస్కస్ శివార్లలో 2015 తర్వాత జరిగిన అతిపెద్ద దాడిగా అభివర్ణించింది.

పసిప్రాణాలు పోతున్నాయ్...!

ప్రతి వెయ్యిలో 25 మంది మృతి.. 52 దేశాల్లో భారత్‌కు 12వ స్థానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: శిశు మరణాల రేటులో భారత్ పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది. తక్కువ ఆదాయం కలిగిన 52 దేశాల జాబితాలో మన దేశానికి 12వ ర్యాంకు వచ్చింది. 2016 లెక్కల ప్రకారం పుట్టిన నెలలోనే దాదాపు 6 లక్షల మంది చిన్నారులు చనిపోయారని యూనిసెఫ్ వెల్లడించింది. ఆ ఏడాది ప్రతీ వెయ్యి మంది చిన్నారుల్లో 25 మందికిపైగా చనిపోయారట. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, పాకిస్థాన్‌లలో ప్రతీ వెయ్యి మందిలో 45 మంది చనిపోతున్నట్లు లెక్క తేల్చింది. పాకిస్థాన్, మధ్య ఆఫ్రికా, అఫ్ఘాన్‌లలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఐదేళ్లలోపు చనిపోతున్న చిన్నారుల మరణాల రేటు తగ్గినా.. పుట్టిన నెలలోపు చిన్నారులను రక్షించుకోలేని పరిస్థితి ఇంకా భారత్‌లో ఉన్నట్లు యూనిసెఫ్ ఈడీ హెన్రీట్టా తెలిపారు. సంపన్న దేశాల్లో ప్రతీ 1000 మందికి ముగ్గురు చిన్నారులు నెలలోపు చనిపోతున్నారని యూనిసెఫ్ పేర్కొంది.

పాముపై పగబట్టి కొరికి చంపాడు

పాము తనను కరిచేసిందని భావించాడో రైతు! పట్టలేని కోపంతో దాని తలను కొరికి నమిలి పారేశాడు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ ప్రాంతంలో చోటు చేసుకుంది. సోనేలాల్ అనే రైతు తన పశువులతో వస్తుండగా అతడి కాలిపై ఏదో కుట్టినట్లనిపించింది. వెంటనే చూస్తే ఓ పాము కనిపించింది. అదే తనను కరిచేసిందని భావించాడు. పట్టలేని కోపంతో దాని తల కొరికి నమిలిపారేశాడు. వెంటనే స్పృహతప్పి పడిపోయాడు. ఆస్పత్రిలో చేర్పిస్తే అతడిని ఏ పామూ కరవలేదని తేలింది.



చిన్నారిని కొరికి చంపేసిన కుక్క

ఊయలలో నిద్రిస్తున్న బాలుడిపై దాడి



క్రిష్ణగిరి, ఫిబ్రవరి 20: ఊయలలో హాయిగా నిద్రిస్తున్న చిన్నారిని ఓ కుక్క కొరికి చంపేసింది. ఈ దారుణ ఘటన కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం చిట్యాలలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చిట్యాలకు చెందిన తలారి హుస్సేన్, చాంద్‌బీ దంపతులు. మంగళవారం తమ పొలంలో యంత్రం సాయంతో వేరుశనగ పంట నూర్పిడి చేస్తున్నారు. ఆ సమయంలో వారి కుమారుడు ఇబ్రహీం(4) నిద్రకు ఉపక్రమించడంతో పక్కనే ఉన్న చెట్టుకు ఊయల వేసి అందులో పడుకోబెట్టారు. ఆపై తమ పనిలో నిమగ్నమైపోయారు. చిన్నారి నిద్రపోతున్న సమయంలో అక్కడికొచ్చిన కుక్క ఇబ్రహీం గొంతును కొరికేసింది. మొహంపైనా దాడి చేసి చంపేసింది. పని పూర్తయిన తర్వాత హుస్సేన్ దంపతులు ఊయల దగ్గరికెళ్లి చూడగా ఇబ్రహీం నిర్జీవంగా కనిపించాడు. కుక్క దాడిలో చనిపోయిన కొడుకును చూసి వారు కన్నీరుమున్నీరయ్యారు.

ప్రైవేటు ఆస్పత్రులకు మందులపై


1200% లాభం

- ఎంఆర్‌పీని భారీగా పెంచి ముద్రించమని డిమాండ్
- జనం బయటకు వెళ్లి మందులు కొనలేని పరిస్థితి
- కేథటర్, కేనులా వంటి పరికరాల ధరల్లో దోపిడీ
- జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: అవి దేశ రాజధాని ఢిల్లీలో నాలుగు పేరున్న పెద్ద ప్రైవేటు ఆస్పత్రులు. ఇక్కడ వైద్య బిల్లులు గుండె గుభేల్‌మనిపిస్తున్నాయంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రోగాల బారినపడ్డ వాళ్లు బతకకపోగా... బిల్లు ఎలా కట్టాలో తెలియక పైప్రాణాలు పైనేపోతున్నాయని బంధువులు ఆ ఫిర్యాదుల్లో గగ్గోలు పెట్టారు. ఆ ఆస్పత్రుల బిల్లులను విశ్లేషించిన జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) సైతం ఆశ్చర్యపోయింది. ఆ ఆస్పత్రులు మందులు, రోగ నిర్ధారణ పరీక్షలపై 1,737 శాతం వరకు లాభాలు ఆర్జిస్తున్నట్లు కనుగొంది. ఈ మొత్తం పేషెంటు బిల్లులో 46 శాతం ఉంటోంది! ఒక్క మందులపైనే 1200 శాతం లాభం వస్తోంది. ఈ వివరాలను ఎన్‌పీపీఏ మంగళవారం వెల్లడించింది. జనం రక్తం పీల్చేస్తున్న ఆస్పత్రుల ధనదాహానికి ఇదో ఉదాహరణ. మందులు, పరికరాలను ప్రైవేటు ఆస్పత్రుల్లోని దుకాణాల్లోనే విక్రయిస్తుండడంతో బయట తక్కువ ధరకు దొరుకుతున్నా వెళ్లి కొనుక్కొనే అవకాశం ఉండడం లేదు. గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)ను బాగా పెంచి ముద్రించమని ఆస్పత్రులు డిమాండ్ చేస్తున్నాయి. ఇలా చేస్తేనే మీ మందులు కొంటామని తయారీదారులకు షరతు విధిస్తున్నాయి. వీటిని పెద్ద పరిమాణంలో ఆస్పత్రులు కొంటుండడంతో ఎంఆర్‌పీ నిబంధనను ఉల్లంఘించకుండానే జనం జేబుకు కత్తెర వేస్తున్నట్లు ఎన్‌పీపీఏ గుర్తించింది. కేథటర్, కేనులా వంటి పరికరాలపై భారీ మార్జిన్లు అనైతిక లాభాలకు తార్కాణమని వ్యాఖ్యానించింది. .

- మందులు, పరికరాలు, రోగ నిర్ధారణ పరీక్ష ఖర్చులు బిల్లులో 50% ఉంటున్నాయి. ఇవి ఆస్పత్రులు ఇచ్చే 'ఎస్టిమేట్'లో ఉండడం లేదు.
- మందులు, పరికరాలపై అత్యధికంగా 350 నుంచి 1700% వరకు ఆస్పత్రులకు లాభం వస్తోంది.
- ధరల నియంత్రణ పరిధిలో లేని మందులపై మార్జిన్ 160 నుంచి 1200% వరకు ఉంటోంది. ధరల నియంత్రణ పరిధిలో ఉంటే 115 నుంచి 360% లాభం వరకు వస్తోంది.
- చాలా మందులు ఔషధాల జాబితాలో లేకపోవడంతో ఎన్‌పీపీఏ ఏం చేయలేపోతోంది. రోగ నిర్ధారణ పరీక్షల ధరలు, ఆస్పత్రుల్లో ఇతర చార్జీలు కూడా ఎన్‌పీపీఏ పరిధిలో లేవు.



రాజ్‌ఘాట్ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శనకు వెళుతున్న ఐఏఎస్‌లు, ఇతర అధికారులు

సీఎస్‌పై ఎమ్మెల్యేల దాడి

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఎదుటే కొట్టిన ఆప్ శాసనసభ్యులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం రాత్రి ఆయన నివాసంలో ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశం రణరంగమైంది. ఆ భేటీలో తనను కొట్టారని ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్ ఆరోపించారు. కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాల సమక్షంలోనే దాడి జరిగిందని తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆప్ సర్కారు సాధించిన విజయాలపై టీవీ ప్రకటనలు విడుదల చేయకపోతే తప్పుడు కేసుల్లో ఇరికిస్తామని కూడా బెదిరించారని 1986 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన అన్షు ప్రకాశ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. "ఆప్ సర్కారు మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీవీలకు వాణిజ్య ప్రకటనలు జారీ చేసే విషయంపై చర్చించేందుకు సీఎం నివాసంలో సోమవారం అర్ధరాత్రి సమావేశం ఉందంటూ రాత్రి 11.30కు ఫోన్ చేసి రమ్మంటే వెళ్లాను. అక్కడ కేజ్రీవాల్, సిసోడియాలతో పాటు 11 మంది ఆప్ ఎమ్మెల్యేలు ఉన్నారు. టీవీలకు ప్రకటనలు ఇవ్వడంలో ఎందుకు ఆలస్యమైందో సమాధానం చెప్పాలని సీఎం ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పా. ఎమ్మెల్యేలు నన్ను దుర్భాషలాడారు. ఎమ్మెల్యే అమానుతుల్లా ఖాన్, మరో ఎమ్మెల్యే కలిసి నా తల, కణతపై పిడిగుద్దులు గుద్దారు. కళ్లజోడు పగిలిపోయింది. నేను తప్పించుకొని బయటపడి ఇంటికి వెళ్లా" అని ప్రకాశ్ ఫిర్యాదులో వివరించారు. సీఎస్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఐఏఎస్ అధికారుల సంఘం సభ్యులు లెఫ్టినెంట్ గవర్నర్ బైజల్‌ను కలిసి నిరసన వ్యక్తం చేశారు. 7వేల మంది ఉద్యోగులు విధులు బహిష్కరించారు. బీజేపీకి అనుకూలంగానే సీఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆప్ విమర్శించింది. అధికారులు, నేతలు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. మంగళవారం సాయంత్రం కేజ్రీవాల్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశానికి సీఎస్ ప్రకాశ్ గైర్హాజరయ్యారు.

'ఐ లవ్ యూ స్టూడెంట్'

విద్యార్థిని పట్ల టీచర్ నిర్వాకం.. అరెస్టు

చెన్నై, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థినికి 'ఐ లవ్ యూ' చెప్పిన ఓ ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని విల్లుపురం జిల్లాలో ఈ ఘటన జరిగింది. మేల్‌మలైనూర్‌లోని సెయింట్ ఆంటోని పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న నిర్మల్(48) ఈ నెల 14న ప్రేమికుల రోజు సందర్భంగా 13ఏళ్ల విద్యార్థినికి గులాబీ పువ్వు ఇస్తూ.. 'ఐ లవ్ యూ' చెప్పాడు. ఆమె విలపిస్తూ ఇంటికెళ్లి ఉపాధ్యాయుడి నిర్వాకాన్ని తల్లిదండ్రులకు వివరించింది. వారి ఫిర్యాదుతో పోలీసులు నిర్మల్‌ను,అతనికి సహకరించిన మరో ఇద్దరు టీచర్లను అరెస్టు చేశారు.

వలసదారులపై మరో పిడుగు!

అదేపనిగా బంధువులను తీసుకొచ్చి అమెరికాలో స్థిరపడే వారికి చెక్?



న్యూయార్క్, ఫిబ్రవరి 20: వలసదారులపై అమెరికా మరింత ఉక్కుపాదం మోపుతోందా? ఈ ప్రశ్నకు అవుననే అంటున్నాయి శ్వేతసౌధం వర్గాలు. యూఎస్ ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం అమెరికాలో ఒకరు స్థిరపడి...ఆ తర్వాత అమ్మా, నాన్న, భార్యాపిల్లలు, దగ్గర బంధువులు ఇలా ఒకరి తర్వాత మరొకరిని తీసుకొచ్చి..ఆపై అంతా ఆ దేశ పౌరులుగా మారుతున్నారు. దీనికి చెక్ పెట్టాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. శ్వేతసౌధం నుంచి వస్తున్న కథనాలతో చాలా మంది వలసదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే వలసవాదచట్టం వల్ల అమెరికా భద్రతకు ముప్పు ఏర్పడుతోందని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఈ విధానం మార్చాలనే ఆలోచనలో ఉంది.

పౌరసత్వం బ్రిటన్‌లో నిపుణుల పోరు

లండన్, ఫిబ్రవరి 20: బ్రిటన్‌లో ఆ దేశ పౌరసత్వం కోసం ఉద్యమిస్తున్న భారతీయులు తమ పోరాటాన్ని ఉధృతం చేశారు. వీరంతా బ్రిటన్‌లో ఆయా రంగాల్లో అత్యంత ప్రతిభావంతులుగా గుర్తింపు పొందారు. దాదాపు 1000 మంది ఉన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నైజీరియాకు చెందిన వారు కూడా బ్రిటన్ పౌరసత్వం కోసం భారతీయులతో కలిసి పోరాటం చేస్తున్నారు. టైర్ వన్ వీసా కింద బ్రిటన్ వచ్చిన వారు ఐదేళ్లు దాటిన తర్వాత అక్కడి చట్టాల ప్రకారం ఆ దేశ పౌరసత్వంకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరిపై నేరారోపణలు, పన్ను ఎగ్గొట్టడం వంటి అభియోగాలు ఉండకూడదు. ఇప్పుడు ఆందోళన చేస్తున్న వారిపై అంతటి తీవ్ర ఆరోపణలు లేకపోయినా..పన్ను ఆలస్యంగా కట్టారనో...పన్నులు తప్పుగా చూపించారనో అభియోగాలు ఉన్నాయి. పాత కారణాలు చూపుతూ పౌరసత్వం ఇవ్వకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిందటి నెలలో డౌన్‌స్ట్రీట్‌లో ధర్నా చేసిన వీరంతా పార్లమెంట్ బయట బుధవారం ఆందోళనకు సిద్ధమౌతున్నారు.

నేడే కమల్‌హాసన్ పార్టీ

- రామేశ్వరంలో కలాం కుటుంబంతో భేటీ
- అక్కడి నుంచి రోడ్ షో.. మదురైలో సభ
- పార్టీ పేరు.. పతాకం ఆవిష్కరణ

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్న ప్రముఖ సినీనటుడు కమల్‌హాసన్ బుధవారం తన పార్టీ పేరును ప్రకటించనున్నారు. ఉదయ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్వస్థలం రామేశ్వరం చేరుకుని. ఆయన కుటుంబ సభ్యులను కలుసుకోనున్నారు. కలాం సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి రోడ్ షో నిర్వహించనున్నారు. మధ్యలో పలు చోట్ల సభల్లో ప్రసంగించనున్నారు. సాయంత్రం మదురైలో జరిగే భారీ బహిరంగ సభలో కమల్ రాజకీయ పార్టీని ప్రకటించడంతోపాటు పార్టీ పతాకాన్ని పరిచయం చేయనున్నారు. ఈ సభకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధ్యక్షుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. కాగా కమల్ చెన్నై నుంచి మంగళవారమే రామేశ్వరానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయనను నామ్ తమిళర్ కట్చి నాయకుడు సీమాన్ కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో తామిద్దరం కలిసి పని చేస్తామని ప్రకటించారు.



కమల్‌హాసన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సీమాన్

అవి వాసన లేని కాగితపు పూలు: స్టాలిన్

రాజకీయాల్లోకి వస్తున్న రజనీకాంత్, కమల్‌హాసన్ కాగితపు పూల లాంటివారని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కె.స్టాలిన్ అన్నారు. రుతువులు మారినప్పుడు కొన్ని కాగితపు పూలు అందంగా వికసిస్తాయి తప్ప.. సువాసనలు వెదజల్లవని, అవి వికసించిన వేగంతోనే నేలరాలిపోతాయని ఎద్దేవా చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు మంగళవారం స్టాలిన్ ఓ లేఖ రాశారు. కొందరు విమర్శిస్తున్నట్లుగా డీఎంకే కుటుంబ పార్టీయేనని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా ఒక కుటుంబమని పేర్కొన్నారు.

నేను పువ్వును కాదు.. విత్తనాన్ని: కమల్‌హాసన్

స్టాలిన్ విమర్శలపై కమలహాసన్ తనదైన శైలిలో స్పందించారు. 'నేను కాగితపు పువ్వును కాదు, విత్తనాన్ని. దానిని నాటి చూస్తే ఏపుగా పెరుగుతా. విత్తనాన్ని ఎవరూ వాసన చూడాల్సిన పని లేదు" అని వ్యాఖ్యానించారు. రాజకీయ రంగంలో కొత్త శకాన్ని ప్రారంభించడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలంటూ ట్వీట్ చేశారు.

నాన్న వెంట నడవను: శృతిహాసన్

తన తండ్రి ప్రారంభిస్తున్న రాజకీయ పార్టీలో చేరబోనని తాను కమల్‌హాసన్ కుమార్తె శృతిహాసన్ అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. "నాకు రాజకీయాల గురించి ఏమాత్రం అవగాహన లేదు. కానీ, మా నాన్న రాజకీయ ప్రయాణానికి నా సంపూర్ణ మద్దతు ఉంటుంది. అయితే ఆయన వెంట నడిచే ఉద్దేశం లేదు" అని స్పష్టం చేశారు

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Balanagar (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.